సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 38

మంగళవారం 30-4-2024



'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

మళ్లీ విష సర్పం నోట్లో తలపెట్టొద్దు

బాబు చరిత్రే మోసం

చోడవరం, అంబాజీపేట, పొన్నూరు ఎన్నికల ప్రచార సభల్లో ఏపీ సీఎం జగన్ ధ్వజం 3 లో

- జగన్ పథకాలే నువ్వూ చేస్తానంటున్నావంటే.. ఎవరు లీడర్? ఎవరు బచ్చా?
- జగన్‌కు ఓటు వేస్తేనే పథకాలన్నీ కొనసాగింపు.. ఇంటింటికీ మరింత మంచి





ఫేక్ వీడియోలపై ఉక్కుపాదమే

ఎన్నికల సమరంలో బీజేపీని ఎదుర్కొనే సత్తా లేక రాజకీయ ప్రత్యర్థులు అడ్డదారులను నమ్ముకున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు.

- వివరాలు 6లో



'ఫేక్' రాజకీయం

అమిత్ షా డీప్ ఫేక్ వీడియో కలకలం రేపుతోంది. లోక్‌సభ ఎన్నికల వేళ డీప్ ఫేక్ బెడదపై సర్వత్రా చర్చ జరుగుతోంది.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

నేడే టెన్త్ ఫలితాలు



పదవ తరగతి పరీక్ష ఫలితాలు మంగళవారం ఉదయం 11 గంటలకు విడుదల కానున్నాయి. http://results.bse.telangana.gov.in, http://results. bsetelangana.org వెబ్‌సైట్లలో ఫలితాలను చూడవచ్చు. టెన్త్ ఫలితాలను వేగంగా అందించేందుకు 'సాక్షి' www.sakshieducation.com వెబ్‌సైట్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

- వివరాలు 16లో

బరిలో 525 మంది..



నామినేషన్ల ఉప సంహరణ అనంతరం రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాల్లో 525 మంది అభ్యర్థులు బరిలో మిగిలారు. మొత్తంగా 893 మంది నామినేషన్లు వేయగా.. 268 మంది నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. మిగతా 625 మందిలో ఉపసంహరించుకున్న వారు పోగా.. 525 మంది పోటీలో మిగిలారు.

- వివరాలు 10లో

ముస్లింలు, దళితులకు చంద్రబాబు శత్రువు



ముస్లింలు, దళితులకు చంద్రబాబు ప్రధాన శత్రువు అని ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. రాజకీయ అవకాశవాది అయిన చంద్రబాబుకు ముస్లింలపై ఎటువంటి ప్రేమ ఉండదని, టీడీపీ, బీజేపీ, జనసేన మతతత్వ ఫాసిస్టు పార్టీలని ఘాటుగా వ్యాఖ్యానించారు.

- వివరాలు 3లో

ముగ్గురూ సిట్టింగులే!



సికింద్రాబాద్ బరిలో ఓ ఎంపీ, ఇద్దరు ఎమ్మెల్యేలు

భిన్న మతాలు, విభిన్న భాషల ప్రజలకు నిలయం

10 లో

అమిత్ షా డీప్ ఫేక్ వీడియో కేసులో రేవంత్‌కు నోటీసులు

సీఎంకు ఫేక్ 'షా'క్

- అమిత్ షా ఫేక్ వీడియో దేశమంతా వైరల్ కావడంతో కేంద్ర హోంశాఖ సీరియస్
- టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌కు 91/160 సీఆర్‌పీసీ కింద నోటీసులు
- మరో నలుగురు టీపీసీసీ సోషల్ మీడియా బాధ్యులకూ..
- గాంధీభవన్‌కు వచ్చి నోటీసులు ఇచ్చిన ఢిల్లీ పోలీసులు
- రేపు (మే 1న) ఢిల్లీలోని స్పెషల్ సెల్ కార్యాలయానికి రావాలని సూచన.. కేసు ఎఫ్‌ఐఆర్ కాపీ ఇవ్వాలని కోరిన కాంగ్రెస్ లీగల్ సెల్ ఇన్‌చార్జి రామచంద్రారెడ్డి
- ఎఫ్‌ఐఆర్ కాపీ అందిన పదిహేను రోజుల్లోగా వివరణ ఇస్తామని వెల్లడి
- ఫేస్‌బుక్, 'ఎక్స్'లకూ స్పెషల్ సెల్ నోటీసులు.. ఈ వీడియోను పోస్ట్ చేసిన, షేర్ చేసిన వారి వివరాలివ్వాలని ఆదేశం



గాంధీభవన్‌లో కాంగ్రెస్ నేతలకు నోటీసులిస్తున్న ఢిల్లీ పోలీసులు

సాక్షి, హైదరాబాద్/సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రంలో బీజేపీ మళ్లీ గెలిస్తే రిజర్వేషన్లను రద్దుచేస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నట్టుగా వైరల్ అయిన డీప్ ఫేక్ వీడియో వ్యవహారం తీవ్ర కలకలం రేపుతోంది. ఆ వీడియో దేశవ్యాప్తంగా వైరల్ కావడంతో తీవ్రంగా పరిగణించిన కేంద్ర హోం శాఖ.. ఇండియన్ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) ద్వారా ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు.. ఆ వీడియోను సోషల్ మీడియాలో పెట్టిన, షేర్ చేసిన వారిపై చర్యలు చేపట్టారు. ఈ మేరకు టీపీసీసీ చీఫ్, సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డికి, పలువురు కాంగ్రెస్ నేతలకు ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. వీడియోను షేర్ చేసిన ఎలక్ట్రానిక్ డివైస్ (మొబైల్/ల్యాప్‌టాప్/ట్యాబ్లెట్)తో మిగతా 5వ పేజీలో ▶



బీజేపీని ప్రశ్నించినందుకే నోటీసులు

- ఇలాంటి వాటికి నేను బెదిరేది లేదు.. కర్ణాటక ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ స్పష్టీకరణ
- బీజేపీకి 400 ఎంపీ సీట్లు ఇస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను రద్దు చేస్తుందని మరోసారి వ్యాఖ్య

5 లో

సోషల్ మీడియాలో బీజేపీని ప్రశ్నించినందుకు నాకు, గాంధీభవన్ నేతలకు ఢిల్లీ పోలీసులు నోటీసులు ఇచ్చారు. 400 సీట్లు ఇవ్వాలని బీజేపీ నాయకులు పదే పదే కోరుతున్నారు. అదే జరిగితే రాజ్యాంగాన్ని సమూలంగా మార్చి ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను పూర్తిగా లేకుండా చేస్తారు.

సీఎం క్షమాపణలు చెప్పాలి



- ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీపై రేవంత్ చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి
- అవసరమైతే కోర్టుకు ఈడుస్తాం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి
- బీజేపీలో చేరిన పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత, పెద్దిరెడ్డి తదితరులు

5 లో

ప్రమాణానికి సిద్ధమా?



- రిజర్వేషన్ల రద్దుపై కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతలకు బండి సంజయ్ సవాల్
- ఓటమి భయంతోనే ఆ పార్టీల విష ప్రచారం

5 లో

రేవంత్‌ను ఎందుకు అరెస్టు చేయరు?



- తప్పుడు ప్రచారం కేసులో అస్సాంలో ఒకరిని అరెస్టు చేశారు
- రేవంత్‌నూ చేయాల్సిందే: హరీశ్‌రావు

5 లో

కేంద్రంలో సంకీర్ణం.. బీఆర్‌ఎస్ కీలకం

ఖమ్మం బస్సు యాత్రలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్

- బీజేపీకి 400, 370 కాదు.. 200 సీట్లు కూడా దాటవు
- రాష్ట్రంలో బీఆర్‌ఎస్ 12 సీట్లు గెలవబోతోంది
- మోదీ గోదావరిని ఎత్తుకుపోతమంటే కిషన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి ఎందుకు మాట్లాడ్తలేరు?.. నేనైతే నా తల తెగినా ఇందుకు ఒప్పుకోనని చెప్పిన
- మా ప్రభుత్వంలో వరి కోతలు.. కాంగ్రెస్ హయాంలో కరెంట్ కోతలు.. కరెంట్ పోతోందంటుంటే భట్టి విక్రమార్క వట్టి విక్రమార్కలా మాట్లాడుతున్నడు
- మళ్లీ విజృంభిద్దామని, అభివృద్ధి చేసుకుందామని పిలుపు



మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేట స్టేజీ తండా రోడ్డు పక్కన ఉన్న హోటల్‌లో స్థానికులతో ముచ్చటిస్తున్న బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: 'కేంద్రంలో బీజేపీ గోవిందా.. లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి 400, 370 సీట్లు ఏమీ వస్తలేవు. 200 సీట్లు కూడా దాటే పరిస్థితి లేదని యావత్ ప్రపంచం కోడై కూస్తోంది. రాష్ట్రంలో ఇవ్వాళ ఆరో రోజు యాత్ర చేశా. ఎక్కడికి పోయినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. 12 పార్లమెంట్ సీట్లు బీఆర్‌ఎస్ గెలవబోతోంది. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం రాబోతోంది. ఆ ప్రభుత్వంలో బీఆర్‌ఎస్ కీలకంగా మారనుంది. మీరు నామా నాగేశ్వరరావును ఎంపీగా గెలిపిస్తే సంకీర్ణంలో ఆయన కేంద్ర మంత్రి అవుతారు. తెలంగాణ రాష్ట్రానికి, ఖమ్మం జిల్లాకు చాలా పెద్ద మేలు జరిగే అవకాశం ఉంటుంది. నరేంద్రమోదీ దాడి నుంచి, చేతకాని, చేవలేని కాంగ్రెస్ మిగతా 2వ పేజీలో ▶

మళ్లీ మీరే రావాలె సారు

కేసీఆర్‌తో రైతులు, వృద్ధులు, మహిళలు

ఖమ్మం మార్గంలో చాయ్ హోటల్ వద్ద కేసీఆర్ మాటామంతీ 2లో

మాకు మోదీ.. మరి మీకెవరు?

- కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి నేతలకు జేపీ నడ్డా ప్రశ్న
- ఆ కూటమి నేతలు అయితే జైలులో, లేకుంటే బెయిల్‌పై ఉన్నారు
- మానుకోట, కొత్తగూడెం సభల్లో ప్రసంగించిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు

2 లో

"ఇండియా కూటమి నేతల్లో కొందరు జైల్లో ఉంటే.. మరికొందరు బెయిల్‌పై ఉన్నారు. దశాబ్దాలుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ కుంభకోణాల్లో కూరుకుపోయింది. తెలంగాణ ప్రజలు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు తగిన గుణపాఠం చెప్పాలి.



అభివాదం చేస్తున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా. చిత్రంలో ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి వినోద్‌రావు ▶

నేడు రాష్ట్రానికి మోదీ

అందోల్ సెగ్మెంట్ అల్లాదుర్గ్‌లోని సభకు పీఎం హాజరు.. రేపు హైదరాబాద్‌కు అమిత్ షా

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో... బీజేపీ నిర్వహిస్తున్న ప్రచారాన్ని మరింత ఉధృతం చేయడంలో భాగంగా మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రానికి రానున్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఉమ్మడి మెదక్ జిల్లా పరిధి అందోల్ నియోజకవర్గం అల్లాదుర్గ్‌లోని ఐబీ చౌరస్తా వద్ద జరగనున్న జహీరాబాద్-మెదక్ జనసభలో ప్రధాని పాల్గొంటారు. జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్, మెదక్ పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి ఎం.రఘునందన్ రావులకు మద్దతుగా అక్కడ ప్రచారం మిగతా 2వ పేజీలో ▶

పంట నష్టం పరిహారానికి ఈసీ గ్రీన్ సిగ్నల్

- రైతులకు మొదటి విడత నష్టానికి సర్కారు సాయం
- రూ.15.81 కోట్లు అందజేయాలని నిర్ణయం



15,814 ఎకరాల్లో పంట నష్టం

సాక్షి, హైదరాబాద్: గత నెల వడగళ్లు, అకాల వర్షాలతో జరిగిన నష్టానికి రైతులకు పరిహారం చెల్లింపునకు ప్రభుత్వానికి ఎన్నికల కమిషన్ అనుమతి ఇచ్చినట్లు వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. దీంతో చెల్లింపుల ప్రక్రియ జరుగుతుందని అధికారులు తెలిపారు. మార్చిలో వడగళ్లు, అకాల వర్షాలకు 15,814 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని వ్యవసాయశాఖ నిర్ధారించిన సంగతి తెలిసిందే. మొత్తం పది జిల్లాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ పేర్కొంది. 15,246 మంది రైతులకు చెందిన వివిధ రకాల పంటలు దెబ్బతిన్నాయి. వారందరికీ ఎకరాకు రూ.10 వేల చొప్పున మొత్తం రూ.15.81 కోట్లు పరిహారం అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కాగా, గత ప్రభుత్వ హయాంలో గతేడాది ఒకసారి తీవ్రమైన వర్షాలతో పంటలకు నష్టం జరిగినప్పుడు మిగతా 2వ పేజీలో ▶

ఇదండీ సంగతి



సార్ అందరూ పారిపోతున్నారు! కాస్త ఆ లాంగ్వేజ్ మార్చండి!!



రెండ్రోజులు మండే ఎండలు

సాధారణం కంటే ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం

- దక్షిణ, ఆగ్నేయ దిశల నుంచి వీస్తున్న వడగాడ్పులు
- **13** జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ
- వడదెబ్బతో ఐదుగురు మృతి 16 లో

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రం నిప్పుల కుంపటిని తలపిస్తోంది. తెలంగాణవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దక్షిణ, ఆగ్నేయ దిశల నుంచి వడగాడ్పులు వీస్తుండటంతో చాలా ప్రాంతాల్లో ఎండలు భగ్గుమంటున్నాయి. గత వారం రోజులుగా రాష్ట్రంలో సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ మేర ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. తేమ శాతం పెరగడం, పొడి వాతావరణంతో వడగాడ్పుల తీవ్రత కూడా అధికమవుతోంది.

మాడుతున్న నల్లగొండ..: సోమవారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లోకెల్లా నిజామాబాద్‌లో 43.8 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఖమ్మంలో సాధారణం కంటే 4.4 డిగ్రీలు ఎక్కువ ఉష్ణోగ్రత నమోదవగా భద్రాచలం, మహబూబ్‌నగర్, హైదరాబాద్‌లలో 2–3 డిగ్రీలు ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు రాష్ట్ర ప్రణాళిక శాఖ మిగతా 16వ పేజీలో ▶

క్లుప్తంగా...

ఫోన్ ట్యాపింగ్‌తో 39 మంది ఎమ్మెల్యేలు గెలిచారు

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): ఫోన్ ట్యాపింగ్‌తో 39 మంది ఎమ్మెల్యేలు గెలిచారని, ఈ కేసు విచారణ జరుగుతుందని, త్వరలోనే వారి శాసన సభ సభ్యత్వాలు రద్దు అవుతాయని మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి వ్యవహారంలో మాజీ మంత్రి హరీశ్‌రావు జైలుకెళ్లడం ఖాయమన్నారు. సోమవారం భువనగిరి లోక్‌సభ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డితో కలిసి ఆయన చేర్యాలలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల తర్వాత చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో సోనియా గాంధీని ఒప్పించడంలో తన పాత్ర ఎంతో ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు.

నాపై కేసు కొట్టివేయండి

హైకోర్టులో బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలత పిటిషన్

సాక్షి, హైదరాబాద్: తప్పుడు ఆరోపణలతో తనపై బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టారని.. అందువల్ల దాన్ని కొట్టేయాలని కోరుతూ బీజేపీ హైదరాబాద్ లోక్‌సభ అభ్యర్థి మాధవీలత హైకోర్టును ఆశ్రయించారు. మాధవీలత ముస్లింలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తున్నారని.. ఈ నెల 17న శ్రీరామనవమి శోభాయాత్ర సందర్భంగా మసీదుపై విల్లు ఎక్కుపెట్టి బాణం వదిలినట్లు హావభావాలు ప్రదర్శించారంటూ షేక్ ఇమ్రాన్ అనే వ్యక్తి బేగంబజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఈ నెల 20న ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈ పిటిషన్‌పై హైకోర్టు నేడు విచారణ చేపట్టనుంది.

మాదిగల వ్యతిరేకి రేవంత్

సీఎం వైఖరికి నిరసనగా మే 4న దీక్ష: మంద కృష్ణ

హిమాయత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ రెడ్డి మాదిగలకు చేసిన ద్రోహంపై మే 4న ఒక్క రోజు నిరసన దీక్ష చేస్తామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ప్రకటించారు. ఆ పార్టీకి, రేవంత్‌కు వ్యతిరేకంగా 119 నియోజకవర్గాల్లో యాత్ర నిర్వహిస్తామని తెలిపారు. సోమవారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో కాంగ్రెస్ సీనియర్ నేత మోత్కుపల్లి నర్సింహులుతో కలసి మందకృష్ణ మీడియాతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో మాదిగలకు ఒక్క ఎంపీ సీటు ఇవ్వకపోవడం రేవంత్‌రెడ్డి వైఖరిని స్పష్టం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాలలతో కుమ్మక్కై మాదిగలకు సీఎం రేవంత్ అన్యాయం చేస్తున్నారనిఆరోపించారు.

ఎదురుకాల్పుల్లో మావోయిస్టు మృతి

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లా సలాంతోంగ్ అటవీ ప్రాంతంలో సోమవారం మావోయిస్టులు–పోలీసులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఓ మావోయిస్టు మృతిచెందాడు. పలువురు జవాన్లు కూడా గాయపడినట్లు తెలిసింది.



సోమవారం ఖమ్మం జెడ్పీ సెంటర్‌లో బీఆర్ ఎస్ ర్యాలీకి హాజరైన ప్రజలు. (ఇన్ సెట్లో) కేసీఆర్‌కు హారతులు పడుతున్న మహిళలు

బీఆర్‌ఎస్ కీలకం

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం నుంచి మన గోదావరిని రక్షించుకోవాలన్నా.. కృష్ణాను రక్షించుకోవాలన్నా.. మన నిధులు మనం తెచ్చుకోవాలన్నా.. హక్కులు సాధించుకోవాలన్నా. బీఆర్‌ఎస్ అయితేనే పేగులు తెగేదాకా కొట్లాడుతుంది..'అని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు. కేసీఆర్ బస్సుయాత్ర సోమవారం వరంగల్ నుంచి తిరుమలాయపాలెం మీదుగా ఖమ్మం జిల్లాలోకి ప్రవేశించింది. ఖమ్మం నగరంలో కాల్వొడ్డు నుంచి మయూరి సెంటర్, వైరా రోడ్, జెడ్పీ సెంటర్ వరకు భారీ ర్యాలీ కొనసాగింది. జెడ్పీ సెంటర్‌లో కేసీఆర్ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.

బీజేపీ వాళ్లకి తెలంగాణ సమస్యలు పట్టవు

'తెలంగాణలో పంటలు పంజాబ్‌ను తలదన్నే పరిస్థితికి తీసుకెళ్లాం. 3.50 కోట్ల టన్నుల వడ్లు పండించాం. కేంద్ర ప్రభుత్వం మేము ధాన్యం కొనమని మొండికేసింది. నామా నాగేశ్వరరావు నాయకత్వంలో నాడు ఎంపీలు కేంద్రమంత్రి వద్దకు వెళ్లి ధాన్యం కొనమని అడిగారు. యాసంగిలో కొంచెం నూక అవుతుందని మంత్రికి చెప్పారు. అయితే ఆ మెదడు తక్కువ మంత్రి.. మీ తెలంగాణ ప్రజలను నూకలు తినమనండి అని చెప్పారు. దీనిని నిరసిస్తూ మొత్తం తెలంగాణ కేబినెట్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందరం పోయి ఢిల్లీలో ధర్నా చేశాం. అప్పుడు ఒక్క బీజేపీ ఎంపీ కానీ, కాంగ్రెస్ ఎంపీ కానీ నోరు కూడా తెరవలేదు. తెలంగాణ ఓట్లు కావాలి కానీ తెలంగాణ సమస్యలు వారికి పట్టవు..'అని కేసీఆర్ ధ్వజమెత్తారు.

ఈ దద్దమ్మలు మనకు ఎందుకు?

'గోదావరి నదిని ఎత్తుకుపోయి తమిళనాడు, కర్ణాటకకు నీళ్లు ఇస్తామని మోదీ క్లియర్‌గా చెబుతుండు. ఇక్కడ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఉన్నడు. ముగ్గురు ఎంపీలున్నరు. బీజేపీ ఉంది. వీళ్లేం చేస్తున్నరు. ఒక్కరైనా మాట్లాడుతున్నరా? రాష్ట్రాన్ని ఎండగడతామని మోదీ మాట్లాడుతుంటే వీరికి ఉలుకు, పలుకు లేదు. ఈ దద్దమ్మలు మనకు ఎందుకు? ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదు? నేను ముఖ్యమంత్రిగా ఉన్న టైమ్‌లో కూడా మోదీ ఇదే ప్రతిపాదన తెచ్చారు. కానీ మా రాష్ట్రానికి వచ్చే నీళ్ల లెక్క తేల్చేదాక ..మా వాటా మాకు అక్కడ పెట్టేదాక ఎట్టి పరిస్థితుల్లో, నా తల తెగినా ఒప్పుకోనని చెప్పినా.. అది బీఆర్‌ఎస్ పార్టీ పాలసీ.. వీళ్లకు ఓట్లు కావాలి.. సీట్లు కావాలి.. కేంద్ర మంత్రులు కావాలి.. కానీ తెలంగాణ సమస్యలు, ప్రధానమైన సమస్యలు నీళ్లు, రైతులు, పంటలు వీళ్లకు పట్టదు..'అని కేసీఆర్ విమర్శించారు.

రేవంత్ నోటికి మొక్కాలి

'మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ, ఈనాటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అడ్డగోలు హామీలు ఇచ్చారు. ఆయన నోటికి మొక్కాలి.. వెనకట కూడా కాంగ్రెస్ వాళ్లు చెప్పేది.. దున్నేవాడికే భూమి.. తినేవాడికే విస్తరి.. గీసేవాడికే గుండు.. అమ్మను చూడు ఆవుదూడ బొమ్మను చూడు.. గుద్దో గుద్దు అని. కానీ నిజమైన సంక్షేమం ఈ రాష్ట్రంలో ప్రారంభమైంది ఎన్‌టీ రామారావు వచ్చిన తర్వాతనే. పేదలకు పట్టెడు అన్నం దొరికింది ఆ పుణ్యాత్ముడు చేపట్టిన కిలో రూ.2 బియ్యం ద్వారానే. ఎవరు అవునన్నా.. కాదన్నా ఇది చరిత్ర..' అని బీఆర్‌ఎస్ అధినేత వివరించారు.

తులం బంగారం తుస్సుమంది

'తెలంగాణ రావడంతో ఎన్‌టీఆర్ చేసిన దానికి మించి కార్యక్రమాలు మనం చేసుకున్నాం. రైతుబంధు, రైతుబీమా, 24 గంటల కరెంటు, ధాన్యం కొనుగోలు ఇలా అన్నీ చేసుకున్నాం. కుంట భూమి ఉన్నా రైతు చనిపోతే వారం లోపు వారి ఇంటికి రూ.5 లక్షలు పంపాం. కల్యాణలక్ష్మి, పెట్టుకున్నాం. అయితే రూ.లక్ష మాత్రమే ఇస్తున్నారు..నేను తులం బంగారం ఇస్తానని రేవంత్‌రెడ్డి అన్నడు.. తులం బంగారం తుస్సుమన్నది. ఇప్పుడు అడిగితే కాంగ్రెస్ కస్సుమంటోంది. రైతుబంధు అడిగితే చెప్పుతో కొడతా అంటోంది. తొమ్మిదేళ్ల రెప్పపాటు పోకుండా ఉన్న కరెంట్ నాలుగు నెలల్లో మాయమైపోతదా? నిన్న మహబూబ్‌నగర్‌లో మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్ ఇంట్లో భోజనం చేస్తుంటే రెండుసార్లు కరెంట్ పోయింది. కరెంట్ పోయిందని నేను ట్విట్టర్‌లో పెట్టా. ఈ జిల్లాలో ఉన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. వట్టి విక్రమార్క. కరెంట్ పోయిందంటే కేసీఆర్ అబద్ధాలకోరు అంటున్నడు. ఉస్మానియా యూనివర్సిటీలో నీటి కొరత ఉంది.. కరెంటు కోతలు ఉన్నాయి. హాస్టళ్లు మూసేస్తున్నామని చీఫ్ వార్డెన్ నోటీసు ఇచ్చింది వాస్తవం కాదా? బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో వరి కోతలుంటే.. కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంట్ కోతలున్నాయి..'అని కేసీఆర్ ఎద్దేవా చేశారు.

ఎన్నికల తర్వాత రాజకీయ అనిశ్చితి

'రూ.2 లక్షల రుణమాఫీ అని రేవంత్‌రెడ్డి అన్నడు. డిసెంబర్ 9 నాడు మాఫీ చేస్తానన్నడు. అయ్యిందా? భద్రాద్రి రామయ్య, బాసర సరస్వతి, యాదగిరి నరసింహస్వామి మీద ఒట్టు అంటావు.. ఇలా ప్రజలను మోసం చేయడానికి ఎన్ని ఒట్లు పెడతావు. ఆగస్టు 15లోగా రుణమాఫీ చేయకుంటే రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలి. ప్రతి మహిళకు రూ.2500 వచ్చిందా? వచ్చే ఆశ ఉందా? ఇన్ని రకాలుగా మోసం జరుగుతోంది.

ఈ మోసాలపై శాసనసభలో, బయట సభల్లో బీఆర్‌ఎస్ ప్రశ్నిస్తే కేసీఆర్ నీ గుడ్లు పీకుతా, పండపెట్టి తొక్కుతా.. చర్లపల్లి జైల్లో వేస్తానని రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నడు. ముఖ్యమంత్రి మాట్లాడే భాషా ఇది?. పార్లమెంట్ ఎన్నికలైన తెల్లారే రేవంత్‌రెడ్డి బీజేపీలోకి జంప్ కొడతాడని బీజేపీ వాళ్లే చెబుతున్నరు. ఈ మాటలను ఆయన ఒక్కసారి కూడా ఖండించడం లేదు. రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల తర్వాత భయంకరమైన రాజకీయ అనిశ్చితి రానుంది..'అని బీఆర్‌ఎస్ అధినేత వ్యాఖ్యానించారు.

నాడు ఖమ్మం బ్రహ్మరథం పట్టింది

'నేను ఒక్కడిని బయలుదేరిన నాడు ఎవరికీ నమ్మకం లేదు తెలంగాణ వస్తదని. నేను ఆమరణ దీక్షకు పూనుకుంటే నన్ను అరెస్ట్ చేసి ఖమ్మం జిల్లా జైలుకు తీసుకొచ్చారు. ఆనాడు ఖమ్మం జిల్లా బిడ్డలు, న్యూడెమోక్రసీ, కమ్యూనిస్టు విద్యార్థి బృందాలు, తెలంగాణ వాదులు బ్రహ్మాండంగా బ్రహ్మరథం పట్టి ఆశీర్వదించి మద్దతు పలికారు. అది నేను మర్చిపోలేదు. చివరికి తెలంగాణ వచ్చింది. ఖమ్మంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అభివృద్ధిని చేసి చూపించిండు. నగరంలో నాడు రోజూ మంచినీళ్లు వస్తే.. ఇప్పుడు మూడురోజులకు ఒకసారి మంచినీళ్లు వస్తున్నాయి. తమ భూములకు నీళ్లు కావాలని పాలేరు రైతులు తూములు బద్దలు కొట్టే పరిస్థితి ఎందుకు వచ్చింది? పంటలు ఎండిపోతుంటే నీటి మంత్రి, వ్యవసాయ మంత్రి ఏం చేస్తున్నరు? అడ్డగోలు హామీలు ఇచ్చి రైతులను, అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ మోసం చేసింది. ఈ ప్రభుత్వంపై యుద్ధం చేయడానికి ఇదే సరైన సమయం. మీ కోరికలు నెరవేరాలంటే బీఆర్‌ఎస్‌కు శక్తి కావాలి. రాష్ట్రాన్ని, ఖమ్మంను ముందుకు తీసుకెళ్లే బలం ఇవ్వాలి. అసెంబ్లీ ఎన్నికల్లో ఏదో జరిగింది. మళ్లీ విజృంభిద్దాం.. అభివృద్ధి చేసుకుందాం..'అని కేసీఆర్ పిలుపునిచ్చారు. బస్సు యాత్రలో ఖమ్మం, మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థులు నామా నాగేశ్వరరావు, మాలోతు కవిత, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్ రెడ్డి, బానోతు హరిప్రియ, బానోతు మదన్‌లాల్, మెచ్చా నాగేశ్వరరావు, దేశపతి శ్రీనివాస్, ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ తదితరులు పాల్గొన్నారు.







సోమవారం హైదరాబాద్‌లో జరిగిన రోడ్‌షోలో మాట్లాడుతున్న జేపీ నడ్డా. అభివాదం చేస్తున్న కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్

మహబూబాబాద్‌లో నిర్వహించిన సభలో ప్రసంగిస్తున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా... హాజరైన ప్రజలు

మాకు మోదీ.. మరి మీకెవరు?

కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి నేతలకు జేపీ నడ్డా ప్రశ్న

- ఆ కూటమి నేతలు అయితే జైలులో, లేకుంటే బెయిల్‌పై ఉన్నారు
- మానుకోట, కొత్తగూడెం సభల్లో ప్రసంగించిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు

మహబూబాబాద్ అర్బన్/చుంచుపల్లి/నిజాంపేట: బీజేపీ గెలిస్తే నరేంద్రమోదీ ప్రధాని అవుతారని చెబుతున్నామని.. మరి ఇండియా కూటమిలో ప్రధాని అభ్యర్థి ఎవరో కాంగ్రెస్ నాయకులే చెప్పాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా ప్రశ్నించారు. ఇండియాకూటమి నేతల్లో కొందరు జైల్లో ఉంటే.. మరికొందరు బెయిల్ మీద ఉన్నారని విమర్శించారు. మోదీతో రాహుల్‌గాంధీ ఏ మాత్రం సరితూగరని.. మరోసారి మోదీ ప్రధాని కావడం ఖాయమని చెప్పారు. రిజర్వేషన్లపై అమిత్‌షా మాటలను వక్రీకరించి, ఫేక్ వీడియోలు తయారు చేయించి ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మహబూబాబాద్, కొత్తగూడెంలో నిర్వహించిన బీజేపీ సభల్లో జేపీ నడ్డా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే.. ''ఇండియా కూటమి నేతల్లో కొందరు జైల్లో ఉంటే.. మరికొందరు బెయిల్ మీద ఉన్నారు. హేమంత్ సోరెన్, కేజ్రీవాల్‌తోపాటు బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత వంటి వారు జైల్లో ఉన్నారు. దశాబ్దాలుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ కుంభకోణాల్లో కూరుకుపోయింది. మళ్లీ కాంగ్రెస్ పాలన వస్తే అవినీతి, అక్రమాలు పెరిగిపోతాయి. తెలంగాణ ప్రజలు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు తగిన గుణపాఠం చెప్పాలి.

మోదీతోనే సుభిక్ష పాలన..

దేశంలో సుభిక్ష పాలన సాగాలంటే ప్రధాని మోదీతోనే సాధ్యం. మోదీ శక్తిమంతమైన నాయకుడు కాబట్టే గత పదేళ్లలో దేశం అన్ని రంగాల్లో ముందుకు దూసుకుపోతోంది. పదేళ్లలో రైల్వే వ్యవస్థను ప్రక్షాళన చేశాం. కేంద్రం చేపడుతున్న అనేక సంక్షేమ పథకాలు పేదలకు ఎంతో అండగా నిలుస్తున్నాయి. బీజేపీ అధికారంలోకి వచ్చిన ఈ పదేళ్లలో దేశం ఆర్థికంగా బలోపేతమైంది. దాదాపు 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశాం.

తెలంగాణకు మూడింతల ఆర్థిక సాయం

తెలంగాణ అభివృద్ధిపై మోదీ ప్రత్యేక దృష్టి సారించారు. మూడింతల ఆర్థిక సాయం అందించారు. వరంగల్, కరీంనగర్, సిద్దిపేట వంటి పట్టణాల అభివృద్ధికి దాదాపు రూ.2,500 కోట్లు కేటాయించారు. తెలంగాణలో రైల్వేల అభివృద్ధికి రూ.10 వేల కోట్లు ఇచ్చాం. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి అండగా నిలిచి మూడోసారి నరేంద్ర మోదీని ప్రధానిని చేద్దాం. ఖమ్మం, మహబూబాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థులు తాండ్ర వినోద్‌రావు, అజ్మీరా సీతారాం నాయక్‌లను గెలిపించాలి'' అని కోరారు. ఈ సభల్లో బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్, కర్ణాటక ఎన్నికల సహ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ గరికపాటి మోహన్‌రావు, ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేటలో రోడ్‌షో

ఎన్నికల ప్రచారంలో భాగంగా మల్కాజ్‌గిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని నిజాంపేట్‌లో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా నడ్డా మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి ఐదు కిలోల బియ్యం ఉచితంగా ఇచ్చిన ఘనత మోదీదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలాంటి వారు దేశం కోసం పాటు పడేవారు కాదన్నారు. మల్కాజ్‌గిరిలో ఈటెల రాజేందర్, సికింద్రాబాద్‌లో కిషన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. అంతకుముందు ఈటల రాజేందర్ మాట్లాడుతూ కేంద్రంలో మళ్లీ నరేంద్రమోదీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తారని, కాంగ్రెస్ వారు తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. టెర్రరిస్టుల పట్ల నరేంద్రమోదీ సింహస్వప్నం అయ్యారని గుర్తు చేశారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు డిపాజిట్‌లు రాకుండా చేయాలని పిలుపునిచ్చారు. ఈ రోడ్‌షోలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, మాధవీలత, మల్లారెడ్డి, ఆకుల సతీష్ తదితరులు పాల్గొన్నారు. నడ్డా సమక్షంలో గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి బీజేపీలో చేరారు.

10 నుంచి 12 సీట్లలో గెలిచి సత్తా చాటాలి

బీజేపీ నేతలకు నడ్డా దిశానిర్దేశం

సాక్షి, హైదరాబాద్ : లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి పది నుంచి పన్నెండు సీట్లలో గెలిచి సత్తా చాటాలని రాష్ట్ర నేతలకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో పార్టీకి మంచి వాతావరణం ఉందని..కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల కంటే అధిక సీట్లు గెలిచే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో డబుల్ డిజిట్‌లో ఎంపీ సీట్లు గెలవడం ద్వారా బీజేపీ చరిత్ర సృష్టించబోతున్నదని తెలిపినట్టు పార్టీవర్గాల సమాచారం. సోమవారం రాత్రి బేగంపేటలోని హరితప్లాజాలో పార్టీనేతలతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో కేంద్రమంత్రి, రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్, మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత, హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ అంటేనే కళకళ

- బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే రైతుబంధు, కల్యాణలక్ష్మి
- కరువు కాటకాల్లేకుండా రాష్ట్రమంతా పచ్చదనం పరుచుకుంది
- ఖమ్మం ప్రజల మనోగతం

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: 'కేసీఆర్ అంటేనే తెలంగాణ ఐకాన్.. చెరువుల నిండా నీళ్లు, పచ్చని పంటలు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఆసరా పింఛన్లు, రైతుబంధు, రైతుబీమా, కరువు కాటకాలు లేని కాలం. రాష్ట్రమంతా పచ్చదనం పరుచుకుంది..'అంటూ బస్సు యాత్రలో భాగంగా జిల్లాకు వచ్చిన మాజీ సీఎం కేసీఆర్‌ను చూసి ప్రజలు గుర్తు చేసుకున్నారు. 'కేసీఆర్ అంటేనే రాష్ట్రం కళకళ'అంటూ పలువురు తమ మనోగతాన్ని వెల్లడించారు. సాయంత్రం 6 గంటల నుంచే మధిర, ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల నుంచి తరలివచ్చిన ప్రజలతో ఖమ్మంలోని వైరా రోడ్, జెడ్పీ సెంటర్ కిక్కిరిసిపోయింది. అంతకుముందు కేసీఆర్ యాత్రకు దారి పొడవునా గిరిజన మహిళలు నృత్యం, కోలాటాలతో స్వాగతం పలికారు. ఇక రాత్రి 7గంటలకు బస్సుయాత్ర ఖమ్మం నగరానికి చేరుకోగా.. రోడ్‌షో అనంతరం కేసీఆర్ మాట్లాడారు. 'కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కింద రూ.లక్ష ఇస్తే.. నేను లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తానని రేవంత్‌రెడ్డి అన్నడు. మీకు తులం బంగారం ఇచ్చాడా?'అని మహిళలను ప్రశ్నించగా లేదు లేదంటూ మహిళలు గొంతెత్తి చెప్పారు. 'రైతుబంధు ఐదెకరాలకు మించి ఇవ్వరట, ఆరెకరాలు, ఏడు ఎకరాలు ఉన్న వాళ్లు కూడా కోటీశ్వరులా?'అని ప్రశ్నించగా కాదు కాదు అంటూ సభికులు పెద్దపెట్టున సమాధానమిచ్చారు. కేసీఆర్ ప్రసంగం 23 నిమిషాల పాటు కొనసాగింది. ఆ సమయంలో అనేకసార్లు 'జై కేసీఆర్'అంటూ నినాదాలు మిన్నంటాయి.

మళ్లీ మీరే రావాలె సారు

- కేసీఆర్‌తో రైతులు, వృద్ధులు, మహిళలు
- ఖమ్మం మార్గంలో చాయ్ హోటల్ వద్ద బస్సు యాత్రకు బ్రేక్



స్థానికులతో ముచ్చటిస్తున్న కేసీఆర్

మరిపెడ రూరల్: 'మీరు లేకపోవుడుతోటి ఇన్ని కష్టాలు సారు. కాంగ్రెస్ వాళ్ల మాయమాటలు నమ్మి మోసపోయినం.. ఇట్లైతదని అనుకోలే సారు .. మళ్లా మీరే రావాలె సారు..'అంటూ పలువురు రైతులు, వృద్ధులు, మహిళలు, వికలాంగులు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావుతో తమ గోడు చెప్పుకున్నారు. దీంతో స్పందించిన కేసీఆర్ బీఆర్‌ఎస్ ప్రభుత్వం లేకపోవడం వల్లే ఇన్ని సమస్యలు వచ్చాయని, తాను అండగా ఉంటానని చెబుతూ వారిని ఓదార్చారు. బస్సుయాత్రలో భాగంగా హనుమకొండ నుంచి ఖమ్మం బయలుదేరిన కేసీఆర్ మార్గం మధ్యలోని మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేట స్టేజీ తండా రోడ్డు పక్కన ఉన్న చిన్న చాయ్ హోటల్ వద్ద కాసేపు ఆగారు. కేసీఆర్‌ను చూసి హోటల్ యజమాని సాందు, కుటుంబ సభ్యులు ఉబ్బి తబ్బిబ్బయ్యారు. హోటల్‌లో ఉన్న మిర్చి బజ్జి, పకోడి, గారెలను ఆయనకు అందించారు. వాటిని తిన్న కేసీఆర్ వారితో కాసేపు ముచ్చటించారు. సమాచారం అందుకున్న ఆనెపురం మాజీ సర్పంచ్ లాల్‌సింగ్ తదితరులు ఎల్లంపేట స్టేజీ వద్దకు చేరుకున్నారు. పలువురు యువతీ యువకులు కేసీఆర్‌తో సెల్ఫీలు దిగారు.

మన పొరపాటు వల్లే రేవంత్ సీఎం

- సోషల్ మీడియా వారియర్స్ సమావేశంలో కేటీఆర్



కంటోన్మెంట్: కొడంగల్‌లో 2018 ఎన్నికల్లో ఓడిపోయిన రేవంత్‌రెడ్డి మల్కాజ్‌గిరి ఎంపీ అయ్యి, ఏకంగా సీఎం కాగలిగాడని, ఆనాడు మల్కాజ్‌గిరి బీఆర్‌ఎస్ నేతల అలసత్వం, చేసిన పొరపాటే ఇందుకు కారణమని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. సోమవారం సాయంత్రం బోయిన్‌పల్లిలోని మల్లారెడ్డి గార్డెన్స్‌లో మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ సోషల్ మీడియా వారియర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ప్రశ్నిస్తానంటూ ఎంపీ అయిన రేవంత్‌రెడ్డి, మోదీని ఏ మేరకు ప్రశ్నించాడన్నారు. మోదీ వ్యాక్సిన్ కనిపెట్టాడన్న కిషన్‌రెడ్డి, కాంగ్రెస్– బీజేపీ ఒక్కటై బీఆర్‌ఎస్‌ను బొందపెట్టాలన్న బండి సంజయ్, రేవంత్ బీజేపీలోకి వస్తాడన్న అరవింద్ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలను ప్రదర్శిస్తూ వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రైతు రుణమాఫీ విషయంలో రేవంత్‌రెడ్డి చెప్పిన అబద్ధాలను ఎండగట్టాలన్నారు. గతంలో ఈటల రాజేందర్ బీజేపీపై చేసిన విమర్శలను ప్రచారం చేయాలని, మల్కాజ్‌గిరిలో బీజేపీని గెలిపించేందుకే కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థిగా సునీత మహేందర్‌రెడ్డికి టికెట్ ఇచ్చిందన్నారు. బీజేపీ మళ్లీ గెలిస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్‌ల ఎత్తేసి, రాజ్యాంగాన్ని మార్చే ప్రమాదముందన్నారు. బీఆర్‌ఎస్‌కు 10–12 సీట్లు వస్తే మళ్లీ రాష్ట్ర రాజకీయాలను శాసించే స్థితి వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, కేపీ.వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కంటోన్మెంట్ అసెంబ్లీ అభ్యర్థి నివేదిత తదితరులు పాల్గొన్నారు. కేటీఆర్ స్పీచ్ ప్రారంభానికి ముందే మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సభావేదిక నుంచి వెళ్లిపోయారు. దీంతో ఈ అంశం చర్చనీయాంశమైంది. గత వారం రోజులుగా కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ ప్రచారంలోనూ మర్రి అంటీ ముట్టనట్టు వ్యవహరిస్తుండటంతో ఈ అంశం ప్రాధాన్యం సంతరించుకుంది.

నేడు రాష్ట్రానికి మోదీ

▶ మొదటి పేజీ తరువాయి

నిర్వహించనున్నారు. మూడోసారి అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామనే విషయాలను మోదీ ప్రస్తావిస్తారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మే 1 (బుధవారం) హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి మాధవీలతకు మద్దతుగా కేంద్ర హోంశాఖ అమిత్ షా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. అదేవిధంగా మే 5న నిజామాబాద్, సికింద్రాబాద్, మల్కాజ్ గిరి పార్లమెంటు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా మూడు చోట్ల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటారు.

పంట నష్టం పరిహారానికి ఈసీ గ్రీన్ సిగ్నల్

▶ మొదటి పేజీ తరువాయి

ఎకరాకు రూ. 10 వేలు పరిహారం ఇచ్చిన సంగతి తెలిసిందే. అదే తరహాలో ఇప్పుడు కూడా పరిహారం ఇవ్వాలని నిర్ణయించారు.

జిల్లా	నష్టం విస్తీర్ణం	రైతులు	పరిహారం (రూపాయల్లో)
కామారెడ్డి	10328.04	9107	103281000
నిజామాబాద్	1652.25	1809	16526250
రాజన్న సిరిసిల్ల	1014.06	1036	10141500
సిద్దిపేట	746.30	793	7467500
మెదక్	714.17	957	7144250
ఆదిలాబాద్	545.09	370	5452250
నిర్మల్	332.17	519	3324250
మంచిర్యాల	244.01	376	2440250
కరీంనగర్	160.10	160	1602500
సంగారెడ్డి	76.04	119	761000
మొత్తం	15814.03	15246	158140750



మధ్యాహ్నం 1.50 గంటలకు: అంబాజీపేటలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభకు హాజరైన జనసందోహంలో ఓ భాగం



సాయంత్రం 4 గంటలకు : గుంటూరు జిల్లా పొన్నూరులో జరిగిన సీఎం జగన్ ఎన్నికల ప్రచార సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం



ఉదయం 11.50 గంటలకు: చోడవరంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం

మళ్లీ విషసర్పం నోట్లో తలపెట్టొద్దు

బాబు చరిత్రే మోసం

చోడవరం, అంబాజీపేట, పొన్నూరు ఎన్నికల ప్రచార సభల్లో సీఎం జగన్ ధ్వజం

- జగన్ పథకాలే నువ్వూ చేస్తానంటున్నావంటే.. ఎవరు లీడర్? ఎవరు బచ్చా?
- జగన్‌కు ఓటు వేస్తేనే పథకాలన్నీ కొనసాగింపు.. ఇంటింటికీ మరింత మంచి

"బిందెడు పన్నీరు తీసుకెళ్లి బూడిదలో పోస్తే ఏమవుతుందో చంద్రబాబును నమ్మితే కూడా అదే అవుతుంది. అక్కడ బిందెడు పన్నీరు గోవిందా.. ఇక్కడ పథకాలూ గోవిందా! గతంలో బాబును నమ్మి ఓటు వేసినందుకు బంగారు రుణాలు గోవిందా...! డ్వాక్రా అక్కాచెల్లెమ్మల రుణాల మాఫీ గోవిందా...! ప్రత్యేక హోదా, ఉమ్మడి రాజధాని, ప్రత్యేక ప్యాకేజీ గోవిందా.. గోవిందా! తిరుమల వెంకన్న స్వామిని తలచుకుని చెప్పే గోవిందా గోవిందాలు కావు ఇవి. బాబును నమ్మితే అన్నీ గోవిందా..!

– చోడవరం సభలో సీఎం జగన్

"జగన్‌ను ఎందుకు ఓడించాలని అడగండి. పేదలకు ఇచ్చిన మాట తప్పనందుకా? ఇంటింటికీ సంక్షేమాన్ని అందిస్తూ మంచి చేస్తున్నందుకా? చంద్రబాబు, రామోజీ, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ, దత్తపుత్రుడు, జన్మభూమి కమిటీల దోపిడీ ముఠాకు అధికారం కోసం జగన్‌ను ఓడించాలా? వీరంతా కలిసి రాష్ట్రాన్ని, ప్రజలను దోచుకోవడం కోసమా..? దోచుకున్నది పంచుకోవడం కోసమా? మరి జగన్‌ను ఎందుకు ఓడించాలయ్యా చంద్రబాబూ?"

– అంబాజీపేట సభలో సీఎం జగన్

"మూడుసార్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు కేవలం 58 నెలల పాలన చేసిన నన్ను "బచ్చా.." అని అంటూనే భయపడుతున్నారు. చంద్రబాబూ నువ్వు నిజంగా అంత పుడింగే అయితే నన్ను ఎదుర్కొనేందుకు ఇన్ని పార్టీలతో పొత్తులెందుకయ్యా? 14 ఏళ్లలో ఏ ఒక్క మంచీ చేయకపోగా ఇప్పుడు ఎన్నికల వేళ ప్రజలను మళ్లీ మోసం చేసేందుకు జగన్ ఐదేళ్లలో చేసిన పథకాలనే అమలు చేస్తానని చెబుతున్నావంటే దాని అర్థం ఏమిటి? మరి ఇప్పుడు ఎవరు బచ్చా? ఎవరు లీడర్? చెప్పు చంద్రబాబూ..!"

– పొన్నూరు సభలో సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం, సాక్షి ప్రతినిధి, కాకినాడ, సాక్షి ప్రతినిధి, గుంటూరు: చంద్రబాబును నమ్మటం అంటే కొండచిలువ నోట్లో తలకాయ పెట్టినట్లేనని ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హెచ్చరించారు. 2014 ఎన్నికల హామీల్లో ఒక్కటంటే ఒక్కటి కూడా నెరవేర్చని చంద్రబాబుకు అసలు ఓటు ఎందుకు వేయాలని ప్రజలంతా గట్టిగా నిలదీయాలని పిలుపునిచ్చారు. చంద్రబాబుకు ఓటు వేస్తే జరిగే నష్టాన్ని తెలుసుకోవాలన్నారు. సోమవారం అనకాపల్లి జిల్లా చోడవరం నియోజకవర్గం కొత్తూరు జంక్షన్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట జంక్షన్, గుంటూరు జిల్లా పొన్నూరులో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో సీఎం జగన్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన ఏమన్నారంటే..

చరిత్ర చెబుతున్న సత్యం..

మరో రెండు వారాల్లో కురుక్షేత్ర మహా సంగ్రామం జరగనుంది. ఇవి కేవలం ఎమ్మెల్యేలు, ఎంపీలను ఎన్నుకునే ఎన్నికలు కావు. మనం వేసే ఓటుతో రాబోయే ఐదేళ్లలో మీ ఇంటింటి అభివృద్ధి, పేదల తలరాతలను నిర్ణయించబోయే ఎన్నికలని ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలి. జగన్‌కు ఓటు వేస్తే పథకాలన్నీ సజావుగా కొనసాగుతాయి. పొరపాటున చంద్రబాబుకు ఓటు వేస్తే పథకాలన్నీ ఆగిపోతాయి. మరోసారి ప్రజలు మోసపోవటమే. మళ్లీ చంద్రముఖి నిద్ర లేస్తుంది. లకలకా అంటూ మీ రక్తం తాగేందుకు మరో ఐదేళ్లు మీ ఇంటి తలుపులు కొడుతుంది. ఇది చంద్రబాబు గురించి చరిత్ర చెబుతున్న సత్యం. బాబును నమ్మడం అంటే విషసర్పాన్ని నమ్మడమేనని గుర్తుంచుకోండి. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న ఆయన చేసిందేమిటంటే.. జన్మభూమి కమిటీలతో మొదలు పెడితే చంద్రబాబుకు ఇంత, దత్తపుత్రుడికి ఇంత, ఓ రామోజీ ఈనాడుకు ఇంత, ఆంధ్రజ్యోతికి, టీవీ 5కి ఇంత.. అంటూ అంతా కలసి రాష్ట్రాన్ని దోచుకోవడం, దోచుకున్నది పంచుకోవడమే!

ఎవరు హీరో? ఎవరు విలన్?

ఈ యుద్ధంలో అటువైపు ఉన్నది కౌరవ సైన్యం, దుష్ట చతుష్టయం. చంద్రబాబుకు మద్దతుగా రెండు జాతీయ పార్టీలు, ఒక వదినమ్మ, ఒక దత్తపుత్రుడు, ఒక ఈనాడు, ఒక ఆంధ్రజ్యోతి, ఒక టీవీ 5.. వీరందరూ సరిపోరు అన్నట్టుగా కుట్రలు, కుతంత్రాలు, మోసాలు, అబద్ధాలు! పేదవాడికి ఎప్పుడూ ఎలాంటి మంచి చేసిన చరిత్ర లేని వీళ్లంతా కూటమిగా మీ బిడ్డపై యుద్ధం చేస్తున్నారు. ప్రజలను మోసం చేసేందుకు సూపర్ సిక్స్, సూపర్ సెవెన్, ఇంటింటికీ కేజీ బంగారం, బెంజ్ కారు అంటున్నారు. మీ బిడ్డ నమ్ముకున్నది మిమ్మల్ని, పైనున్న ఆ దేవుడిని. మేనిఫెస్టోను బైబిల్, ఖురాన్, భగవద్గీత మాదిరిగా భావిస్తూ 99 శాతం హామీలను అమలు చేసి మళ్లీ మీ ఆశీర్వాదం కోసం మీ బిడ్డ వచ్చాడు. పేదలకు మరింత మంచి చేస్తూ ఇంటింటి అభివృద్ధి, పౌరసేవలు, ఇంటికే పథకాలు కొనసాగింపుగా వైఎస్సార్ సీపీ 2024 మేనిఫెస్టోను రూపొందించాం. సినిమాకు వెళ్లినప్పుడు హీరో మంచి చేస్తాడు కాబట్టి అందరికీ నచ్చుతాడు. హీరోలో మానవత్వం ఉంది కాబట్టి నచ్చుతాడు. విలన్ ఎందుకు నచ్చడు? విలన్ మోసాలు, అబద్ధాలు, కుట్రలు చేస్తాడు కాబట్టి నచ్చడు. నిజ జీవితంలో కూడా ఆలోచన చేయండి ఎవరు హీరో? ఎవరు విలన్?



రెండు బటన్లూ ఫ్యాన్‌కే...

వలంటీర్లు మళ్లీ మీ ఇంటికే రావాలన్నా, పేదవాడి భవిష్యత్తు మారాలంటే, పథకాలన్నీ కొనసాగాలన్నా... అవి ఇంటికే రావాలన్నా... లంచాలు, వివక్ష లేని పాలన జరగాలన్నా, మన పిల్లలు, మన బడులు బాగుండాలన్నా, మన వ్యవసాయం, ఆస్పత్రులు మెరుగ్గా ఉండాలన్నా రెండు బటన్లు ఫ్యాను మీద నొక్కాలి. 175కు 175 అసెంబ్లీ స్థానాలు, 25 ఎంపీ స్థానాలకు 25 ఎంపీ స్థానాల్లో మన అభ్యర్థులను భారీ మెజార్టీలతో గెలిపించాలి.

ముస్లింలు, దళితులకు చంద్రబాబు శత్రువు

రాజకీయ అవకాశవాది చంద్రబాబుకు ముస్లింలపై ప్రేమ లేదు

- టీడీపీ, బీజేపీ, జనసేన మతతత్వ ఫాసిస్టు పార్టీలు
- ఈ పార్టీలు ముస్లింలు, క్రిస్టియన్ మైనార్టీలకు శత్రువులు
- వారు అధికారంలోకి వస్తే ముస్లిం, దళిత రిజర్వేషన్లు తీసేస్తారు
- ముస్లిం, దళితులకు అండగా నిలిచే సెక్యులర్ నాయకుడు జగన్
- ఏపీ ప్రజలు సీఎం వైఎస్ జగన్‌కు మద్దతుగా నిలవాలి
- సాక్షి 'ఫేస్ టు ఫేస్' కార్యక్రమంలో ఎంఐఎం అధినేత అసదుద్దీన్



సాక్షి, హైదరాబాద్: ముస్లింలు, దళితులకు చంద్రబాబు ప్రధాన శత్రువు అని ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చెప్పారు. రాజకీయ అవకాశవాది అయిన చంద్రబాబుకు ముస్లింలపై ఎటువంటి ప్రేమ ఉండదని, టీడీపీ, బీజేపీ, జనసేన మతతత్వ ఫాసిస్టు పార్టీలని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ పార్టీలు ముస్లింలు, క్రిస్టియన్ మైనార్టీలకు శత్రువులని అన్నారు. ఏపీలో టీడీపీ, బీజేపీ, జనసేన అధికారంలోకి వస్తే ముందుగా ముస్లిం రిజర్వేషన్లు, ఆ తర్వాత దళితుల రిజర్వేషన్లు తొలగిస్తారని తెలిపారు. ఇందుకోసం బీజేపీ చేస్తున్న కుట్రను చంద్రబాబు, పవన్ ఏపీలో అమలు చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు ముస్లింలు, దళితుల ప్రయోజనాలను తాకట్టు పెట్టి స్వలాభం కోసమే ఆలోచిస్తారన్నారు. 2002లో గుజరాత్ అల్లర్ల కారణంగా దేశం మొత్తం కాలిపోతుంటే, ముస్లింలపై దౌర్జన్యాలు జరుగుతుంటే చంద్రబాబు మాత్రం బీజేపీకి మద్దతిచ్చారని తెలిపారు. చంద్రబాబును ముస్లింలు ఎన్నటికీ నమ్మరని స్పష్టంగా చెప్పారు. ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సెక్యులర్ వాది అని తెలిపారు.

సోమవారం సాక్షి ఫేస్ టు ఫేస్ కార్యక్రమంలో పాల్గొన్న అసదుద్దీన్ ఒవైసీ తన అభిప్రాయాలను సూటిగా, స్పష్టంగా చెప్పారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ నిన్నటి వరకు విశ్వగురు, జీ–20, చంద్రయాన్, 5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ అంటూ ఊదరగొట్టారని, ఇప్పుడు అవన్నీ వదిలేసి హిందూ–ముస్లిం వివాదాన్ని తెరమీదకు తెచ్చారని అన్నారు. ముస్లింలను ద్వేషించడం ఒక్కటే ప్రధాని మోదీ గ్యారంటీ అని, తద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మోదీ ఆయనలోని లోపాలను కప్పిపుచ్చుకొనేందుకు ఇలాంటి వాతావరణం సృష్టించారన్నారు.

ఇప్పుడిప్పుడే ముస్లింలు బాగుపడుతున్నారు

వైఎస్ఆర్ ఇచ్చిన ముస్లిం రిజర్వేషన్ల వల్ల ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో చాలా మంది ముస్లిం యువకులు, విద్యార్థులు లబ్ధి పొందుతున్నారని ఒవైసీ చెప్పారు. ఇప్పుడిప్పుడే ముస్లింలు బాగుపడుతున్నారని తెలిపారు. డాక్టర్లు, ఇంజనీర్లు, డీఎస్పీలు, ఆర్డీవోలు, టీచర్లుగా ఉద్యోగులు పొందుతున్నారన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు ముస్లింలు అంటే తీవ్రమైన ద్వేషమని, 4 శాతం రిజర్వేషన్ల ద్వారా ముస్లింలు లబ్ధిపొందడం బీజేపీకి మింగుడుపడటం లేదని తెలిపారు. విద్య, ఉద్యోగ పరంగా ముస్లింలు లబ్ధి పొందడం, స్వావలంబన సాధించడం బీజేపీకి నచ్చడంలేదని, దీంతో రిజర్వేషన్లు తొలగించేందుకు కుట్రలు చేస్తున్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ముస్లింలకు ఇస్తున్న రిజర్వేషన్లు మతం ప్రాతిపదికన కాదని, ముస్లింలలోని నిమ్న కులాల వారికి ఇస్తున్నారని చెప్పారు. సామాజిక, విద్యాపరమైన వెనుకబాటు కారణంగా వారికి రిజర్వేషన్‌లు అందుతున్నాయని తెలిపారు.

బీజేపీతో కలిసి టీడీపీ, జనసేన కుట్రలు

ముస్లింల అభివృద్ధిని అడ్డుకునేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తో కలిసి ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, జనసేన పార్టీలు పనిచేస్తున్నాయన్నారు. చంద్రబాబు, పవన్ బీజేపీ ఎజెండా ఆధారంగా ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని చెప్పారు. ఏపీలో వీరు అధికారంలోకి వస్తే బీజేపీ కుట్రలు అమలు చేస్తారని, చంద్రబాబు ముస్లిం రిజర్వేషన్లు లేకుండా చేస్తారని తెలిపారు. ముస్లిం రిజర్వేషన్ల తరువాత దళితులకు కూడా రిజర్వేషన్లు లేకుండా చేస్తారన్నారు. ఏపీ ప్రజలంతా ఆలోచించి టీడీపీ, బీజేపీ, జనసేనలాంటి మతతత్వ, ఫాసిస్టు పార్టీలను ఓడిస్తారని ఆశిస్తున్నానని అన్నారు.

హామీ ఇచ్చి అమలు చేసిన వైఎస్సార్

ముస్లిం రిజర్వేషన్లను మహానేత వైఎస్సార్ హామీ ఇచ్చి, అధికారంలోకి రాగానే అమలు చేశారని అసదుద్దీన్ ఒవైసీ చెప్పారు. కాంగ్రెస్ పరిశీలకుడిగా గులాం నబీ ఆజాద్ 2004లో హైదరాబాద్ వచ్చినప్పుడు అప్పటి కాంగ్రెస్ నేత యూనుస్ సుల్తాన్ ఇంట్లో జరిగిన సమావేశంలో ముస్లిం రిజర్వేషన్లు ఇస్తామని వైఎస్ రాజశేఖరరెడ్డి హామీ ఇచ్చారన్నారు. హామీ ఇచ్చినట్లుగానే అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రభుత్వం ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించిందని తెలిపారు. కోర్టు దీనిపై అభ్యంతరం చెప్పడంతో ప్రముఖ ఆంత్రోపాలజిస్టు కృష్ణన్ ఆధ్వర్యంలో కమిటీ వేశారని, ముస్లింలలో కుల ప్రాతిపదికన 4 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం సహేతుకమే అని ఆ కమిటీ తేల్చిందని చెప్పారు. ఆ తరువాత వేసిన ఎస్ఎల్‌పీలో ముస్లిం రిజర్వేషన్లను అనుమతిస్తూ సుప్రీం కోర్టు స్టే ఇచ్చిందన్నారు.

సెక్యులర్ లీడర్ జగన్‌కు అండగా నిలవండి

సెక్యులర్ లీడర్ అయిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ మద్దతివ్వాలని ఒవైసీ కోరారు. విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చాలా సమస్యలున్నాయని, రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని జగన్ రాజకీయ నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు. జగన్ ఎప్పుడూ దళితులు, ముస్లింల ప్రయోజనాల విషయంలో రాజీపడలేదన్నారు. ముస్లింలు, దళితులకు అండగా నిలిచే సెక్యులర్ లీడర్ జగన్ ఏపీకి అవసరమని, ఆయనకు మద్దతుగా నిలిచి ఓటెయ్యాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు ఒవైసీ విజ్ఞప్తి చేశారు.

ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై అన్నీ అపోహలే

రెవెన్యూ, న్యాయపరమైన అంశాలు తెలియనివారు మాట్లాడుతున్నారు

- భూములు లాక్కుంటారనేది శుద్ధ అబద్ధం.. అందరితో సంప్రదించాకే చట్టం అమలు
- టైట్లింగ్ యాక్ట్, రీ సర్వే, ఇ–స్టాంపింగ్ అద్భుతమైన సంస్కరణలు
- స్టాంప్ పేపర్ల కంటే ఎక్కువ భద్రతా ఫీచర్లతో ఇ–స్టాంపింగ్
- ఇండియన్ ఇంటెలెక్చువల్ ఫోరం రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ కేంద్రం నిర్ణయం

- ఈ చట్టం అమలు చేయాలని రాష్ట్రాలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒత్తిడి తెస్తోంది
- అయినా రాష్ట్రంలో అమలు చేయబోమని ఎప్పుడో చెప్పాం
- టీడీపీవి అబద్ధపు ప్రచారాలు
- పేదలకు భూములు పంచిన నేత జగన్..
- రైతుల భూములతో వ్యాపారం చేసుకున్నది టీడీపీ
- రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆగ్రహం

ఎవరినీ వదిలిపెట్టను..

సోషల్ మీడియాలో ఏబీ వెంకటేశ్వరరావు సందేశాలు పెట్టారు

- ఆయనలాంటి పోస్టు చేపడితే విచారణ సజావుగా సాగదు
- ఆలిండియా సర్వీసెస్ నిబంధనల మేరకే ఆయనపై ప్రభుత్వ చర్యలు
- క్రిమినల్ కేసులు తేలేవరకు సస్పెన్షన్ విధించే అధికారం సర్కారుకు ఉంది
- క్యాట్‌లో ఏపీ ప్రభుత్వ ఏజీ శ్రీరాం వాదనలు
- తీర్పును వాయిదా వేసిన ధర్మాసనం

సాక్షి, హైదరాబాద్: సోషల్ మీడియాలో తన కేసుపై వచ్చిన ఓ పోస్టుకు.. 'ఎవరినీ వదిలి పెట్టను'.. అంటూ సస్పెన్షన్‌లో ఉన్న ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు పోస్టు పెట్టారని.. ఓ ఉన్నతస్థాయి అధికారి ఇలా మెసేజ్ పెడితే ఆయనపై కేసుల్లో దర్యాప్తు అధికారులు పారదర్శక విచారణ ఎలా చేయగలరని క్యాట్ (సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్)లో ఏపీ ప్రభుత్వ అడ్వొకేట్ జనరల్ శ్రీరాం వాదనలు వినిపించారు. ఆలిండియా సర్వీసెస్‌లోని నిబంధనల మేరకే ప్రభుత్వం ఆయనపై సస్పెన్షన్ విధించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుమతిలేకుండా ఇజ్రాయిల్ నుంచి ఫోన్ ట్యాపింగ్ పరికరాలు తెచ్చినట్లు, అందులోనూ అవినీతి ఆరోపణలు రావడంతో ఏపీ ప్రభుత్వం ఏబీ వెంకటేశ్వరరావును సస్పెండ్ చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఆ తర్వాత 'సుప్రీం' సూచనలతో రాష్ట్ర ప్రభుత్వం ఆయన్ను విధుల్లోకి తీసుకుంది. విధుల్లో చేరిన తర్వాత తన అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రెస్‌మీట్ల ద్వారా ట్యాపింగ్ కేసులో సాక్షులను బెదిరించే ప్రయత్నం చేశారు. దీంతో ప్రభుత్వం మరోసారి సస్పెండ్ చేసింది. దీన్ని సవాల్ చేస్తూ వెంకటేశ్వరరావు ఏప్రిల్, 2023లో క్యాట్‌ను ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జ్యుడీషియల్ సభ్యురాలు లతా బస్వరాజ్ పట్నే, నాన్–జ్యుడీషియల్ సభ్యురాలు శాలినీ మిస్రా ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ చేపట్టారు. ఏపీ ప్రభుత్వం తరఫున ఏజీ శ్రీరాం వాదనలు వినిపించారు. జీపీ పాండురంగారెడ్డి, ఏజీపీ కృష్ణ హాజరయ్యారు.

సాక్షులను బెదిరించే ప్రయత్నం..

'రెండుసార్లు విలేకరుల సమావేశంలో వెంకటేశ్వరరావు వాడిన భాష సమర్థనీయం కాదు.. ఫోన్ ట్యాపింగ్, అవినీతి కేసుపై 'అవుకథ, నాలుగు కాళ్ల జంతువు' లాంటి వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వంలోని పెద్దలపై, కొందరు అధికారులపై అభ్యంతరకరంగా మాట్లాడారు. ఇదంతా అన్ని పత్రికలు, చానల్‌లో ప్రసారమైంది. కేసుకు ఎప్పుడు ఎలా ముగింపు పలకాలో తనకు తెలుసునని, సరైన సమయంలో సరైన సమాధానం ఇస్తానన్నారు. అంశాలను కొందరు సోషల్ మీడియాలో పెట్టగా.. ఎవరినీ వదిలిపెట్టను అని వెంకటేశ్వరరావు థంబ్‌నెయిల్ పెట్టారు. ఓ సీనియర్ ఐపీఎస్ అధికారి ఇలా పెడితే సాక్షులు, విచారణాధికారులు ప్రభావితమవుతారు. ఆయనను విధుల్లో కొనసాగిస్తే విచారణ పారదర్శకంగా సాగే అవకాశంలేదు. అలాంటప్పుడు వారిపై చర్యలు తీసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంది. ఫోన్ ట్యాపింగ్‌ను కేంద్ర ప్రభుత్వం కూడా ధృవీకరించింది'.. అని ఏజీ వాదించారు.

రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాన్ని సమర్థించిన హైకోర్టులు..

'నిజానికి.. ఆలిండియా సర్వీస్ రూల్స్ ప్రకారం.. క్రిమినల్ అభియోగాలన్నీ తొలగిపోయే వరకు లేదా కొట్టేసేవరకు వారిపై సస్పెన్షన్ విధించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంది. గతంలో సుప్రీంకోర్టు, ఏపీ, బాంబే, హరియాణా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ హైకోర్టులు తీర్పులిచ్చాయి (వాటిని చదివి వినిపించారు). క్రమశిక్షణా చర్యల మేరకే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకు కేంద్రం పూర్తి స్వేచ్ఛ ఇచ్చింది'.. ఏజీ వాదనలు వినిపించారు. అనంతరం వెంకటేశ్వరరావు తరఫు న్యాయవాది వాదనలు విన్న బెంచ్.. వెంకటేశ్వరరావు ప్రెస్‌మీట్ ఆడియో కాపీని అందజేయాలని ఏపీ ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశిస్తూ, తీర్పు రిజర్వు చేసింది.

'ఏబీవీ'.. ఎనీటైం బాబు వెంటే
టీడీపీ పొలిటికల్ సర్వీసులో ఐపీఎస్ అధికారి

- సదా చంద్రబాబు, ఆ పార్టీ సేవలోనే
- గతంలో డేటాచోరీ స్కెచ్‌కు సూత్రధారి
- సస్పెన్షన్‌లో ఉన్నా పచ్చపార్టీ సేవలో తరిస్తున్న అధికారి

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

సునీల్‌యాదవ్ బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వు

సాక్షి, హైదరాబాద్: తనకు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లేకున్నా దాదాపు 32 నెలలుగా జైల్లో ఉంచడం రాజ్యాంగ సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని, బెయిల్ మంజూరు చేయాలని వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో నిందితుడు సునీల్‌యాదవ్ దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పును తెలంగాణ హైకోర్టు రిజర్వు చేసింది. తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆయన మరోసారి హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం మరోసారి విచారించారు. సీబీఐ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. 'వివేకా హత్యకేసులో సునీల్‌యాదవ్‌కు సంబంధం లేకపోయినా అన్యాయంగా ఇరికించారు. హత్యకు వినియోగించిన గొడ్డలిని కాలువలో పడేశారన్నది సునీల్‌పై ప్రధాన ఆరోపణ. అదే నిజమైతే.. ఇప్పటివరకు ఆ ఆయుధం ఎందుకు దొరకలేదు. గూగుల్ టేక్ అవుట్ ఆధారంగా నిందితుడిని ఇంతకాలంగా జైలులో ఉంచటం సుప్రీంకోర్టు తీర్పుల ఉల్లంఘనే..' అని సునీల్‌యాదవ్ న్యాయవాది గతవారమే వాదించారు. ఇరుపక్షాల వాదనలు పూర్తికావడంతో న్యాయమూర్తి తీర్పును రిజర్వు చేశారు.



విశ్వమంటేనే మార్పు, జీవితం కేవలం అభిప్రాయం మాత్రమే!

– మార్కస్ అరేలియస్

సాక్షి

మంగళవారం, 30 ఏప్రిల్ 2024

ఎండుతున్న జలకళ

అనుకున్నంతా అయింది. విశ్లేషకులు భయపడుతున్నట్టే జరిగింది. మొన్న మార్చిలోనే దేశంలోని ప్రధాన జలాశయాలన్నీ అయిదేళ్ళలో ఎన్నడూ లేనంత కనిష్ఠ స్థాయికి అడుగంటినట్టు వార్తలు వచ్చినప్పుడు వేసవిలో ఇంకెంత గడ్డుగా ఉంటుందో అని భయపడ్డారు. సరిగ్గా అప్పుడనుకున్నట్టే ఇప్పుడు దేశం నీటికొరత సంక్షోభంలోకి జారిపోతోంది. ఏప్రిల్ 25 నాటికి దేశవ్యాప్తంగా రిజర్వాయర్లలో నీటిమట్టం ఆందోళనకర స్థాయికి పడిపోయినట్టు కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) తాజా లెక్కలు వెల్లడించాయి. ముఖ్యంగా, దక్షిణాదిలో పదేళ్ళలో ఎప్పుడూ లేనంత కనిష్ఠస్థాయికి జలాశయాల్లో నీటి నిల్వలు పడిపోయాయి. సాగునీటికీ, తాగునీటికీ, జలవిద్యుత్ ఉత్పత్తికీ తిప్పలు తప్పేలా లేవు. ఆ సవాళ్ళకు సంసిద్ధం కావాల్సిన అవసరాన్ని గణాంకాలు గుర్తు చేస్తున్నాయి.

దేశం మొత్తం మీద రిజర్వాయర్ల నిల్వ సామర్థ్యంలో కేవలం 30 శాతం వరకే ప్రస్తుతం నీళ్ళున్నాయని లెక్కలు చెబుతున్నాయి. ఇది గత ఏడాది కన్నా తక్కువ. అందుకే ఇప్పుడింతగా ఆందోళన. వర్షాకాలంలో 2018 తర్వాత అతి తక్కువ వర్షాలు పడింది గత ఏడాదే. దానికి తోడు ఎల్‌నినో వాతావరణ పరిస్థితి వల్ల గత వందేళ్ళ పైచిలుకులో ఎన్నడూ లేనంతగా నిరుడు ఆగస్టు గడిచిపోయింది. వర్షాలు కురిసినా, కొన్నిచోట్ల అతివృష్టి, మరికొన్నిచోట్ల అనావృష్టి. ఇవన్నీ కలిసి దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడ్డాయి. దీర్ఘకాలంగా వర్షాలు కొరవడడంతో నీటి నిల్వలు తగ్గి, అనేక ప్రాంతాలు గొంతు తడుపుకొనేందుకు నోళ్ళు తెరుస్తున్నాయి. హెచ్చిన ఉష్ణోగ్రతలు, తీవ్రమైన వడగాడ్పులు సైతం నీటిమట్టాలు వేగంగా పడిపోవడానికి కారణమయ్యాయి.

దేశంలో తూర్పు ప్రాంతంలోని అస్సామ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ లాంటి రాష్ట్రాల్లో నీటి నిల్వలు కొంత మెరుగ్గా ఉన్నాయి కానీ, మిగతా ప్రాంతాల్లో పరిస్థితి అంత ఆశాజనకంగా లేదు. ప్రధానంగా తూర్పు, దక్షిణ భారత ప్రాంతాల్లో ఈ ప్రభావం అమితంగా కనిపిస్తోంది. కర్ణాటక, తమిళనాడు, కేరళతో పాటు తెలుగు రాష్ట్రాలకూ తిప్పలు తప్పడం లేదు. దక్షిణాదిలో దాదాపు 42 జలాశయాలను సీడబ్ల్యూసీ పర్యవేక్షిస్తుంటుంది. గత ఏడాది ఇదే సమయానికి వాటిలో 29 శాతం దాకా నీళ్ళున్నాయి. దశాబ్ద కాలపు సగటు గమనిస్తే, ఈ సమయానికి కనీసం 23 శాతమన్నా నీళ్ళుండేవి. కానీ, ఈ ఏడాది కేవలం 17 శాతానికి తగ్గిపోయాయి. దాన్నిబట్టి ప్రస్తుత గడ్డు పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. గుజరాత్, మహారాష్ట్రలున్న పశ్చిమ భారతావనిలోనూ అదే పరిస్థితి. అక్కడ సీడబ్ల్యూసీ పర్యవేక్షించే 49 రిజర్వాయర్లలో పదేళ్ళ సగటు 32.1 శాతం కాగా, నిరుడు నీటినిల్వలు 38 శాతం ఉండేవి. కానీ, ఈసారి అది 31.7 శాతానికి పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది.

ఈ ఏడాది మధ్య, ఉత్తర భారతావనుల్లోనూ జలాశయాల్లో నీళ్ళు అంతంత మాత్రమే. అక్కడ చారిత్రక సగటు నిల్వలతో పోలిస్తే, ఈసారి బాగా తక్కువగా ఉన్నాయట. మొత్తం మీద దేశంలోని ప్రధాన నదీపరివాహక ప్రాంతాల రీత్యా చూస్తే... నర్మద, బ్రహ్మపుత్ర, తాపీ నదీపరివాహక ప్రాంతాల్లో పరిస్థితి మాత్రం సాధారణ నిల్వస్థాయుల కన్నా మెరుగ్గా ఉంది. అయితే, కావేరీ నదీ పరివాహక ప్రాంతం, అలాగే మహానది, పెన్నా నదులకు మధ్యన తూర్పు దిశగా ప్రవహించే పలు నదీ క్షేత్రాలు తీవ్రమైన లోటును ఎదుర్కొంటున్నాయి. ఎండలు ముదిరి, వేసవి తీవ్రత హెచ్చనున్న నేపథ్యంలో రానున్న రోజుల్లో పరిస్థితులు మరింత గడ్డుగా మారే ప్రమాదం లేకపోలేదు.

ఇప్పటికే ఇవన్నీ రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేస్తున్నాయి. బెంగళూరు కొద్ది వారాలుగా తీవ్ర నీటి ఎద్దడి సమస్యలో కూరుకుపోయింది. విషయం జాతీయ వార్తగా పరిణమించింది. ఇక, తమిళనాట పలు ప్రాంతాల్లో నెర్రెలు విచ్చిన భూములు, ఎండిన జలాశయాలు, తాగునీటి కొరతతో బిందెడు నీళ్ళ కోసం ప్రజలు నిత్యం ఇబ్బంది పడుతున్న దృశ్యాలు ప్రత్యక్షమవుతున్నాయి. సహజంగానే నిత్యజీవితంతో పాటు వ్యవసాయ కార్యకలాపాలనూ ఈ నీటి నిల్వల కొరత బాధిస్తోంది. తగిన నీటి వసతి లేక వివిధ రకాల పంటలు, తోటలు దెబ్బతింటున్నాయి. ఇవాళ్టికీ భారత ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయ రంగం కీలకం. జలాశయాల్లో తగ్గిన నీటితో అది పెను సవాళ్ళను ఎదుర్కొంటోంది. ఇప్పటికీ మన దేశంలోని సేద్యపు భూముల్లో దాదాపు సగం వర్షపు నీటిపైనే ఆధారపడ్డాయి. రానున్న వర్షాకాలంలో సాధారణ స్థాయికి మించి వర్షపాతం నమోదవుతుందని అంచనా వెలువడింది. ఫలితంగా, ఋతుపవనాలు ఇప్పుడున్న చిక్కులను తొలగిస్తాయన్నది ఆశ.

నిజానికి, దేశంలో జలవిద్యుదుత్పత్తి సైతం తగ్గుతూ వస్తోంది. విద్యుచ్ఛక్తి గిరాకీ విపరీతంగా ఉన్నప్పటికీ, గత ఆర్థిక సంవత్సరం తొలి పది నెలల్లో హైడ్రోపవర్ జనరేషన్ 17 శాతం పడిపోయింది. ఆ మాటకొస్తే, తగ్గుతున్న జలాశయాల నిల్వలు, పెరుగుతున్న ప్రజల నీటి అవసరాల రీత్యా గత కొన్ని దశాబ్దాలుగా ఆసియాలో, ప్రధానంగా చైనా, భారత్‌లలో జలవిద్యుదుత్పత్తి తగ్గుతోంది. ఈ పరిస్థితుల్లో జలసంరక్షణ కీలకం. ప్రభుత్వాలు, పాలకులు తక్షణం స్పందించి, దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే కష్టం. గృహవినియోగం మొదలు వ్యవసాయ పద్ధతులు, పారిశ్రామిక కార్యకలాపాల దాకా అన్ని స్థాయుల్లోనూ నీటి వృథాను తగ్గించి, ప్రతి నీటిబొట్టునూ ఒడిసిపట్టుకోవడం ముఖ్యం. నీటి నిల్వ, పంపిణీలు సమర్థంగా సాగేలా చూడాలి. సుస్థిర వ్యవసాయ విధానాలు, పంటల వైవిధ్యంతో నీటి వినియోగాన్ని తగ్గించాలి. ఎప్పుడైనా వర్షాలు లేక, దుర్భిక్షం నెలకొన్నా తట్టుకొనే సామర్థ్యం పెంపొందించుకోవాలి. నీటి పొదుపు, ఇంకుడు గుంతల ఆవశ్యకత నుంచి వర్షపునీటి నిల్వల దాకా అన్నిటిపై ప్రజా చైతన్యం కలిగించాలి. గడ్డుకాలం కొనసాగితే, భవిష్యత్తులో నీటి కోసం యుద్ధాలు జరుగుతాయని నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో సత్వరమే మేలుకోవాలి.

పశ్చిమాసియా ఘర్షణ ఆర్థికానికి చేటే!

విశ్లేషణ



సుష్మా రామచంద్రన్

భారీ ఆర్థిక వ్యవస్థల కంటే భారత్ మెరుగైన వృద్ధి రేటు నమోదు చేయగల సమయంలో ఇరాన్, ఇజ్రాయెల్‌ల మధ్య ఘర్షణ మొదలైంది. గల్ఫ్ ముడిచమురుపై భారత్ ఎక్కువగా ఆధారపడుతున్న నేపథ్యంలో రవాణాలో వచ్చే ఇబ్బంది ఏదైనా మన ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపడం ఖాయం. పైగా యుద్ధం ముదిరితే ప్రపంచవ్యాప్తంగా ముడిచమురు ధరలు కొండెక్కుతాయి. అత్యధిక లాభాలనిచ్చే యూరోపియన్ మార్కెట్లకు భారత్ తన సరుకులు రవాణా చేయడం కూడా కష్టమవుతుంది. ఇప్పుడు అసలు ప్రశ్న ఏమిటి అంటే... పశ్చిమాసియా ఘర్షణల ప్రభావం నుంచి మన ఆర్థిక వ్యవస్థను రక్షించుకునేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోగలదా అన్నది!

పశ్చిమాసియాలో ఇటీవలి పరిణామాలు భారత్ లాంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలకు ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయి. తీవ్రత, నష్టం ఏమిటన్నవి ఇంకా అంచనా వేయాల్సే ఉన్నా ఈ ఆర్థిక సంవత్సరంలో బాహ్య పరిణామాలు మన ఆర్థిక వ్యవస్థకు అతిపెద్ద ముప్పు కాగలవని మాత్రం కచ్చితంగా చెప్పవచ్చు. ఉక్రెయిన్, రష్యా మధ్య 2022లో యుద్ధం మొదలైన తరువాత పలు దేశాల్లో పరిస్థితులు మారినట్లే పశ్చిమాసియా పరిణామాలు కూడా అంతర్జాతీయంగానే కాకుండా, స్థానికంగానూ కలకలం సృష్టించనున్నాయి. పరిస్థితి సద్దుమణగకుంటే... లేదా మరింత దిగజారితే ఇప్పటికే ఎదురవుతున్న పలు సవాళ్లను తట్టుకోవడం కష్టమని స్వయంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పేర్కొనడం ఇక్కడ ప్రస్తావనార్హం. అంతేకాదు... కొన్ని అసందిగ్ధ పరిస్థితులు ఎదుర్కోవాల్సి రావచ్చు అని కూడా ఆమె సూచనప్రాయంగా తెలిపారు. సప్లై చెయిన్‌లో వచ్చే ఇబ్బందుల వల్ల నిత్యావసరాల ధరలు పెరిగే అవకాశముందని అంటున్నారు కేంద్ర మంత్రి.

ఆర్థిక పరిపుష్టి మార్గంలో కూడా కొన్ని అడ్డంకులు ఉన్నాయన్న కేంద్ర ఆర్థికశాఖ మంత్రి వ్యాఖ్యలు అర్థం చేసుకోదగ్గవే. ప్రపంచంలోని భారీ ఆర్థిక వ్యవస్థల కంటే భారత్ మెరుగైన వృద్ధి రేటు నమోదు చేయగల సమయంలో ఇరాన్, ఇజ్రాయెల్‌ల మధ్య ఘర్షణ మొదలైంది. ఈ ఆర్థిక సంవత్సరంలో జీడీపీ(స్థూల జాతీయోత్పత్తి) 7 శాతం కంటే ఎక్కువ ఉండవచ్చునని ప్రభుత్వం ఉత్సాహంగా ఉన్న వేళ అంతర్జాతీయ సంస్థలు కూడా తమ అంచనాలను సవరించుకుంటున్న విషయం తెలిసిందే. ఇంటర్నేషనల్ మానెటరీ ఫండ్ (అంతర్జాతీయ ద్రవ్యనిధి – ఐఎంఎఫ్) ఇటీవలే భారత్ జీడీపీ వృద్ధిరేటును 6.5 నుంచి 6.8 శాతానికి సవరించింది. ప్రపంచ బ్యాంకు కూడా 6.4 నుంచి 6.6 శాతానికీ, 'స్టాండర్డ్ అండ్ పూర్ గ్లోబల్' 6.4 నుంచి 6.8 శాతానికీ ఈ ఆర్థిక సంవత్సరపు భారత జీడీపీ రేటును సవరించాయి. అయితే ఈ అద్భుతమైన పురోగతిని అంతర్జాతీయ అంశాలు నిరాశాపూరితం చేసే అవకాశం ఉంది. రానున్న వారాల్లో పశ్చిమాసియా ప్రాంతంలో పరిస్థితులు ఒక దశ దాటాయంటే మాత్రం ఇప్పటివరకూ హెచ్చరికలు అనుకుంటున్న పలు ఘటనలు వాస్తవం కావచ్చు.

ఒకవేళ ఇరాన్ తన హోర్ముజ్ జలసంధి ద్వారా ముడిచమురు, సహజవాయువు రవాణాలను నిలిపివేసిందని అనుకుందాం. పెర్షియన్, ఒమాన్ గల్ఫ్‌లను కలిపే ఈ సన్నటి రవాణా మార్గాన్ని అత్యంత కీలకమైన చమురు రవాణా మార్గంగా యూఎస్ ఎనర్జీ ఇన్ఫర్మేషన్ ఏజెన్సీ గుర్తించింది. పర్షియన్ గల్ఫ్ నుంచి రవాణా అయ్యే ముడిచమురులో 80 శాతం ఈ జలసంధి ద్వారానే ఖండాలు



మారుతుంది. భారత దేశం కూడా ఈ ప్రాంతపు ముడిచమురుపై ఎక్కువగా ఆధారపడుతున్న నేపథ్యంలో రవాణాలో వచ్చే ఇబ్బంది ఏదైనా మనపై తీవ్ర ప్రభావం చూపడం ఖాయం. భారత్ ఉపయోగించే ముడిచమురులో 30 శాతం వరకూ రష్యా నుంచే వస్తున్నా మిగిలిన మొత్తం సౌదీ అరేబియా, పశ్చిమాసియా, యూఏఈ వంటి దేశాల నుంచే వస్తూండటం గమనార్హం. హోర్ముజ్ జలసంధి ఎంత కీలకమో దీనిద్వారా అర్థం చేసుకోవచ్చు.

రెండో అంశం... పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరిగితే సూయిజ్ కాలువను కూడా మూసివేసే అవకాశం ఉంది. ఆసియా నుంచి ఎర్ర సముద్రం మీదుగా ఈ కాలువకు వెళ్లే మార్గం బాబ్ ఎల్-మండేబ్ అనే చిన్న కాలువ దగ్గరి నుంచి మొదలవుతుంది. యెమెన్ కేంద్రంగా పనిచేసే హౌతీ తిరుగుబాటుదారులు దాడులకు పాల్పడుతున్న ప్రాంతమిదే. వీరంతా హమాస్‌కు మద్దతుగా ఉన్నవారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే రవాణా కొంత 'కేప్ ఆఫ్ గుడ్‌హోప్' (దక్షిణాఫ్రికా) మీదుగా మళ్లింది. ఫలితంగా రవాణ ఖర్చులు పెరిగిపోవడమే కాదు... సమయం కూడా ఎక్కువవుతోంది. పరిస్థితి ముదిరితే అత్యధిక లాభాలనిచ్చే యూరోపియన్ మార్కెట్లకు భారత్ తన సరుకులు రవాణా చేయడం కష్టమవుతుంది. భౌగోళిక రాజకీయ ఒత్తిళ్ల వల్ల ఎగుమతులు స్తంభించిపోతే వాణిజ్య ప్రవాహాలు తీవ్రస్థాయిలో ప్రభావితమవుతాయి.

మూడో ప్రమాదం ఇంకోటి ఉంది. యుద్ధం ముదిరితే ప్రపంచ వ్యాప్తంగా ముడిచమురు ధరలు కొండెక్కుతాయి. బారెల్‌కు 75–80 డాలర్ల అత్యంత తక్కువ శ్రేణి ధరలు ఇప్పటికే లేకుండాపోయాయి. ప్రస్తుతం బ్రెంట్ ముడిచమురు ధరలు 87 నుంచి 89 డాలర్ల మధ్య ఉన్నాయి. ఇప్పటికైతే ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య ఘర్షణ ఈ ధరల మీద పెద్దగా ప్రభావం చూపలేదు. కానీ ఇంకొంచెం తీవ్రమైతే అవి పెరగడం ఖాయం.

ముడిచమురు ధరలు పెరిగితే ఏమవుతుందో మనందరికీ తెలుసు. కేంద్ర ప్రభుత్వ ఖర్చులు పెరిగిపోతాయి. కరెంట్ అకౌంట్‌పై ఒత్తిడి పెరుగుతుంది. ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కొనేందుకు పెట్రోలు, డీజిల్ల ధరలు పెంచాలని చమురు కంపెనీలు ఇప్పటికే కోరుతూండటం గమనార్హం. ఇది బహుశా ఎన్నికల తరువాతే జరగవచ్చు. అయినా, ఆర్థిక వ్యవస్థపై దుష్ప్రభావం పడటం ఖాయం. ముడిచమురుకు మనం పెట్టే ఖర్చు మాటెలా ఉన్నా... పశ్చిమాసియా మీద అలుముకున్న యుద్ధమేఘాలు తొలగకపోతే మన వ్యూహాత్మక అవసరాల కోసం స్థిరంగా చమురు అందుబాటులో ఉండటమూ అత్యంత కీలకమే. మన దేశ చమురు అవసరాల్లో 80 శాతం దిగుమతులతోనే తీరుతున్నాయన్న వాస్తవాన్ని గుర్తుంచుకోవాలి.

ఇప్పుడు అసలు ప్రశ్న ఏమిటి అంటే?... పశ్చిమాసియా ఘర్షణల ప్రభావం నుంచి మన ఆర్థిక వ్యవస్థను రక్షించుకునేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోగలదా? అన్నది. ప్రస్తుతం మన చేతుల్లో ఏమీ లేదు కానీ... మనకు మిత్రదేశాలే అయిన ఇజ్రాయెల్, ఇరాన్‌లకు నిగ్రహం పాటించమని కోరడం మాత్రం చేయదగ్గ పనే. ముడిచమురు విషయానికి వస్తే ఇటీవలి కాలంలో వేర్వేరు మార్గాల ద్వారా కొనుగోలు చేయడం కొంచెం ఎక్కువైంది. అలాగని గల్ఫ్ నుంచి వచ్చే లోటు మొత్తం భర్తీ అవుతుందని కాదు. కానీ ఈ మార్గాల గుండా వచ్చే ఇతర సరుకుల విషయంలో మాత్రం ప్రత్యామ్నాయాలు వెతకడం అసాధ్యం. కానీ ఈ ప్రవాహానికి ఆటంకాలు ఎదురుకావొచ్చు. ఇలాంటి పరిణామాలే ఎదురైతే రానూ పోనూ సరుకుల ఖర్చులు తడిసి మోపెడవుతాయి.

ఘర్షణ తాలూకు ఇతర ప్రభావాలను ఇప్పుడే అంచనా వేయలేము. కానీ ఉదాహరణకు రష్యా–ఉక్రెయిన్ యుద్ధం మొదలైనప్పుడు వేర్వేరు లోహాల ధరలు అమాంతం పెరిగాయి. సన్‌ఫ్లవర్ నూనెలు దొరక్కుండా పోయాయి. ఇలాగే పశ్చిమాసియాలో యుద్ధం లాంటి వాతావరణం ఏదైనా ఏర్పడితే భారత ఆర్థిక వ్యవస్థపై అనూహ్య పరిణామాలు తప్పకుండా ఉంటాయి. నిజానికి ప్రపంచీకరణ నేపథ్యంలో ఇలాంటి ఇబ్బందుల నుంచి తప్పించుకోవడం ఏ దేశానికీ సాధ్యం కాదు. అందుకే... పశ్చిమాసియా ప్రాంతంలో అత్యంత త్వరగా శాంతి, సాధారణ పరిస్థితులు నెలకొనాలని మాత్రమే ఎవరైనా కోరుకోగలిగేది!

వ్యాసకర్త సీనియర్ ఫైనాన్షియల్ జర్నలిస్ట్

('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

తెలిసీ అనుమతిస్తారా?



జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ చాలా మంది మహిళలను లైంగికంగా బాధించిన వేలాది (2,976) వీడియోలు పెన్‌డ్రైవ్ నుంచి బయటి కొచ్చాయి. ఇవన్నీ ఆయన ఫోన్లో రికార్డు అయినవి. దిగ్భ్రాంతికరం ఏమిటంటే, పెన్‌డ్రైవ్ లీక్ అయినప్పటి నుంచీ బీజేపీ (జేడీఎస్ మిత్రపక్షం) అగ్ర నాయకులకు విషయం తెలుసు. అయినా లోక్‌సభ ఎన్నికల పోటీలో ఉండనిచ్చారు.

– మహమ్మద్ జుబేర్, ఫ్యాక్ట్ చెకర్

సైన్యమే పంపింది!



నాకు ఆశ్చర్యం కలిగించేది ఏమంటే, 25 ఏళ్ల తర్వాత కూడా చాలామంది పాత్రికేయులు, కార్గిల్ యుద్ధ కాలంలో చొరబాట్లకు కారణం పాకిస్తానీ ముజాహిదీన్ అని రాయడం! అది తప్పు. అది భారత మిలిటరీ యుద్ధ చరిత్రనే వక్రీకరిస్తుంది. చొరబాట్లకు కారణం పాకిస్తాన్ నిజ సైనిక యూనిట్లు!

– వేద్ మాలిక్, మాజీ ఆర్మీ చీఫ్

అతివాదపు అడ్డా యూరప్



"నిర్ణయ లేమి వల్ల, 'పొలిటికల్లీ కరెక్ట్'గా ఉండటం వల్ల ర్యాడికల్ అతివాదులు, తీవ్రవాదులు అత్యంత ఎక్కువగా యూరప్ నుంచి వచ్చే రోజొకటి వస్తుంది" అన్నారు 2017లో యూఏఈ విదేశాంగ మంత్రి షేక్ అబ్దుల్లా బిన్ జాయేద్. ఎంత గట్టి సందేశం! (జర్మనీలోని హ్యామ్‌బర్గ్‌లో ఇస్లామిక్ స్టేట్ కావాలంటూ నిరసన జరిగిన నేపథ్యంలో.)

– హసన్ సజ్వానీ, యూఏఈ వ్యాఖ్యాత

ఒకే ఒక్క నటుడు



సినిమాకు ఇచ్చిన గొప్ప తోడ్పాటుకు గానూ బోల్డంత ప్రేమ, ఆరాధనలతో ప్రియాతిప్రియమైన ఇర్ఫాన్ ఖాన్‌ను గుర్తుచేసుకుంటున్నా(ఏప్రిల్ 29న వర్ధంతి). తన అభినయ నైపుణ్యంతో నన్ను ఆందోళనకు గురిచేసేంత దగ్గరగా వచ్చిన నటుడు బహుశా ఆయనొక్కరే. ఆయన ఆత్మను దేవుడు దీవించుగాక.

– అదిల్ హుస్సేన్, నటుడు

ఆ సూత్రమే మంత్రం



ఇండియాలో అమ్ముతున్న చాలా 'ఓఆర్ఎస్' ద్రావణాలు ఫేక్. ఈ కంపెనీలు ఓఆర్ఎస్ ట్రేడ్‌మార్క్‌ను వాడుకుంటున్నాయి. చక్కెర ఎక్కువగా, ప్రమాదకరమైన స్థాయిలో తక్కువగా సోడియం ఉంటాయి. వీటివల్ల చాలామంది పిల్లలు మెదడువాపుతో ఐసీయూల్లో చేరాల్సి వచ్చింది. 'డబ్ల్యూహెచ్ఓ' సూత్రం ఆధారంగా తయారయ్యేదే నిజమైన ఓఆర్ఎస్ అని గుర్తించాలి.

– రేవంత్ హిమత్‌సింగ్ కా, ఫుడ్ యాక్టివిస్ట్

ఇన్ బాక్స్

సంతోషంగా లేని శ్రామికుడు

దేశంలో కార్మికులు అసంతృప్తితో, అర్ధాకలితో ఉన్న వేళ 'మే డే'ని జరుపుకోబోతున్నాం. ఎన్నో ఉద్యమాలూ, త్యాగాల ఫలితంగా వచ్చిన కార్మికుల హక్కులు మళ్లీ హరించే పరిస్థితులు దేశంలో కనిపిస్తున్నాయి. పరిశ్రమలు మూసివేతకు గురవుతున్నాయి. 19వ శతాబ్దంలో పారిశ్రామిక విప్లవం ఫలితంగా అమెరికా, యూరప్‌లలో పరిశ్రమలు ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి. అత్యధిక లాభాల కోసం పెట్టుబడిదారులు కార్మికుల శ్రమను విచక్షణా రహితంగా దోచుకునే వారు. రోజుకు 16 గంటల నుండి 20 గంటలు పని చేయించే వారు. ప్రశ్నించిన కార్మికులను ఇబ్బందులకు గురిచేసేవారు. దీంతో కార్మిక సంఘాల నిర్మాణం జరిగింది.

అమెరికాలోని ఫిలడెల్ఫియా నగరంలో కార్మికులు 1806లో 'మెకానిక్ యూనియన్' పేరిట సంఘాన్ని ఏర్పాటు చేసుకొని పని గంటలను తగ్గించాలనీ, యూనియన్‌లను గుర్తించాలనీ, పనికి తగ్గ వేతనాలు ఇవ్వాలనీ, పరిశ్రమల్లో కనీస వసతులు కల్పించాలనీ, కార్మికులకు తగిన విశ్రాంతి ఇవ్వాలనీ పోరాటం మొదలు పెట్టారు. పోరాటం బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్, అమెరికాలోని ఇతర ప్రాంతాలకూ విస్తరించింది. 1818లో ఇంగ్లాండ్‌లోని స్టాల్ పోర్ట్ పట్టణం బట్టల ఫ్యాక్టరీలో కార్మికులు సమ్మెకు దిగారు. లయన్స్ పట్టణంలో 1831–1834లో కార్మికులు తిరగబడ్డారు. 1848లో ప్యారిస్ పోరాటాలు జరిగాయి.

జర్మనీ, ఆస్ట్రేలియా కార్మికులు తిరగ బడ్డారు. పారిస్‌లో సమ్మెలు జరిగాయి. 1886 మే ఒకటిన అమెరికాలోని చికాగోలో 18 గంటల పని విధానాన్ని వ్యతిరేకిస్తూ 8 గంటల పని విధానాన్ని ప్రవేశపెట్టాలని కార్మికులు సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా జరిగిన కాల్పుల్లో అనేకమంది కార్మికులు మరణించారు. ఈ ఉద్యమం ఫలితంగా 8 గంటల పని విధానాన్ని సాధించు కోవడం జరిగింది. భారత్‌లో 1923 మే 21న 'లేబర్ కిసాన్ పార్టీ ఆఫ్ హిందూస్థాన్' ఆధ్వర్యంలో మొదటిసారి మద్రాస్‌లో 'మే డే' ఉత్సవాలు జరుపుకోవడం ప్రారంభం అయింది.

స్వాతంత్ర్యానంతరం దేశంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పరిశ్రమల స్థాపన పెరగడంతో కార్మికులు – ఉద్యోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. కానీ స్వాతంత్ర్య అమృతోత్సవాల నాటికి అనేక పరిశ్రమలు మూసివేతకు గురికావడం శోచనీయం. భారత్‌లో కోల్ ఇండియా లాంటి ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు దేశంలో 20 లక్షల రిజిస్టర్డ్ కంపెనీలు ఉండగా 2014 నుండి 2023 వరకు 7.5 లక్షల కంపెనీలు మూసివేతకు గురయ్యాయి. రెండున్నర కోట్ల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. 277 ప్రభుత్వ రంగ సంస్థలలో 36 వరకు మూసి వేశారు. పాతిక సంస్థలను అమ్మి వేశారు. నష్టాల పేరిట సంస్థల్లోని ప్రభుత్వ వాటాలను కూడా అమ్మి వేశారు. లాభాలతో ఉన్న కోల్ ఇండియా నుండి 33 శాతం పెట్టుబడులను ఉపసంహరించుకొంది ప్రభుత్వం. 45 కోట్ల మంది అసంఘటిత, వలస కార్మి కుల పరిస్థితీ; 23.5 కోట్ల చదువుకున్న నిరుద్యోగుల పరిస్థితీ దీనంగా తయారయింది.

కార్మిక చట్టాలను సైతం కేంద్ర ప్రభుత్వం కోడ్‌లుగా మార్చేసి హక్కులను హరిస్తున్న కాలమిది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవమైన 'మే డే'ను జరుపుకొంటున్నాం. కార్మికుల హక్కుల పరిరక్షణ పోరుకు మళ్ళీ చెయ్యెత్తి పిడికిలి బిగించి ముందుకు సాగాల్సిన అవసరాన్ని ఇది గుర్తు చేస్తోంది.

– ఎమ్‌డీ మునీర్, సీనియర్ జర్నలిస్ట్ । 99518 65223

(రేపు అంతర్జాతీయ కార్మిక దినోత్సవం)

జనం గుండెల్లో గులాబీ జెండా

అభిప్రాయం



వద్దిరాజు రవిచంద్ర

తెలంగాణ ప్రాంతంలో జరిగిన అనేక పోరాటాల్లో తెలంగాణ సాధన ఉద్యమం మహోన్నతమైంది. వద్దాలుగేండ్ల పాటు నాటి ఉద్యమ నేత కేసీఆర్ సారథ్యంలో సాగిన మహోద్యమంలో రూపుదిద్దుకున్న గులాబి జెండా సమ్మక్క– సారక్కల పౌరుషాగ్నిని రగిలించి స్వరాష్ట్రాన్ని సాధించింది. సరిగ్గా 2001 ఏప్రిల్ 27న ప్రారంభమైన తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) కాలక్రమేణా భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)గా అవతరించింది.

1969 పోరాటం వైఫల్యం వల్ల తెలంగాణ ప్రజలలో రాజకీయ నాయకత్వంపై అవిశ్వాసం చోటు చేసుకున్నది. పదవుల కోసం తెలంగాణ డిమాండును తాకట్టు పెడతారనే అభిప్రాయం బలపడిపోయింది. ఈ నేపథ్యంలో కె. చంద్రశేఖరరావు తమ డిప్యూటీ స్పీకర్ పదవికి రాజీనామా చేయటంతోపాటు శాసన సభ్యత్వానికి సైతం రాజీనామా చేసి నూతన విశ్వాసాన్ని ప్రజల్లో పాదుకొల్పారు. కరీంనగర్‌లో జరిపిన 'సింహగర్జన' సభ విజయవంతమై తెలంగాణ రాష్ట్ర డిమాండ్‌కు ప్రజల్లో ఉన్న మద్దతును చాటి చెప్పింది. ఆ తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో టీఆర్ఎస్ విశేషమైన ఫలితాలను సాధించింది. 23 ఏళ్ళ ఉజ్వల ప్రస్థానంలో టీఆర్ఎస్ చరిత్రాత్మకమైన విజయాలను సాధించింది. పరిపాలనలోనూ నూతన ఆవిష్కరణలెన్నో చేసింది. 14 ఏళ్ల కేసీఆర్ నాయకత్వంలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం కొనసాగింది. ఎన్నికల ప్రక్రియను సైతం పోరాట రూపంగా మలుచుకున్నది.

2004లో కాంగ్రెస్ పార్టీతో ఎన్నికల పొత్తు పెట్టుకున్న టీఆర్ఎస్... ఆనాడు కేంద్రంలో అధికారంలోకి వచ్చిన యూపీఏ కామన్ మినిమమ్ ప్రోగ్రామ్‌లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అంశాన్ని చేర్పించగలిగింది. దేశంలోని 32 పార్టీలను తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఒప్పించి లేఖలు రాయించింది. ఈ కృషి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో కీలకమైన మలుపు. ఆనాటి యూపీఏ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో అనుసరిస్తున్న సాచివేత ధోరణిని నిరసిస్తూ కేసీఆర్ తమ కేంద్ర మంత్రి పదవికీ, పార్లమెంట్ సభ్యత్వానికీ రాజీనామా చేసి కరీంనగర్ ఉప ఎన్నికను సృష్టించారు. ఈ ఎన్నికలో 2 లక్షల 50 వేల మెజారిటీతో కేసీఆర్ విజయం సాధించడం ఉద్యమానికి కొత్త ఊపునిచ్చింది.



అనేకమార్లు పదవీ త్యాగాలు చేసిన టీఆర్ఎస్ పార్టీ నాయకత్వం ఎన్నికల ద్వారా ప్రజల నిర్ణయాన్ని ప్రకటింపచేసినా, నాటి కేంద్ర ప్రభుత్వం ఉపేక్ష ధోరణినే అవలంబించింది. కేంద్రం వైఖరితో విసిగిపోయిన కేసీఆర్... 'తెలంగాణ వచ్చుడో కేసీఆర్ సచ్చుడో' అని భీషణ ప్రతిజ్ఞ చేస్తూ 2009 నవంబర్ 29న చారిత్రాత్మక నిరాహార దీక్షను ప్రారంభించారు. దీక్షకు మద్దతుగా యావత్ తెలంగాణ ప్రజానీకం ఉవ్వెత్తున ఎగిసిపడింది. ఉస్మానియాతోపాటు అన్ని విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులు తరగతులు బహిష్కరించి రోడ్లమీదకు వచ్చారు. ఎందరో యువకులు బలిదానాలకు పాల్పడ్డారు. ఉద్యోగులు, కార్మికులు, కర్షకులు అందరూ సంఘీభావంగా ఎక్కడికక్కడ ఆందోళనలు చేపట్టారు. దీంతో ఆనాటి కేంద్ర హోంమంత్రి చిదంబరం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. చివరకు తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నం 2014 జూన్ 2న సాకారమైంది. తెలంగాణ రాష్ట్రం అవతరించింది. మొదటి రెండు అసెంబ్లీ ఎన్నికల్లోనూ టీఆర్ఎస్‌కే ప్రజలు పట్టం కట్టారు. ఉద్యమ నాయకుడు కేసీఆర్ ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారు.

2023 శాసనసభ ఎన్నికల్లో మోసపు వాగ్దానాలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఆరు గ్యారెంటీలతో ప్రజలను ఏమార్చి గెలిచినా వాటి అమలులో విఫలమయ్యింది. నాలుగు నెలల పాలనలో ఏమీ చేయని కాంగ్రెస్ మళ్లీ పార్లమెంట్ ఎన్నికలంటూ ప్రజల ముందుకు వస్తోంది. ప్రజలు ఆ పార్టీని ఎక్కడికక్కడ నిలదీస్తున్నారు. రాష్ట్రంలోని ఆడపిల్లల పెండ్లికి తులం బంగారం ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇంతవరకూ ఒక్క తులం కూడా ఇవ్వలేదు. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు 15, 16 వేల కోట్ల నిధులు రైతుబంధుకు కేటాయించి రైతులకు భరోసా నిచ్చింది. రెండు దఫాలుగా రూ. 30 వేల కోట్ల రుణమాఫీ చేసింది. గత అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ నేతలు తాము అధికారంలోకి వస్తే 2023 డిసెంబర్ 9న ఒకొక్క రైతుకు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి నేటికీ ఆ హామీని వాయిదా వేస్తూ వస్తున్నారు.

ప్రస్తుతం రాష్ట్రంలో పర్యటిస్తున్న కేసీఆర్‌కు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. రాబోవు రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి రావాలని ప్రజలు కేసీఆర్‌ను మనసారా దీవిస్తున్నారు.

వ్యాసకర్త రాజ్యసభ సభ్యులు

యమ నియమాలు

మన భారతీయ సంస్కృతిలో సమాజ శ్రేయస్సుకూ, వ్యక్తి శ్రేయస్సుకూ అనుసరించవలసిన నియమాలు నిర్దేశితమై ఉన్నాయి. ముఖ్యంగా పతంజలి అష్టాదశ యోగసూత్రాల్లోని 'యమ', 'నియమ' సూత్రాలు ఇటువంటివే. యమ అంటే అహింస, సత్యం, అస్తేయం, బ్రహ్మచర్యం, అపరిగ్రహం అనే నియమాలు. ఈ ఐదింటిని పాటించటం వల్ల సమాజ శాంతి, సంక్షేమం సాధ్యమవుతుంది.

అహింసను జీవన సూత్రంగా అలవర్చుకుంటే నేటి హత్యలు, దాడులు, కొట్లాటలు, గొడవలు ఏవీ ఉండవు.



సత్యం పాటించటం వల్ల సమాజంలో అవినీతి, అన్యాయం ఉండవు కదా! అస్తేయం అంటే దొంగతనం చేయకుండుట. ప్రశాంత సమాజం ఉండాలంటే అస్తేయాన్ని పాటించాలి. బ్రహ్మచర్యం అంటే వివాహం చేసుకోకుండా ఉండటం అని కాదు అర్థం. వివాహం అయినప్పటికీ తన భార్యతో సహా స్త్రీలందరినీ మాతృస్వరూపులుగా భావించమని అర్థం. అపరిగ్రహం అంటే ఇతరుల వస్తువు కావాలని మనసులో కూడా కోరుకోకపోవటం.

నియమ అనగా – శౌచం, సంతోషం, తపస్సు, స్వాధ్యాయం, ఈశ్వర ప్రణిధానం అనే ఐదు నియమాల తోరణం. ఈ ఐదింటినీ పాటించడం వల్ల వైయక్తిక శాంతి, సుఖం సాధ్యమవుతాయి. శౌచం అనగా శుచి. కేవలం శారీరకంగానే కాదు, మానసిక శుభ్రత కూడా పాటించాలి. సంతోషం అంటే ఆనందంగా ఉండాలి అని అర్థం. ఉన్న దానితో సంతృప్తి చెందితే జీవితం ఆనందమయం అవుతుంది. తపస్సు అంటే ముక్కుమూసుకొని ధ్యానం చెయ్యమని కాదు అర్థం. ప్రతి పనినీ ఏకాగ్రతతో చేయటమే తపస్సు. అంతేకాదు శారీరక, మానసిక, వాచిక తపస్సుల గూర్చి కూడా భగవద్గీతలో చెప్పబడింది. స్వాధ్యాయం అంటే సద్గ్రంథ పఠనం. మంచి సాహిత్యం చదవటం వల్ల వ్యక్తిత్వ వికాసం అలవడుతుంది.

ఈశ్వర ప్రణిధానం అంటే నీ ప్రతి ఆలోచననూ, ప్రతి కర్మనీ భగవంతుని అర్పణగా భావిస్తూ చెయ్యటం. సర్వస్వం భగవంతునిదే అనే భావన వల్ల అహంకారం తొలగి మనిషి త్యాగ భావనతో జీవిస్తాడు. తద్వారా మానవుడు మోక్షాన్ని పొందవచ్చు.

– సాక్షి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** బ.సప్తమి రా.2.52 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** ఉత్తరాషాఢ రా.1.39 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** ఉ.10.13 నుండి 11.45 వరకు, తదుపరి తె.5.28 నుండి 6.56 వరకు (తెల్లవారితే బుధవారం), **దుర్ముహూర్తం:** ఉ.8.08 నుండి 8.56 వరకు, తదుపరి రా.10.50 నుండి 11.38 వరకు, **అమృతఘడియలు:** రా.7.25 నుండి 8.46 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.39, **సూర్యాస్తమయం:** 6.14.

రేవంత్‌ను ఎందుకు అరెస్టు చేయరు?: హరీశ్



సదాశివపేట(సంగారెడ్డి): తప్పుడు, గోబెల్స్ ప్రచారం కేసులో సీఎం రేవంత్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో జరిగిన రోడ్‌షోలో ఆయన ప్రసంగించారు. ముఖ్యమంత్రికి ఢిల్లీ పోలీసులు ఇచ్చిన నోటీసులపై ఆయన స్పందించారు. తప్పుడు, గోబెల్స్ ప్రచారం చేసినందుకు రేవంత్‌కు నోటీసులు ఇచ్చారనీ. ఈ కేసుకు సంబంధించి అస్సాంలో ఇప్పటికే ఒకరిని అరెస్టు చేశారని, మరి రేవంత్‌ని ఎందుకు చేయరని ప్రశ్నించారు. ఒకవేళ అరెస్టు చేయకపోతే మోదీ, రేవంత్‌ల దోస్తానా బయటపడినట్లేనని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని మోసం చేసిందనీ, ఓట్ల కోసం వస్తే కాంగ్రెస్ నేతలను చీపుర్లతో తరిమికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

దేవుళ్ల పేర్లతో..: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రామిసరీ నోట్లు, బాండ్‌పేపర్లతో నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్.. లోక్‌సభ ఎన్నికల్లో దేవుళ్లపై ప్రామిస్ చేస్తోందని హరీశ్ విమర్శించారు. వారి మాయ మాటలను నమ్మి ప్రజలు మరోసారి ఓటేస్తే వారి అబద్ధాలు, మోసాలను ఆమోదించినట్లు అవుతుందని, బీఆర్‌ఎస్‌కు ఓటేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో కొట్లాడేందుకు బలం ఇవ్వాలని కోరారు.

కాంగ్రెస్‌లోకి గుత్తా తనయుడు అమిత్



అమిత్‌కు కాంగ్రెస్ కండువా కప్పుతున్న సీఎం రేవంత్ రెడ్డి. చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు గుత్తా అమిత్‌రెడ్డి సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ సమక్షంలో ఆయన పార్టీ కండువా కప్పుకున్నారు. ఆయనతోపాటు గుత్తా సోదరుడు గుత్తా జితేందర్‌రెడ్డి కూడా కాంగ్రెస్‌లో చేరారు. వారిని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెంటపెట్టుకొని సీఎం వద్దకు తీసుకెళ్లి పార్టీలో చేర్పించారు. వారి వెంట ఏఐసీసీ జనరల్ సెక్రటరి రోహిత్ చౌదరి ఉన్నారు. ఎన్నికలకు ముందు అమిత్‌రెడ్డికి ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నాలు చేశారు. కానీ దక్కలేదు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత నల్లగొండ ఎంపీగా పార్టీ అవకాశం ఇస్తే పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు. ఆ తర్వాత భువనగిరి, నల్లగొండ నియోజకవర్గాల్లో ఎక్కడి నుంచైనా పోటీ చేయడానికి తనకు అభ్యంతరం లేదని గుత్తా సుఖేందర్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. తదనంతరం చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో పోటీకి దూరంగా ఉన్నట్టు అమిత్‌రెడ్డి ప్రకటించారు.

సీఎంకు ఫేక్ 'షా'క్

▶ మొదటి పేజీ తరువాయి

సహా మే 1వ తేదీన స్పెషల్ సెల్ కార్యాలయానికి రావాలని నోటీసులో పేర్కొన్నారు. నోటీసులు అందుకున్నవారిలో టీపీసీసీ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె సతీష్, శివకుమార్ అంబాలా, నవీన్, ఆస్మా తస్లీం ఉన్నారు. వీరికి సంబంధించిన నోటీసులను గాంధీభవన్‌లో కాంగ్రెస్ లీగల్ సెల్ ఇన్‌చార్జి రామచంద్రారెడ్డికి ఇచ్చిన ఢిల్లీ పోలీసులు.. రేవంత్‌కు సంబంధించి టీపీసీసీ అధ్యక్షుడి పేరిట 91/160 సీఆర్‌పీసీ కింద నోటీసులను ఆయన నివాసంలో ఇచ్చినట్టు తెలిసింది. కర్ణాటకలో ఎన్నికల ప్రచారంలో ఉన్న రేవంత్.. తనకు నోటీసులు వచ్చిన విషయాన్ని వెల్లడించారు కూడా.

సిద్దిపేటలో మాట్లాడిన వీడియో డీప్ ఫేక్‌తో..

కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇటీవల సిద్దిపేటలో జరిగిన బహిరంగసభలో మాట్లాడుతూ.. మతపరంగా ముస్లింలకు ఇస్తున్న రిజర్వేషన్లను రద్దు చేస్తామని.. వాటిని ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు ఇస్తామని వ్యాఖ్యానించారు. అయితే కొందరు ఆ వీడియోను డీప్‌ఫేక్‌తో మార్ఫింగ్ చేశారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు రద్దు చేస్తామని అమిత్‌షా అన్నట్టుగా ఎడిట్ చేసి.. సోషల్ మీడియాలో పెట్టారు. ఈ వీడియో విపరీతంగా వైరల్ అయింది. ఫేస్‌బుక్, ఎక్స్ (ట్విట్టర్)లో కాంగ్రెస్ పార్టీ, టీపీసీసీ, రేవంత్ పేరిట ఉన్న ఖాతాల నుంచి కూడా ఈ వీడియో షేర్ అయింది. దీనిపై బీజేపీ రాష్ట్ర శాఖ ఇక్కడి పోలీసులకు, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది కూడా. అయితే ఈ వీడియో దేశవ్యాప్తంగా కూడా వైరల్ అవుతుండటం.. ముఖ్యంగా కాంగ్రెస్ సోషల్ మీడియా ఖాతాల ద్వారా విస్తృత ప్రచారంలోకి రావడంతో కేంద్రం హోం శాఖ అలర్ట్ అయింది.

ఉదయమే గాంధీభవన్‌కు సమాచారం

అమిత్ షా డీప్‌ఫేక్ వీడియో వ్యవహారానికి సంబంధించి నోటీసులు ఇవ్వడానికి ఢిల్లీ పోలీసులు వస్తున్నారని సోమవారం ఉదయమే గాంధీభవన్‌కు సమాచారం అందింది. మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఐఎఫ్‌ఎస్‌ఓ స్పెషల్ సెల్ ఇన్‌స్పెక్టర్ నీరజ్ చౌదరి నేతృత్వంలోని బృందం గాంధీభవన్‌కు చేరుకుంది. టీపీసీసీ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె సతీష్, శివకుమార్ అంబాలా, నవీన్, ఆస్మా తస్లీంలకు నోటీసులు ఇవ్వాలని పేర్కొంది. వారి తరఫున కాంగ్రెస్ లీగల్ సెల్ ఇన్‌చార్జి, అడ్వొకేట్ రామచంద్రారెడ్డి ఆ నోటీసులను తీసుకున్నారు. ఎవరి ఫిర్యాదు మేరకు నోటీసులు ఇచ్చారని రామచంద్రారెడ్డి ప్రశ్నించగా.. కేంద్ర హోంశాఖ నుంచి వచ్చిన ఫిర్యాదు అని ఇన్‌స్పెక్టర్ వివరించారు. దీంతో ఈ కేసుకు సంబంధించిన ఎఫ్‌ఐఆర్ కాపీని తమకు పంపాలని.. పూర్వాపరాలు పరిశీలించి ముందుకు వెళ్తామని, ఇందు కోసం 15 రోజుల గడువు కావాలని ఇన్‌స్పెక్టర్‌ను రామచంద్రారెడ్డి కోరారు. ఈ మేరకు రాతపూర్వకంగా విజ్ఞప్తిని అందజేశారు. దీనితో ఢిల్లీ పోలీసులు వెళ్లిపోయారు.

కాంగ్రెస్ నేతల ఆగ్రహం

ఢిల్లీ పోలీసులు గాంధీభవన్‌కు వచ్చిన విషయం తెలిసి మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, పార్టీ నాయకురాలు శోభారాణి తదితరులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. ఢిల్లీ పోలీసుల తీరును తప్పు పట్టారు. ఏ వీడియోను ఎవరు, ఎందుకు సోషల్ మీడియాలో పెట్టారో తెలియకుండా, ఎఫ్‌ఐఆర్ కాపీ కూడా లేకుండా గాంధీభవన్‌కు వచ్చి నోటీసులు ఇవ్వడం శోచనీయమని పేర్కొన్నారు.

ఐటీ చట్టం, సీఆర్‌పీసీల కింద కేసు నమోదు చేసి..

కేంద్ర హోంమంత్రి అమిత్ షా డీప్‌ఫేక్ వీడియో విషయంలో తగిన చర్యలు చేపట్టాలని కేంద్ర హోంశాఖ 'ఇండియన్ సైబర్ క్రైం కో–ఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ)'ని ఆదేశించింది. ఐ4సీ డిప్యూటీ కమిషనర్ సింకూ శరణ్ సింగ్ ఆదివారమే ఢిల్లీ 'ఇంటెలిజెన్స్ ఫ్యూజియన్ స్ట్రాటజిక్ ఆపరేషన్స్ (ఐఎఫ్‌ఎస్‌ఓ)' స్పెషల్ సెల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఐటీ చట్టం సెక్షన్ 66సీ, ఐపీసీలోని 153/153ఏ/465/469/171జీ సెక్షన్ల కింద కేసు (ఎఫ్‌ఐఆర్ నంబర్ 177/24) నమోదు చేసింది. అమిత్ షా వీడియోను డీప్‌ఫేక్ మార్ఫింగ్ చేసిందెవరు? 'ఎక్స్', ఫేస్‌బుక్, ఇతర సోషల్ మీడియా ఖాతాల ద్వారా వైరల్ చేసిందెవరనే దానిపై దర్యాప్తు చేపట్టింది. ఇందులో భాగంగా 91/160 సీఆర్‌పీసీ కింద నోటీసులు జారీ చేసింది. మరోవైపు ఈ వీడియోను వైరల్ చేసిన వారిపై బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనూ చర్యలు చేపట్టారు.

ఫేస్‌బుక్, 'ఎక్స్'లకూ నోటీసులు

ఈ వీడియో వ్యవహారానికి సంబంధించి ఫేస్‌బుక్, ఎక్స్ (ట్విట్టర్) సంస్థలకు కూడా స్పెషల్ సెల్ పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఎవరు ఆ వీడియోను మొదట పోస్ట్ చేశారు? ఇప్పటివరకు ఎందరు ఆ వీడియోను సర్క్యులేట్ చేశారనే వివరాలను వెబ్ లింకులతో సహా ఇవ్వాలని ఆదేశించారు.

స్పెషల్ సెల్‌కు చేసిన ఫిర్యాదులో ఏముంది?

''ఒక సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రసంగించిన వీడియోను మార్చేసి (డీప్‌ఫేక్, ఎడిట్, బోగస్ చేసి) కొందరు వ్యక్తులు ఎక్స్, ఫేస్‌బుక్ పేజీల్లో పోస్ట్ చేశారు. వాస్తవానికి అమిత్ షా మాట్లాడినది వేరు, వాళ్లు పోస్ట్ చేసిన ప్రసంగం వేరు. ఏయే పేజీల్లో (ఎక్స్, ఫేస్‌బుక్) ఆ వీడియోను పోస్ట్ చేశారనేది లింకులతో సహా ఇస్తున్నాం. సమాజాన్ని, ప్రజలను తప్పుదోవ పట్టించేలా అసత్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కొందరు భావిస్తున్నారు. అందుకే వాళ్లు అమిత్ షా ప్రసంగాన్ని మార్ఫింగ్ చేసి పోస్ట్ చేశారు. ఆ అసత్య వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆ ఎక్స్, ఫేస్‌బుక్ ఖాతాలను నిర్వహిస్తున్న వారిని, వాటికి సంబంధించిన ఇన్‌చార్జులు, నకిలీ వీడియోతో ప్రచారానికి శ్రీకారం చుట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి'' అని స్పెషల్ సెల్‌కు చేసిన ఫిర్యాదులో ఐ4సీ డిప్యూటీ కమిషనర్ సింకూ శరణ్ సింగ్ పేర్కొన్నారు. మరోవైపు అమిత్ షా ఫేక్ వీడియో వ్యవహారానికి సంబంధించి చర్యలు తీసుకోవాలంటే బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి సోమవారం హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

'డీప్ ఫేక్' తప్పుడు ప్రచారంపై చర్యలు తీసుకోండి

- కేంద్ర ఎన్నికల సంఘానికి బీజేపీ ఫిర్యాదు
- కేంద్ర మంత్రి అమిత్ షా సహా కీలక వ్యక్తుల వ్యాఖ్యలను వక్రీకరించారని వెల్లడి
- ఇది ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపుతోందని వివరణ

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నికల సమయంలో టెక్నాలజీని దుర్వినియోగం చేస్తూ 'డీప్ ఫేక్' వీడియోలతో జరుగుతున్న తప్పుడు ప్రచారంపై చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘానికి బీజేపీ ఫిర్యాదు చేసింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, సినీనటులు రణ్‌వీర్ సింగ్, అమీర్‌ఖాన్, సమాజ్‌వాదీ పార్టీ జనరల్ సెక్రటరీ లాల్‌జీ వర్మ తదితరుల వీడియోలను 'డీప్‌ఫేక్' చేసి, వివాదాస్పద అంశాలను జోడించి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేశారని పేర్కొంది. సమాజంలోని కీలక వ్యక్తుల మాటలను వక్రీకరించి, ప్రచారం చేయడం ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపుతోందని స్పష్టం చేసింది. ఈ మేరకు సోమవారం కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్, ఎంపీ అనిల్ బలూని, క్రమశిక్షణ కమిటీ సభ్యుడు ఓం పాఠక్ తదితరులు ఈసీకి ఫిర్యాదు చేశారు. 'బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ తదితరులకు ఇస్తున్న చట్టవిరుద్ధమైన రిజర్వేషన్లను రద్దు చేస్తాం' అంటూ అమిత్ షా మాట్లాడినట్టుగా తప్పుడు వీడియోను వైరల్ చేశారని వివరించారు. వాస్తవానికి ''బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైతే చట్ట విరుద్ధమైన ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తాం. అవి తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు దక్కాల్సినవి..'' అని చెప్పారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

సెక్షన్లేమిటి.. నేరాలేమిటి?

ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు అమిత్ షా డీప్‌ఫేక్ వీడియోకు సంబంధించి ఐటీ చట్టంలోని సెక్షన్ 66సీ, ఐపీసీలోని 153/153ఏ/465/469/171జీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఆయా సెక్షన్లను ఏయే నేరాలకు సంబంధించి నమోదు చేస్తారంటే..

ఐటీ యాక్ట్ సెక్షన్ 66సీ: ఆన్‌లైన్/ఇంటర్నెట్‌లో ఎవరైనా వ్యక్తుల గుర్తింపును మోసపూరితంగా, వారి పరువుకు భంగం కలిగేలా వినియోగించడం. ఈ సెక్షన్ కింద గరిష్టంగా మూడేళ్ల వరకు జైలుశిక్ష, రూ.లక్ష వరకు జరిమానా విధించేందుకు అవకాశం ఉంటుంది.

ఐపీసీ సెక్షన్ 153/ సెక్షన్ 153ఏ: ఎవరైనా వ్యక్తులపై ఉద్దేశపూర్వకంగా ఇతరులను రెచ్చగొట్టడం, దాడికి ప్రేరేపించేలా చేయడం.. మతం, కులం, ప్రాంతం, భాష ప్రాతిపదికన వివిధ వర్గాల మధ్య విద్వేషాన్ని రగిలించడం. ఈ సెక్షన్ల కింద గరిష్టంగా ఏడాది వరకు జైలు శిక్ష, జరిమానా విధించవచ్చు.

సెక్షన్ 465: ఎవరైనా వ్యక్తుల గుర్తింపును ఫోర్జరీ చేయడం. ఈ సెక్షన్ కింద గరిష్టంగా రెండేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా విధించవచ్చు.

సెక్షన్ 469: ఎవరైనా వ్యక్తులు, సంస్థల పరువుకు భంగం కలిగించేందుకు ఉద్దేశపూర్వకంగా డాక్యుమెంట్లు/ఎలక్ట్రానిక్ రికార్డులను ఫోర్జరీ చేయడం. ఈ సెక్షన్ కింద గరిష్టంగా మూడేళ్ల వరకు జైలుశిక్ష, జరిమానా విధించవచ్చు.

సెక్షన్ 171 జీ: ఎవరైనా అభ్యర్థి వ్యక్తిత్వంపై దుష్ప్రచారం చేయడం, ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించడం. ఈ సెక్షన్ కింద కేవలం జరిమానా విధించే అవకాశం ఉంటుంది.

నోటీసులు జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం

టీపీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్, దయాకర్

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల ప్రచారంలో కేంద్రమంత్రి అమిత్ షా మాట్లాడిన మాటలను ఫేక్ వీడియోలు చేశారన్న ఆరోపణలతో సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర కాంగ్రెస్ నేతలకు నోటీసులు జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్, టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈ ఎన్నికల్లో తమకు గెలుపు అవకాశాలు తక్కువగా ఉన్నాయని గ్రహించి కాంగ్రెస్‌పై నిందలు వేయడానికి బీజేపీ పన్నిన కుట్రలో భాగమే ఇది అని విమర్శించారు. అమిత్ షా ఆరోపించిన ఫేక్ వీడియో కచ్చితంగా బీజేపీకి చెందిన నకిలీ వీడియోల ఫ్యాక్టరీ నుంచి వచ్చిందేనన్నారు. తెలంగాణ ప్రజలకు బీజేపీ జిమ్మిక్కులు బాగా తెలుసునని, ఎన్నికల్లో గుణపాఠం చెబుతామన్నారు

బీజేపీని ప్రశ్నించినందుకే నోటీసులు

- మోదీ ఈడీ, ఐటీ, సీబీఐనే కాదు.. చివరికి ఢిల్లీ పోలీసులనూ పంపుతున్నారు
- ఇలాంటి వాటికి నేను బెదిరేది లేదు.. కర్ణాటక ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి
- బీజేపీకి 400 ఎంపీ సీట్లు ఇస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను రద్దు చేస్తుందని వ్యాఖ్య
- ఆ కుట్రలను భగ్నం చేయాలంటే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపు



వేదికపై రేవంత్‌తో మాట్లాడుతున్న ప్రియాంక

సాక్షి, బళ్లారి: ''బీజేపీపై పోరాటం చేసే వారికి అమిత్ షా నోటీసులు ఇస్తున్నారు. సోషల్ మీడియాలో బీజేపీని ప్రశ్నించినందుకు తెలంగాణ ముఖ్యమంత్రినైన నాకు, గాంధీభవన్ నేతలకు ఢిల్లీ పోలీసులు నోటీసులు ఇచ్చారు. మోదీ, అమిత్ షాలు ఎన్నికలు వచ్చినప్పుడల్లా ఈడీ, ఐటీ, సీబీఐ అధికారులను పంపుతున్నారు. చివరికి ఢిల్లీ పోలీసులను కూడా పంపుతున్నారు. ఇలాంటి వాటికి నేను బెదిరేది లేదు..''అని టీపీసీసీ చీఫ్, సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కర్ణాటకలోని కలబుర్గి లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో రేవంత్ పాల్గొన్నారు. ఢిల్లీ పోలీసుల నోటీసులకు భయపడబోమన్నారు.

బీజేపీ రిజర్వేషన్లను రద్దు చేస్తుంది

400 సీట్లు ఇవ్వాలని బీజేపీ నాయకులు పదే పదే కోరుతున్నారని, అదే జరిగితే రాజ్యాంగాన్ని సమూలంగా మార్చి ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను పూర్తిగా లేకుండా చేస్తారని రేవంత్ మరోసారి ఆరోపించారు. వారి కుట్రలను భగ్నం చేయాలంటే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఈ దేశానికి ఏమీ చేయలేదని మండిపడ్డారు. దేశంలో నిరుద్యోగ సమస్య పెరిగిందన్నారు. రైతులకు తీవ్ర అన్యాయం చేశారని, బడాబాబులకు మాత్రం మేలు చేశారని పేర్కొన్నారు. కర్ణాటకలో కరువు విలయ తాండవం చేస్తున్నా కేంద్రం నిధులు ఇవ్వడం లేదని.. ఢిల్లీలో కాంగ్రెస్ నాయకులు ధర్నా చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని చెప్పారు. కేంద్రం తీరును సుప్రీం కోర్టు కూడా తప్పుపట్టిందన్నారు.

సీఎం బహిరంగ క్షమాపణలు చెప్పాలి

- ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీపై రేవంత్ చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి
- అవసరమైతే కోర్టుకు ఈడుస్తాం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి
- బీజేపీలో చేరిన పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత, పెద్దిరెడ్డి తదితరులు



కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్), బీజేపీలపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు బహిరంగ క్షమాపణ చెప్పి, వాటిని వెనక్కి తీసుకోవాలని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌పై ఆయన చేసిన వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమైనవని, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఖండించిన విషయాన్ని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి కనీసం ఏ ఆధారం లేకుండా మాట్లాడటం క్షమించరాని నేరమని, అవసరమైతే ఆయనను కోర్టుకు ఈడుస్తామన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రసంగ వీడియోను మార్ఫింగ్ చేయడం నేరమని, వాటిని ఏకంగా కాంగ్రెస్ పార్టీ అఫీషియల్ సోషల్ మీడియా పేజీలో పోస్ట్ చేయడమంటే దిగజారుడుతనమేనని చెప్పారు. ఇది దేశ భద్రతకే ప్రమాదమని, రిజర్వేషన్లు పోతాయంటూ చేసిన వ్యాఖ్యల తో బడుగు బలహీనవర్గాల ప్రజల్లో ఉద్రిక్తతలు రెచ్చగొట్టి శాంతిభద్రతలకు భంగం కలిగించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశామని, దీనిపై కోర్టుకు వెళ్లేందుకు కూడా తాము వెనుకాడబోమన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి, మంథని నియోజకవర్గనేత నారాయణరెడ్డి, కార్మిక సంఘ నాయకుడు కాంతారెడ్డి, భూపాలపల్లి గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేష్‌నాయక్‌లతోపాటు, బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లకు చెందిన పలువురు బీజేపీలో చేరారు. అనంతరం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ బీజేపీ రిజర్వేషన్లు తొలగిస్తుందని, హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటిస్తారని తప్పుడు ప్రచారం చేస్తూ, తలాతోక లేకుండా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మజ్లిస్ గెలుపు కోసం ప్రయత్నం చేస్తున్నాయని, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పోటీపడి చెరోవైపు ఒవైసీ చంక నాకుతున్నాయని మండిపడ్డారు. హామీల అమలులో వైఫల్యం చెందిన రేవంత్‌రెడ్డి ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయారని, ఆయన్ను రైతులు, యువత, మహిళలు, తెలంగాణ సమాజం నమ్మడం లేదన్నారు. రిజర్వేషన్ల విషయంలో బీజేపీపై చేసిన అసత్య ప్రకటనలు, ఆరోపణలతో ఆయన నిజం స్వరూపం బట్టబయలైందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అనిశ్చిత పరిస్థితిలో ఉండి, నిరాశ నిస్పృహల్లో కూరుకుపోయి మార్ఫింగ్ వీడియోలతో తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. బీఆర్‌ఎస్ అనుసరిస్తున్న విధానాలు నచ్చక బీజేపీలో చేరానని మాజీ మంత్రి పెద్దిరెడ్డి చెప్పారు.

రెండున్నర నెలల్లో రెండుపార్టీలు..

వెంకటేశ్ నేత 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి చెన్నూరు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. 2019లో అప్పటి టీఆర్‌ఎస్‌లో చేరి, పెద్దపల్లి నుంచి పోటీ చేసి ఎంపీగా గెలిచారు. మళ్లీ ఎంపీ టికెట్ దక్కదని గ్రహించి, గత ఫిబ్రవరిలో కాంగ్రెస్‌లో చేరారు. అయితే గడ్డం వంశీకృష్ణకు టికెట్ ఖరారు కావడంతో ఆ పార్టీలోనే ఉండి బీజేపీ టికెట్ కోసం ప్రయత్నాలు చేశారు. ఆ పార్టీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్‌ను మార్చి తనకే టికెట్ ఇవ్వాలని బీజేపీ పెద్దలను కోరినా ఆ ప్రయత్నాలు ఫలించలేదు. టికెట్ దక్కలేదని కేవలం రెండున్నర నెలల్లో ఆయన రెండు పార్టీలు మారారు.

రిజర్వేషన్ల రద్దుపై ప్రమాణానికి సిద్ధమా?

- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతలకు బండి సంజయ్ సవాల్
- ఓటమి భయంతోనే రెండు పార్టీలు కలిసి విష ప్రచారమని ధ్వజం



కరీంనగర్ టౌన్: కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి రాగానే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను రద్దు చేస్తుందంటూ సీఎం రేవంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలను బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ తీవ్రంగా ఖండించారు. సోమ వారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఓడిపోతారనే భయంతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కుమ్మక్కై ఒకే స్వరాన్ని విన్పిస్తూ ప్రజల్లో భయందోళనలు సృష్టిస్తున్నాయని మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయా నేతలకు సవాల్ విసిరారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి అనుగుణంగా రిజర్వేషన్లను బీజేపీ ప్రభుత్వం యథాతథంగా కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ మాటకు తాము కట్టుబడి ఉన్నామని, ఇదే విషయంపై బీజేపీ పక్షాన తాను ప్రమాణం చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. ఈ ప్రమాణానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని కూడా ఒప్పించి తీసుకొస్తానని చెప్పారు.

డేట్, టైం మీరే ఫిక్స్ చేయండి

'డేట్, టైం, వేదిక మీరే ఫిక్స్ చేయండి.. అదే సమయంలో రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నమైన, సుప్రీం తీర్పునకు వ్యతిరేకమైన ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని ప్రమాణం చేసే దమ్ము మీకుందా?' అని సీఎం, కేటీ ఆర్‌లకు బండి సంజయ్ సవాల్ విసిరారు. బండి సంజయ్ అవినీతిపరుడంటూ కేటీఆర్, పొన్నం ప్రభాకర్ చేసిన ఆరోపణలపై తీవ్రంగా స్పందించారు. 'నేను అవినీతికి పాల్పడితే ఇన్నాళ్లు అధికారంలో ఉన్నది మీరే కదా.. నాపై ఎందుకు చర్యలు తీసుకోలేదు' అని ప్రశ్నించారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ భూస్థాపితం కావ డానికి ప్రధాన కారణం కేటీఆరేనని, జనం ఛీ కొట్టినా ఆయనకు అహంకారం తగ్గలేదన్నారు. పంట నష్టపోయిన రైతుల తరఫున, 317 జీవో సవరించాలని ఉద్యోగుల తరఫున పోరాడి జైలుకు పోయానని, ప్రజా సమస్యలపై ఐదేళ్లపాటు లాఠీదెబ్బలు తిని, వందల కేసులు పెట్టినా వెరవకుండా పోరాడానని వెల్లడించారు. 'మీ దృష్టిలో ఇవన్నీ గాలి తిరుగుళ్లా' అని ప్రశ్నించారు. జూన్ 4 తర్వాత జనం బీఆర్‌ఎస్ పార్టీని పాతాళంలోకి తొక్కబోతున్నారని అప్పుడైనా మీకు బుద్ధి రావాలని కోరుకుంటున్నానని బండి అన్నారు.

789 టీఎంసీల నికర జలాలు కావాలి

- ఏపీ వాడుకోని 291 టీఎంసీలను పునః కేటాయించాలన్న తెలంగాణ
- నికర, వరద జలాలు కలిపి మొత్తం 1144 టీఎంసీలు కావాలన్న ఏపీ
- కృష్ణా ట్రిబ్యునల్–2కి స్టేట్‌మెంట్ ఆఫ్ కేస్ సమర్పించిన ఇరురాష్ట్రాలు



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కృష్ణాజలాల్లో ఉన్న 1050 టీఎంసీల వాటాలో 789.8 టీఎంసీలను తమకే కేటాయించాలని తెలంగాణ కోరగా, తమకు 1144 టీఎంసీలను కేటాయించాలని ఏపీ కోరింది. ఈ మేరకు జస్టిస్ బ్రిజేష్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా ట్రిబ్యునల్–2కి రెండు రాష్ట్రాలు తమ స్టేట్‌మెంట్ ఆఫ్ కేస్‌ను దాఖలు చేశాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బచావత్ ట్రిబ్యునల్(కృష్ణా ట్రిబ్యునల్–1) గంపగుత్తగా 811 టీఎంసీల నీటిని కేటాయించగా, కృష్ణా ట్రిబ్యునల్–2 అదనంగా మరో 194 టీఎంసీలను కేటాయించింది. రెండు ట్రిబ్యునళ్లు కలిపి ఉమ్మడి ఏపీకి 1005 టీఎంసీల నీటి కేటాయింపులు జరిపాయి. వీటితోపాటు ఇతర కేటాయింపులను..ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య పునః పంపిణీ జరపాలని కృష్ణా ట్రిబ్యునల్–2కు అదనపు విధివిధానాలు (టీఓఆర్) జారీ చేస్తూ 2023 అక్టోబర్ 10న కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీనిపై విచారణలో భాగంగా జస్టిస్ బ్రిజేష్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా ట్రిబ్యునల్–2 ..కృష్ణా జలాల పంపిణీపై తమ వాదనలతో స్టేట్ ఆఫ్ కేసు(ఎస్‌ఓసీ) దాఖలు చేయాలని రెండు రాష్ట్రాలను గతంలో ఆదేశించింది.

75శాతం నీటి లభ్యత ఆధారంగా 512 టీఎంసీలు కావాలి: ఏపీ

75శాతం నీటి లభ్యత ఆధారంగా కృష్ణా ట్రిబ్యునల్–1 ఉమ్మడి ఏపీకి కేటాయించిన 811 టీఎంసీల్లో 512 టీఎంసీల ఆధారంగా ఇప్పటికే తమ రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్మాణం జరిగిందని, వాటిని ముట్టుకోరాదని ఏపీ కృష్ణా ట్రిబ్యునల్–2కి కోరింది. తెలుగు గంగ కాల్వకు ఉన్న 25 టీఎంసీలు, ఆర్డీఎస్ కాల్వకు ఉన్న 4 టీఎంసీల కేటాయింపులను ముట్టుకోరాదని సూచించింది. గోదావరి నుంచి 90 టీఎంసీలను పోలవరం ప్రాజెక్టు ద్వారా కృష్ణా బేసిన్‌కు తరలిస్తే అందుకు బదులుగా నాగార్జునసాగర్‌కు ఎగువన ఉన్న రాష్ట్రాలకు బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన 90 టీఎంసీల వాటాలో ఉమ్మడి ఏపీకి మిగిలి ఉన్న 45టీఎంసీలను పూర్తిగా తమ రాష్ట్రాలకే కేటాయించాలని ఏపీతో పాటు తెలంగాణ రాష్ట్రాలు డిమాండ్ చేయడం గమనార్హం. ఉమ్మడి ఏపీకి ఉన్న మొత్తం 1005 టీఎంసీల కేటాయింపులకు మించి వచ్చే వరదను పూర్తిగా తమ రాష్ట్రానికే కేటాయించాలని ఏపీ కోరింది.

ఏపీ వాడని 291 టీఎంసీలను పునః కేటాయించాలి: తెలంగాణ

తెలంగాణ పరిధిలో నిర్మాణాలు పూర్తయ్యి వినియోగంలో ఉన్న ప్రాజెక్టులకు 299 టీఎంసీలు, నిర్మాణంలోని ప్రాజెక్టులకు 238 టీఎంసీలు, భవిష్యత్‌లో కట్టనున్న ప్రాజెక్టులకు 216 టీఎంసీలు, తాగునీటి అవసరాలకు 36 టీఎంసీలు కలిపి మొత్తం 789 టీఎంసీలు కేటాయించాలని తెలంగాణ కోరింది. కనీస మొత్తంగా 75 శాతం నీటి లభ్యత(డిపెండబిలిటీ) ఆధారంగా ఉమ్మడి ఏపీకి కృష్ణా ట్రిబ్యునల్–1 కేటాయించిన 811 టీఎంసీల్లో కనీసం 555 టీఎంసీలు, 65 శాతం లభ్యత ఆధారంగా మరో 43 టీఎంసీలు, సగటు ప్రవాహాలు(95 టీఎంసీల క్యారీ ఓవర్ జలాలు కలిపి) 120 టీఎంసీలు, పోలవరం ద్వారా గోదావరి జలాల తరలింపు పథకం కింద మరో 45 టీఎంసీలతోపాటు 75శాతం, 65శాతం, 50శాతం డిపెండబిలిటీల ఆధారంగా కృష్ణానదిలో లభ్యతగా ఉండనున్న 2578 టీఎంసీల సగటు జలాలకు మించి ప్రవహించే జలాల్లో వాడుకోకుండా మిగులుగా ఉండే పూర్తి జలాలను తమకే కేటాయించాలని తెలంగాణ కోరింది. 811 టీఎంసీల్లో ఏపీ వాటా 512 టీఎంసీల్లో 291 టీఎంసీలను ఆ రాష్ట్రం వాడుకోవడం లేదని, ఈ జలాలను రెండు రాష్ట్రాలకు పునః కేటాయింపులు జరపాలని తెలంగాణ కోరడం గమనార్హం.

ఫేక్ రాజకీయం!

పెనుముప్పుగా మారుతున్న కృత్రిమమేధ • తప్పుడు ఆడియో, వీడియోలతో గందరగోళం

- కలకలం రేపుతున్న అమిత్ షా డీప్ ఫేక్ వీడియో
- రిజర్వేషన్లనే రద్దు చేస్తామన్నట్టుగా ఎడిట్ చేసిన వైనం
- దాన్ని షేర్ చేశారంటూ తెలంగాణ సీఎం రేవంత్‌కు సమన్లు
- లోక్‌సభ ఎన్నికల వేళ డీప్ ఫేక్ బెడదపై సర్వత్రా చర్చ

కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఏప్రిల్ 23న తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల ప్రచార సభలో ప్రసంగించారు. కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే మతపరమైన ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల హక్కులను వారికి తిరిగిస్తామని ప్రకటించారు. అయితే మొత్తంగా రిజర్వేషన్లనే రద్దు చేస్తామని అమిత్ షా చెప్పినట్టుగా మారి ఫ్ంగ్ చేసిన వీడియో తాజాగా దేశవ్యాప్తంగా వైరలవుతోంది. లోక్‌సభ ఎన్నికల్లో తీవ్ర నష్టం చేయగల ఈ పరిణామాన్ని బీజేపీ సీరియస్‌గా తీసుకుంది. కేంద్ర హోం శాఖ ఫిర్యాదుతో ఢిల్లీ పోలీసులు హుటాహుటిన రంగంలోకి దిగారు. దీంతో సంబంధముందంటూ అసోంలో ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. అంతేగాక ఈ నకిలీ వీడియోను తెలంగాణ కాంగ్రెస్ విస్తృతంగా షేర్ చేసిందంటూ పీసీసీ చీఫ్ అయిన సీఎం రేవంత్‌రెడ్డికి ఏకంగా సమన్లు జారీ చేశారు! సోమవారం హైదరాబాద్ వచ్చి మరీ రేవంత్, పీసీసీ సోషల్ మీడియా ఇన్‌చార్జి, మరికొందరు కాంగ్రెస్ నేతలకు నోటీసులిచ్చారు! అమిత్ షా మార్ఫింగ్ వీడియోను ఎక్స్‌లో పోస్టు చేశారన్నది రేవంత్‌పై ఆరోపణ. రాజకీయంగా తీవ్ర కలకలం రేపుతున్న ఈ పరిణామంతో డీప్ ఫేక్ ముప్పు మరోసారి తీవ్ర చర్చనీయాంశంగా మారింది...



గతేడాది తెలంగాణలోనూ అసెంబ్లీ ఎన్నికల ముందు ఇలాంటిదే జరిగింది. కాంగ్రెస్‌కు ఓటేయాలంటూ బీఆర్ఎస్ ముఖ్య నేత కేటీఆర్ ప్రజలకు పిలుపునిస్తున్న వీడియో క్లిప్ పోలింగ్‌కు ముందు రోజు తెగ వైరలైంది. దాన్ని లక్షలాది మంది చూశారు. ఇదీ కృత్రిమ మేధ సాయంతో రూపొందిన డీప్ ఫేక్ వీడియోనే.

నోట్ దీజ్ పాయింట్స్

- భారత్‌లో జనాభాలో సగానికి పైగా, అంటే ఏకంగా 76 కోట్ల పై చిలుకు ఇంటర్నెట్ వినియోగదారులున్నారు.
- కనుక ఆన్‌లైన్ ప్రచారం శరవేగంగా ప్రజలను చేరుతోంది.
- రీల్స్, షార్ట్స్ ప్రపంచాన్ని ఏలుతున్న ఈ రోజుల్లో ఒక్క క్లిక్, ఒక్క స్వైప్‌తో ఓటరు అభిప్రాయాన్ని మార్చొచ్చు. కనీసం ప్రభావితం చేయొచ్చు.
- పార్టీ అభిమానులు పెద్దగా పట్టించుకోకున్నా తటస్థ ఓటర్లను ఇలాంటి ప్రచారం ప్రభావితం చేయగలదు.
- ఈ అంశాన్ని తమ అభిమాన పార్టీలకు సానుకూలంగా మలిచే ప్రయత్నాలు జరుగుతున్నాయి.
- అందుకే కృత్రిమ మేధతో పుట్టుకొచ్చే 'మానిప్యులేటెడ్ కంటెంట్' ఈ లోక్‌సభ ఎన్నికల్లో అనేక రెట్లు పెరగనుందని అంచనా.

కశ్మీర్‌లో భద్రతా బలగాలపై ఆత్మాహుతి బాంబు దాడి తర్వాత దేశవ్యాప్తంగా వాట్సాప్ గ్రూపుల్లో ఓ మెసేజ్ వైరలైంది. ఈ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేస్తే దాడికి పాల్పడ్డ వ్యక్తి కుటుంబాన్ని, ఇతర ఉగ్రవాదులను, రాళ్లు రువ్వినవారిని జైళ్ల నుంచి విడిపిస్తానంటూ ఆ పార్టీ ముఖ్యుడు హామీ ఇచ్చారన్నది దాని సారాంశం. కానీ అది నకిలీ మెసేజ్.

> తప్పుడు ప్రచారంతో ఒక్క ఓటర్ మనసు మార్చినా అది స్వేచ్ఛాయుత ఎన్నికల ప్రక్రియకు గొడ్డలిపెట్టే. ఈ తప్పుడు ప్రచార సరళి మీద ఈసీ దృష్టి పెట్టి ప్రజాస్వామ్యానికి చేటుగా మారుతున్న డీప్‌ఫేక్‌లను నియంత్రించాల్సిన అవసరముంది. నష్టం జరగకముందే చర్యలు తీసుకోవాలి
>
> - కేంద్ర ఎన్నికల మాజీ ప్రధాన కమిషనర్ ఎస్‌వై ఖురేషీ

దేశం ఇప్పుడు సమాచార యుద్ధాన్ని ఎదుర్కొంటోంది. సాంకేతికత సమాచారాన్ని ఎంత వేగంగా ప్రచారం చేస్తోందో అంతే వేగంగా దేశాన్ని ప్రమాదంలోనూ పడేస్తోంది. ముఖ్యంగా కృత్రిమ మేధతో పుట్టుకొచ్చిన వికృత శిశువు 'డీప్ ఫేక్' ఎన్నికల్లో పెద్ద అస్త్రంగా మారిపోయింది. పార్టీలు ఫేక్ వీడియోలతో తమ ప్రత్యర్థులపై దుష్ప్రచారం చేస్తున్నాయి. పలు రాష్ట్రాల్లో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఫేక్ వీడియోలు విపరీతంగా కలకలం రేపడమే గాక ఓటర్లపైనా బాగా ప్రభావం చూపాయి. ఈ లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఫేక్ వీడియోల జోరు మామూలుగా లేదు! పలు పార్టీలు తమ చేతికి మట్టి అంటకుండా డీప్ ఫేక్‌లను వీలైనంతగా వాడుకుంటున్నాయి.

చౌక బేరం

డీప్ ఫేక్‌లను రూపొందించడానికి అవసరమైన కృత్రిమ మేధ సాధనాలు కారుచౌకగా అందుబాటులో ఉన్నాయి. కొన్నయితే ఉచితం కూడా! దాంతో పార్టీలన్నీ ఓటర్లను ప్రభావితం చేయడానికి ఎడాపెడా డీప్ ఫేక్‌లను తయారు చేసి వదులుతున్నట్టు వాటి నిర్వాహకులే చెబుతున్నారు. టీవీ వార్తలు మొదలుకుని ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి గ్లోబల్ ప్లాట్‌ఫాంల దాకా నకిలీ వార్తల రూపకల్పన, ప్రచారాల్లో దూసుకుపోతున్నారు. ఇవి ఒకసారి జనంలోకి వెళ్లాక ఏం చేసినా నష్ట నివారణ కష్టమే.

ఏఐ వాడకం.. బీజేపీతోనే మొదలు...

- ప్రచారంలో సాంకేతికతను వాడకంలో అధికార బీజేపీ ఎంతో ముందంజలో ఉంది.
- ఆ పార్టీ 2012లోనే మోదీ త్రీడీ హోలోగ్రామ్‌ను వాడింది! దీని ద్వారా ఒకేసారి అనేక ప్రదేశాల్లో ప్రచారంలో పాల్గొన వచ్చు.
- ఈ వ్యూహాన్ని 2014 లోక్‌సభ ఎన్నికల్లో విస్తృతంగా అమలు చేశారు.
- ప్రచారం కోసం డీప్‌ఫేక్‌లను వాడిన తొలి నేతగా ఢిల్లీ బీజేపీ ఎంపీ, సినీ నటుడు మనోజ్ తివారీ నిలిచారు. 2020లో ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ హిందీ, హర్యాణ్వీ, ఇంగ్లిష్ భాషల్లో ఓటర్లనుద్దేశించి మూడు వీడియోల్లో ప్రసంగించారు. వీటిలో హిందీ వీడియో మాత్రమే అసలుది. మిగతా రెండూ డీప్ ఫేక్‌లు. కానీ ఏ మాత్రమూ గుర్తించలేనంత పకడ్బందీగా తివారీ గొంతు, పెదవుల కదలిక తదితరాలను మార్చారు!

గతి తప్పుతున్న వ్యూహం

అధికారికంగా, బహిరంగంగా జరిగే డీప్ ఫేక్ వ్యవహారాన్ని మించి ప్రత్యర్థులపై బురదజల్లేలా 'అనైతిక ప్రచారం' జోరుగా సాగుతోంది. వాట్సాప్‌లో అంతర్జాతీయ నంబర్లు, ఇన్‌స్టాగ్రాంలో బర్నర్ హ్యాండిల్స్ తదితరాల ద్వారా ఇలాంటి కంటెంట్ ప్రజలను చేరుతోంది. రాజకీయ ప్రత్యర్థుల వీడియోలు, ఆడియోలకు అభ్యంతరకర, అశ్లీల కంటెంట్‌ను జోడిస్తూ డీప్ ఫేక్‌లు హోరెత్తిస్తున్నాయి. పలు సంస్థలు ఇలాంటి కంటెంట్ తయారీతో పాటు దాన్ని వైరల్ చేసే బాధ్యతనూ తీసుకుంటున్నాయి. రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇలా నిర్మాణ కార్మికుల ఫోన్ నంబర్ల సాయంతో డీప్ ఫేక్‌లను విచ్చలవిడిగా వైరల్ చేశారు. అభ్యర్థులు అవినీతిపరులని చూపేందుకు డబ్బులు తీసుకుని ఓటేయాలని ఓటర్లను బెదిరిస్తున్నట్టు, డబ్బు పంచుతున్నట్టు వీడియోలు, ఆడియోలు రూపొందించి ప్రచారం చేశారు. ప్రత్యర్థులపైనే గాక సొంత పార్టీలోనూ శత్రువులపైనా కొందరు ఇలాంటి ప్రచారాలకు దిగుతున్నారు!

చట్టాలకావల

మన దేశంలో డీప్ ఫేక్ ఎన్నికల సమగ్రతకే ముప్పుగా మారుతోంది. ప్రస్తుత చట్టాలేవీ డీప్ ఫేక్‌ను స్పష్టంగా నిర్వచించడం లేదు. వ్యక్తిగత కేసుల్లో ఐటీ చట్టంతో కలిపి, పరువు నష్టం, నకిలీ వార్తలు, వ్యక్తి ప్రతిష్ఠకు భంగం, ప్రైవసీ ఉల్లంఘన వంటి చట్టాలను వాడుతూ పోలీసులు నెట్టుకొస్తున్నారు.

నిరాశపరిచిన మ్యూనిచ్ ఒప్పందం

డీప్ ఫేక్‌లను నియంత్రించాలంటూ గూగుల్, మెటా వంటి టెక్ దిగ్గజాలపై కేంద్రం ఒత్తిడి తెస్తోంది. ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసేందుకు కృత్రిమ మేధ సాధనాలను వాడకుండా జాగ్రత్తలు తీసుకుంటామంటూ ప్రముఖ టెక్ కంపెనీలు మ్యూనిచ్ సదస్సులో ఒప్పందానికి వచ్చినా ఆచరణలో పెద్దగా జరిగిందేమీ లేదు.

-సాక్షి, నేషనల్ డెస్క్



ఎన్నికల విచిత్రం

ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఎన్నికల యంత్రాంగం పలు కార్యక్రమాలు చేపడుతోంది. అందులో భాగంగా సోమవారం అధికారులు కోల్‌కతాలో ఓ ట్రామ్‌ను ఇలా ముస్తాబు చేశారు

ఎలక్షన్ బీట్

రంగంలోకి బీజేపీ మహిళా విస్తారక్‌లు

తెలంగాణ, కర్ణాటకల్లో ప్రచారానికి 500 మంది సుశిక్షిత కార్యకర్తలు

సాక్షి, న్యూఢిల్లీ: దక్షిణ భారతంలో గరిష్ట స్థానాలు దక్కించుకునేందుకు అవకాశాలున్న తెలంగాణ, కర్ణాటకలలో మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు బీజేపీ మహిళా విస్తారక్‌లను రంగంలోకి దించనుంది. మహిళా ఓటర్లతో మమేకమవ్వడం, కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించడం, స్వయం సహాయక సంఘాలతో సమావేశాలు నిర్వహించడం వంటి కార్యక్రమాలతో ఓటర్లను పార్టీ వైపు మొగ్గేలా చేయనుంది. గుజరాత్, రాజస్తాన్ తదితర రాష్ట్రాల్లో పార్టీకి పూర్తి కాలం విస్తారక్‌లుగా పనిచేస్తున్న 500 మంది సుశిక్షిత మహిళా కార్యకర్తలను ఈ రెండు రాష్ట్రాలకు పంపనుంది. మే ఒకటో తేదీ నుంచి 13న పోలింగ్ రోజు వరకు వీరంతా కేటాయించిన నియోజకవర్గాల్లోనే ఉండి ప్రచారం చేయనున్నారు.

అధికారంలోకి వస్తే ఆర్థిక సర్వే: రాహుల్

పటాన్: కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కుల, ఆర్థిక సర్వే నిర్వహిస్తామని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి హామీ ఇచ్చారు. దళితులు, గిరిజనులు, ఓబీసీలతోపాటు జనరల్ కేటగిరీలోని పేదల స్థితిగతులు తెలుసుకొని వారి అభివృద్ధికి బాటలు వేయడానికి ఈ సర్వే తోడ్పడుతుందని వివరించారు. సోమవారం గుజరాత్‌లోని పటాన్‌లో, ఛత్తీస్‌గఢ్‌లోని సక్రీ గ్రామంలో సార్వత్రిక ఎన్నికల ప్రచార సభలో రాహుల్ గాంధీ మాట్లాడారు. కేంద్రంలో మరోసారి అధికారం దక్కితే రాజ్యాంగాన్ని మార్చేయడానికి బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. రిజర్వేషన్లను బీజేపీ, ఆర్ఎస్ఎస్ వ్యతిరేకిస్తున్నాయని ధ్వజమెత్తారు. ''మేము అధికారంలోకి వచ్చాక తొలుత కుల, ఆర్థిక సర్వే నిర్వహిస్తాం. దేశ జనాభాలో దళితులు, గిరిజనులు, ఓబీసీలు, జనరల్ కేటగిరీలోని పేదలు ఎంతమంది ఉన్నారో కచ్చితమైన గణాంకాలు సేకరిస్తాం. ఆ తర్వాత ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో, ప్రైవేట్ కాలేజీలు, యూనివర్సిటీల్లో దళితులు, గిరిజనులు, ఓబీసీలు, జనరల్ కేటగిరీ పేదల భాగస్వామ్యాన్ని గుర్తిస్తాం. సర్వే ద్వారా వారి ఆర్థిక స్థితిగతులను తెలుసుకుంటాం. జనాభాలో ఎవరెంత మంది ఉన్నారు? ఏయే రంగాల్లో ఎవరు పని చేస్తున్నారు? వారి ఆర్థిక పరిస్థితి ఏమిటన్నది స్పష్టంగా తెలిసిపోతుంది. కుల, ఆర్థిక సర్వేలో తేలిన ఫలితాలను బట్టి సంక్షేమ, అభివృద్ధి పథకాలకు రూపకల్పన చేస్తాం. ఎలాంటి వివక్ష, అన్యాయానికి తావు లేకుండా సంపద, అధికారాన్ని ప్రజలకు పంపిణీ చేయాలన్నదే మా లక్ష్యం'' అని రాహుల్ గాంధీ వివరించారు.

అమేథీలో స్మృతి ఇరానీ నామినేషన్

అమేథీ(యూపీ): బీజేపీ నేత, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ సోమవారం అమేథీ లోక్‌సభ స్థానానికి నామినేషన్ వేశారు. జిల్లా ఎన్నికల అధికారి నిషా అనంత్‌కు రెండు సెట్ల నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఆమె వెంట మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్, భర్త జుబిన్ ఇరానీ ఇతర బీజేపీ నేతలు ఉన్నారు. అంతకు ముందు నగరంలోని బీజేపీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు మూడు కిలోమీటర్ల మేర రోడ్ షో నిర్వహించారు. కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న అమేథీని 2019 ఎన్నికల్లో రాహుల్ గాంధీని ఓడించి స్మృతీ ఇరానీ కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. మే 20వ తేదీ ఐదో విడతలో పోలింగ్ జరగనున్న అమేథీ స్థానానికి కాంగ్రెస్ పార్టీ ఇంకా అభ్యర్థిని ప్రకటించలేదు.

లక్నో సీటుకు రాజ్‌నాథ్ నామినేషన్

లక్నో: బీజేపీ సీనియర్ నేత, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సోమవారం యూపీలోని లక్నో లోక్‌సభ సీటుకు నామినేషన్ సమర్పించారు. జిల్లా ఎన్నికల అధికారి సూర్యపాల్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఆయన వెంట యూపీ, ఉత్తరాఖండ్ సీఎంలు యోగి, పుష్కర్ సింగ్ ధామి ఉన్నారు. కలెక్టరేట్ వరకు సాగిన ఊరేగింపులో రోడ్డుకు ఇరువైపులా నిలబడిన కార్యకర్తలు నేతలపై పూలజల్లు కురిపించారు.

మోదీని ఎన్నుకోవడమే మీరిచ్చే బహుమతి

ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన పెళ్లి కుమారుడిపై కేసు నమోదు

మంగళూరు: ''నరేంద్ర మోదీని మరోసారి ప్రధానిగా ఎన్నుకోవడమే నాకు మీరిచ్చే గొప్ప బహుమతి'' అంటూ తన వివాహ శుభలేఖపై అచ్చేసుకున్న ఓ పెళ్లి కొడుకు ఇబ్బందుల్లో ఇరుక్కున్నాడు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించాడంటూ పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు. కర్ణాటక రాష్ట్రంలోని ఉప్పినంగాడీలో ఈ నెల 26న ఈ సంఘటన జరిగింది. ఆ పెళ్లి కొడుకు ప్రధాని మోదీకి అభిమాని. ఎన్నికల ప్రకటన కంటే ముందే మార్చి 1న శుభలేఖలు ప్రింట్ చేయించానని, ఈ నెల 18న పెళ్లి జరిగిందని చెప్పాడు. షెడ్యూల్ రాకముందే శుభలేఖలు ప్రింట్ అయ్యాయి కాబట్టి ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘన కాదని వాదించాడు. అయినప్పటికీ ఎన్నికల సంఘం అధికారులు పట్టించుకోలేదు. అతడిపై కేసు పెట్టాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ నెల 26న ఎఫ్ఐఆర్ నమోదైంది.

ఇండోర్‌లో హస్తానికి మరో షాక్

ఇండోర్: ఎన్నికల ప్రచారపర్వందాకా వెళ్లకముందే నామినేషన్ల తంతు వద్దే కాంగ్రెస్ పార్టీకి సొంత పార్టీ అభ్యర్థులే షాక్ మీద షాక్ ఇస్తున్నారు. ఇటీవల సూరత్‌లో నామినేషన్ పత్రాలు తిరస్కరణకు గురైన వెంటనే పార్టీ అభ్యర్థి నీలేశ్ కుంభనీ అదృశ్యమైన ఘటనను మరువకముందే ఇండోర్‌లో పార్టీ అభ్యర్థి నామినేషన్ల ఉపసంహరణకు చివరిరోజైన సోమవారం చివరిక్షణంలో తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. ఇండోర్‌లో బరిలో దిగిన కాంగ్రెస్ అభ్యర్థి అక్షయ్ కాంతి బామ్ స్థానిక బీజేపీ ఎమ్మెల్యే రమేశ్‌తో కలిసి కలెక్టర్ ఆఫీస్‌కు వచ్చి తన నామినేషన్‌ను విత్‌డ్రా చేసుకుని ఆ తర్వాత నేరుగా బీజేపీ ఆఫీస్‌కు వెళ్లారు. బీజేపీ ఆఫీస్‌కు మధ్యప్రదేశ్ ఉపముఖ్యమంత్రి జగదీశ్ దేవ్డా, మంత్రి విజయ్‌వర్గీయలతో కలిసి కారులో వెళ్తున్న ఫొటోను విజయ్‌వర్గీయ 'ఎక్స్'లో పోస్ట్‌చేశారు. బీజేపీలోకి స్వాగతం అని ట్వీట్‌చేశారు. అక్షయ్ బీజేపీలో చేరనున్నట్లు తెలుస్తోంది.

పురుషుల కోసం... పురుషుల చేత...

లక్నో: పురుషులకోసం.. పురుషుల చేత ఓ పార్టీ ఏర్పాటైంది. పురుషుల హక్కులకోసం గొంతెత్తుతూ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ పడుతోంది. రాంచీ, లక్నో, గోరఖ్‌పూర్ నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఆ పార్టీ పేరు మేరా అధికార్ రాష్ట్రీయ దళ్ (ఎమ్ఏఆర్డీ). 'కొడుకుల గౌరవం కోసం కదనరంగంలోకి పురుషులు' పేరుతో ఇటీవల ఎన్నికల 'మేని'ఫెస్టోను విడుదల చేసింది. పురుషుల కోసం ప్రత్యేక సంక్షేమ మంత్రిత్వ శాఖ, జాతీయ పురుషుల కమిషన్ ఏర్పాటు చేస్తామని 'మేని'ఫెస్టోలో పేర్కొంది. మహిళలకోసం రూపొందించిన చట్టాల వల్ల ఇబ్బందులు పడుతున్న పురుషులను కాపాడటం కోసం 'మెన్ సెక్యూరిటీ బిల్' తెస్తామని ప్రకటించింది. మహిళలకోసం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ 'ఉమెన్ పవర్‌లైన్' మాదిరిగానే 'మెన్ పవర్‌లైన్' ఏర్పాటు చేస్తామని, భరణం పేరుతో వేధింపులకు గురయ్యే పురుషులు ఆ నెంబర్‌కు కాల్ చేస్తే వెంటనే సహాయం అందిస్తామని నేతలు ప్రచారంలో హోరెత్తిస్తున్నారు. 2018లో ఏర్పాటైన పార్టీ ఇప్పటివరకూ ఏడు ఎన్నికల్లో పోటీ చేసింది. అన్ని ఎన్నికల్లో డిపాజిట్లు కోల్పోయింది.

కోటాలో నీట్ అభ్యర్థి బలవన్మరణం

కోటా: పోటీ పరీక్షల శిక్షణకు పేరున్న రాజస్తాన్‌లోని కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నగరంలోని కున్హారి ప్రాంతంలోని ఓ హాస్టల్‌లో ఉంటూ నీట్‌కు ప్రిపేరవుతున్న సుమిత్ పంచాల్(20) అనే విద్యార్థి ఉరేసుకున్నాడు. తన గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు విగతజీవిగా వేలాడుతుండగా ఆదివారం రాత్రి గుర్తించారు. మధ్యాహ్నమే అతడు ఉరి వేసుకుని ఉంటాడని భావిస్తున్నారు. అయితే, సుమిత్ మెడపై లోతైన గాయం ఉందని, ఎవరో చంపారంటూ హరియాణాలోని రోహతక్‌కు చెందిన అతడి తల్లిదండ్రులు ఆరోపించడంతో అసహజ మృతిగా కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. నిపుణుల ఆధ్వర్యంలో శవ పరీక్ష జరిపించినట్లు వారు చెప్పారు. మృతికి కారణాలు తెలియరాలేదని, సూసైడ్ నోట్ కూడా లభ్యం కాలేదన్నారు. భద్రతా ప్రమాణాల ప్రకారం హాస్టల్ నిర్వాహకులు గదుల్లోని సీలింగ్ ఫ్యాన్లకు యాంటీ సూసైడ్ డివైజ్ ఏర్పాటు చేసి ఉంటే ఘటనను నివారించగలిగి ఉండేవారమని పోలీసులు తెలిపారు. సుమిత్ వచ్చే నెలలో జరిగే నీట్-యూజీ పరీక్ష రాయాల్సి ఉంది. కాగా, కోటాలో గత ఏడాది మొత్తం 23 మంది విద్యార్థులు బలవన్మరణం చెందారు. తాజా ఘటనతో కలిపి ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 8 మంది ఆత్మహత్య చేసుకున్నారు.

కెన్యాలో కూలిన డ్యామ్ 45 మంది మృతి

మరో 49 మంది గల్లంతు..

109 మందికి గాయాలు

నైరోబీ(కెన్యా): ఆఫ్రికా దేశం కెన్యాలో జలాశయం ధ్వంసమై నివాసప్రాంతాలను ముంచెత్తడంతో 45 మంది ప్రాణాలు కోల్పోయారు. 49 మంది గల్లంతయ్యారు. సుమారు 109 మంది గాయపడి ఆస్పత్రి పాలయ్యారు. తరచూ ఆకస్మిక వరదలు సంభవించే గ్రేట్ రిఫ్ట్ వ్యాలీ ప్రాంతంలో సోమవారం వేకువజామున ఈ ఘటన చోటుచేసుకుంది. మయి మహియులో ఇటీవలి వర్షాలకు పొంగి పొర్లుతున్న పాత కిజాబె డ్యాం ఆనకట్ట కొట్టుకుపోయింది. దీంతో వరద ఒక్కసారిగా నివాస ప్రాంతాలను ముంచెత్తిందని, ప్రధాన రహదారి కొట్టుకుపోయిందని అధికారులు తెలిపారు. విమానాశ్రయంలో వరద పోటెత్తడంతో కొన్ని విమానాలను దారి మళ్లించారు.

రఫాపై ఇజ్రాయెల్ దాడులు 22 మంది మృతి

రఫా: గాజా ప్రాంతంలోని హమాస్ మిలిటెంట్లకు పట్టున్న రఫాలోకి తమ సైన్యం త్వరలో ప్రవేశించనుందంటూ హెచ్చరికలు చేస్తున్న ఇజ్రాయెల్ ఆ నగరంపై వైమానిక దాడులకు దిగింది. ఆదివారం అర్ధరాత్రి నుంచి జరిపిన దాడుల్లో మూడు కుటుంబాల్లోని ఆరుగురు మహిళలు, ఐదుగురు చిన్నారులు సహా మొత్తం 22 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఐదు రోజుల వయసున్న పసికందు ఉందని పాలస్తీనా అధికారులు తెలిపారు. హమాస్ మిలిటెంట్లను ఏరివేయడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ ఆరు నెలలకు పైగా భీకర దాడులను కొనసాగిస్తోంది. ఈ దాడుల్లో ఇప్పటి వరకు 34 వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఇలా ఉండగా, కాల్పుల విరమణకు ఒప్పించేందుకు అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఆదివారం ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో ఫోన్‌లో సంభాషించినట్లు వైట్ హౌస్ వెల్లడించింది.

అమెరికా వర్సిటీల్లో నిరసనల హోరు

900 మందికిపైగా విద్యార్థుల అరెస్టు

వాషింగ్టన్: గాజాపై ఇజ్రాయెల్ సైన్యం దాడులను వ్యతిరేకిస్తూ అమెరికా విశ్వవిద్యాలయాల్లో విద్యార్థుల నిరసనలు నానాటికీ ఉధృతరూపం దాలుస్తున్నాయి. పాలస్తీనియన్లకు సంఘీభావంగా ర్యాలీలు కొనసాగుతున్నాయి. పోలీసులు అరెస్టులు చేస్తున్నా నిరసనకారులు వెనక్కి తగ్గడం లేదు. న్యూయార్క్, కాలిఫోర్నియా, మిస్సోరీ, ఇండియానా, మసాచుసెట్స్, వెర్మాంట్, వర్జీనియా తదితర ప్రాంతాల్లో ఆంక్షలను సైతం లెక్కచేయకుండా విద్యార్థులు నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. వర్సిటీ క్యాంపస్‌ల్లో శిబిరాలు వెలుస్తున్నాయి. గాజాపై దాడులు వెంటనే నిలిపివేయాలని, కాల్పుల విరమణ పాటించాలని, పాలస్తీనియన్లకు మానవతా సాయం అందించాలని నినదిస్తున్నారు. విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో కొన్ని యూనివర్సిటీల్లో పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు సమాచారం. దేశవ్యాప్తంగా ఇప్పటిదాకా 900 మందికిపైగా విద్యార్థులను పోలీసులు అరెస్టు చేశారు. ఇదిలా ఉండగా, యూనివర్సిటీ ఆఫ్ లాస్ ఏంజెలెస్-కాలిఫోర్నియా(యూసీఎల్ఏ)లో ఇజ్రాయెల్ వ్యతిరేక, అనుకూల వర్గాల మధ్య తాజాగా ఘర్షణ చోటుచేసుకుంది. రెండు వర్గాల విద్యార్థులు పరస్పరం వ్యతిరేకంగా నినాదాలు చేసుకున్నారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. ఒకరినొకరు నెట్టేసుకున్నారు. అధికారులు రంగంలోకి దిగి వారికి నచ్చజెప్పారు.

ఫేక్ వీడియోలపై ఉక్కుపాదమే

ప్రధాని మోదీ హెచ్చరిక

- కృత్రిమ మేధ సాయంతో ఫేక్ వీడియోలు సృష్టిస్తున్నారు
- రాబోయే నెల రోజుల్లో పెద్ద సంఘటన సృష్టించడానికి కుట్ర
- కర్ణాటక, మహారాష్ట్రలో మోదీ ఎన్నికల ప్రచారం

బాగల్‌కోట్/షోలాపూర్/సతారా: ఎన్నికల సమరంలో బీజేపీని ఎదుర్కొనే సత్తా లేక రాజకీయ ప్రత్యర్థులు అడ్డదారులను నమ్ముకున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఎన్నికల్లో గెలుస్తామన్న నమ్మకం లేనివారు కృత్రిమ మేధ సాయంతో ఫేక్ వీడియోలు సృష్టించి, తనపై, బీజేపీ నాయకులపై బురదజల్లుతున్నారని, తద్వారా సమాజంలో అశాంతిని సృష్టించాలన్నదే వారి లక్ష్యమని ఆరోపించారు. కృత్రిక మేధను దుర్వినియోగం చేస్తున్నారని, టెక్నాలజీని, సోషల్ మీడియాను స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని ఆరోపించారు. అచ్చంగా తన గొంతును పోలిన గొంతుతో ఫేక్ వీడియోలు సృష్టిస్తున్నారని, తాను అనని మాటలు అన్నట్లుగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నిర్ధారణ కాని, తప్పుడు సమాచారాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారని, ఇది నిజంగా ప్రమాదకరమైన ధోరణి అన్నారు. ఇలాంటి ఫేక్ వీడియోలపై పోలీసులకు గానీ, బీజేపీకి గానీ ఫిర్యాదు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తప్పుడు పనులు చేసినవారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫేక్ వీడియోలపై ఉక్కు పాదం మోపుతామని స్పష్టంచేశారు. తప్పుడు సమాచారంతో ఇతరులను అప్రతిష్టపాలు చేయడం మన చట్టం అనుమతించదని తేల్చి చెప్పారు. సోమవారం కర్ణాటకలోని బాగల్‌కోట్, మహారాష్ట్రలోని షోలాపూర్, సతారాలో ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని మోదీ ప్రసంగించారు. రాబోయే నెల రోజుల్లో దేశంలో ఒక పెద్ద సంఘటన సృష్టించడానికి శత్రువులు ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఆరోపించారు. సామాజిక అశాంతి, అల్లకల్లోలం రేపడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకొనే అవకాశం ఉందని అన్నారు. తాను చాలా సీరియస్‌గా ఈ ఆరోపణలు చేస్తున్నానని చెప్పారు. ఫేక్ వీడియోల నుంచి మన సమాజాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఇలాంటి వీడియోలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. ఫేక్ వీడియోలను తెలిసీ తెలియక సోషల్ మీడియాలో షేర్ చేస్తే కేసుల్లో ఇరుక్కుంటారని, అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.



రిజర్వేషన్ల రక్షణకు ఎంత దూరమైనా వెళ్తా..

దేశంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు బీజేపీ వెంట నడుస్తుండడంతో మైనార్టీలను మచ్చిక చేసుకోవడానికి కాంగ్రెస్ కొత్త కుట్రలకు తెరలేపిందని ప్రధాని మోదీ ఆరోపించారు. ఆ పార్టీ ఓటు బ్యాంకు రాజకీయాలను నమ్ముకుందని, అధికారంలోకి వస్తే మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోందని చెప్పారు. కాంగ్రెస్ ఆటలు సాగనివ్వబోనని స్పష్టం చేశారు. దళితులు, ఆదివాసీ, ఓబీసీల రిజర్వేషన్లను కాపాడడానికి ఎంత దూరమైనా వెళ్తానని, ఈ మేరకు వారికి గ్యారంటీ ఇస్తున్నానని మోదీ వివరించారు. టెక్నాలజీ హబ్‌గా పేరుగాంచిన బెంగళూరు కాంగ్రెస్ పాలనలో ట్యాంకర్ హబ్‌గా మారిందని ఎద్దేవా చేశారు. ట్యాంకర్ మాఫియా ప్రజలను దోచుకుంటోందని, ఇందులో కమీషన్లు కాంగ్రెస్ నేతలకు చేరుతున్నాయని దుయ్యబట్టారు.

అంతా రాజకీయ కుట్ర

లైంగిక వేధింపుల ఆరోపణలు, కేసులపై రేవణ్ణ వ్యాఖ్య

బెంగళూరు/శివమొగ్గ: తనపై, తన కుమారుడు ప్రజ్వల్‌పై లైంగిక వేధింపులు, కేసులు అంతా రాజకీయ కుట్రలో భాగమని కర్ణాటక జేడీఎస్ ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణ వ్యాఖ్యానించారు. సోమవారం బెంగళూరులో మీడియాతో మాట్లాడారు. 'ఈ ఆరోపణల వెనుక రాజకీయ కుట్ర కోణం ఉంది. ఆరోపణలపై దర్యాప్తును ఎదుర్కొంటా. ఆరోపణల్లో నిజం ఉందని దర్యాప్తులో తేలితే ఎలాంటి శిక్ష అనుభవించడానికైనా నా సిద్ధం. నాలుగైదేళ్లనాటి పాత అంశాలను పట్టుకుని ఇప్పుడు కేసులు నమోదు చేస్తున్నారు. సిట్ దర్యాప్తు చేశాక నిజాలు బయటికొస్తాయిగా. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. వాళ్లనుకున్నదే చేస్తారు. ఇవన్నీ ఈనాటివి కాదు. కాంగ్రెస్ నేతలు ఆరోపించినట్లుగా ఇది పెద్ద సెక్స్ కుంభకోణమే అయితే సిట్ ఏర్పాటుచేశారుగా. సమగ్ర దర్యాప్తు చేయనివ్వండి. సాధారణంగానే ప్రజ్వల్ విదేశాలకు వెళ్తాడు. ఇప్పుడూ అలాగే వెళ్లాడు. ఎఫ్ఐఆర్ వేస్తారనిగానీ, సిట్‌తో దర్యాప్తు చేయిస్తారనిగానీ ప్రజ్వల్‌కు తెలీదు. దర్యాప్తు అధికారులు ఆదేశించినప్పుడు ప్రజ్వల్ వచ్చి వారికి సహకరిస్తాడు'' అని రేవణ్ణ చెప్పారు.

పార్టీ నుంచి ప్రజ్వల్ సస్పెండ్!

లైంగిక ఆరోపణల నేపథ్యంలో ప్రజ్వల్‌ను సస్పెండ్ చేయాలనే నిర్ణయానికొచ్చినట్లు జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామి సోమవారం చెప్పారు. '' ప్రజ్వల్‌పై ఆరోపణలు నిజమైతే ఆయనకు శిక్ష పడాల్సిందే. వివాదంలో ప్రజ్వల్‌ను వెనకేసుకొచ్చే ప్రసక్తే లేదు. తప్పు అని తేలితే కఠినచర్యలు తీసుకోవాల్సిందేనని మా కుటుంబం మొత్తం కోరుకుంటోంది. ప్రజ్వల్ సస్పెన్షన్ నిర్ణయాన్ని మంగళవారం హుబ్బళిలో పార్టీ కోర్ కమిటీ సమావేశంలో ప్రతిపాదిస్తాం. పార్లమెంట్‌సభ్యుడు కాబట్టి నిర్ణయం ఢిల్లీ స్థాయిలో జరగాలి. ఈ విషయాన్ని జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు హెచ్‌డీ దేవెగౌడకు వివరించా'' అని కుమారస్వామి అన్నారు.

రేప్ బాధితురాలి 30 వారాల గర్భవిచ్ఛిత్తి ఉత్తర్వులు వెనక్కి

ఆమె తల్లిదండ్రుల వేడుకోలుతో సుప్రీంకోర్టు నిర్ణయం

న్యూఢిల్లీ: రేప్ కారణంగా గర్భందాల్చిన 14 ఏళ్ల టీనేజర్ పెట్టుకున్న గర్భవిచ్ఛిత్తి పిటిషన్‌కు ఓకే చెప్పిన సర్వోన్నత న్యాయస్థానం ఆ అమ్మాయి తల్లిదండ్రుల అభ్యర్థనతో ఆ ఉత్తర్వులను వెనక్కి తీసుకుంది. 30 వారాల ప్రెగ్నెన్సీ వేళ అబార్షన్ కారణంగా తలెత్తే సంక్లిష్ట ఆరోగ్య సమస్యల కన్నా ఆ పిండాన్ని పెరగనివ్వడమే మేలు అని టీనేజర్ తల్లిదండ్రులు పెట్టుకున్న అర్జీతో సుప్రీంకోర్టు ఏకీభవించింది. 'బిడ్డ ప్రయోజనాలే పరమావధి' అంటూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం గత ఉత్తర్వులను ఉపసంహరించుకుంది. అబార్షన్‌కు నిరాకరిస్తూ బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టేస్తూ సుప్రీంకోర్టు ఏప్రిల్ 22న ఈ ఉత్తర్వులు ఇచ్చింది. 142వ అధికరణం ప్రకారం తమకు సంక్రమించిన అసాధారణ అధికారాలను వినియోగిస్తూ సుప్రీంకోర్టు ఆనాడు ఆ ఉత్తర్వులిచ్చింది.

సాక్షి
కరీంనగర్
మంగళవారం । 30 । ఏప్రిల్ । 2024



క్వింటాల్ పత్తి రూ. 7,450

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ పత్తి మార్కెట్‌లో క్వింటాల్ పత్తి రూ. 7,450 పలికింది. క్రయవిక్రయాలను కార్యదర్శి గుగులోతు రెడ్డినాయక్ పర్యవేక్షించారు.



పైసల 'పంచాయితీ'

గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో సర్పంచ్‌లు అభివృద్ధి పనులు విరివిరిగా చేపట్టారు. వారి పదవీకాలం ముగిసినా బిల్లులు రాకపోవడంతో మాజీ సర్పంచ్‌ల తిప్పలు అన్నీ ఇన్నీ కావు. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
43.0/26.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వాతావరణం అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. వడ గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

జడ్జి అరుణకు సన్మానం



సివిల్ జడ్జి అరుణను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ నాయకులు

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.అరుణ హైదరాబాద్‌కు బదిలీ అయిన సందర్భంగా ఆమెకు వీడ్కోలు, కరీంనగర్ మొదటి అదనపు జిల్లా జడ్జిగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్‌కు స్వాగత కార్యక్రమాన్ని సోమవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా జడ్జి బి.ప్రతిమ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విడాకుల కేసుల్లో జడ్జి అరుణ చూపిన చొరవను కొనియాడారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన జడ్జి వెంకటేశ్ కేసుల పరిష్కారంలో ఎక్కువ చొరవ చూపాలని పేర్కొన్నారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు రఘువీర్, ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు జడ్జి వెంకటేశ్‌కు స్వాగతం పలుకుతూ సన్మానం చేయగా, జడ్జి అరుణను శాలువ, మెమొంటోలతో సత్కరించి వీడ్కోలు తెలిపారు. న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యం



కోదండరాంను సన్మానిస్తున్న నాయకులు

చిగురుమామిడి(హుస్నాబాద్): రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. సోమవారం చిగురుమామిడికి మొట్టమొదటి సారి వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలోని అన్నివర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సిందేనన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ నుంచి ఎంపీగా పోటీ చేస్తున్న అభ్యర్థుల పక్షాన ప్రచారం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. బీజేపీ రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తోందని విమర్శించారు. బీజేపీ కుట్రను నిలువరించాలంటే కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని, ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ అభ్యర్థులకు ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో స్వరాజ్ ఇండియా పార్టీ జాతీయ అధ్యక్షుడు యోగేంద్ర యాదవ్, టీజేఎస్ రాష్ట్ర కార్యదర్శి ముక్కెర రాజు, మోర గణేశ్, నీలవేణి రమేశ్, ములుగు సతీశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి తదితరులున్నారు.

ఆస్తిపన్ను రాయితీకి నేడు ఆఖరు

కరీంనగర్ కార్పొరేషన్: ఐదు శాతం రాయితీతో 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను చెల్లించడానికి మంగళవారం చివరి రోజని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నగరపాలకసంస్థ డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి ప్రకటనలో తెలిపారు. అలాగే 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బకాయిలు కూడా చెల్లించి ఐదు శాతం రాయితీ సౌకర్యం వినియోగించుకోవచ్చన్నారు. నగరపాలక కార్యాలయం, ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చని పేర్కొన్నారు. మంగళవారం అర్ధరాత్రి 12 గంటల లోపు ఐదుశాతం రాయితీతో ఆన్‌లైన్ ద్వారా ఆస్తి పన్ను చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు.

విజిలెన్స్ విచారణకు బల్దియా అధికారులు

కరీంనగర్ కార్పొరేషన్: స్మార్ట్ సిటీ అక్రమాలపై విజిలెన్స్ చేపడుతున్న విచారణకు నగరపాలక సంస్థ అధికారులు హాజరయ్యారు. సోమవారం నగరంలోని రేకుర్తిలో రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో జరిగిన విచారణకు ఐదుగురు అధికారులు హాజరై వివరణ ఇచ్చారు. నగరంలో స్మార్ట్ సిటీ కింద చేపట్టిన కూడళ్లు, రోడ్ల అభివృద్ధిలో అక్రమాలు చోటుచేసుకున్నాయనే ఫిర్యాదుల మేరకు విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టడం తెలిసిందే. ఇందులో భాగంగా స్మార్ట్ సిటీ పనులు మొదలైనప్పటి నుంచి ఉన్న ఎస్‌ఈలు, గత, ప్రస్తుత ఈఈలు, డీఈలు, ఏఈని విచారణకు హాజరు కావాలని అధికారులు ఆదేశించారు. ఈ క్రమంలోనే అప్పటి ఎస్‌ఈలు భద్రయ్య, పీవీ కృష్ణారావు, ఈఈ పీవీ రామన్, డీఈ ఓంప్రకాశ్, ఏఈ వాణి విచారణకు హాజరు కాగా, మరో ఇద్దరు నాగమల్లేశ్వరరావు, కిష్టప్ప ఆరోగ్య, ఎన్నికల విధుల కారణంగా హాజరుకాలేకపోతున్నామని, తర్వాత వచ్చి వివరణ తెలియజేస్తామని సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఇదిలాఉంటే విచారణలో తమ వద్ద ఉన్న ప్రశ్నావళిని ముందుంచిన విజిలెన్స్ అధికారులు, బల్దియా అధికారుల నుంచి వాటికి సమాధానాలు తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

లెక్క తేలింది.. పోరు మిగిలింది

- కరీంనగర్ బరిలో 28, పెద్దపల్లిలో 42 మంది
- కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా పోటీలో అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి
- స్వతంత్రులకు గుర్తుల కేటాయింపు
- ఇక పెరగనున్న పొలిటికల్ హీట్

నియోజకవర్గం	కరీంనగర్	పెద్దపల్లి
నామినేషన్ వేసినవారు	53	63
తిరస్కరించినవి	20	14
విత్‌డ్రా చేసుకున్నవారు	05	07
బరిలో ఉన్నవారు	28	42



నేటి నుంచి పెరగనున్న ప్రచార జోరు

ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మేరకు కీలక ఘట్టం ముగియడంతో అభ్యర్థులెవరో తేలిపోయింది. ప్రధాన పార్టీలతో పాటు, ఇతర చిన్న పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు మంగళవారం నుంచి ప్రచారాన్ని ముమ్మరం చేయనున్నారు. ఎలాగైనా ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు అభ్యర్థులు తమ ప్రణాళికను అమలు చేసేందుకు సిద్ధమయ్యారు. ప్రచారాన్ని మరింత వేడెక్కించే పనిలో పడ్డారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసుకుంటున్నారు.

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/సాక్షి, పెద్దపల్లి: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో మరో అంకం పూర్తయ్యింది. బరిలో నిలిచే అభ్యర్థుల సంఖ్య తేలింది. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో తుది పోరులో తలపడే అభ్యర్థుల సంఖ్యపై స్పష్టత వచ్చింది. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో 28 మంది, పెద్దపల్లిలో 42 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. ఇందులో ప్రధాన పార్టీలకు చెందినవారితో పాటు స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉన్నారు. సోమవారం నామినేషన్ ఉపసంహరణకు చివరిరోజు కావడంతో కరీంనగర్‌లో ఐదుగురు, పెద్దపల్లిలో ఏడుగురు స్వతంత్ర అభ్యర్థులు విత్‌డ్రా చేసుకున్నారు. ఈ మేరకు ఫాం–5 పూరించి ఆర్వోలకు అందజేశారు. దీంతో రిటర్నింగ్ అధికారులు వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు, స్వతంత్ర అభ్యర్థుల సమక్షంలో ఇండిపెండెంట్ అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు.

కరీంనగర్‌లో 2, పెద్దపల్లిలో 3 ఈవీఎంలు

ఒక స్థానంలో 15మంది అభ్యర్థులకు మించితే రెండు ఈవీఎంలను ఉపయోగించాల్సి ఉంటుంది. పెద్దపల్లి బరిలో 42మంది ఉండటంతో మూడు ఈవీఎంలు, కరీంనగర్‌లో 28మంది అభ్యర్థులే ఉండటంతో రెండు ఈవీఎంలను ఉపయోగించాల్సి ఉంటుంది. దీనికి అనుగుణంగా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. స్వతంత్ర అభ్యర్థులను ఎన్నికల బరిలో నుంచి తప్పించేందుకు ప్రధాన పార్టీల నేతలు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతోనే ఈసారి గతంలో కంటే ఎక్కువ మంది బరిలో నిలిచినట్లు తెలుస్తోంది.

చీలిక ఓట్ల లెక్కల్లో అభ్యర్థులు

2019లో పెద్దపల్లి లోక్‌సభ బరిలో 18 మంది అభ్యర్థులుండగా, ఈసారి 42 మంది పోటీలో ఉన్నారు. 2019లో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో 15 మంది పోటీలో ఉండగా ఈసారి 28మంది ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులు కూడా బరిలో ఉన్నారు. పెద్దపల్లి పరిధిలో ప్రధాన పార్టీలకు రెబల్ అభ్యర్థుల బెడద లేదు. అయితే కరీంనగర్‌లో కాంగ్రెస్ టిక్కెట్ ఆశించి భంగపడిన అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి రెబల్ అభ్యర్థిగా పోటీలో దిగుతున్నారు. దీంతో రెబల్ అభ్యర్థితో పాటు చిన్న పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు ఓట్లు సాధించనున్నారు. వీరి ఓట్ల చీలిక వల్ల ఏ పార్టీకి నష్టం చేకూరుతుంది? ఎంత మేరకు వీరి ప్రభావం ఉండనుందనే లెక్కలపై అన్ని పార్టీల్లో జోరుగా చర్చలు కొనసాగుతున్నాయి.

అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్: పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలిచిన ప్రధాన పార్టీల అభ్యర్థులు మినహా మిగిలిన 24 మందికి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి సోమవారం సాయంత్రం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో అభ్యర్థుల సమక్షంలో గుర్తుల కేటాయింపు ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా మొదట 9 మంది రిజిస్టర్డ్ అన్ రికగ్నైజ్డ్ పొలిటికల్ పార్టీల అభ్యర్థులకు, అనంతరం 15 మంది స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిబంధనల ప్రకారం గుర్తులు కేటాయించామని, అభ్యర్థులు తప్పకుండా ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలని సూచించారు. గుర్తుల జాబితాను కలెక్టర్ చాంబర్ ఆవరణలో ప్రదర్శించారు. కార్యక్రమంలో కరీంనగర్ అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, రాజన్న సిరిసిల్ల అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, డీఆర్వో పవన్‌కుమార్, ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత



స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలిస్తున్న సాధారణ పరిశీలకుడు అమిత్ కటారియా, కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ అభిషేక్ మహంతి

కరీంనగర్: పోలింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలను భద్రపరచడంతో పాటు కౌంటింగ్ కోసం అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని ఎన్నికల సాధారణ పరిశీలకుడు అమిత్ కటారియా సూచించారు. సోమవారం ఎస్సారార్ డిగ్రీ కళాశాలలో స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ అభిషేక్ మహంతితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కౌంటింగ్ కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేపట్టాలని, కౌంటింగ్ సజావుగా సాగేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు సమన్వయంతో ఎన్నికలు ప్రశాంతంగా పూర్తయ్యేలా పనిచేయాలన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. సీపీ అభిషేక్ మహంతి మాట్లాడుతూ, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పోలీస్‌శాఖ తరఫున ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

కంట్రోల్ రూం పరిశీలన

ఎన్నికల నేపథ్యంలో కంట్రోల్ రూం సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలని ఎన్నికల సాధారణ పరిశీలకుడు అమిత్ కటారియా ఆదేశించారు. సోమవారం కరీంనగర్ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంను పరిశీలించి పనితీరు, తదితర వివరాలను నోడల్ అధికారి నాగార్జునను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో కరీంనగర్, సిరిసిల్ల అదనపు కలెక్టర్లు ప్రఫుల్‌దేశాయ్, పూజారి గౌతమి, ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, ఆర్డీవో మహేశ్వర్, కాలేజీ ప్రిన్సిపాల్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైద్యారోగ్య శాఖలో ఇష్టారాజ్యం

- ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు

సాక్షిప్రతినిధి,కరీంనగర్: వైద్యారోగ్య శాఖలో సాక్షాత్తు ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలు అమలుకావడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక అన్ని డిప్యూటేషన్లను రద్దు చేస్తూ వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. ఫిబ్రవరి 7న మెమో నం.1500/ఎఫ్1/2024 జారీ చేశా రు. కాగా వైద్యారోగ్య శాఖలో వైద్యవిధాన పరిషత్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్, డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ మూడు విభాగాలుండగా సదరు ఆదేశాలు మూడు విభాగాలకు వర్తిస్తాయి. ఈ క్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలువురు ఏరియా ఆసుపత్రి వైద్యులు పూర్వస్థానాలకు వెళ్లారు. కానీ, జమ్మికుంట ఏరియా ఆసుపత్రి వైద్యుడు మాత్రం రిలీవ్ కాకపోవడం గమనార్హం. సదరు ఆదేశాలతో అప్పటి జిల్లా వైద్యాధికారి లలితకుమారి రిలీవ్ అయి వెళ్లిపోయారు. జిల్లా అధికారే ఆదేశాలను పాటించగా వైద్యున్ని రిలీవ్ చేయాల్సిన అధికారి పట్టనట్లు వ్యవహరించడం విడ్డూరం. డిప్యూటేషన్ క్యాన్సిల్ అయినప్పుడు అదే స్థానంలో కొనసాగడం నిబంధనలకు విరుద్ధం. విచిత్రమేమిటంటే ఆయా హెచ్‌వోడీల పరిధిలో ఎవరెవరు డిప్యూటేషన్‌లో పని చేస్తున్నారో జాబితా పంపాలని వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశించారు. ఈ నేపథ్యంలో సదరు జాబితాలో అతడి పేరు లేనట్లు తెలుస్తోంది. రాష్ట్ర వైద్యారోగ్య శాఖలో కీలక స్థానంలో ఉన్న అధికారి అండతో పాటు జిల్లాస్థాయి అధికారి అండతో తన పేరును జాబితాలో లేకుండా చేసుకున్నారన్న ప్రచారం జరుగుతోంది. కాగా ఈ విషయంలో కలెక్టర్ జోక్యం చేసుకోవాలని తోటి ఉద్యోగులే డిమాండ్ చేస్తున్నారు.

బల్దియా ఆర్‌ఐ సస్పెన్షన్

- బిల్‌కలెక్టర్ సరెండర్

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలకసంస్థ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌పై సస్పెన్షన్ వేటు పడింది. రేకుర్తిలో నకిలీ పత్రాలతో భూకబ్జాకు పాల్పడిన నిందితులకు సహకరించారనే అభియోగంతో ఈనెల 24న శ్రీకాంత్‌తో పాటు, బిల్ కలెక్టర్ రాజులను పోలీసులు అరెస్ట్‌చేసి జైలుకు తరలించిన విషయం తెలిసిందే. నిబంధనల మేరకు జైలులో ఉన్న శ్రీకాంత్‌ను సస్పెండ్ చేస్తూ మున్సిపల్ శాఖ రీజినల్ డైరెక్టర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్ ఇన్‌చార్జి ఆర్‌ఐగా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే ఔట్‌సోర్సింగ్ పద్ధతిన బిల్‌కలెక్టర్‌గా ఉన్న రాజును నగరపాలకసంస్థ నుంచి తొలగిస్తూ, వారధికి సరెండర్ చేశారు.

ఫారిన్ చెక్కేద్దాం!

- భూకబ్జా కేసుల్లో వరుస అరెస్టులు
- నిందితుల గుండెల్లో గుబులు
- తప్పించుకునేందుకు విదేశాలకు జంప్
- లుక్ అవుట్ నోటీసులు జారీ చేసే అవకాశం
- సీపీ కార్యాలయానికి 2,700కు పైగా ఫిర్యాదులు



కరీంనగర్‌క్రైం: భూకబ్జా కేసుల్లో నిందితులుగా ఉన్న పలువురు విదేశాల బాట పడుతున్నారు. వరుస అరెస్టులు నిందితుల గుండెల్లో గుబులు రేపుతుండగా పోలీసులు అరెస్టు చేసి, జైలుకు పంపిస్తారన్న భయంతో ఫారిన్ చెక్కేద్దామంటూ ఫ్లైట్లు ఎక్కేస్తున్నారు. దీంతో విదేశాలకు వెళ్తున్న నిందితులపై పోలీసులు దృష్టిసారించారు. కేసుల్లో ఉన్న పలువురు నాయకులు ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నారు. భూ దందాల్లో ఆయా పార్టీలకు చెందిన పలువురి పాత్ర ఉండటం.. ఎన్నికల సమయంలో అరెస్టు చేస్తే ప్రచారంపై ప్రభావం పడుతుందని, ప్రతిపక్షాలకు ప్రచారాస్త్రంగా మారుతుందని భయపడుతున్నారు. అలాంటి వారిని ఎన్నికలు ముగిసే వరకు ప్రచారానికి దూరంగా ఉండాలని ఆయా పార్టీల నేతలే చెబుతున్నట్లు సమాచారం.

ఆరా తీస్తున్న పోలీసులు...

పార్లమెంట్ ఎన్నికల ప్రచారం జోరందుకున్న సమయంలోనూ భూ కబ్జా ఫిర్యాదులు కరీంనగర్ కమిషనరేట్‌కు భారీగా వస్తున్నాయి. బాధితులు తమ గోడు వెళ్లబోసుకుంటూ న్యాయం చేయాలని సీపీ అభిషేక్ మహంతికి విన్నవిస్తున్నారు. కానీ పార్లమెంట్ ఎన్నికలు పూర్తయ్యే వరకు ఫిర్యాదుల స్వీకరణ నిలిపివేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అయితే, గతంలో వచ్చిన ఫిర్యాదులపై విచారణ కొనసాగుతుండటంతోపాటు అరెస్టులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భూ దందాల్లో కీలక పాత్ర ఉండి, విదేశాలకు వెళ్లినట్లు తెలిసిన నాయకులపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇప్పటికే కమిషనరేట్ పరిధిలో 2,700కు పైగా ఫిర్యాదులు రాగా, వాటిలో సుమారు 35కు పైగా కేసులు నమోదవగా, మరికొన్ని విచారణ దశలో ఉన్నాయి. భూ అక్రమాలపై పెద్ద ఎత్తున కేసులు నమోదవుతుండటం, వాటిల్లో ప్రధాన నిందితులుగా ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులే ఉండటంతో కీలక నేతలు తలలు పట్టుకుంటున్నారు. ఏ క్షణాన ఏం జరుగుతుందోనన్న భయం వారిని వెంటాడుతోంది.


అరెస్టు భయంతో విదేశాలకు..

భూ కబ్జా కేసుల్లో నిందితులుగా ఉన్న పలువురు నాయకులు అరెస్టు భయంతో విదేశాలకు వెళ్తున్నారు. దీనిపై పోలీసులు వివరాలు సేకరించే క్రమంలో వారి కుటుంబసభ్యుల నుంచి స్పందన ఉండటం లేదు. దీంతో లుక్ అవుట్ నోటీసులు జారీ చేసే అవకాశాలపై పరిశీలిస్తున్నట్లు సమాచారం. పార్లమెంట్ ఎన్నికలు ముగిశాక భూ ఆక్రమణ కేసులపై మళ్లీ దృష్టిసారించనున్నట్లు తెలిసింది.

లోక్‌సభ బరిలో వీరే..

కరీంనగర్: కరీంనగర్ పార్లమెంట్ బరిలో 28 మంది అభ్యర్థులు నిలిచారు. బండి సంజయ్(బీజేపీ), మారేపల్లి మొగిలియ్య(బీఎస్పీ), బోయినపల్లి వినోద్‌కుమార్(బీఆర్‌ఎస్), వెలిచాల రాజేందర్‌రావు(కాంగ్రెస్–ఐ), కడతల అనిల్‌రెడ్డి(నేషనల్ నవక్రాంతి పార్టీ), తాళ్లపల్లి అరుణ(అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫామ్స్ పార్టీ), పంచిక అశోక్(ఎస్‌జేపీఐ), చింత అనిల్‌కుమార్(పీపీఐ), చిలువేరి శ్రీకాంత్(డీఎస్‌పీ), చీకోటి వరుణ్‌కుమార్ గుప్తా(టీసీపీ టీసీపీ), పాడిశెట్టి సమ్మయ్య(బీఎంపీ), గట్టు రాణాప్రతాప్(సోషలిస్టు పార్టీ), పెద్దపల్లి శ్రవణ్ (భారతీయ యువకుల దళం) బరిలో నిలిచారు. స్వతంత్ర అభ్యర్థులుగా అబ్బిడి బుచ్చిరెడ్డి, మేకల అక్షయ్‌కుమార్, కట్కూరి అనూస్, కోట శ్యామ్‌కుమార్, బరిగె గట్టయ్య యాదవ్, గద్ద సతీశ్, గవ్వల లక్ష్మి, గుడిసె మోహన్, దేవునూరి శ్రీనివాస్, పేరాల మానస, పొత్తూరి రాజేందర్, రాపోలు రాంకుమార్ భరద్వాజ్, వేముల విక్రమ్‌రెడ్డి, ద్యాగల వెంకటనర్సయ్య, శివరాత్రి శ్రీనివాస్ బరిలో ఉన్నారు.

రాముని పేరిట ఓట్ల రాజకీయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

జమ్మికుంట(హుజూరాబాద్): రాముని పేరిట బీజేపీ ఓట్ల రాజకీయం చేస్తుందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆరోపించారు. జమ్మికుంటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా మంగళవారం నిర్వహించే సీఎం బహిరంగసభ ఏర్పాట్లను నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. ఎంపీ సంజయ్ కరీంనగర్‌కు చేసిందేమీ లేదన్నారు. హనుమకొండ వలసవాది వినోద్‌కుమార్‌కు బీఆర్‌ఎస్ టికెట్ ఇచ్చిందని విమర్శించారు. జమ్మికుంటలో జరిగే బహిరంగ సభను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. తుమ్మేటి సమ్మిరెడ్డి, జి. సారంగపాణి, సదయ్య, రేణుక తదితరులు పాల్గొన్నారు.

8న వేములవాడకు ప్రధాని మోదీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్

- మోదీ సభపై బీజేపీ ఫోకస్
- విజయవంతం చేయాలని కార్యకర్తలకు ఎంపీ సంజయ్ పిలుపు

కరీంనగర్‌టౌన్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ వచ్చే నెల 8న కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రచారం నిర్వహించే అవకాశముంది. ఈ మేరకు ప్రధానమంత్రి కార్యాలయం నుంచి రాష్ట్ర కార్యాలయానికి సమాచారం అందింది. పార్టీ వర్గాల సమాచారం మేరకు మే 8న ఉదయం కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని వేములవాడలో పర్యటిస్తారు. ప్రధాని రాక సమాచారాన్ని అందుకున్న జిల్లా నాయకత్వం సభాస్థలి ఏర్పాట్లపై దృష్టి సారించింది. ప్రధాని మోదీ తొలిసారి వేములవాడ రానున్న నేపథ్యంలో ఎములాడ రాజన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించేలా పార్టీ నాయకత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఉదయం 10 గంటలకు రాజన్న దర్శనాంతరం వేములవాడలో ఏర్పాటు చేసే భారీ బహిరంగ సభకు హాజరై మోదీ ప్రసంగించేలా షెడ్యూల్ ఖరారు చేయనున్నారు. ప్రధాని పర్యటన పూర్తి షెడ్యూల్ రెండుమూడు రోజుల్లో అధికారికంగా వెల్లడయ్యే అవకాశముంది. మరోవైపు సోమవారం ఎంపీ కార్యాలయంలో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ శక్తి కేంద్ర ఇన్‌చార్జిల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, ప్రధాని మోదీ 8న కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో వేములవాడలో బహిరంగ సభ ఏర్పాటు చేయాలని యోచిస్తున్నామని, సభను విజయవంతం చేసేలా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని కోరారు. బహిరంగ సభాస్థలిని ఎంపిక చేసేందుకు మంగళవారం మధ్యాహ్నం వేములవాడ వెళ్లనున్నారు. అనంతరం జిల్లా, నియోజకవర్గ ముఖ్యనేతలతో సమావేశమై మోదీ సభ ఏర్పాట్లపై చర్చించనున్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.మనోహర్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మీసాల చంద్రయ్య, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు, అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దు

కరీంనగర్‌టౌన్: పదో తరగతి పరీక్ష ఫలితాలు మంగళవారం వెలువడనున్న నేపథ్యంలో విద్యార్థులు ఫెయిల్ అయితే మానసిక ఒత్తిడికి గురికావద్దని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత సోమవారం ప్రకటనలో తెలిపారు. మళ్లీ పరీక్ష రాసి పాస్ అయ్యే అవకాశాలు ఉన్నందున, సానుకూల దృక్పథంతో ఆలోచించాలని, ఎలాంటి అఘాయిత్యానికి పాల్పడకుండా మనోధైర్యంతో ఒత్తిడిని జయించాలని పేర్కొన్నారు. ఎవరైనా విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురైతే టోల్ ఫ్రీ 14416 నంబర్‌కు ఫోన్ చేసి వైద్యుల సలహాలు పొందవచ్చని సూచించారు. అలాగే తల్లిదండ్రులు కూడా పిల్లలను మానసిక ఒత్తిడికి గురి చేయవద్దని కోరారు. ఒత్తిడికి గురైన విద్యార్థులకు నిపుణులైన వైద్యులచే అవసరమైన కౌన్సెలింగ్ ఇప్పించాలని పేర్కొన్నారు.

బీజేపీ పథకాలతో అన్ని వర్గాలకు మేలు

ఇల్లందకుంట(హుజూరాబాద్): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్ లక్ష్యంగా కొనసాగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం ఇల్లందకుంట మండలంలో నిర్వహించిన లాబార్థి సంపర్క్ అభియాన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పదేళ్ల మోదీ పాలనలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. లబ్ధిదారులంతా ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, హుజూరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ మాడ గౌతమ్‌రెడ్డి, బైరెడ్డి రమణారెడ్డి, ఆరెల్లి శ్రీనివాస్, ఉప్పుల శ్రీనివాస్, అంతం ఎల్లారెడ్డి, ఎండీ షఫీ, రాంబాబు, సమ్మయ్య, నరేందర్‌రెడ్డి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎన్టీపీసీ పీటీఎస్‌లో అగ్ని ప్రమాదం



మంటల్లో కాలిపోతున్న చెట్లు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ పర్మినెంట్ టౌన్‌షిప్ బి–గేట్ ప్రాంతంలోని చెట్లపొదల్లో సోమవారం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. సెక్యూరిటీ సిబ్బంది వెంటనే అధికారులకు సమాచారం అందించారు. ఎన్టీపీసీకి చెందిన అగ్నిమాపక యంత్రంపాటు మరో మూడు ఫైరింజన్‌లు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. కాగా, ఎండిపోయిన చెట్ల ఆకులకు మంటలు అంటుకోవడంతో ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు.

విద్యుత్ వైర్లకు తగిలి వ్యాన్ దగ్ధం

వీణవంక(హుజూరాబాద్): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో సోమవారం డీసీఎం వ్యాన్ గడ్డి కట్టల లోడ్‌తో వెళ్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లకు తగిలి దగ్ధమైంది. వివరాలు.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలానికి చెందిన రవి అనే వ్యక్తి డీసీఎం వ్యాన్‌ను బ్రాహ్మణపల్లిలో గడ్డి కట్టలు తీసుకెళ్లేందుకు తీసుకొచ్చారు. దాదాపు 160పైగా గడ్డి కట్టలు వేసుకొని వెళ్తుండగా గ్రామ శివారులో విద్యుత్ వైర్లకు తగిలి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు ఆర్పే ప్రయత్నం చేశారు. మంటలు వ్యాన్ మొత్తం వ్యాప్తిచెందడంతో ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా వారు వచ్చి ఆర్పివేశారు. డీసీఎం వ్యాన్ పూర్తిగా కాలిపోయిందని బాధితుడు వాపోయాడు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలను పరిశీలిస్తున్న గ్రామస్తులు

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని పోతుగల్‌లో గొర్రెల మందపై కుక్కలు దాడి చేసి ఘటనలో 15 గొర్రెలు చనిపోయాయి. పోతుగల్‌కు చెందిన కుంట్ల భాస్కర్ గొర్రెలమందపై ఆదివారం రాత్రి కుక్కల దాడి చేశాయి. ఈ దాడిలె 15 గొర్రెలు మృతి చెందగా, మరికొన్ని గాయపడ్డాయి. రూ.2లక్షల వరకు నష్టం జరిగిందని బాధితుడు భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశాడు. పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతోనే కుక్కలు గొర్లమందలపై దాడులు చేస్తున్నాయన్నారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ గౌతంరావు, కాంగ్రెస్ నాయకుడు తోట ధర్మేందర్ కోరారు.

గుండెపోటుతో పంచాయతీ కార్యదర్శి మృతి

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావుపేట గ్రామ పంచాయతీ కార్యదర్శి దేవరాజు భారతి (51) గుండెపోటుతో మృతి చెందారు. మెట్‌పల్లిలో నివాసం ఉంటున్న భారతి సోమవారం ఉదయం ఇంటి పనుల్లో నిమగ్నమై ఉన్న సమయంలో ఒక్కసారిగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలింది. భారతి మృతిపట్ల పంచాయతీ అధికారులు సంతాపం తెలిపారు.

పైసల ‘పంచాయితీ’



‘ఈ ఫొటోలోని వ్యక్తి పేరు మేడి అంజయ్య. తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి మాజీ సర్పంచ్. గత ప్రభుత్వ హయాంలో పల్లె ప్రగతిలో భాగంగా అందినకాడల్లా అప్పు తెచ్చి గ్రామంలో అభివృద్ధి పనులు చేయించారు. చేసిన పనులకు ఏడాది కాలంగా ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో పాటు అప్పు ఇచ్చినవారి నుంచి ఒత్తిడితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. చివరకు బిల్లులు చెల్లించాలని మార్చి 5న తిమ్మాపూర్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట పురుగుల మందు డబ్బాతో ఆందోళన చేయగా పోలీసులు అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు.. ఇలా అంజయ్య ఒక్కరే కాదు.. గత ప్రభుత్వ హయాంలో అప్పు చేసి, పల్లె ప్రగతి పనులు చేపట్టి.. బిల్లుల కోసం ఎదురుచూస్తున్న మాజీ సర్పంచ్‌లు అందరిదీ ఇదే పరిస్థితి’..

- గుదిబండలా మారిన అప్పులు
- మాజీ సర్పంచ్‌లకు తిప్పలు
- మూడు నెలలు గడుస్తున్నా పత్తాలేని బిల్లులు



వెలిచాల గ్రామపంచాయతీ కార్యాలయం

కరీంనగర్: గత ప్రభుత్వం పల్లె ప్రగతి పనుల్లో భాగంగా గ్రామాల్లో అభివృద్ధి పనులను విరివిరిగా చేపట్టింది. ప్రత్యేకాధికారులను నియమించి పల్లెప్రగతి పనులను యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేయాలని లేకుంటే నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం సర్పంచ్‌లపై సస్పెన్షన్ వేటు తప్పదని హెచ్చరించడంతో.. అప్పటి సర్పంచ్‌లు అప్పు తెచ్చి గ్రామాల్లో వారి పదవీకాలం ఏడాది ముందు ముగుస్తుందనగా పనులు చేపట్టారు. వారి పదవీకాలం ముగిసి మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు బిల్లులు చేతికి రాకపోవడంతో మాజీ సర్పంచ్‌ల అప్పుల తిప్పలు అన్ని ఇన్ని కావు.

313 గ్రామాల్లో పనులు

- జిల్లాలో 313 గ్రామపంచాయతీలు ఉన్నాయి. పల్లె ప్రగతి పనుల్లో భాగంగా గ్రామాల్లో చేపట్టిన పనుల బిల్లులు అందక, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు రాక సతమతమవుతున్నారు.
- ఉపాధి పథకంలో రూ.22 లక్షలతో ఒక్కో రైతు వేదిక, రూ.12లక్షల చొప్పున వైకుంఠధామం, రూ.లక్ష నుంచి రూ.4 లక్షలతో క్రీడా ప్రాంగణం, పల్లె ప్రకృతి వనంతో పాటు గత ఆర్థిక సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా రూ.28.70 కోట్లతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు.
- కార్యక్రమాల అమలులో లక్ష్య సాధనకు సర్పంచులు, కాంట్రాక్టర్లపై జిల్లా అధికారులు ఒత్తిడి తెచ్చి గడువులోగా పనులు పూర్తి చేయించారు. కానీ చేసిన పనులకు ఇప్పటికీ బిల్లులు అందక అరిగోస పడుతున్నామని మాజీ సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల్లో చేపట్టిన పనులు..	
పల్లె ప్రకృతి వనాలు	313
రైతు వేదికలు	76
క్రీడా ప్రాంగణాలు	313
వైకుంఠధామాలు	313
సీసీ రోడ్లు	573
దంప్‌యార్డులు	340
వర్మి కంపోస్టు షెడ్లు	267
నర్సరీలు	313
వరి కల్లాలు	2,666

- లక్షల్లో అప్పులు చేసి అభివృద్ధి పనులు చేశామని, బిల్లులు పూర్తిగా చెల్లించలేదని వాపోతున్నారు. పల్లె ప్రగతిలో చేపట్టిన పనుల బిల్లులన్నింటినీ చెల్లించేలా ప్రభుత్వం చొరవ చూపాలని కోరుతున్నారు.
- మరోవైపు పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు అందక విద్యుద్దీపాలు, ట్రాక్టర్ల వాయిదాలు, కరెంటు బిల్లులు, తాగునీరు, బోరు మోటార్ల నిర్వహణ ఎలా చేసేదని ప్రస్తుత కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జీవితంలో ఆర్థికంగా నిలదొక్కుకోవాలి

- సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్



మాట్లాడుతున్న జడ్జి వెంకటేశ్

సప్తగిరికాలనీ(కరీంనగర్): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వృద్ధుల, దివ్యాంగుల ఆశ్రమం, స్వధార్ హోమ్, బాల సదన్, శిశుగృహాలను సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్ సందర్శించారు. స్వధార్ హోమ్‌లో ఉన్నవారితో మాట్లాడారు. యవ్వనంలో ఆకర్షణకు లోనై, బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దన్నారు. కష్టపడి చదువుకొని, జీవితంలో ఆర్థికంగా నిలదొక్కుకున్న తర్వాతే ప్రేమ గురించి ఆలోచించాలని సూచించారు. బాలసదన్‌లోని పిల్లలతో మాట్లాడుతూ.. పరిశుభ్రత పాటించాలని, మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. శిశుగృహలో వంట, ఆహార పదార్థాలను నిల్వ చేసే గదులను తనిఖీ చేశారు. పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎలాంటి న్యాయపరమైన సహాయం కావాలన్నా సంప్రదించాలని నిర్వాహకులకు సూచించారు. జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేశ్, వద్ధాశ్రమం, స్వధార్ హోం, బాల సేదన్ నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

‘నేచర్’ అండ.. దాతల సాయం



దాతల నుంచి సేకరించిన నగదును బాధితులకు అందజేస్తున్న నేచర్ యూత్ సభ్యులు, గ్రామస్తులు

- బాధిత కుటుంబానికి రూ.4,04,260 అందజేత

రామడుగు(చొప్పదండి): రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడడంతో వారి ఆర్థిక పరిస్థితి దీన స్థితికి చేరింది. ఈనేపథ్యంలో గ్రామానికి చెందిన యూత్ అసోసియేషన్ సభ్యులు బాధితుల ఇబ్బందులను సోషల్ మీడియాలో వైరల్ చేశారు. దీంతో దాతలు స్పందించి వారి వైద్య ఖర్చులకు అవసరమైన కొంత నగదును అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. వివరాలు.. రామడుగు మండలం గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన ఏగోలపు మల్లేశం, భారతమ్మ ఇటీవల ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గోపాల్‌రావుపేట శివారులో లారీ ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు. వారిది గీత కార్మిక పేద కుటుంబం. వైద్యానికి డబ్బు లేక ఇబ్బందిపడుతున్న పరిస్థితి తెలుసుకొని గ్రామానికి చెందిన నేచర్ యూత్ అసోషియేషన్ సభ్యులు వారి దీనగాథను సోషల్ మీడియాలో వైరల్ చేశారు. ఈక్రమంలో గ్రామస్తులతో పాటు, ఇతర గ్రామాల దాతలు స్పందించి రూ.4,04,260 ఆర్థికసాయం అందించగా, సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు ఎడవెల్లి నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీ కరుణశ్రీపాపిరెడ్డి, నేచర్ యూత్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కాసారపు పర్శారాంగౌడ్, బుర్ర శ్రీకాంత్ గౌడ్, గడ్డం రత్నాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

దేహదానానికి దంపతుల అంగీకారం



అభినందనపత్రం అందిస్తున్న రాజమౌళి

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలో పెళ్లినరోజు సందర్భంగా ఓ యువజంట ఆదర్శనీయ నిర్ణయం తీసుకుంది. మరణానంతరం తమ దేహాలను మెడికల్ కాలేజీకి దానం చేస్తామని ప్రకటించారు. రమేశ్‌నగర్‌కు చెందిన కట్కూరి రాజశేఖర్–శ్రీచందన దంపతులు. స్థానిక లక్ష్మీనగర్‌లో రెడీమేడ్ దుస్తుల వ్యాపారం చేస్తున్నారు. సోమవారం పెళ్లిరోజు సందర్భంగా వినూత్నంగా వేడుకలు జరుపుకున్నారు. మరణానంతరం తమ దేహాలను రామగుండం ప్రభుత్వ మెడికల్ కాలేజీకి దానం చేస్తామని ప్రకటించారు. అంగీకార పత్రాలపై సంతకాలు చేసి సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు ఆరెపెల్లి రాజమౌళికి అందజేశారు. రాజమౌళి వారిని అభినందించారు. అనంతరం దంపతులకు సదాశయ ఫౌండేషన్ ద్వారా అభినందన పత్రాన్ని అందజేశారు. ఫౌండేషన్ రాష్ట్ర ప్రతినిధి కేఎస్‌వాసు తదితరులు పాల్గొన్నారు. దంపతులను ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు టి.శ్రావణ్ కుమార్, కార్యదర్శి టి.లింగమూర్తి, రాష్ట్ర కార్యదర్శి భీష్మాచారి, గౌరవ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి, ముఖ్య సలహాదారు నూక రమేశ్ తదితరులు అభినందించారు.

అప్పుడు 183.. ఇప్పుడు 29

- గత పార్లమెంట్ ఎన్నికల్లో ఎర్రజొన్న రైతుల హవా
- అందరి దృష్టిని ఆకర్షించిన అప్పటి నిజామాబాద్ ఎన్నిక



2019 ఎన్నికల్లో ఈవీఎంలు (ఫైల్)

కోరుట్ల: 2019 నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికలు.. ‘పది..పాతిక’ కాదు..ఏకంగా 183 మంది నామినేషన్లు వేశారు. అప్పటికీ కొంత మంది రైతులు నామినేషన్లు వేయకుండా అప్పటి అధికార పార్టీ ప్రయత్నం ఫలితంగా నామినేషన్ల జోరుకు కాస్త అడ్డుకట్ట పడింది. అప్పుడు నిజామాబాద్ పార్లమెంట్ అందరి దృష్టిని ఆకర్షించింది. ధర గిట్టుబాటు కావడం లేదని పసుపు, ఎర్రజొన్న, చెరుకు పెద్ద సంఖ్యలో తాము పోటీకి ముందుకు వచ్చారు. చివరికి 183 మంది నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఈ సారి నిజామాబాద్ పార్లమెంట్‌లో పరిస్థితి మారింది. ఉపసంహరణల పర్వం ముగిసేసరిగి మొత్తం 29 మంది అభ్యర్థులు మాత్రమే బరిలో మిగిలారు.

మూకుమ్మడి జాడ లేదు

గత ఎన్నికల్లో అత్యధికంగా నామినేషన్లు దాఖలైన క్రమంలో ఈసారి పరిస్థితి ఎలా ఉంటుందోనని పోలీస్, ఇంటలిజెన్స్ వర్గాలు ముందుగానే ఆరాతీశాయి. ఎన్నికల అధికార యంత్రాంగం నామినేషన్ల తీరుపై కొంతమేర దృష్టి సారించినట్లు సమాచారం. గత ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఆర్మూర్, కోరుట్ల, జగిత్యాల, బాల్కొండ, బోధన్ పరిసర ప్రాంతాల్లోని పసుపు, ఎర్రజొన్న, చెరుకు రైతులు ఉద్యమస్ఫూర్తితో ఎక్కువ సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేశారు. అప్పుడు క్వింటాలు పసుపు ధర కేవలం రూ.5వేల నుంచి రూ.7వేల మాత్రమే ఉండటం, ఎర్రజొన్నకు ఆశించిన రీతిలో ధర లేకపోవడం, పార్లమెంట్ పరిధిలోని కోరుట్ల, బోధన్ సెగ్మెంట్ల పరిధిలోని ముత్యంపేట, బోధన్ షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించాలన్న డిమాండ్‌తో రైతులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు వేసి తమ సమస్యలను దేశవ్యాప్తంగా ఎత్తిచూపేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సారి పసుపు బోర్డు ప్రకటనతో పాటు పసుపు ధర క్వింటాలు రూ.9వేల నుంచి రూ.16వేల వరకు పలకడంతో రైతులకు ఉపశమనం దక్కింది. ముత్యంపేట, బోధన్ షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించే విషయంలో అధికార కాంగ్రెస్ పార్టీ అధ్యయన కమిటీ వేయడం చెరుకు రైతులకు ఊరటనిచ్చింది. ఫలితంగా రైతులు ఈ సారి మూకుమ్మడి నామినేషన్లపై పెద్దగా ఆసక్తి చూపలేదు.

ఫలితంపై ప్రభావం..

గత ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు మినహా 183 మంది అభ్యర్థులు బరిలో ఉండటం.. వీరిలో 175 మందికిపైగా రైతులు కావడం గమనార్హం. స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేసి బరిలో నిలిచిన సుమారు 175 మంది రైతులకు సుమారు 80 వేలపైనే ఓట్లు పోలయ్యాయి. ఆ ఎన్నికల్లో బీజేపి తరఫున బరిలో నిలిచిన ఎంపీ అర్వింద్ 4,80,484 ఓట్లు సాధించగా, బీఆర్‌ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల కవిత 4,09,709 ఓట్లు సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి మధుయాస్కి 69,240 ఓట్లు పొందారు. కేవలం 70 వేల ఓట్ల తేడాతో కల్వకుంట్ల కవిత ఓటమి పాలయ్యారు. రైతులకు వచ్చిన ఓట్లు దాదాపు ఇదే సంఖ్యలో ఉండటంతో రైతుల నామినేషన్లు ఎన్నికల ఫలితాలనే తారుమారు చేశాయన్న ప్రచారం జరిగింది. ఈ సారి ఎన్నికల బరిలో కేవలం 29 మంది మాత్రమే ఉండటంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు తేలికగా ఊపిరి పీల్చుకుంటున్నారు.

రూ.4లక్షలు పట్టివేత

జగిత్యాలక్రైం: జగిత్యాలలోని పాతబస్టాండ్ ఆవరణలో సోమవారం పట్టణ ఎస్సై మన్మథరావు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో జిల్లా కేంద్రానికి చెందిన ఎండీ.ఇక్రమోద్దీన్ ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.4లక్షలు తీసుకెళ్తుండగా పట్టుకుని సీజ్ చేశారు. పట్టణ ఎస్సై నరేశ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టగా.. విద్యానగర్‌కు చెందిన గొడిపెల్లి సురేశ్ ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.85 వేల నగదును సీజ్ చేశారు.

రైలుకిందపడి లారీ డ్రైవర్ ఆత్మహత్య

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన లారీ డ్రైవర్ షేక్ జహీరొద్దీన్(55) సోమవారం పెద్దపల్లి– రాఘవాపూర్ రైల్వేస్టేషన్ల మధ్య రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని రైల్వేహెడ్ కానిస్టేబుల్ కెంసారపు సంపత్ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందని వివరించారు.

కాంగ్రెస్ అభ్యర్థిపై చర్య తీసుకోండి

- రిటర్నింగ్ అధికారి, పోలీసులకు బీజేపీ నాయకుల ఫిర్యాదు

కరీంనగర్‌టౌన్: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ అభ్యర్థి బండి సంజయ్‌పై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుపై చర్య తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతితోపాటు ఏసీపీ నరేందర్‌కు ఫిర్యాదు చేశారు. రాజేందర్‌రావు తన సొంత ఫేస్‌బుక్ ఐడీ నుంచి రిజర్వేషన్ల రద్దు, బండి సంజయ్ మోసాలు అంటూ ఆయన మాటలను వక్రీకరించి, తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ అంశాన్ని అవసరమైతే రాష్ట్ర ఎన్నికల కమిషన్‌తోపాటు డీజీపీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు కొట్టె మురళీకృష్ణ, డాక్టర్ పుల్లెల పవన్‌కుమార్, సొల్లు అజయ్ వర్మ, రాష్ట్ర ఎన్నికల కమిటీ సభ్యుడు పొన్న వెంకటరమణ తదితరులున్నారు.

తండ్రిపై కొడుకు దాడి

- ఆస్తి తగాదాలే కారణం

మల్లాపూర్: ఆస్తి తగాదాలతో కన్న తండ్రిపై ఓ కొడుకు విచక్షణారహితంగా దాడి చేసిన ఘటన మండలంలోని రేగుంటలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మూడంపెల్లి రాజరెడ్డికి ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు శేఖర్ కొద్దిరోజులుగా తండ్రితో తగాదా పెట్టుకుంటున్నాడు. సోమవారం కూడా గొడవకు దిగిన శేఖర్ గడ్డపారతో తండ్రిపై దాడి చేశాడు. ఈ ఘటనలో రాజరెడ్డి తీవ్రంగా గాయపడటంతో కుటుంబసభ్యులు కరీంనగర్‌కు తరలించారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు రేగుంటకు వెళ్లి విచారణ చేపట్టారు.

200 కేజీల నల్లబెల్లం స్వాధీనం

రామగుండం: అండమాన్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఆదివారం రాత్రి తనిఖీలు చేయగా 200 కేజీల నల్లబెల్లం లభ్యమైందని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్)సీఐ బుర్ర సురేశ్‌గౌడ్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు వరంగల్ నుంచి రామగుండం చేరుకున్న రైలులో సోదా చేయగా సంచుల్లో నల్లబెల్లం లభించిందన్నారు. దీనిని స్వాధీనం చేసుకొని సోమవారం కేసు నమోదు చేసి ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాస్‌కు అప్పగించామని పేర్కొన్నారు. బెల్లం విలువ సుమారు రూ.80వేలు ఉంటుందన్నారు. కాగా, ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఆర్‌పీఎఫ్ సతార్క్ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా రూ.4.20 లక్షల విలువైన నిషేధిత వస్తువులను స్వాధీనం చేసుకున్నామని సీఐ వివరించారు. నల్లబెల్లం రవాణాను గుర్తించిన ఆర్‌పీఎఫ్ సిబ్బంది లోకేంద్ర, ఓంవీర్, దినేశ్ చంద్‌ను సీఐ అభినందించారు.

తప్పుడు పత్రాలతో భూకబ్జాకు యత్నం

- ఒకరిని అరెస్ట్ చేసిన పోలీసులు

చొప్పదండి: తప్పుడు ధ్రువపత్రాలు తయారు చేసి ఇతరులకు విక్రయించిన భూమిని కబ్జా చేసేందుకు యత్నించిన వ్యక్తిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ ఉపేంద్రచారి కథనం ప్రకారం.. చొప్పదండి పట్టణానికి చెందిన సుద్దాల వెంకటస్వామి 2010లో పెద్దెళ్ళి గట్టయ్య వద్ద 2 గుంటల భూమి కొనుగోలు చేశాడు. అనంతరం 2016లో రామడుగుకు చెందిన వైద్యుల మహేందర్‌రెడ్డికి విక్రయించి రిజిస్ట్రేషన్ చేశాడు. ఈక్రమంలో పలువురి చేతులు మారిన తర్వాత చొప్పదండి మాజీ ఎంపీపీ వల్లాల కృష్ణహరి కొనుగోలు చేసి మోకాపైకి వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా, సుద్దాల వెంకటస్వామి అడ్డుకున్నాడు. ఎవరైనా మోకాపై వెళ్లేందుకు ప్రయత్నించగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసులు పెడుతానని బెదిరించాడు. వెంకటస్వామి అమ్మిన 2 గుంటలు, దాని పక్కనే ఆనుకొని ఉన్న సర్వే నంబర్ 442లోని మరో 2 గుంటలు కబ్జా చేసి తన భార్య సుద్దాల తరుణి పేరుతో తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించాడు. 2007లో తన భార్య పేరు మీద గ్రామపంచాయతీ రికార్డులో ఎటువంటి గృహ నిర్మాణం చేయకుండా తప్పుడు పత్రాలతో దొంగ ఇంటి నంబర్ పొంది కబ్జా చేశాడు. మోకాపైకి కొనుగోలుదారు వెళ్లకుండా భయభ్రాంతులకు గురి చేసి అమ్మిన భూమితో పాటు, మరో 2 గుంటలు కబ్జా చేయాలనే ఉద్దేశంతో గ్రామపంచాయతీ రికార్డులను ఫోర్జరీ చేశాడు. తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి పలువురికి డబుల్ రిజిస్ట్రేషన్‌లు చేసి అట్రాసిటీ కేసులు పెడుతానని బెదిరింపులకు గురి చేస్తున్నాడని వల్లాల కృష్ణహరి ఫిర్యాదు మేరకు వెంకటస్వామి, అతడి భార్య తరుణిలపై కేసు నమోదైంది. విచారణలో ఆరోపణలు నిజం కావడంతో సోమవారం వెంకటస్వామిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు.

తెరపైకి డబుల్ రిజిస్ట్రేషన్‌ల దందా

చొప్పదండి పట్టణంలో పలువురు దళారుల అవతారం ఎత్తి దశాబ్దకాలంగా డబుల్ రిజిస్ట్రేషన్‌ల దందా నిర్వహిస్తున్నారు. ఇంటి నిర్మాణాలు చేయకుండానే నంబర్లు వేయించుకోవడం, అక్రమంగా విద్యుత్ మీటర్లు పొంది భూములు కబ్జా చేయడం వంటి దందాలో పలువురు ఆరి తేరారు. బ్రాహ్మణకుంట సమీపంలోని 301 సర్వే నంబర్‌లో ఒకే వ్యక్తి 32 గుంటల భూమిని ఒకసారి ఇద్దరికి, రెండోసారి 32 గుంటలను ఒక్కరికి, మూడోసారి రెండు మూడు గుంటల చొప్పున పలువురికి డబుల్, ట్రిపుల్ రిజిస్ట్రేషన్‌లు చేసినా అధికారులు, పోలీసులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులకు ఆడిందే ఆటగా మారింది. కాగా డబుల్ పట్టాల వ్యవహారంలో వెంకటస్వామి అరెస్ట్‌తో రోడ్డు పక్కన విలువైన స్థలాలను డబుల్ పట్టా చేసి కబ్జా చేసిన వారిపైనా చర్యలు తీసుకోవాలని భూయజమానులు కోరుతున్నారు. పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి బాధ్యతలు చేపట్టిన తర్వాత భూకబ్జాదారులపై ఉక్కుపాదం మోపుతుండటంతో తమకు న్యాయం జరుగుతుందని ప్లాట్ల యజమానులు ఆశాభావంతో ఉన్నారు. ఇప్పటికే సీపీ వద్ద పలువురు చొప్పదండి వాసులు ఫిర్యాదు చేయడంతో కబ్జాదారుల వెన్నులో వణుకు పుడుతోంది.

ఏసీబీకి చిక్కిన హెడ్‌కానిస్టేబుల్

- రూ.5 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం
- దుబాయి నుంచి డీజీపీకి ఫిర్యాదు చేసిన బాధితుడు



పట్టుబడిన హెడ్‌కానిస్టేబుల్ మనోహర్

జగిత్యాల క్రైం: నాన్ బెయిలబుల్ వారెంట్ అందించిన కానిస్టేబుల్.. రూ.10 వేలు లంచం కావాలని డిమాండ్ చేసి.. రూ.5వేలు తీసుకుంటూ పట్టుబడ్డాడు. ఈ సంఘటన జగిత్యాలలో చర్చనీయాంశంగా మారింది. ఏసీబీ అధికారుల కథనం ప్రకారం.. మనోహర్ కొద్దికాలంగా జిల్లాకేంద్రంలో నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేస్తున్న విభాగంలో పనిచేస్తున్నాడు. జగిత్యాల అర్బన్ మండలం పెరకపల్లి గ్రామానికి చెందిన బాలె తిరుపతి ఓ కేసులో కోర్టు హాజరుకాకుండా దుబాయ్‌లో ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేయడంతో కోర్టు వారెంటును కొద్దిరోజుల క్రితం హెడ్‌కానిస్టేబుల్ మనోహర్ వారి కుటుంబసభ్యులకు అందించి లంచం డిమాండ్ చేస్తున్నాడు. వాస్తవానికి కోర్టు పంపించే వారెంట్లను కుటుంబసభ్యులకు అందించాలి తప్ప ఎలాంటి డబ్బులూ డిమాండ్ చేయరాదు. మనోహర్ మాత్రం లంచం కోసం వేధిస్తుండడంతో దుబాయ్‌లో ఉన్న తిరుపతి ఈనెల 16న రూ.5వేలు ఫోన్‌పే ద్వారా మనోహర్‌కు పంపాడు. అయినా మనోహర్ వినిపించుకోకుండా మరో రూ.5 వేల కోసం డిమాండ్ చేస్తూ వస్తున్నాడు. ఈ క్రమంలో తిరుపతి డీజీపీకి మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశాడు. ఆయన ఆదేశాల మేరకు సోమవారం రాత్రి ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి, సీఐలు కృష్ణకుమార్, తిరుపతి జిల్లాకేంద్రంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తా వద్ద బాధితుడి తిరుపతి మామ కటుకం గంగాధర్‌కు రూ.5వేలు ఇచ్చి పంపించారు. వాటిని గంగాధర్ నుంచి తీసుకుంటుండగా మనోహర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం అతడిని రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి వివరాలు వెల్లడించారు.

ప్రాణం తీసిన బండరాయి

- ట్రాక్టర్‌పై నుంచి పడి మాజీ సర్పంచ్ మృతి
- చందుర్తిలో విషాదం



మల్లేశం(ఫైల్)

చందుర్తి(వేములవాడ): రోడ్డుపై పోసిన ధాన్యం కుప్పల పక్కన ఏర్పాటు చేసిన బండరాయి ఓ నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు. రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి మండలకేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ మర్రి మల్లేశం(52) ఆదివారం రాత్రి పొలం వద్దకు ట్రాక్టర్‌పై వెళ్తుండగా రోడ్డుపై పోసిన ధాన్యం కుప్పల పక్కనే ఉన్న బండరాయిని గమనించక ట్రాక్టర్‌ను ఎక్కించాడు. ట్రాక్టర్ అదుపు తప్పడంతో మల్లేశం తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుని భార్య లక్ష్మి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ఎనిమిదేళ్లకు కూతురు దరి చేరిన తల్లి

- మతిస్థిమితం లేక.. తప్పిపోయిన తల్లి
- అమ్మ కోసం వెతికి వెతికి.. అలసిపోయిన కూతురు
- ఇల్లంతకుంట పోలీసుల చొరవతో కలిసిన తల్లీకూతుళ్లు



ఎనిమిదేళ్లకు కూతురు దరి చేరిన తల్లి రాములమ్మ

సిరిసిల్ల: ఎనిమిదేళ్ల కిందట తప్పిపోయిన తల్లి.. ఆమె కోసం వెతికి వెతికి ఆశలు చాలించుకున్న కూతురు.. చివరికి ఇల్లంతకుంట పోలీసుల చొరవతో.. తల్లీబిడ్డలు కలిసిన ఘటన రాజన్నసిరిసిల్ల జిల్లాలో సోమవారం రాత్రి జరిగింది. ఇల్లంతకుంట ఎస్సై రాజు కథనం ప్రకారం.. ఆదివారం రాత్రి ఇల్లంతకుంట మండలం గాలిపల్లిలో ఒక గుర్తుతెలియని మహిళ ఉందని ఇల్లంతకుంట పోలీస్‌స్టేషన్‌కు డయల్ 100 కాల్ వచ్చింది. వెంటనే ఇల్లంతకుంట ఎస్సై రాజు బ్లూకోర్ట్ సిబ్బందిని గాలిపల్లికు పంపించారు. అక్కడ గుర్తుతెలియని మహిళ ఉండడంతో ఆమెను విచారించగా తన పేరు దోమల రాములమ్మ భర్త పుల్లయ్య అని తెలిపింది. ఆమెను సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సఖీ సెంటర్‌కు పంపించారు. రాములమ్మ చెప్పిన వివరాల ఆధారంగా ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం కిష్టాపూర్ గ్రామంగా గుర్తించిన పోలీసులు ముదిగొండ పోలీసుల సహకారంతో కిష్టాపూర్ గ్రామ పెద్దలకు రాములమ్మ ఫొటోలను సోమవారం పంపించారు. తన తల్లిగా గుర్తించిన ఆమె కూతురు రమాదేవి ఎనిమిదేళ్ల కిందట మతిస్థిమితం సరిగా లేక తప్పిపోయిందని, ఆమె కోసం అప్పటి నుంచి వెతుకుతున్నామని రమాదేవి పోలీసులకు వివరించారు. ఈమేరకు ముదిగొండ పోలీసుల సహకారంతో ఇల్లంతకుంట పోలీసుల చొరవతో కిష్టాపూర్ నుంచి రమాదేవి సిరిసిల్ల సఖీ కేంద్రానికి వచ్చి తల్లిని చూసి బోరున విలపించింది. ఇల్లంతకుంట ఎస్సై రాజు సమక్షంలో రమాదేవికి ఆమె తల్లి రాములమ్మను అప్పగించారు. ఎనిమిదేళ్ల కిందట తప్పిపోయిన తన తల్లిని గుర్తించి తమకు అప్పగించినందుకు రమాదేవి ఇల్లంతకుంట పోలీసులకు, సఖీ కేంద్రం నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

నగరంలో బీఆర్ఎస్ పార్టీకి షాక్

- కాంగ్రెస్‌లో చేరిన రెండో డివిజన్ కార్పొరేటర్
- కండువా కప్పిన మంత్రి పొన్నం ప్రభాకర్


కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో మంత్రి ప్రభాకర్

కరీంనగర్ కార్పొరేషన్: లోక్‌సభ ఎన్నికల వేళ నగరంలో బీఆర్ఎస్‌కు షాక్ తగిలింది. రెండో డివిజన్ కార్పొరేటర్ కాశెట్టి లావణ్య–శ్రీనివాస్ దంపతులు కారు దిగారు. సోమవారం రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ముస్తాబాద్ పర్యటనలో ఉన్న మంత్రి వారికి, మరికొంత మంది నాయకులకు కండువాలు కప్పి, ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో మాజీ ఉపసర్పంచులు మూల కృష్ణారెడ్డి, మూల రాజిరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కాశెట్టి దామోదర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చెల్లోజు రాజు, కూడలి అశోక్, మాజీ వార్డు సభ్యులు వై.రమణాచారి, పోలు రాజ్‌కుమార్, అల్లిబిల్లి నగేశ్, బత్తుల సత్యం తదితరులున్నారు.

బల్దియాలో కాంగ్రెస్‌కు ప్రాతినిధ్యం..

నగరపాలక సంస్థలో కాంగ్రెస్ అడుగు పెట్టింది. గత బల్దియా ఎన్నికల్లో ఆ పార్టీ ఒక్క కార్పొరేటర్‌ను కూడా గెలుచుకోలేకపోయింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రమైన కరీంనగర్‌లో కాంగ్రెస్ బలోపేతం కావాల్సిన ఉంది. అయితే, బీఆర్ఎస్‌కు చెందిన పలువురు కార్పొరేటర్లు గతంలోనే కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నా వివిధ కారణాలతో చేరికలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో కొందరు బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్, బీజేపీలవైపు అడుగులు వేస్తున్నట్లు సమాచారం.

నేనెవరో కేసీఆర్‌నడుగు..

- కేటీఆర్‌పై కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు ఫైర్


మాట్లాడుతున్న రాజేందర్‌రావు, పక్కన నరేందర్‌రెడ్డి

కరీంనగర్ కార్పొరేషన్: నేనెవరో మీ అయ్య కేసీఆర్ నడుగు.. వెంట తిప్పుకొని.. ఖర్చు పెట్టించి.. దొంగ బీఫాం ఇచ్చి మోసం చేసిందెవరినో కూడా చెబుతాడు.. అంటూ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మండిపడ్డారు. సోమవారం నగరంలోని మంచిర్యాల చౌరస్తా, భగత్‌నగర్ చౌరస్తా, కాశ్మీర్‌గడ్డ రైతుబజార్‌లలో రోడ్‌షో నిర్వహించారు. రాజేందర్‌రావు ఎవరో తెలియదన్న కేటీఆర్ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తన తండ్రి జగపతిరావు చివరి కోరిక మేరకు కరీంనగర్ ప్రజలకు సేవ చేసేందుకు వచ్చానని తెలిపారు. స్మార్ట్‌సిటీ నిధుల్లో బండి సంజయ్, వినోద్ 30 శాతం దోచుకున్నారని ఆరోపించారు. తాను ఎంపీగా గెలిచాక కశ్మీర్‌గడ్డ మార్కెట్‌లో షెడ్డు నిర్మిస్తానన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కమీషన్ డబ్బుతో వినోద్ ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారని పేర్కొన్నారు. 2014 ఎన్నికల్లో భార్య పుష్పలమ్మ నామినేషన్ వేశానని ప్రకటించిన సంజయ్ ప్రస్తుతం వందల కోట్ల రూపాయలు ఎలా ఖర్చు పెడుతున్నాడని ప్రశ్నించారు. సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, సమన్వయ కమిటీ కో–ఆర్డినేటర్ వైద్యుల అంజన్‌కుమార్, సభ్యులు ఆరెపల్లి మోహన్, ఆకారపు భాస్కర్‌రెడ్డి, నడిపెల్లి అశోక్‌రావు, మల్లికార్జున రాజేందర్, ఎండీ.ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కృషి చేయాలి

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావు విజయానికి కృషి చేయాలని ఆ పార్టీ సమన్వయ కమిటీ సభ్యుడు ఆకారపు భాస్కర్‌రెడ్డి కోరారు. సోమవారం డీసీసీ కార్యాలయంలో 1, 17, 18, 19, 20, 21, 59వ డివిజన్ల నాయకులతో సమావేశమయ్యారు.

ఎంపీ సమక్షంలో బీజేపీలో చేరికలు


కండువాలు కప్పుతున్న ఎంపీ సంజయ్

కరీంనగర్‌టౌన్: ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో సిరిసిల్ల నుంచి ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరఫున పోటీ చేసిన పత్తిపాక సురేశ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు సోమవారం బీజేపీలో చేరారు. ఎంపీ బండి సంజయ్ కరీంనగర్‌లోని తన కార్యాలయంలో వారికి కండువాలు కప్పారు. చేరారు. బీజేపీలో చేరినవారిలో సిరిసిల్ల నియోజకవర్గానికి చెందిన పిస్క వెంకటేశ్, బుధారం సదానంద్, బీమని నగేశ్, కొంపల్లి మురళి, గుడ్ల సురేశ్‌కుమార్, శ్రీధర్, దాసరి వెంకటేశ్, ఆడెపు లక్ష్మణ్, సత్యవికాస్, బలుసాని అనిల్, తుపాకుల రమేశ్ తదితరులున్నారు.

31వ డివిజన్ నాయకులు...

కరీంనగర్‌లోని లక్ష్మీనగర్ 31వ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ మాజీ నాయకుడు వి.కిశోర్ గౌడ్ ఆధ్వర్యంలో పలువురు సోమవారం ఎంపీ సంజయ్ సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. బీజేపీలో చేరినవారిలో వి.నర్సింహరాజు, బి.నవీన్, కె.నాగరాజు, జి.సాయికిరణ్, జి.మణిదీప్, జి.సాయికృష్ణ, జి.సాయికుమార్, జి.శివ, పి.అంజి, పి.శ్రీనివాస్, ఎండీ.హసన్ అన్సార్, టి.నిరంజన్, ఎ.అరుణ్, మీనార్‌ఖాన్, వి.రాకేశ్ తదితరులున్నారు. అలాగే, సర్పంచుల ఫోరం ఇల్లంతకుంట మండల అధ్యక్షుడు నారాయణ తదితరులు ఎంపీ కార్యాలయానికి బీజేపీలో చేరారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం

రేకుర్తి 18వ డివిజన్ 38, 40వ బూత్‌ల పరిధిలో సోమవారం బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి జాడి బాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేంద్ర పథకాలు, ఎంపీగా సంజయ్ చేసిన అభివృద్ధిపై కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు ప్రతాప్ రెడ్డి, లక్ష్మీరాజం, నరసింహారెడ్డి, నరేశ్, భాస్కరాచారి, రమేశ్, చంద్రకాంత్, భూమయ్య, పోచమ్మ, శైలజ తదితరులున్నారు.

క్లుప్తంగా

పవర్ కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: విద్యుత్ పనుల్లో భాగంగా 11 కేవీ సుభాష్‌నగర్ ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 12 గంటల నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని రూరల్ ఏడీఈ రాజు తెలిపారు. సుభాష్‌నగర్, కిసాన్‌నగర్, రైల్వేస్టేషన్ రోడ్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

'ఆర్యవైశ్య' కార్యవర్గ ప్రమాణస్వీకారం


ప్రమాణస్వీకారం చేయిస్తున్న రాజేందర్

విద్యానగర్: కరీంనగర్ హౌసింగ్ బోర్డు ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం సోమవారం కరీంనగర్‌లో నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు నగునూరి రాజేందర్ అభ్యుదయ సంఘం అధ్యక్షుడు కోశెట్టి మహేశ్, ప్రధాన కార్యదర్శులు అల్లెంకి రంజిత్ కుమార్, సోమ రవీందర్, ఇతర కార్యవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ చైర్మన్ చిట్టుమల్ల శ్రీనివాస్, ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శివనాథుని శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి పెద్ది వేణుగోపాల్, కోశాధికారి సుద్దాల వెంకటేశ్, కాంజర్ల శ్రీకాంత్, న్యాయ సలహాదారులు నిరుమల్ల శంకర్, రేగురి మారుతి, సూర శ్రీనివాస్, నలుమాచు విజయ్, సామా లక్ష్మణ్, పేడ శ్రీనివాస్, చింతకింది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


ఆంజనేయులు


ప్రభాకర్

సప్తగిరికాలనీ: జిల్లా ప్రైవేట్ సెక్యూరిటీగార్డు, వాచ్‌మెన్, స్వీపర్స్ సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలను సోమవారం కరీంనగర్‌లో నిర్వహించినట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా పున్నం రవి, అధ్యక్షుడిగా ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా ఉట్ల ప్రభాకర్, కోశాధికారిగా ఎండీ.హుస్సేన్, ఉపాధ్యక్షులుగా గున్నాల మల్లేశం, పుప్పలచ్చ భాస్కర్, సహాయ కార్యదర్శులుగా తాళ్ల కుమార్, నోముల జగన్ ఎన్నికైనట్లు పేర్కొన్నారు.

'సదస్సును అడ్డుకోవడం భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడి'

కరీంనగర్: కాకతీయ యూనివర్సిటీ వరంగల్ సెనెట్ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన లౌకిక విలువలు–సాహిత్యం అనే సదస్సును అడ్డుకోవడాన్ని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ ఖండించారు. ప్రముఖ కవులు డాక్టర్ పసునూరి రవీందర్, నరేశ్‌కుమార్ సూఫీ, మెర్సీ మార్గరెట్‌లపై ఫాసిస్టు మూకల దాడి భావ ప్రకటనా స్వేచ్ఛ మీద దాడిగా పేర్కొన్నారు. ఒకే భావజాలం కలిగిన వ్యక్తులు సమావేశాలు జరుపుకునే హక్కు ఉందని, దాన్ని అడ్డుకునే హక్కు ఎవరికీ లేదన్నారు.

నేడు ఇనాం భూముల కౌలుకు వేలం

కరీంనగర్‌రూరల్: నగునూరు శ్రీలక్ష్మీనారాయణ స్వామి దేవస్థానం ఇనాం భూములను కౌలుకు ఇచ్చేందుకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు దేవాదాయ, ధర్మాదాయ శాఖ నోటీస్‌లో పేర్కొంది. గతంలో ఉన్న కౌలు కాలపరిమితి ముగిసిన దృష్ట్యా కొత్తగా 14 జూన్ 2024 నుంచి 13 జూన్ 2026 వరకు సర్వే నంబర్ 182లోని 2.15 ఎకరాలు, 640లోని 37 గుంటలు, 655లోని 1.24 ఎకరాలు, 1109లోని 2.23 ఎకరాలను కౌలుకు ఇవ్వనున్నట్లు తెలిపింది. ఆసక్తి ఉన్న రైతులు రూ.20 వేలు ధరావత్తు చెల్లించి, వేలంలో పాల్గొనాలని సూచించింది.

సీపీఎం మద్దతు కోరిన 'వెలిచాల'

- ఎంపీ సంజయ్ అభివృద్ధి నిరోధకుడు
- సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి


మాట్లాడుతున్న వాసుదేవరెడ్డి, పక్కన రాజేందర్‌రావు, నాయకులు

కరీంనగర్: ఐదేళ్లుగా కరీంనగర్ ఎంపీగా ఉంటూ బండి సంజయ్ అభివృద్ధి నిరోధకుడిగా మారారని, కులం, మతం, దేవుళ్ల పేరిట పబ్బం గడిపారని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి విమర్శించారు. సోమవారం కరీంనగర్‌లోని కోతిరాంపూర్ ముకుందలాల్ మిశ్రా భవన్‌లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు ఆయనను కలిసి, మద్దతు కోరారు. ఈ సందర్భంగా వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ మతాల మధ్య చిచ్చు పెడుతూ రాజకీయపబ్బం గడుపుతోందని ఆరోపించారు. సీపీఎం ఇండియా కూటమిలో ఉందని, అందులో భాగంగానే కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. పార్లమెంటు స్థాయిలో ముఖ్య కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి, ఆయన గెలుపునకు కృషి చేస్తామన్నారు. తాను బలహీనమైన అభ్యర్థిని అని కేటీఆర్ అనడాన్ని రాజేందర్‌రావు ఖండించారు. తెలంగాణ ఉద్యమం జరుగుతున్నప్పుడు ఆయన అమెరికాలో ఉన్నాడని, ఉద్యమం ఊపందుకున్నాక వచ్చి, సెంటిమెంట్‌ను అడ్డుపెట్టుకొని రూ.వేల కోట్లు అక్రమంగా సంపాదించారని ఆరోపించారు. కేటీఆర్, కేసీఆర్‌లకు ఉద్యమ సమయంలో ఖర్చులకు డబ్బులిచ్చింది తానేనన్నారు. ఇదివరకు బీజేపీ, బీఆర్ఎస్‌లకు అవకాశం కల్పించారని, ఈసారి తనను గెలిపించాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గీట్ల ముకుంద రెడ్డి, గుడికందుల సత్యం, జి.బీమాసాహెబ్, జిల్లా కమిటీ సభ్యులు సుంకరి సంపత్, ఎడ్ల రమేశ్, నరేశ్, పీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మాకర్ రెడ్డి, నాయకులు నర్సింగరావు, రాజిరెడ్డి తదితరులున్నారు.

ఆరు గ్యారంటీల అమలులో విఫలం


ప్రచారం చేస్తున్న హరిశంకర్

కరీంనగర్: ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని, బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ అన్నారు. కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా 37, 55వ డివిజన్లలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అభివృద్ధికి నిధులు తేలేని అసమర్థ ఎంపీ బండి సంజయ్ అని విమర్శించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పేందుకు కరీంనగర్ ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. గడపగడపకు వెళ్లి, ఆ పార్టీల వైఫల్యాన్ని ఎండగడుతూ వినోద్‌కుమార్ చేసిన అభివృద్ధి పనులను వివరిస్తున్నామని పేర్కొన్నారు. మరోసారి అభివృద్ధికి పట్టం కట్టాలని, బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ, జాతీయ రహదారులు, రైల్వే లైన్లు తీసుకువచ్చిన ఘనత ఆయనదేనన్నారు. కార్యక్రమంలో 37వ డివిజన్ అధ్యక్షుడు అరె రవిగౌడ్, 55వ డివిజన్ అధ్యక్షుడు చేతి చంద్రశేఖర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం

కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా 24వ డివిజన్ శివాజీనగర్‌కు చెందిన బూత్ అధ్యక్షుడు, పార్టీ సీనియర్ నాయకుడు సయ్యద్ నయీమ్ ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు షేక్ నాహిద్, ఎండీ.మోబిన్, ఎండీ.బజాన్, సుమేర్, మహమ్మద్ అలీ, సయ్యద్ ఇమాముద్దీన్, ఎండీ.వాహెద్, ఎండీ.ఇస్మాయిల్, సయ్యద్ తగ్దీర్, ఎండీ.జీషాన్, శివ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీవి చిల్లర రాజకీయాలు


మాట్లాడుతున్న అనిల్, పక్కన నాయకులు

- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్

విద్యానగర్: ఎస్సీ వర్గీకరణపై అనేక హామీలిచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు బీజేపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ, మహిళా రిజర్వేషన్లు రద్దు చేస్తుందన్న విష ప్రచారంతో చిల్లర రాజకీయాలు చేస్తోందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ ఆరోపించారు. సోమవారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలకు సీట్లు కేటాయించకుండా వారి ఓట్లను దండుకోవడానికే నాటకాలు ఆడుతోందన్నారు. దొంగ వీడియోలు తయారు చేస్తూ మాదిగ జాతిని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో బీజేపీని, కరీంనగర్‌లో బండి సంజయ్‌ని గెలిపించడానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ వర్గాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. అతినీతి, గడీల పాలన సాగించి ఎస్సీ వర్గీకరణపై ఎలాంటి నిర్ణయం తీసుకోని కేసీఆర్ ఇప్పుడు నీతులు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. ఎస్సీ వర్గీకరణ సాధన మాదిగల ఏకైక ఎజెండా అని, దాని అమలు విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ అంకితభావంతో ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఇంజం వెంకటస్వామి, అవునూరి ప్రభాకర్, తునికి వసంత్, దండు అంజయ్య, తుంగ ఆంజనేయులు, ఎలగందుల భిక్షపతి, గుండా థామస్, తడగొండ శంకర్, కొత్తూరి రాజన్న తదితరులు పాల్గొన్నారు.

రైల్వే హమాలీలను ఉద్యోగులుగా గుర్తించాలి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కరీంనగర్‌రూరల్: రైల్వే హమాలీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కె.బుచ్చన్న యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్ రైల్వేస్టేషన్‌లోని హమాలీ సంఘం కార్యాలయంలో మే డే 138వ పోస్టర్లను ఆవిష్కరించారు. ఎన్నో పోరాటాలు చేసి, సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు కోడ్‌లుగా మార్చిందన్నారు. 24 గంటలపాటు రైల్వేస్టేషన్‌లో ఉంటూ ప్రజలకు సేవలందిస్తున్న హమాలీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, వారికి ఇళ్లు నిర్మించాలని, కార్మిక చట్టాల రద్దును విరమించుకోవాలన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మే డేను ఘనంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైల్వే హమాలీ సంఘం అధ్యక్షుడు కాశెట్టి లక్ష్మయ్య, కార్యదర్శి గాండ్ల రమేశ్, ఉపాధ్యక్షుడు దాసరి ప్రభాకర్, ప్రతినిధులు మహేందర్, రఘుపతి, రాజు, శంకరయ్య, రవీందర్, స్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మందకొడిగా ధాన్యం కొనుగోళ్లు

- కేంద్రాల్లో రైతుల పడిగాపులు
- పాత గన్నీ సంచులతో హమాలీల తిప్పలు
- కరీంనగర్ మండలంలో పరిస్థితి


చెర్లభూత్కూర్‌లో ధాన్యం కాంటా వేస్తున్న హమాలీలు


చిరిగిన గన్నీ సంచి

కరీంనగర్‌రూరల్: యాసంగి ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి.. రైతులు పచ్చి వరిని కోయడంతో ధాన్యంలో తేమశాతం ఎక్కువగా ఉందంటూ నిర్వాహకులు కాంటా పెట్టడం లేదు. ఎండల తీవ్రతకు హమాలీలు ప్రతీరోజు ఉదయం 10 గంటల వరకే ధాన్యం తూకం వేస్తుండటంతో కొనుగోళ్లలో జాప్యం జరుగుతోంది. కరీంనగర్ మండలంలోని 17 గ్రామాలతోపాటు కార్పొరేషన్‌లో విలీనమైన ఆరెపల్లి, తీగలగుట్టపల్లి, వల్లంపహాడ్‌లో కరీంనగర్, దుర్శేడ్ సహకార సంఘాలు, ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అయితే, ఆయా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు నెమ్మదిగా సాగుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అకాల వర్షాల భయంతో వరి పచ్చిగా ఉన్నప్పుడే కోసినవారు ధాన్యం ఆరబెట్టేందుకు పొద్దంతా కేంద్రాల్లోనే పడిగాపులు పడుతున్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా టార్పాలిన్లు ఇవ్వాలని, ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని వారు కోరుతున్నారు.

చిరిగిన గన్నీ సంచులకు కుట్లు..

కరీంనగర్ సింగిల్‌విండో ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాలకు సరఫరా చేసిన గన్నీ సంచులు చిరిగిపోవడంతో హమాలీలు ఇబ్బంది పడుతున్నారు. చెర్లభూత్కూర్ కేంద్రంలో పాత గన్నీ సంచులు చిరిగిపోతే అప్పటికప్పుడే సుత్లీతో కుట్లు వేయాల్సి వస్తోందని అంటున్నారు. ట్రాక్టర్లలో ధాన్యం బస్తాలను లోడ్ చేసిన తర్వాత పాత సంచులు చిరిగిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, కొత్తవి ఇవ్వాలంటున్నారు.

ట్రాన్స్‌జెండర్స్ ఓటు వేయాలి



కరీంనగర్: ట్రాన్స్ జెండర్స్ నివసిస్తున్న ప్రదేశాలను మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో మెప్మా సిబ్బంది సోమవారం సందర్శించారు. ఓటరు స్లిప్పులు పంపిణీ చేశారు. కమిషనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, ట్రాన్స్‌జెండర్స్ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేయాలని కోరారు. సీవో పి.సునీత, టీఎంసీ ఎం.అనిత, డీఎంసీ ఎం.శ్రీవాణి, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

నేటి ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల ధర్నా వాయిదా



సప్తగిరికాలనీ: నగునూర్ జెడ్పీ హైస్కూల్ పీడీ పోతన శ్రీనివాస్ పునర్ నియామకంపై తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు సోమవారం డీఈవో జనార్దన్‌రావుతో చర్చలు జరిపారు. శ్రీనివా స్‌ను పాఠశాలలోనే కొనసాగించేందుకు ఆయన హామీ ఇచ్చినట్లు తెలిపారు. దీంతో మంగళవారం డీఈవో కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల ధర్నాను వాయిదా వేశామన్నారు. నాయకులు కిషన్ నాయక్, మల్లిక్, తిరుపతి, రాజన్న తదితరులున్నారు.

వృద్ధాశ్రమానికి కూలర్



సప్తగిరికాలనీ: స్థానిక వృద్ధాశ్రమానికి కరీంనగర్‌లోని మేము సైతం యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం కూలర్ అందజేశారు. సంస్థ అధ్యక్షురాలు చకిలం స్వప్న–శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి


యువ న్యాయ్ గ్యారంటీ కార్డులను ప్రదర్శిస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

కరీంనగర్ కార్పొరేషన్: నిరుద్యోగులను నిండా ముంచిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మునిగంటి అనిల్ కోరారు. సోమవారం నగరంలోని శాతవాహన యూనివర్సిటీ ఆవరణలో మొహబ్బత్ కీ దుకాణ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని చెప్పిన ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చాక మాట మార్చారని ఆరోపించారు. ప్రైవేట్ కంపెనీలను ప్రోత్సహించి, వాటి ద్వారా ఉద్యోగాలు కల్పించాల్సిన కేంద్ర ప్రభుత్వం అదానీ, అంబానీలకు మేలు చేసి, ప్రైవేట్ రంగాన్ని దెబ్బతీసిందన్నారు. నిరుద్యోగులు ఈ ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెప్పాలని, కాంగ్రెస్‌కు మద్దతునివ్వాలని కోరారు. అనంతరం యువన్యాయ్ గ్యారంటీ ప్లకార్డులు ప్రదర్శించారు. యూనివర్సిటీ ఇన్‌చార్జి పృథ్వీ, అధ్యక్షుడు యూసుఫ్, అజయ్, హరీశ్, వంశీ, వరుణ్, విక్రమ్, మనోజ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

మే డే విజయవంతం చేయండి


మాట్లాడుతున్న రమేశ్

కరీంనగర్: మే డేను జిల్లాలోని ఆశవర్కర్లు విజయవంతం చేయాలని ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ కోరారు. సోమవారం కరీంనగర్ ముకుందలాల్ మిశ్రా భవన్‌లో నిర్వహించిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మే డే సందర్భంగా వచ్చే పాలకులు పారితోషికాలు కాకుండా నిర్దిష్ట పని గంటలు రూపొందించాలని, కేంద్ర ప్రభుత్వం ఆశవర్కర్లను స్కీమ్ వర్కర్ల నుంచి కార్మికులుగా గుర్తించాలని, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ సూచన మేరకు ఫ్రంట్ లైన్ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. 8 గంటల పని విధానం రద్దును విరమించుకోవాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు తదితర డిమాండ్లతో మండల కేంద్రాల్లో, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఎదుట జెండాలు ఆవిష్కరించాలని, ర్యాలీలు చేపట్టాలని పిలుపునిచ్చారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు రంగవేని శారద, ప్రధాన కార్యదర్శి శ్రీలత, ఉపాధ్యక్షురాళ్లు పద్మ, శంకరమ్మ, సహాయ కార్యదర్శి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దుర్శేడ్‌లో తాగునీటి తిప్పలు


డ్రమ్ముల్లో నీరు తెచ్చి, సంపులో నింపుతున్న స్థానికులు

కరీంనగర్ మండలంలోని దుర్శేడ్‌లో తాగునీటి సమస్యతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు రక్షిత బావులు జాతీయ రహదారి నిర్మాణంలో పోవడమే ఈ పరిస్థితికి కారణం. సోమవారం ఐదోవార్డుకు చెందిన గాజే మల్లేశం సమీపంలోని వ్యవసాయ బావి వద్దకు వెళ్లి, ట్రాక్టర్‌లో మూడు డ్రమ్ముల నీటిని తీసుకువచ్చాడు. వాటిని తన ఇంటి ఎదుట ఉన్న సంపులో నింపాడు. ఇతనొక్కడే కాదు.. స్థానికులు పలువురు నీటి కోసం చేతిపంపులు, వ్యవసాయ బావులను ఆశ్రయిస్తున్నారు. అధికారులు స్పందించి, సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– కరీంనగర్‌రూరల్

రాజ్యాంగమే ప్రజాస్వామ్యానికి రక్ష



మాట్లాడుతున్న వేణుగోపాల్

కరీంనగర్: భారత రాజ్యాంగమే ప్రజాస్వామ్యానికి రక్ష అని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. కరీంనగర్‌లో ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై, మాట్లాడారు. మన దేశం ప్రజాస్వామ్య, లౌకిక దేశంగా ఉంటది తప్ప మత రాజ్యంగా మారే అవకాశం లేదన్నారు. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ప్రపంచ దేశాల రాజ్యాంగాలన్నింటినీ వడపోసి, మనకు కొన్ని వందల ఏళ్లపాటు ఉపయోగపడేలా రాజ్యాంగాన్ని రూపొందించారని తెలిపారు. రాజ్యాంగాన్ని గౌరవించే ఇండియా కూటమికి ప్రజలు, ప్రజాస్వామిక వాదులు ఈ పార్లమెంట్ ఎన్నికల్లో మద్దతు పలకాలని కోరారు.

నేడు 3 నియోజకవర్గాల్లో సీఎం జనజాతర సభలు

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి మూడు చోట్ల పర్యటించనున్నారు. కరీంనగర్, వరంగల్, చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గాల్లో ఆయన జనజాతర సభల ద్వారా ప్రచారంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2 గంటలకు కరీంనగర్ పరిధిలోని హుజూరాబాద్‌లో జరిగే జనజాతర సభకు హాజరుకానున్న సీఎం రేవంత్.. అక్కడి నుంచి సాయంత్రం 4 గంటలకు వరంగల్ పార్లమెంటు పరిధిలోని భూపాలపల్లి జనజాతర సభలో పాల్గొంటారు. అక్కడి నుంచి రాత్రి 7 గంటలకు చేవెళ్ల పార్లమెంటు పరిధిలోని బాలాపూర్, బడంగ్‌పేట్ కార్నర్ మీటింగ్‌లో పాల్గొని రాత్రి 9కి ఆర్కేపురం, సరూర్‌నగర్ కార్నర్ మీటింగ్‌లలో ప్రసంగిస్తారు.

ఈ 11 రోజులు కీలకం

జూమ్ మీట్‌లో సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో కీలకమైన ఈ 11 రోజులు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ నాయకులను కోరారు. సోమవారం రాత్రి మంత్రులు, పార్లమెంటు ఇన్‌చార్జులు, అభ్యర్థులతో ఆయన జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఏఐసీసీ ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ, ఏఐసీసీ కార్యదర్శి విష్ణునాథ్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో సీఎం రేవంత్ మాట్లాడుతూ ప్రతీ మండల, బూత్ స్థాయిలో పక్కా ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లాలని సూచించారు. ఈ ఎన్నికల్లో కష్టపడిన వారికి మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు. ప్రతీ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన మెజారిటీ తగ్గకుండా చూసుకోవాల్సిన బాధ్యత మంత్రులు, పార్లమెంట్ ఇన్‌చార్జ్‌లపై ఉందన్నారు.

బీజేపీపై ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: పార్లమెంటు ఎన్నికల్లో ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా బీజేపీ నేతలు వ్యవహరిస్తున్నారని టీపీసీసీ ఎన్నికల నిర్వహణ కమిటీ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మాజీ ఎమ్మెల్సీ దిలీప్‌కుమార్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.వినోద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, మాజీ మంత్రి పుష్పలీల తదితరులు ఎన్నికల కమిషనర్ వికాస్‌రాజ్‌ను కలిసి ఫిర్యాదును అందజేశారు. రాష్ట్రంలో బీజేపీ నాయకులతో పాటు జాతీయ నాయకులు కూడా ప్రజల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు.

మైనింగ్ అనుమతులు రద్దు చేయాలి

ఎన్నికలను బహిష్కరిస్తామంటూ మైలారం గ్రామస్తుల నిరసన

బల్మూర్: నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలంలోని మైలారం గుట్టపై మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని గ్రామస్తులు సోమవారం ఫ్లెక్సీలతో నిరసన తెలిపారు. మైనింగ్ తవ్వకాలకు అధికారులు ఇచ్చిన అనుమతులపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ 'గుట్ట ముద్దు.. ఓట్లు వద్దు' అనే నినాదంతో తమ ఆవేదన వ్యక్తం చేశారు. గుట్టపై మైనింగ్ తవ్వకాలు జరిపితే గ్రామం ఉనికి లేకుండా పోతుందని, చుట్టుపక్కల ఉన్న నాలుగు గ్రామాల రైతులకు తీవ్ర నష్టం వాటిల్లి.. పర్యావరణానికి సైతం ముప్పు ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గుట్టపై మైనింగ్ తవ్వకాల అనుమతులు రద్దు చేస్తేనే తాము పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు వేస్తామని, లేకపోతే బహిష్కరిస్తామని హెచ్చరించారు. అధికారులు స్పందించే వరకు తమ నిరసన కొనసాగిస్తామని తేల్చిచెప్పారు.

తెలంగాణ ఇప్పించా.. వర్గీకరణ కూడా చేయిస్తా


- సర్వే సత్యనారాయణ




కంటోన్మెంట్ (హైదరాబాద్): కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీని ఒప్పించి తెలంగాణ ఇప్పించానని, అదే విధంగా ఎస్సీ వర్గీకరణ కూడా చేయిస్తానని కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ అన్నారు. కాంగ్రెస్ పెద్దల సూచనల మేరకు కంటోన్మెంట్ అసెంబ్లీ, మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానాల్లో తన నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు సోమవారం మహేంద్రాహిల్స్‌లోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీ నేతల తీరు వల్ల మాదిగలకు అన్యాయం జరిగే పరిస్థితులు ఏర్పడటాన్ని తాను తీవ్రంగా వ్యతిరేకించానన్నారు. ముఖ్యంగా ప్రస్తుత పార్లమెంట్, కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో ఒక్క చోట కూడా మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారికి పార్టీ టికెట్ కేటాయించలేదని, దీన్ని నిరసిస్తూనే తాను రెబల్‌గా నామినేషన్ వేయాల్సి వచ్చిందని చెప్పారు. అయితే పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ సహా పలువురు పెద్దలు తనతో ఫోన్‌లో మాట్లాడి నామినేషన్‌లు ఉపసంహరించుకోవాలని కోరినట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు పార్టీ అధిష్టానం సుముఖత వ్యక్తం చేసిందన్నారు.

సికింద్రాబాద్ లోక్‌సభ ఎన్నికలో ఓ సారూప్యత కనపడుతోంది. మూడు ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో ఒకరు సిట్టింగ్ ఎంపీ, కేంద్రమంత్రి కాగా, మిగతా ఇద్దరు సిట్టింగ్ ఎమ్మెల్యేలు కావడం గమనార్హం. ఒకరు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి పార్టీ మారి కాంగ్రెస్ తరఫున పార్లమెంట్‌కు పోటీపడుతున్నారు. మరొకరు ప్రస్తుతం సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఎమ్మెల్యేగా ఉంటూ అక్కడినుంచే ఎంపీగా పోటీ చేస్తున్నారు. బీజేపీ తరఫున సిట్టింగ్ ఎంపీ, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి బరిలో ఉండగా, కాంగ్రెస్ తరఫున ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, బీఆర్‌ఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే టి.పద్మారావు గౌడ్ బరిలో ఉన్నారు. దీంతో వీరిలో ఎవరికి ప్రజలు పట్టం కడతారన్నది ఆసక్తికరంగా మారింది.

– సాక్షి, హైదరాబాద్





ముగ్గురూ సిట్టింగులే!



సికింద్రాబాద్ బరిలో ఓ ఎంపీ, ఇద్దరు ఎమ్మెల్యేలు

భిన్న మతాలు, విభిన్న భాషల ప్రజలకు నిలయం

సైనిక స్థావరంగా ప్రత్యేకత చాటుకుంటున్న లష్కర్

చాలా ఏళ్లుగా జాతీయ పార్టీలదే గెలుపు

జంట నగరాలుగా ప్రసిద్ధి చెందిన హైదరాబాద్-సికింద్రాబాద్‌లలో ఒకటైన సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం భిన్న మతాలు, విభిన్న భాషలు, వివిధ సంస్కృతీ సంప్రదాయాలతో కాస్మోపాలిటన్ ప్రాంతంగా ఉంది. ఆర్మీ కంటోన్మెంట్, దక్షిణ మధ్య రైల్వే కేంద్రం, వివిధ ప్రాంతాలకు కనెక్టివిటీ కలిగిన రైల్వే జంక్షన్,

భిన్న మతాలు.. భిన్న భాషలు

ఇఫ్లూ (ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ), చారిత్రక ప్రాధాన్యత కలిగిన అనేక చర్చిలు, మసీదులు, ప్రసిద్ధి చెందిన మార్కెట్లు, పేరెన్నికగన్న క్లబ్‌లు, క్లాక్‌టవర్‌తో ఈ ప్రాంతానికి ఓ విశిష్టత ఉంది. వందల ఏళ్ల క్రితం నుంచి సైనిక స్థావరంగా ఉన్న ఇక్కడి ప్రాంతాన్ని లష్కర్ క్యాంప్‌గా పిలిచేవారు. అది విస్తరించి సికింద్రాబాద్‌నూ లష్కర్‌గా పిలవడం ప్రారంభమై వాడుకలోకి వచ్చిందని చెబుతారు. ఇక్కడ అధిక సంఖ్యలో ఉన్న బీసీలతోపాటు ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీలు, రైల్వే ఉద్యోగులు, ఉత్తర భారతీయులు అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేస్తారు. ఆంధ్రా సెటిలర్లు సైతం గణనీయంగా ఉన్నారు.

హేమాహేమీల అడ్డా

చాలాకాలం వరకు కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గంలో 90వ దశకం నుంచి బీజేపీ సత్తా చాటడం మొదలైంది. గరీబోళ్ల బిడ్డగా పేరుగాంచిన మాజీ ముఖ్యమంత్రి టి.అంజయ్య, మణెమ్మ దంపతులిద్దరినీ పార్లమెంట్‌కు పంపిన ఈ నియోజకవర్గం నుంచే అహ్మద్ మొహినుద్దీన్, పి.శివశంకర్, పీవీ రాజేశ్వరరావు (మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కుమారుడు), అంజన్‌కుమార్‌యాదవ్, బండారు దత్తాత్రేయ, జి.కిషన్‌రెడ్డి లాంటి వారు లోక్‌సభకు వెళ్లారు. అంజయ్య, శివశంకర్, దత్తాత్రేయ, కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రులుగా పనిచేశారు. ఉప ఎన్నికలతో సహా 18 పర్యాయాలు ఎన్నికలు జరగ్గా కాంగ్రెస్ 11 సార్లు, బీజేపీ ఐదు సార్లు, తెలంగాణ ప్రజా సమితి ఒకసారి గెలిచింది. ప్రాంతీయ పార్టీలుగా ఏర్పాటై ఉవ్వెత్తున ఎగసిపడిన టీడీపీ కానీ, బీఆర్‌ఎస్ కానీ ఇక్కడి నుంచి ఒక్కసారి కూడా గెలవలేదు. చాలా ఏళ్లుగా జాతీయ పార్టీలను మాత్రమే ఇక్కడి ఓటర్లు గెలిపిస్తున్నారు.




జి.కిషన్‌రెడ్డి (బీజేపీ)


నాగేందర్ (కాంగ్రెస్)


పద్మారావు (బీఆర్‌ఎస్)

అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఓటర్లు

సెగ్మెంట్	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్లు	మొత్తం
ముషీరాబాద్	1,56,947	1,49,422	12	3,06,381
అంబర్‌పేట	1,40,458	1,38,206	11	2,78,675
ఖైరతాబాద్	1,53,835	1,42,514	34	2,96,383
జూబ్లీహిల్స్	2,02,177	1,85,008	21	3,87,206
సనత్‌నగర్	1,30,848	1,21,673	9	2,52,530
నాంపల్లి	1,65,582	1,57,377	8	3,22,967
సికింద్రాబాద్	1,33,649	1,33,608	25	2,67,282
పార్లమెంట్	10,83,496	10,27,808	120	21,11,424

కొత్త చరిత్ర లిఖించాలని..

ఈ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు గాను ఒక్క నాంపల్లి సెగ్మెంట్‌లో తప్ప మిగతా ఆరింట బీఆర్‌ఎస్ అభ్యర్థులే గెలిచారు. వారిలో ఒకరైన దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరడంతో ప్రస్తుతం ఆ పార్టీకి ఐదు సెగ్మెంట్లలో ఎమ్మెల్యేలున్నారు. పద్మారావుకు సికింద్రాబాద్, సనత్‌నగర్ సెగ్మెంట్లలో మంచి పట్టుంది. వీటితో పాటు అంబర్‌పేట, ముషీరాబాద్, జూబ్లీహిల్స్ సెగ్మెంట్లలోని ఓటర్లు కూడా అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరి కారు పార్టీ వైపే మొగ్గు చూపితే పద్మారావు విజయం సాధించే అవకాశం ఉంటుందని అంటున్నారు. ప్రజల మధ్య ఉంటారనేది కూడా ఆయనకు కలిసివచ్చే అంశమని చెబుతున్నారు.



పట్టు నిలబెట్టుకునేందుకు..

సిట్టింగ్ సీటును తిరిగి నిలబెట్టుకునేందుకు కిషన్‌రెడ్డికి 'మోదీ మేనియా' శ్రీరామరక్షగా కనిపిస్తోంది. మరోవైపు ప్రచారంలోనూ ఆయన దూసుకుపోతున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రధాన ప్రచారాస్త్రాలుగా ఉన్నాయి. అయితే నగరంలో గత కొన్నేళ్లలో అనేక ఫ్లైఓవర్లు పూర్తి అయినప్పటికీ, గతంలో ఆయన ఎమ్మెల్యేగా కూడా ప్రాతినిధ్యం వహించిన .. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంబర్‌పేట ఫ్లై ఓవర్ పనులు ఏళ్ల గడుస్తున్నా పూర్తి కాకపోవడాన్ని బీఆర్‌ఎస్ ప్రముఖంగా ప్రస్తావిస్తోంది. తమ హయాంలో ఎన్నో ఫ్లై ఓవర్లు కడితే బీజేపీ చేపట్టిన ఒక్క ఫ్లై ఓవర్ కూడా పూర్తిచేయలేకపోయిందని బీఆర్‌ఎస్ నేతలు ఎద్దేవా చేస్తున్నారు. ఎంపీగా ఈ నియోజకవర్గానికి కిషన్‌రెడ్డి ప్రత్యేకంగా తెచ్చిందేమీ లేదని కూడా విపక్ష పార్టీల నేతలు విమర్శిస్తున్నారు.



ఊపులో గెలిచేందుకు..

రాష్ట్రంలో పదేళ్ల అధికారం దూరమై.. తెలంగాణ ఏర్పాటు తర్వాత తొలిసారి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అదే ఊపుతో సికింద్రాబాద్‌లో గెలవాలనే పట్టుదలతో ఉంది. దానం నాగేందర్‌కు ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ సెగ్మెంట్లలో బలం ఉంది. అయితే గెలిచిన కొద్దికాలానికే పార్టీ మారడం నష్టం కలిగించవచ్చనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. మరోవైపు ప్రచారంలో కూడా కొంత వెనుకబడి ఉన్నారని అంటున్నారు. అయితే అధికార పార్టీకి చెందిన అభ్యర్థి కావడం కలిసివచ్చే అంశమని చెబుతున్నారు.



ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఒక్క సీటూ రాదు

- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి... ఎండలకు కేసీఆర్ ఆగమవుతున్నారు
- ఓడిపోతామన్న భయంతో బీజేపీ నోటీసులు ఇచ్చింది



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎండల వేడికి కేసీఆర్ ఆగమవుతున్నారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఎద్దేవా చేశారు. కేంద్రంలో హంగ్ వస్తుందని ఆగం మాటలు మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ తీరును తప్పుపట్టారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఒక్కసీటు కూడా రాదని అన్నారు. సీఎంగా ఏడాదికి ఒక్కసారి కూడా బయటకు రాని కేసీఆర్ ప్రతిపక్షంలోకి రాగానే రోడ్డుషోల పేరుతో రోడ్డున పడ్డారని ఎద్దేవా చేశారు. కేంద్రంలో కాంగ్రెస్‌దే విజయమని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పాలన పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారని, కేసీఆర్‌కే ఏం చేయాలో పాలుపోక తోచింది మాట్లాడుతున్నారని విమర్శించారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని తెలిసే బీజేపీ వాళ్లు నోటీసులు పంపుతున్నారని, వారికి ఓటమి భయం పట్టుకుందని అన్నారు. రిజర్వేషన్లను తొలగించాలనే ఆలోచన బీజేపీకి ఉందనే విషయం వారి మాటల్లోనే తెలుస్తోందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాంగం రిజర్వేషన్లు ఇచ్చిందని, కానీ రాజ్యాంగం అవసరమా అనే చర్చ బీజేపీ నేతలే చేశారని అన్నారు. రిజర్వేషన్ల విషయంలో బీజేపీ వైఖరిపై తెలంగాణలో వ్యతిరేకత వచ్చిందన్నారు. కాంగ్రెస్‌కు ఎస్సీ, ఎస్టీ, బీసీలు అనుకూలం కాబట్టి బీజేపీకి భయం పట్టుకుందని, అందుకే ఎన్నికల స్టంట్‌లో భాగంగా నోటీసులు జారీ చేశారని అన్నారు. దీనిపై న్యాయపోరాటం చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి చరణ్ కౌశిక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు సంపూర్ణ మద్దతు

సేవాలాల్ సేన



పంజగుట్ట (హైదరాబాద్): గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంతో పోరాడి గిరిజనుల ఎన్నో డిమాండ్లు నెరవేర్చుకున్నామని, కానీ కాంగ్రెస్ పాలనలో గిరిజనులను అణగదొక్కేందుకు చూస్తున్నారని సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు అంగోతు రాంబాబు నాయక్ అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపుకోసం సేవాలాల్ సేన కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ ప్రభుత్వం గిరిజనులకు ఎంతో మేలు చేసిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీలో లంబాడీలకు మంత్రివర్గంలో స్థానం కల్పించకుండా అణగదొక్కుతున్నారని, ఇటీవల ప్రకటించిన కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో కూడా అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సేవాలాల్ సేన ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని గిరిజన తాండాలు, గూడేల్లో పర్యటించి బీఆర్‌ఎస్‌కు ఓటు వేసేలా చైతన్య పరుస్తామన్నారు.

బరిలో మిగిలింది 525 మంది

100 మంది అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ

- 17 స్థానాల్లో తుదకు పోటీలో మిగిలిన 525 మంది అభ్యర్థులు
- సికింద్రాబాద్ స్థానంలో అత్యధికంగా 45 మంది పోటీ
- మెదక్ స్థానంలో 44 మంది అభ్యర్థులు
- 16 లోక్‌సభ స్థానాల్లో ఒకటికి మించి బ్యాలెట్ యూనిట్ వాడకం.. 6 స్థానాల్లో మూడు బ్యాలెట్ యూనిట్లతో ఎన్నికలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సోమవారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన అనంతరం 17 లోక్‌సభ స్థానాల్లో మొత్తం 525 మంది అభ్యర్థులు బరిలో మిగిలారు. 893 మంది నామినేషన్లు దాఖలు చేయగా, వివిధ కారణాలతో 268 మంది అభ్యర్థుల నామినేషన్లను గత శుక్రవారం నిర్వహించిన పరిశీలనలో తిరస్కరించారు. 625 మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించారు. నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు సోమవారం మధ్యాహ్నం 3 గంటలతో ముగియగా, 100 మంది అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో పోటీలో తుదకు 525 మంది మిగిలారు.

6 చోట్లలో 3 బ్యాలెట్లతో ఎన్నికలు

అభ్యర్థుల సంఖ్య గణనీయంగా పెరిగిపోవడంతో రాష్ట్రంలోని 16 లోక్‌సభ నియోజకవర్గాల్లో ఒకటి కంటే ఎక్కువ సంఖ్యలో బ్యాలెట్ యూనిట్లను వినియోగించి పోలింగ్ నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే .. అత్యధికంగా సికింద్రాబాద్, మెదక్, చెవెళ్ల, పెద్దపల్లి, వరంగల్, భువనగిరి నియోజకవర్గాల్లో మూడు బ్యాలెట్ యూనిట్లతో పోలింగ్ నిర్వహించనున్నారు. మిగిలిన 11 నియోజకవర్గాల్లో ఆదిలాబాద్ మినహా ఇతర అన్ని చోట్లలో రెండు బ్యాలెట్ యూనిట్లను వినియోగించాల్సి ఉండనుంది. కేవలం 12 మంది మాత్రమే పోటీచేస్తున్న ఆదిలాబాద్ స్థానంలోనే ఒక బ్యాలెట్ యూనిట్‌ను వాడనున్నారు. అభ్యర్థుల సంఖ్య 15.. ఆలోపు ఉంటే ఒక బ్యాలెట్ యూనిట్ సరిపోనుంది. అభ్యర్థుల సంఖ్య 16–31 మధ్యలో ఉంటే రెండు బ్యాలెట్ యూనిట్లు, 32–47 మధ్య ఉంటే మూడు బ్యాలెట్ యూనిట్లను వాడాల్సి ఉండనుంది. ఒక బ్యాలెట్ యూనిట్‌లో గరిష్ఠంగా 16 మంది అభ్యర్థులకు చోటు ఉంటుంది. తొలి బ్యాలెట్ యూనిట్‌లో 15 మంది అభ్యర్థులతో పాటు నోటాకు చోటు కేటాయిస్తారు. బ్యాలెట్ యూనిట్ల సంఖ్య పెరిగితే ఓటర్లు గందరగోళానికి గురయ్యే అవకాశం ఉంటుంది.

రాష్ట్రంలో నామినేషన్లను ఉపసంహరించుకున్న అభ్యర్థుల సంఖ్య, ఎన్నికల బరిలో చివరకు మిగిలిన అభ్యర్థుల సంఖ్యను ఈ కింది పట్టికలో చూడవచ్చు..

క్రసం	లోక్‌సభ స్థానం	ఉపసంహరణ	పోటీలో మిగిలిన అభ్యర్థులు	క్రసం	లోక్‌సభ స్థానం	ఉపసంహరణ	పోటీలో మిగిలిన అభ్యర్థులు
1	ఆదిలాబాద్	1	12	10	చెవెళ్ల	3	43
2	పెద్దపల్లి	7	42	11	మహబూబ్‌నగర్	4	31
3	కరీంనగర్	5	28	12	నాగర్‌కర్నూల్	2	19
4	నిజామాబాద్	3	29	13	నల్లగొండ	9	22
5	జహీరాబాద్	7	19	14	భువనగిరి	12	39
6	మెదక్	9	44	15	వరంగల్	6	42
7	మల్కాజ్‌గిరి	15	22	16	మహబూబాబాద్	2	23
8	సికింద్రాబాద్	1	45	17	ఖమ్మం	6	35
9	హైదరాబాద్	8	30	మొత్తం		100	525



బూటకపు ఎన్నికలను బహిష్కరించండి

మావోయిస్టు సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్

మంచిర్యాల రూరల్ (హాజీపూర్): తెలంగాణలో పార్లమెంటు బూటకపు ఎన్నికలను బహిష్కరించాలని భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ సోమవారం పత్రికలకు విడుదల చేసిన లేఖలో పిలుపునిచ్చారు. రాష్ట్రంలో గెలుపు కోసం అధికార పార్టీతో సహా ప్రతిపక్ష పార్టీలు ప్రజలను మోసం చేసేందుకు ప్రణాళికలతో సిద్ధమై వస్తున్నాయని, అన్ని పార్టీలను తరిమికొట్టాలని సూచించారు. 2023 శాసనసభ ఎన్నికల మాదిరి ఈ పార్లమెంటు ఎన్నికల్లో అధికారం కోసం మద్యం, డబ్బుతోపాటు కుల, మత రాజకీయాలు చేసేందుకు వస్తున్నారని విమర్శించారు. దోపిడీ విధానాలను అమలు చేస్తూ నిరంకుశ అధికారాన్ని ప్రజాస్వామ్యం పేరుతో చలామణి చేసే రాజకీయ పార్టీలకు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. 2019 ఎన్నికల్లో దేశభక్తి, హిందూ మతోన్మాదాన్ని రెచ్చగొట్టి ఓట్లను దండుకున్న బీజేపీ.. ఇప్పుడు అయోధ్య రామమందిర, సీఏఏ పేరుతో మూడు నెలలుగా ఎన్నికల తతంగాన్ని నడిపిస్తోందన్నారు.

భారీ మెజారిటీతో ఖమ్మంలో గెలుస్తాం: భట్టి

ఖమ్మం వన్‌టౌన్: ఖమ్మం లోక్‌సభ స్థానాన్ని రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో గెలుచుకుంటామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క జోస్యం చెప్పారు. ఇందుకోసం అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని, ప్రచారానికి సమన్వయ కమిటీలను వేస్తామన్నారు. ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో కలసి విలేకరులతో మాట్లాడారు. దేశాన్ని ఐక్యంగా ఉంచడం కాంగ్రెస్ లక్ష్యమైతే దేశాన్ని విచ్ఛిన్నం చేసేలా వ్యవహరించడంతోపాటు కొందరు కార్పొరేట్లకు దేశ సంపద, సహజ వనరులను బీజేపీ దోచిపెడుతోందని ఆరోపించారు. తమ పార్టీ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించేలా ప్రణాళిక సిద్ధం చేశామని మంత్రులు పొంగులేటి, తుమ్మల తెలిపారు. మతతత్వ బీజేపీతోపాటు రాష్ట్రాన్ని పదేళ్లు దోచుకున్న బీఆర్‌ఎస్‌ను ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, జారె ఆదినారాయణ, మాలోత్ రాందాస్ నాయక్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో పొంగులేటి, తుమ్మల, రఘురాంరెడ్డి

నిధులివ్వమంటే.. గాడిద గుడ్డు ఇచ్చారు

గాడిద గుడ్డు వినూత్న ప్రచారంలో బల్మూరి వెంకట్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అభివృద్ధి కోసం రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఇవ్వమంటే బీజేపీ రాష్ట్రానికి గాడిద గుడ్డు ఇచ్చిందని భారత జాతీయ విద్యార్థి సంఘం (ఎన్‌ఎస్‌యూఐ) రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్రావు ఎద్దేవా చేశారు. కేంద్రమంత్రిగా కిషన్‌రెడ్డి ఉండి కూడా రాష్ట్రానికి గాడిద గుడ్డు మాత్రమే మిగిలిందని ధ్వజమెత్తారు. పదేళ్ల బీజేపీ పాలనలో తెలంగాణకు గాడిద గుడ్డు మాత్రమే ఇచ్చారనే వినూత్న ప్రచారాన్ని సోమవారం గాంధీభవన్‌లో వెంకట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేడారం జాతరకు జాతీయ హోదా ఇవ్వమంటే బీజేపీ గాడిద గుడ్డు ఇచ్చిందన్నారు. కనీసం ఒక ఐఐఎం, ఎన్ఐటీ ఇవ్వలేదని విమర్శించారు. రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా రావాల్సిన కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఇవ్వలేదని, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేదని, బడ్జెట్‌లో ఉత్తరాది రాష్ట్రాలతో సమాన వాటా ఇవ్వమంటే కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి గాడిద గుడ్డు ఇచ్చిందని వెంకట్ మండిపడ్డారు. కృష్ణా జలాల్లో గాడిదగుడ్డు, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ విషయంలోనూ గాడిదగుడ్డు ఇచ్చిందన్నారు. తెలంగాణ అభివృద్ధికి ఏ మాత్రం సహకరించని బీజేపీ ప్రభుత్వ నిర్వాకంపై కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఈటల రాజేందర్ సమాధానం చెప్పాలని వెంకట్ డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులకు తెలంగాణలో ఓటు అడిగే హక్కు లేదని, బీజేపీని మళ్లీ గెలిపిస్తే ఇంకా పెద్ద గాడిద గుడ్డు ఇస్తారు తప్ప అభివృద్ధి చేయరని చెప్పారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు బెల్లయ్య నాయక్, టీపీసీసీ అధికార ప్రతినిధి సామా రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటేస్తే మజూరీలో రాయితీ
ఛత్తీస్‌గఢ్‌లో బంపర్ ఆఫర్

రాయ్‌పూర్: ఓటేస్తే రెస్టారెంట్లు డిస్కౌంట్ ఇవ్వడాన్ని నోయిడాలో చూశాం. బెంగళూరులో అయితే ఏకంగా ఫ్రీ బీర్ ప్రకటించారు! ఈ జాబితాలో తాజాగా ఛత్తీస్‌గఢ్ చేరింది. అయితే ఇందులో కాస్త వెరైటీ ఉంది! ఓటేసి వేలికి నీలి రంగు సిరా చూపిస్తే బంగారం తయారీ ధరలను (మజూరీ) తగ్గిస్తామని రాష్ట్ర వాణిజ్య మండలి ప్రకటించింది. దాంతోపాటు పలు ఇతర ఉత్పత్తులపైనా రాయితీ ఇవ్వాలని నిర్ణయించింది. వివిధ సంస్థల నిర్వాహకులు కూడా ఇందుకు అంగీకరించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ అమర్ పర్వానీ నేతృత్వంలో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ గౌరవ్ కుమార్ సింగ్ సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఓటేసిన వారికి తమ ఉత్పత్తుల కొనుగోలుపై ఫర్నిచర్ అసోసియేషన్ 10 శాతం, టెక్స్‌టైల్ ట్రేడర్స్ అసోసియేషన్ 10 శాతం, రాయ్‌పూర్ ఆప్టికల్ అసోసియేషన్ 15 శాతం, ప్లైవుడ్ అసోసియేషన్ 5 శాతం, బులియన్ అసోసియేషన్ 15 శాతం రాయితీ ప్రకటించాయి. ఛత్తీస్‌గఢ్‌లో 11 లోక్‌సభ స్థానాలకు గాను ఏడింటికి మే 7న మూడో విడతలో పోలింగ్ జరగనుంది.



మేం మారమంతే!
బెంగళూరులో ఓటింగ్ అంతంతే

ఈసీ ఎన్ని ప్రయత్నాలు చేసినా, హోటళ్లు మొదలుకుని బార్ల దాకా ఎందరు ఎన్ని ఆకర్షణీయమైన ఆఫర్లిచ్చినా బెంగళూరు ఓటర్లు మాత్రం మారలేదు. నగరంలో ఎప్పుడూ పోలింగ్ తక్కువగా నమోదవుతుండటంతో ఈసారి ఓటర్లను పోలింగ్ బూతులకు రప్పించేందుకు ఎన్నో వ్యాపార సంస్థలు యథాశక్తి ప్రయత్నించాయి. ఓటేస్తే భారీ డిస్కౌంట్ ఆఫర్లు ప్రకటించాయి. ఒక హోటల్ ఉచిత దోసెలు, మరో సంస్థ ఉచిత బీర్, ఇంకొన్ని మిల్క్‌షేక్ తదితరాలపై 30 శాతం డిస్కౌంట్, వండర్‌లా వంటి రిసార్టులు ఎంట్రీ ఫీజుపై 15 శాతం తగ్గింపు వంటివి ఇచ్చాయి. కానీ ఇవేమీ బెంగళూరువాసులను కదిలించలేకపోయాయి. ఏప్రిల్ 26న కర్నాటకవ్యాప్తంగా 14 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగడం తెలిసిందే. మొత్తమ్మీద 69.23 శాతం మంది ఓటేస్తే బెంగళూరులో మాత్రం 54 శాతం మించలేదు. బెంగళూరు సెంట్రల్‌లో 52.81 శాతం, బెంగళూరు నార్త్‌లో 54.42 శాతం, బెంగళూరు సౌత్‌లో 52.15 శాతం పోలింగ్ నమోదైంది. బెంగళూరు రూరల్‌లో 67.29 శాతం ఓటు హక్కు నమోదవడం విశేషం!

– సాక్షి, నేషనల్ డెస్క్

స్టేట్ స్కాన్

కాంగ్రెస్, ఆప్... మిత్రభేదం

పంజాబ్‌లో ఒంటరి పోరు | గట్టి పోటీ ఇస్తున్న బీజేపీ

పోరాటాల పురిటి గడ్డగా పేరొందిన పంజాబ్‌లో ఎన్నికల పోరు ఎప్పుడూ హై ఓల్టేజ్‌లో ఉంటుంది. కాంగ్రెస్, శిరోమణి అకాలీదళ్ (ఎస్ఏడీ)లను గత అసెంబ్లీ ఎన్నికల్లో ఊడ్చిపారేసిన ఆమ్ ఆద్మీ పార్టీ లోక్‌సభ ఎన్నికల్లోనూ దుమ్ము రేపే ప్రయత్నంలో ఉంది. జాతీయ స్థాయిలో ఇండియా కూటమి భాగస్వాములైన ఆప్, కాంగ్రెస్ పంజాబ్‌లో మాత్రం విడిగా పోటీ చేస్తూ పరస్పరం తలపడుతుండటం విశేషం. గత లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు కొల్లగొట్టిన కాంగ్రెస్ ఈసారీ సత్తా చాటాలని చూస్తోంది. అకాలీ–బీజేపీలతో కూడిన ఎన్డీఏ కూటమికి ఆ ఎన్నికల్లో అంతంత ఫలితాలే వచ్చాయి. రైతు ఉద్యమం నేపథ్యంలో బీజేపీకి అకాలీ కటీఫ్‌తో పంజాబ్‌లో ఈసారి పార్టీలన్నీ ఒంటరి పోరాటమే చేస్తున్నాయి...

– సాక్షి, నేషనల్ డెస్క్

పంజాబ్ ఎన్నికల్లో కొన్నేళ్లుగా అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ మొత్తం 13 చోట్లా ఒంటరి పోరాటం చేసి ఏకంగా 8 స్థానాలు చేజిక్కించుకుంది. అకాలీదళ్ 10, బీజేపీ మూడు చోట్ల పోటీపడ్డా చెరో రెండు సీట్లతో సరిపెట్టుకున్నాయి. 2014 లోక్‌సభ ఎన్నికల్లో అనూహ్యంగా 4 సీట్లు కొల్లగొట్టిన కేజ్రీవాల్ పార్టీ అన్నిచోట్లా పోటీ చేసి ఒక్క స్థానానికే పరిమితమైంది. ఆ తర్వాత పంజాబ్‌లో రాజకీయాలు సమూలంగా మారిపోయాయి. 2020లో మోదీ సర్కారు వ్యవసాయ సంస్కరణ చట్టాలపై వ్యతిరేకంగా పంజాబ్‌లో వ్యతిరేకత తార స్థాయిలో వ్యక్తమైంది. ఆ దెబ్బకు 2022 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్, అకాలీదళ్ కుదేలయ్యాయి. సరికొత్త రాజకీయాల వాగ్దానంతో ఆప్ అధికారాన్ని తన్నుకుపోయింది.

బీజేపీకి మళ్లీ 'రైతు' గండం...

హస్తినతో పాటు దేశాన్నీ కుదిపేసిన సాగు చట్టాల వ్యతిరేక ఉద్యమ సారథులు పంజాబ్ రైతులే. వారి ఆగ్రహ ప్రభావం ఎక్కడ తమపై పడుతుందోననే ఆందోళనతో అకాలీదళ్ 2020లో బీజేపీతో తెగదెంపులు చేసుకున్నా లాభం లేకపోయింది. సుర్జీత్ సింగ్ బర్నాలా, ప్రకాశ్ సింగ్ బాదల్ వంటి దిగ్గజాల సారథ్యంలో వెలుగు వెలిగిన పార్టీ ఇప్పుడు పంజాబ్‌లో ఎదురీదుతోంది. తాజాగా మరోసారి రైతులు 'చలో ఢిల్లీ' అంటూ ఆందోళనల బాట పట్టడం పంజాబ్‌లో బీజేపీకి విషమ పరీక్షగా మారింది. ప్రచారంలోనూ కమలనాథులకు రైతుల నుంచి నిరసనల సెగ బాగానే తగులుతోంది. అభివృద్ధి నినాదం, మోదీ ఫ్యాక్టర్‌తోనే తదితరాలనే నమ్ముకుని బీజేపీ ఒంటరి పోరాటం చేస్తోంది.





పోలింగ్ తేదీ: జూన్ 1

సర్వేల సంగతేంటి..

పంజాబ్ రైతుల తాజా ఆందోళనలు బీజేపీపై ప్రభావం చూపవచ్చని సర్వేలు అంచనా వేస్తున్నాయి. 13 సీట్లలో ఆప్, కాంగ్రెస్‌లకే చెరో సగం దక్కవచ్చని లెక్కలేస్తున్నాయి. బీజేపీకి 2, అకాలీదళ్‌కు ఒక సీటు రావచ్చని కొన్ని సర్వేలు అంటున్నాయి.

కెప్టెన్ అమరీందర్ తన పంజాబ్ లోక్ కాంగ్రెస్‌ను 2022లో బీజేపీలో విలీనం చేశారు. కాంగ్రెస్ నుంచి సస్పెన్షన్‌కు గురైన ఆయన భార్య ప్రణీత్ కౌర్ కూడా బీజేపీ తీర్థం పుచ్చుకోవడం విశేషం. లూధియానా కాంగ్రెస్ ఎంపీ రవ్‌నీత్ సింగ్ బిట్టూ కూడా బీజేపీలో చేరి పార్టీ టికెట్‌పై అక్కడి నుంచే పోటీ చేస్తున్నారు.

చిన్న రాష్ట్రమే అయినా ఐకే గుజ్రాల్, మన్మోహన్ సింగ్ రూపంలో పంజాబ్ ఏకంగా ఇద్దరు ప్రధానులను అందించింది. వారి జన్మస్థలాలు దేశ విభజనతో ప్రస్తుత పాకిస్తాన్‌లోని పంజాబ్‌లోకి వెళ్లిపోయాయి. పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ జన్మస్థలమేమో మన పంజాబ్‌లో ఉండటం విశేషం.



కేజ్రీవాల్‌ను జైల్లో పెట్టినా ఆయన సిద్ధాంతాలను అరెస్టు చేయగలరా!? దేశవ్యాప్తంగా ఆయనకు మద్దతు పలుకుతున్న లక్షలాది కేజ్రీవాల్‌లను ఏ జైల్లో పెడతారు? కేజ్రీవాల్ వ్యక్తి కాదు, భావజాలం. మోదీ సర్కారు వేధింపులను ఇండియా కూటమి కలిసికట్టుగా ఎదుర్కొంటుంది. బీజేపీ భారతీయ జుమ్లా పార్టీగా మారింది.

– ఎన్నికల ర్యాలీలో పంజాబ్ సీఎం భగవంత్ మాన్

కలి'విడి'గా కాంగ్రెస్, ఆప్...

పంజాబ్‌లో నవ్‌జోత్‌సింగ్ సిద్ధూ, కెప్టెన్ అమరీందర్ సింగ్ వర్గ పోరు కాంగ్రెస్‌ను తీవ్రంగా దెబ్బతీసింది. సిద్ధూకు పీసీసీ చీఫ్ పదవి కట్టబెట్టిన అధిష్టానం పార్టీ వీర విధేయుడైన కెప్టెన్‌కు పొమ్మనకుండా పొగబెట్టింది. దాంతో ఆయన వేరుకుంపటి



పెట్టుకున్నారు. పర్యవసానంగా రెండేళ్లకే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తల బొప్పికట్టింది. 117 సీట్లకు ఏకంగా 92 చోట్ల గెలిచి ఆప్ ప్రభంజనం సృష్టించింది. ఢిల్లీ ఆవలా దుమ్ము రేపగలమని నిరూపించింది. ఆప్ నేత భగవంత్ మాన్ సీఎం అయ్యారు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియా కూటమితో జట్టుకట్టిన ఆప్ పంజాబ్‌లో మాత్రం పొత్తుకు ససేమిరా అంది. దాంతో కాంగ్రెస్, ఆప్ విడిగానే పోటీ చేస్తున్నాయి. గతంలో రైతుల పోరాటానికి దన్నుగా నిలిచిన ఆ పార్టీలకు ఎన్నికల ముందు మళ్లీ రైతులు ఆందోళనలకు దిగడం కలిసి రానుంది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత వంటి రైతుల డిమాండ్లను కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో చేర్చడం విశేషం. 6 న్యాయాలు, 25 గ్యారంటీలనూ విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తోంది. కార్పొరేట్లతో బీజేపీ కుమ్మక్కు, అధిక ధరలు, నిరుద్యోగం వంటి అంశాలనూ గట్టిగా ప్రచారం చేస్తోంది.

కేజ్రీవాల్ అరెస్టు ఆప్‌కు ప్లస్సా, మైనస్సా!

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో లోక్‌సభ ఎన్నికల ముందు కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేయడం సంచలనంగా మారింది. బీజేపీ కక్షగట్టి విపక్ష నేతలను జైల్లో పెడుతోందంటూ ఇండియా కూటమి దేశవ్యాప్తంగా మూకుమ్మడి ఆందోళనలకు దిగింది. తొలుత కాస్త తడబడ్డ ఆప్ నేతలు ప్రచారంలో జోరు పెంచారు. 'జైల్ కా జవాబ్ ఓట్ సే' (జైల్లో పెట్టినందుకు ఓటుతో జవాబిద్దాం) నినాదంతో దూసుకెళ్తున్నారు. కేజ్రీవాల్ భార్య సునీత ప్రచార బరిలో దిగడంతో ఆప్ కార్యకర్తల్లో ఉత్సాహం పెరిగింది. ఏమైనా ఎన్నికల ముంగిట అధినేత అందుబాటులో లేకపోవడం ఆప్‌కు ఇబ్బందికరమేనని కొందరంటుండగా, ఆప్‌కు సానుభూతి కలిసొస్తుందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

అవీ.. ఇవీ...

- అత్యంత వృద్ధ ప్రధానిగా మొరార్జీ దేశాయ్ రికార్డుకెక్కారు. ఆయన 81 ఏళ్ల 23 రోజుల వయసులో ప్రధాని అయ్యారు.
- యువ ప్రధాని రికార్డు రాజీవ్‌గాంధీది. 40 ఏళ్ల 72 రోజుల వయసులో ఆయన పదవి చేపట్టారు.
- ప్రధానిగా సుదీర్ఘకాలం కొనసాగింది జవహర్‌లాల్ నెహ్రూ. 6,130 రోజుల పాటు పీఎంగా ఉన్నారు.
- అతి స్వల్ప కాలం ప్రధానిగా ఉన్నది గుల్జారీలాల్ నందా. 1964లో నెహ్రూ మరణానంతరం 13 రోజులు తాత్కాలిక ప్రధానిగా పని చేశారు. అనంతరం 1966లో లాల్‌బహదూర్ శాస్త్రి మృతి అనంతరం కూడా మరో 13 రోజుల పాటు తాత్కాలికంగా ప్రధాని బాధ్యతలు నిర్వర్తించారు.
- లోక్‌సభకు అత్యధికసార్లు నెగ్గింది సీపీఐ నేత ఇంద్రజిత్ గుప్తా. ఆయన 11 సార్లు ఎన్నికై మొత్తం 37 ఏళ్ల పాటు లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు.
- కేంద్ర మంత్రిగా అత్యధిక కాలం పని చేసిన రికార్డు స్వరణ్‌సింగ్‌ది. ఆయన ఏకంగా 23 ఏళ్ల పాటు ఏకబిగిన మంత్రిగా కొనసాగారు. 1952లో నెహ్రూ తొలి ప్రభుత్వంలో మంత్రి మొదలైన స్వరణ్‌సింగ్ ఇన్నింగ్స్ 1975లో ఇందిర హయాం దాకా కొనసాగింది!
- స్వతంత్ర భారత చరిత్రలో తొలి ఓటరుగా హిమాచల్ ప్రదేశ్‌లోని కల్పాకు చెందిన శ్యామ్ శరణ్ నేగి రికార్డులకెక్కారు. 1951–52 తొలి లోక్‌సభ ఎన్నికల్లో ఓటేసిన తొలి వ్యక్తి ఆయనే.





పెద్ద నోట్ల రద్దు. దేశవ్యాప్తంగా బ్యాంకులు, ఏటీఎంల ముందు జనం బారులు. వస్తు సేవల పన్ను (జీఎస్టీ)తో యావద్దేశం ఒకే మార్కెట్‌గా మారిన వైనం. సామాన్యులు, వ్యాపారస్తులు, చిన్న పరిశ్రమలను తీవ్ర ఇబ్బందుల పాలు చేసిన రెండు నిర్ణయాలు. అయినా వాటి ఉద్దేశాన్ని ప్రజలకు వివరించడంలో మోదీ సఫలమయ్యారు. ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపడమే గాక దేశ ఆర్థిక పురోగతి కోసం దూర దృష్టితో కఠిన నిర్ణయాలు తీసుకున్నారు. డిజిటైజేషన్‌కు ఊతమిచ్చారు. దాంతో 2019 లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు మోదీ ప్రభుత్వాన్ని మరింత మెజారిటీతో ఆశీర్వదించారు. కాంగ్రెస్ వరుసగా రెండోసారి ప్రధాన ప్రతిపక్ష హోదా కూడా సాధించలేకపోయింది...

– సాక్షి, నేషనల్ డెస్క్

మోదీ 2.0

2019లో బీజేపీకి మరింత మెజారిటీ
మరోసారి కాంగ్రెస్ పేలవ ప్రదర్శన

బీజేపీతో నేరుగా తలపడుతున్న రాష్ట్రాలు మినహా మిగతా చోట్ల ప్రాంతీయ పార్టీలతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకుంది. కశ్మీర్, బిహార్, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, జార్ఖండ్, కేరళల్లో వాటితో సీట్ల సర్దుబాటు చేసుకుంది. యూపీలో ఎవరూ ఊహించని విధంగా బీఎస్పీ, ఎస్పీ కలసి పోటీ చేశాయి! విపక్షాలు ఎన్ని ప్రయత్నాలు చేసినా, మళ్లీ ఎన్డీఏదే అధికారమన్న మెజారిటీ ఒపీనియన్ పోల్స్ అంచనాలే నిజమయ్యాయి. బీజేపీ బలం 282 నుంచి 303కు పెరిగింది! ఓట్ల శాతం కూడా 31 నుంచి 37.3 శాతానికి పెరిగింది. ఎన్డీఏకు 353 మంది ఎంపీలు సమకూరారు. కాంగ్రెస్ 44 సీట్ల నుంచి కనాకష్టంగా 52 దాకా ఎగబాకింది.

పెద్ద నోట్ల రద్దు

2016 నవంబర్ 8 రాత్రిని దేశ ప్రజలు ఎన్నిటికీ మర్చిపోలేరు! ప్రధాని మోదీ టీవీ ముందుకొచ్చి రూ.500, రూ.1,000 నోట్లను రద్దు చేస్తున్నట్టు సంచలనాత్మక ప్రకటన చేశారు. నల్లధనం, నకిలీ నోట్ల ఏరివేత, ఉగ్రవాదులకు నిధుల సరఫరాను అరికట్టే లక్ష్యంతో తీసుకున్న ఈ నిర్ణయానికి మద్దతివ్వాలని కోరారు. వాటి స్థానే కొత్త రూ.500తో పాటు రూ.2,000 నోట్లు తేనున్నట్టు చెప్పారు. నిర్ణీత గడువులోపు పాత నోట్లను మార్చుకునేందుకు బ్యాంకులు, ఏటీఎంల ముందు బారులు తీరి పడ్డ ఇక్కట్లు అన్నీ ఇన్నీ కావు! ఇంతా చేసి... రూ.15.41 లక్షల కోట్ల విలువైన రూ.500, రూ.1,000 నోట్లను రద్దు చేయగా దాదాపుగా ఆ మొత్తమంతా (రూ.15.3 లక్షల కోట్లు) తిరిగి బ్యాంకుల్లోకి రావడం గమనార్హం.

గతం

జీఎస్టీ

2017 దాకా ఒకే ఉత్పత్తి, ఒకే సేవపై దేశవ్యాప్తంగా రకరకాల ధరలుండేవి. రాష్ట్రానికో రీతిలో వ్యాట్, ఎక్సైజ్ సుంకాలు దీనికి కారణం. రాష్ట్రాల స్థాయిలో పన్నుల ఎగవేతా ఎక్కువగా ఉండేది. వీటికి పరిష్కారంగా దేశవ్యాప్తంగా ఒకే మార్కెట్, ఒకే పన్ను సంకల్పంతో మోదీ సర్కారు 2017 జూలై 1 నుంచి జీఎస్టీని అమల్లోకి తెచ్చింది. తొలుత పెద్దగా ప్రభావం కనిపించకున్నా కొన్నేళ్లుగా పన్నుల ఆదాయం భారీగా పెరుగుతోంది.

విశేషాలు...

- ఎన్నికలకు కేవలం రెండు నెలల ముందు 2019 ఫిబ్రవరి 14న జమ్మూ కశ్మీర్లోని పుల్వామాలో జరిగిన జైషే ఉగ్ర సంస్థ దాడిలో ఏకంగా 40 మంది జవాన్లు ప్రాణాలు విడిచారు. దీనికి మోదీ సర్కారు సర్జికల్ స్ట్రయిక్స్‌తో బదులిచ్చింది. పాక్‌లోని బాలాకోట్‌లోని ఉగ్ర స్థావరాలను మన వాయుసేన విమానాలు బాంబులతో నేలమట్టం చేశాయి. ఈ ఉదంతం బీజేపీకి బాగా కలిసొచ్చింది.
- ప్రజాస్వామ్య వ్యవస్థలను ఎన్డీఏ సర్కారు ధ్వంసం చేస్తోందన్న విమర్శలు కాంగ్రెస్, ఇతర విపక్షాలకు పెద్దగా లాభించలేదు. ప్రతి పేద మహిళకు ఏడాదికి రూ.72,000, ఇల్లులేని వారందరికీ ఇంటి స్థలం, ఉచిత వైద్య పరీక్షలు, ఔషధాలు, ఉచిత వైద్యం వంటి కాంగ్రెస్ హామీలను జనం పట్టించుకోలేదు.
- సీబీఐ, కాగ్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలన్నీ కాంగ్రెస్ హయాంలోనే నిర్వీర్యమయ్యాయని, విపక్షాలవి కుటుంబ రాజకీయాలని, కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యమే లేదని మోదీ చేసిన విమర్శలు ప్రజలను ఆకట్టుకున్నాయి.

17వ లోక్‌సభలో పార్టీల బలాబలాలు
(మొత్తం సీట్లు 543)

పార్టీ	స్థానాలు
బీజేపీ	303
కాంగ్రెస్	52
డీఎంకే	24
వైఎస్సార్‌సీపీ	22
టీఎంసీ	22
శివసేన	18
జేడీ(యూ)	16
బిజూ జనతాదళ్	12
బీఎస్పీ	10
టీఆర్ఎస్	9
స్వతంత్రులు	51
ఇతరులు	4

పరిచయం

కరిగిన కల నుంచి లేచిన అల

మేనకా గాంధీ. సైనిక కుటుంబంలో పుట్టిన ఆమె జీవితమంతా పోరాటాలమయమే. ప్రధాని ఇందిర ఇంటి కోడలయ్యారు. కానీ కళ్లముందు కన్పించిన బంగారు భవిష్యత్తు చూస్తుండగానే కరిగిపోయింది. భర్త హఠాన్మరణంతో అంతా తలకిందులైంది. అయితే.. అత్తపై తిరగబడాల్సి వచ్చినా, రెండేళ్ల పసిబాబుతో అత్తింటికి శాశ్వతంగా దూరమైనా డీలా పడలేదు. ఒంటరిగానే రాజకీయాల్లో రాణించారు. బీజేపీలో చేరిన గాంధీ కుటుంబీకురాలిగా సంచలనం సృష్టించారు...

– సాక్షి, నేషనల్ డెస్క్

భర్త మరణంతో...

సంజయ్‌తో మేనక వైవాహిక బంధానికి ఆరేళ్లకే నూరేళ్లు నిండాయి. 1980లో భర్త విమాన ప్రమాదంలో మరణించే నాటికి మేనకకు కేవలం 23 ఏళ్లు. కొడుకు వరుణ్ 100 రోజుల పసికందు! భర్త ప్రాతినిధ్యం వహించిన అమేథీ లోక్‌సభ స్థానం ఉప ఎన్నికలో పోటీ చేయాలనుకున్నారు. అందుకామె వయసు చాలలేదు. రాజ్యాంగ సవరణ చేసి ఎన్నికల్లో పోటీకి కనీస వయసును తగ్గించాల్సిందిగా ప్రధాని అయిన తన అత్తగారు ఇందిరను కోరారు. ఆమె ఒప్పుకోలేదు. బావ రాజీవ్ అమేథీ నుంచి భారీ మెజారిటీతో గెలిచారు. మరుసటేడు 1982లో సంజయ్ అనుచరులు లక్నోలో ఏర్పాటు చేసిన భేటీలో మేనక పాల్గొని ప్రసంగించారు. దీన్ని తనపై తిరుగుబాటుగా ఇందిర భావించారు. లండన్ పర్యటన నుంచి తిరిగొస్తూనే కోడలిపై కన్నెర్రజేశారు. ఇంటినుంచి వెళ్లిపొమ్మన్నారు. మనవడు వరుణ్‌ను తనతోనే ఉంచుకునేందుకు విఫలయత్నం చేశారు. 1982 మార్చిలో రెండేళ్ల కొడుకును వెంటబెట్టుకుని అత్తింటిని శాశ్వతంగా వదిలి వెళ్లారు మేనక.



సొంత పార్టీ.. బీజేపీ తీర్థం...

1983లో అక్బర్ అహ్మద్‌తో కలిసి రాష్ట్రీయ సంజయ్ మంచ్‌ను స్థాపించారు మేనక. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్నికల్లో ఐదు అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసి నాలుగింటిని గెలుచుకున్నారు! 1984 సార్వత్రిక ఎన్నికల్లో అమేథీలో రాజీవ్‌పై పోటీ చేసి ఓడిపోయారు. తర్వాత పార్టీని జనతాదళ్‌లో విలీనం చేశారు. ఆ పార్టీ జనరల్ సెక్రటరీగా పనిచేశారు. 1989లో జనతాదళ్ టికెట్‌పై పిలిభిత్ నుంచి లోక్‌సభకు ఎన్నికవడమే గాక కేంద్ర మంత్రి కూడా అయ్యారు. 1996లో అక్కణ్నుంచే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. 1998లో రెండోసారి గెలిచారు. 1999లో బీజేపీలో చేరారు. వాజ్‌పేయి ప్రభుత్వంలో మంత్రిగా చేశారు. 2014లో మోదీ ప్రభుత్వంలో మహిళా, శిశు సంక్షేమ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో సుల్తాన్‌పూర్ నుంచి గెలుపొందారు. ఈసారీ అక్కణ్నుంచే బరిలో ఉన్నారు. పిలిభిత్‌కు మేనక ఆరుసార్లు ప్రాతినిధ్యం వహించారు. తర్వాత అక్కణ్నుంచి వరుణ్ రెండుసార్లు గెలిచారు.

ప్రేమ, పెళ్లి, ఎడబాటు..


మేనక 1956 ఆగస్టు 26న జన్మించారు. తల్లిదండ్రులు లెఫ్టినెంట్ కల్నల్ తర్లోచన్ సింగ్ ఆనంద్, అమర్‌దీప్. లారెన్స్ స్కూల్, లేడీ శ్రీ రామ్ కాలేజీలో చదివారు. జవహర్‌లాల్ నెహ్రూ వర్సిటీలో జర్మన్ అభ్యసించారు. కాలేజీ రోజుల్లో అందాల పోటీల్లో గెలుపొందారు. బాంబే డైయింగ్ మోడల్‌గా కూడా చేశారు. 1973లో సంజయ్ గాంధీని ఓ పార్టీలో కలిశారు. రెండేళ్ల ప్రేమ తర్వాత పెళ్లి చేసుకోవాలనుకున్నారు. ప్రధాని కొడుకుతో సంబంధం అనగానే మేనక కుటుంబం సంకోచించినా ఇందిర మాత్రం ఈ బంధాన్ని సాదరంగా స్వాగతించారు. అలా 1974లో సంజయ్‌తో పెళ్లయింది. 1980లో వరుణ్ పుట్టాడు. తొలుత ఫిరోజ్ అని తాత పేరు పెట్టగా దానికి వరుణ్ అని ఇందిర చేర్చారు.

జంతు ప్రేమికురాలిగా..

మేనక చేయి తిరిగిన రచయిత్రి, కాలమిస్ట్. జంతు హక్కుల కార్యకర్త. 1992లో పీపుల్ ఫర్ యానిమల్స్ (పీఎఫ్ఏ)ని స్థాపించారు. ఇది దేశంలో అతిపెద్ద జంతు సంక్షేమ సంస్థల్లో ఒకటి. కేంద్రంలో జంతు సంక్షేమ శాఖను సృష్టించి, దానికి మంత్రిగా కూడా పనిచేశారు. బహిరంగ ప్రదర్శనలకు జంతువుల వాడకాన్ని నిషేధిస్తూ చట్టం తెచ్చారు. కాస్మటిక్స్, ఆహార ఉత్పత్తులపై శాకాహారం, మాంసాహారం అని లేబుల్ చేయడాన్ని తప్పనిసరి చేశారు. జంతువులు, పర్యావరణం పట్ల ఆమె నిబద్ధతకు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. పలు ప్రతిష్టాత్మక అవార్డులు వరించాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

నమ్మకం లేద్దొరా!



వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో నవరత్నాలు 2.0పై సామాన్యులతోపాటు మేధావులు, ఉద్యోగ వర్గాల నుంచి మంచి స్పందన వస్తోంది. సీఎం జగన్ చెప్పాడంటే.. చేస్తాడంతే.. అన్న నమ్మకాన్ని మరింతగా పెంచింది. ఇక మిగిలింది 'పొత్తుల'మేనిఫెస్టో. అయితే రచ్చబండ దగ్గరైనా.. సామాజిక మాధ్యమాల్లోనైనా దీని కోసం కనీస స్పందన లేని దుస్థితి. ఇదే ఆ పార్టీల పెద్దల్ని కలవర పెడుతోందట. టీడీపీ సూపర్ 6 హామీలను ఎవరూ దేఖట్లేదు. దీంతో సూపర్ 7.. సూపర్ టెన్ అంటూ హామీలను పెంచుకుంటూ పోతున్నా.. ప్రజలెవరూ నమ్మట్లేదు. ఇప్పుడు ఉమ్మడిగా హామీలు గుప్పించేందుకు సిద్ధమయ్యారు. ప్రధాని మోదీ చేతుల మీదుగా మేనిఫెస్టో విడుదల చేద్దామన్న ప్రయత్నాలకు పీఎంవో గండి కొట్టిందట. దీంతో మాకు నమ్మకం లేద్దొరా..! అంటూ సోషల్‌మీడియా చెడుగుడు ఆడుకుంటోంది.

ఏడ దొరికార్రా..



గాడిద సంగీతానికి ఒంటె ఆశ్చర్యపడితే, ఒంటె అందానికి గాడిద మూర్ఛ పోయిందన్న చందంగా ఉంది.. జనసేన వ్యవహారం. అధినేత పవన్ చదివింది టెన్త్.. చెప్పేది ఇంటర్.. డిప్లమా, ఎమ్మెస్సీ.. ఎట్సెట్రా. అధినేతే అలా ఉంటే.. అభ్యర్థి మరెలా ఉంటారు? అందుకే కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ కూడా తనను తాను ఇంజినీరింగ్ పూర్తి చేసినట్లు తెగ చెప్పేసుకున్నారు. అతి రహస్యం బట్టబయలన్నట్లు.. అఫిడవిట్‌లో ఈయనది ఇంటర్ బ్యాచేనని తేలింది. మరోవైపు దుబాయ్‌లో ఆర్థిక మోసాలు చేసి, ఇండియాకు పారిపోయి వచ్చినట్లు బయటపడింది. దీనిపై జనసేన బాధితురాలు ఆకుల జయకల్యాణి విమర్శలు పవన్ అభిమానుల చెవులకు చిల్లులు పెడుతున్నాయట. ఏడ దొరికిన సంతరా.. అంటూ వాపోతున్నారు.

• బయటే డాబు.. లోపల బాబ్బాబు!

రెండు నాల్కల చంద్రం



బీజేపీ పెద్దలతో సమావేశాల్లో ఏం చెప్పినా 'ఎస్ బాస్'

అన్నిటికీ తల ఊపి.. చచ్చీచెడీ పొత్తు

- బయట మాత్రం డాంబికాలు.. పొత్తుకు వాళ్లే పిలిచారని వ్యాఖ్య
- అన్ని రాష్ట్రాలూ ల్యాండ్ టైట్లింగ్ చట్టం తేవాలన్నది కేంద్రమే
- ఆ చట్టం ఇంకా అమల్లోకి రాకముందే బాబు బ్యాచ్ దుష్ప్రచారం
- ఆ చట్టం ద్వారా ప్రభుత్వం భూములు లాక్కుంటోందంటూ విషం
- మరి ఆ చట్టాన్ని తెమ్మన్న బీజేపీతో జట్టు కట్టడమెందుకు బాబూ?
- స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణకే కట్టుబడి ఉన్నామంటున్న బీజేపీ
- ఆ పార్టీతో కూటమి గట్టి.. అలా జరగనివ్వబోమంటూ బాబు బడాయి
- ప్రత్యేక హోదాపైనా ఇంతే.. అది ముగిసిన అధ్యాయమన్న బీజేపీ
- ప్యాకేజీ తీసుకుని మరీ.. ఎన్నికల ముందు నారా నోట హోదా మాట
- దాన్ని మేనిఫెస్టోలో చేర్పించగలరా? అని ప్రశ్నిస్తే మాత్రం మౌనం
- ముస్లిం రిజర్వేషన్లను తొలగిస్తామని స్పష్టంగా చెబుతున్న కమలం
- ఆ ప్రస్తావన వచ్చినపుడు బాబు మాత్రం మౌనం
- తమతో అన్నింటికీ బాబు అంగీకరించారని బీజేపీ స్పష్టీకరణ
- అంటే.. బాబు లోపల అంగీకరించి,
  బయట బడాయికి పోతున్నాడనేది తేటతెల్లం
- ఈ వైఖరులతో మరోసారి బయటపడ్డ బాబు బ్రాండ్.. మోసం

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి

చంద్రబాబుతో తమకు అన్ని అంశాల్లోనూ సెటిల్‌మెంట్ కుదిరిందని, అన్నీ పరిష్కారమయ్యాయని పీయూష్ గోయల్ స్పష్టంగా చెప్పారు. తమ అజెండాతో చంద్రబాబు ఏకీభవించినట్లు ఆయన స్పష్టంగా చెప్పారు. మరి ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని ప్రతిపాదించిన బీజేపీతో ఏకీభవించి.. ఆ చట్టాన్ని ఇక్కడ వ్యతిరేకిస్తున్నారంటే ఏంటర్థం? ఆ పార్టీతో కలిసి పోటీ చేస్తూ ఆ చట్టాన్ని రద్దు చేస్తాననటం ఎవరిని మోసం చేయడానికి? ఇది దుర్మార్గం కాదా? ప్రత్యేక హోదా ముగిసిందని చెబుతున్న బీజేపీతో జట్టు కట్టి.. లేదు లేదు ప్రత్యేక హోదా సాధిస్తామని చెబుతున్న చంద్రబాబు మోసగాడు కాదా? స్టీల్ ప్లాంటును ప్రయివేటీకరించే విషయంలో తమ వైఖరి మారలేదని స్పష్టంగా చెబుతున్న బీజేపీతో కూటమి గట్టి పోటీ చేస్తూ.. ప్రయివేటీకరణను అడ్డుకుంటామని చెబుతున్న బాబు మాటలు అసలు ఒక్క శాతమైనా నమ్మేట్టున్నాయా? ముస్లిం రిజర్వేషన్లు తీసేస్తామని, ఉమ్మడి పౌరస్మృతి తెస్తామని స్పష్టంగా చెబుతున్న బీజేపీతో కలిసి పోటీ చేస్తూ.. వాటిపై దాటవేత వైఖరి అనుసరిస్తుండటం బాబు దివాలాకోరు తనానికి పరాకాష్ట కాదా? అయినా చంద్రబాబును మోస్తున్న అను 'కుల' మీడియాకు గానీ, పచ్చ ముఠాకు గానీ సిగ్గుందని అనుకోగలమా? బీజేపీతో పొత్తు కోసం ఢిల్లీ చుట్టూ తిరిగి.. పార్టీ పెద్దల అపాయింట్‌మెంట్లు దొరక్కపోయినా పడిగాపులు కాసి... చచ్చీ చెడీ, శరణు శరణు అంటూ వేడుకుని మరీ పొత్తు పెట్టుకున్న వ్యవహారం యావత్తు ప్రజానీకం చూసిందే. కానీ పొత్తు కుదుర్చుకుని ఢిల్లీ నుంచి వచ్చాక చంద్రబాబు ఏమన్నాడో తెలుసా? ''వాళ్లు అడిగితే మేం పొత్తు పెట్టుకున్నాం'' అని. అదీ చంద్రబాబు ట్రేడ్ మార్కు.

ఒకే భూమిపై ఒకరికి తెలియకుండా మరొకరి వద్ద రుణాలు తీసుకోవటం.. ఒకరికి మించి ఎక్కువ మందికి విక్రయించడం వంటి మోసాలకు తావు లేకుండా.. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారంగా 'ల్యాండ్ టైట్లింగ్ చట్టం' తేవాలని ఎన్‌డీఏ ప్రభుత్వం చెబుతోంది. అన్ని రాష్ట్రాలూ ఈ మేరకు చట్టాలు చేయాలని సూచిస్తోంది. ఇందులో లోపాలను పరిహరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా ముందడుగు వేసింది. ఈ చట్టాన్ని చేసి గెజిట్ విడుదల చేసింది. దీనికి సంబంధించిన నియమ నిబంధనలింకా విడుదల కాలేదు. రాష్ట్రంలో భూముల రీసర్వే జరుగుతోంది. ఇది పూర్తయితేనే ఆ చట్టాన్ని ముందుకు తీసుకెళ్లడానికి అవకాశం ఉంటుంది. ఇదీ వాస్తవం. అయితే ఈ చట్టం ఇంకా అమల్లోకి రాక ముందే.. అమల్లోకి వచ్చేసినట్లు, ప్రభుత్వం అందరి భూములనూ దోచుకుంటోందంటూ చంద్రబాబు, ఆయన అనుకూల మీడియా జుగుప్సాకరమైన ప్రచారం మొదలెట్టింది. చంద్రబాబు ఇంకాస్త ముందుకెళ్లి.. తను అధికారంలోకి వస్తే గనక నెల రోజులు తిరక్కుండానే ఈ చట్టాన్ని రద్దు చేసేస్తానని చెబుతున్నాడు. ఒక వైపు బీజేపీతో కలిసి పోటీ చేస్తూ.. ఎన్‌డీఏ కూటమిని చూసి ఓటేయండని చెబుతూ.. మరోవైపు ఎన్‌డీఏ ప్రభుత్వం తెచ్చిన చట్టాన్ని ఎలా రద్దు చేస్తావు చంద్రబాబూ? మరి బీజేపీతో విభేదిస్తున్నపుడు ఆ విషయం బయటకు ఎందుకు చెప్పటం లేదు? కూటమి అంతా ఒకటే అని ఎందుకీ అబద్ధాలు? ఓట్ల కోసం నువ్వు ఏం మాట్లాడుతున్నావో.. ఎంతకు దిగజారిపోతున్నావో తెలుస్తోందా?

మరిన్ని పేజీల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

బీజేపీ

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తాం. ఇప్పటికీ మా వైఖరి అదేనని న్యాయస్థానాల సాక్షిగా బీజేపీ చెబుతోంది. ఈ మధ్యే రాష్ట్ర హైకోర్టులో అఫిడవిట్ వేసి మరీ... విశాఖ స్టీల్‌పై తమ వైఖరి ఏమాత్రం మారలేదని స్పష్టంగా చెప్పింది.



టీడీపీ

బీజేపీతో కలిసి పోటీ చేస్తున్న చంద్రబాబు నాయుడు మాత్రం.. విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ జరగనివ్వనని బయట బహిరంగ సభల్లో చెబుతున్నాడు. ఈయనకు తోడు మరో భాగస్వామిగా ఉన్న దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ సైతం ప్రైవేటీకరణ జరగనివ్వనని హుంకరిస్తున్నాడు. మరి ఆ మాట బీజేపీతో చెప్పించవచ్చు కదా? మీ మేనిఫెస్టోలో పెట్టవచ్చు కదా? ఎందుకీ దగుల్బాజీ మాటలు? ఇంకెన్నాళ్లు ఈ మోసపు బతుకులు?

బీజేపీ

ముస్లింలు ఆర్థికంగా బాగా వెనకబడి ఉన్నారని గ్రహించిన దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి.. వారిని బీసీల్లో చేర్చి 4 శాతం రిజర్వేషన్లను కల్పించారు. నాటి నుంచీ అవి కొనసాగుతున్నాయి. కానీ బీజేపీ మాత్రం మతపరమైన రిజర్వేషన్లకు తాము వ్యతిరేకమంటోంది. తాము గనక అధికారంలోకి వస్తే.. ఈ రిజర్వేషన్లను తొలగిస్తామని బీజేపీ అగ్ర నేతలు ఇప్పటికే స్పష్టంగా చెప్పారు.



టీడీపీ

బీజేపీతో కూటమి గట్టి పోటీ చేస్తున్న చంద్రబాబు నాయుడు తాను ముస్లిం రిజర్వేషన్లకు వ్యతిరేకమని చెప్పటం లేదు. ఆ విషయాన్ని ఎప్పటికప్పుడు దాటవేస్తూ... పక్క దోవ పట్టిస్తూ... ప్రచారాన్ని లాగించేస్తున్నాడు.

బీజేపీ

తాము కేంద్రంలో మూడోసారి అధికారంలోకి రాగానే ముస్లింలకు వర్తించేలా ఉమ్మడి పౌర స్మృతి (సీసీసీ)ని తీసుకు వస్తామని బీజేపీ చెబుతోంది.



టీడీపీ

దీనిపైనా చంద్రబాబు దాటవేతనే అనుసరిస్తున్నాడు. బీజేపీతో కలిసి పోటీ చేస్తూ.. వాళ్లతో అధికారం పంచుకుంటానని చెబుతున్న చంద్రబాబు వాళ్ల ఎజెండాతో తాను ఏకీభవిస్తున్నట్లు చెప్పటం లేదెందుకు? ఎన్నాళ్లీ మోసం? రెండు నాల్కలతో ఎందరిని మభ్యపెడతారు?

బీజేపీ

ప్రత్యేక హోదా ముగిసిపోయిన అధ్యాయమని, ఇక దాని గురించి ప్రస్తావించే అవకాశం గానీ, అవసరం గానీ లేదని బీజేపీ పదేపదే చెబుతోంది. ఈ మధ్యే రాష్ట్రానికి వచ్చిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సైతం... ప్రత్యేక హోదా అనేది ముగిసిన అధ్యాయమన్నారు. ఈ హోదాకు తగ్గట్లుగా ప్రత్యేక ప్యాకేజీని గతంలోనే చంద్రబాబు నాయుడు తీసుకున్నారని, కనక దీనిపై ఆయన తమను అడిగే పరిస్థితి లేదని చెప్పారు.



టీడీపీ

సిగ్గూ, మర్యాదా అన్నీ వదిలేసిన చంద్రబాబు నాయుడు.. ఇప్పటికీ ప్రత్యేక హోదా గురించి మాట్లాడుతున్నారు. తాము గెలిస్తే రాష్ట్రానికి బీజేపీ సాయంతో ప్రత్యేక హోదాను సాధిస్తామని మళ్లీ మళ్లీ చెబుతున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయమని చెబుతుంటే... సాక్షాత్తు ప్యాకేజీ తీసుకున్న చంద్రబాబు మళ్లీ ప్రత్యేక హోదా గురించి మాట్లాడుతుండటం ఎవరి చెవుల్లో పువ్వులు పెట్టడానికి? పోనీ ప్రత్యేక హోదా అంశాన్ని మేనిఫెస్టోలో పెట్టగలవా చంద్రబాబూ?

నల్లమలకూ ఓ వీరప్పన్!

విలువైన కలపను టోకుగా కాజేశాడా నేత.. నల్లమల వీరప్పన్‌గా పేరుమోశాడాయన.. నాటుసారా వ్యాపారంలో అందెవేసిన చేయి.. తన సారా వ్యాపారానికి అడ్డొచ్చిన వారి అంతు చూడడానికి సైతం వెనుకాడనంత దౌర్జన్యపరుడు.. ఈ అక్రమాలన్నిటితో రూ.వేల కోట్లను అనతికాలంలోనే ఆర్జించి.. తన దోపిడీ సామ్రాజ్యాన్ని బలపరుచుకున్న నేత.. అక్కడి జనాన్ని తన కంటి చూపుతో శాసించారు. సారా వ్యతిరేకోద్యమం ముమ్మరంగా రాష్ట్రంలో ఊపేస్తే.. అప్పటి ఈ టీడీపీ నేత నియోజకవర్గంలో ఒక్కరు కూడా ఈయనకు వ్యతిరేకంగా గొంతెత్తడానికి సాహసించలేకపోయారంటే జనాన్ని ఎంతగా భీతిగొలిపారో అర్థం చేసుకోవచ్చు. తుదకు తన అక్రమాలకు మద్దతిచ్చే టీడీపీలో చేరారు.. అదొక్కటే కాదు.. అవకాశవాదంతో ఏ ఎండకా గొడుగు పడుతూ బీజేపీ, కాంగ్రెస్ పార్టీల్లోనూ చేరారు.. ఈ నేత నీడన పెరిగిన ఆయన తనయ ప్రస్తుతం టీడీపీ లోక్‌సభ అభ్యర్థిగా బరిలో ఉన్నారు.

వీళ్లా అభ్యర్థులు?

- అక్రమ రవాణాతో రూ.వేల కోట్లకు పడగలు
- ఎదురించిన వారంతా చెరువుల్లో చేపలకు ఆహారం
- నాటుసారాతో పేద కుటుంబాల ఉసురు తీసిన చరిత్ర
- తరచూ పార్టీలు మారుతూ ఊసరవెల్లి నైజం
- తండ్రికి తగ్గ తనయగా ఆ నేత కుమార్తె అ'రాజకీయం'
- ప్రస్తుతం టీడీపీ అభ్యర్థిగా డబ్బులు వెదజల్లుతున్న వైనం

నల్లమల కలపపై ఒకప్పటి టీడీపీ నేత గొడ్డలి వేటు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: ఆ పేరు వింటే చాలు నల్లమల వీరప్పన్ గుర్తుకు వస్తారు. కొన్నేళ్ల కిందట నల్లమల అడవిని అడ్డాగా చేసుకుని తన వ్యాపారాన్ని సాగించారు. కలప చెట్లను ఇష్టానుసారం నరికి హైదరాబాద్‌కు తరలించి రూ. వేల కోట్లు సంపాదించారు. తనకు ఎదురు మాట్లాడితే వారి పని అంతే. అడ్డుకుందామని యత్నించిన అధికారులను నయానో భయానో లొంగదీసుకుని తన వ్యాపారాన్ని సాగించారు. అంగబలానికి తోడు అర్థబలం తోడవడంతో ఆయన అక్రమార్జనకు అడ్డే లేకుండా పోయింది.

తండ్రి రాజకీయ అండతో...: తండ్రి రాజకీయ అండతో ఈ నేత విచ్చలవిడిగా సంపాదించారు. జూపాడుబంగ్లా, పగిడ్యాల, మిడుతూరు, ఓర్వకల్లు మండలాల్లో సొంతంగా సారా అంగళ్లు తెరిచారు. పల్లెలకు సారాను పరిచయం చేశారు. సారా వల్ల అనేక వందల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. సారా అంగళ్లను తమ గ్రామాల్లో తొలగించాలని మహిళలు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేసినా, తన అంగబలంతో వాటిని అణచివేశారు. 1989లో రాష్ట్ర వ్యాప్తంగా సారాకు వ్యతిరేకంగా ఉద్యమాలు నడిచాయి. మహిళలు పెద్ద ఎత్తున ఉద్యమంలో పాల్గొన్నారు. రోడ్ల మీదకి వచ్చి తమ కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్న సారా రక్కసిని పార దోలాలని రాష్ట్రమంతటా నినదించారు. ఒక్క నందికొట్కూరు నియోజకవర్గంలో మాత్రమే సారా ఉద్యమం చేయాలంటే గజగజ వణకాల్సిన పరిస్థితిని ఈ నేత సృష్టించారు. ఉద్యమం చేస్తే తమను ఏం చేస్తారోనన్న భయం నియోజకవర్గ ప్రజలను వెంటాడింది. ఉద్యమం పెద్ద ఎత్తున ఎగసిపడిన రోజుల్లోనూ స్థానికంగా మాత్రం సారా వ్యాపారం విచ్చలవిడిగా సాగిపోయింది.

రూ.కోట్లలో విభేదాలతో బయటకు...: 1993లో ముఖ్యమంత్రిగా ఉన్న కోట్ల విజయభాస్కరరెడ్డితో సారా కాంట్రాక్టు విషయంలో ఈ నేతకు విభేదాలు వచ్చాయి. తన సారా వ్యాపారానికి సహకరించడంలేదన్న కోపంతో ఆయన టీడీపీలో చేరి 1994లో నందికొట్కూరు నుంచి పోటీ చేసి గెలుపొందారు. అక్షరాస్యత పెద్దగా లేని నాటి రోజుల్లో అమాయక ప్రజలను తన రాజకీయ లబ్ధి కోసం ఈ నేత వాడుకున్నారన్న విమర్శలూ ఉన్నాయి. ఫ్యాక్షన్ రాజకీయాలు చేపట్టి ఎంతో మంది మహిళల పుస్తెలు తెంపిన ఘన చరితా ఈయనదేనన్న ఆరోపణలు ఉన్నాయి.

కేసులు...: వ్యక్తిని అక్రమంగా నిర్బంధించడంతో ఆయనపై ఐపీసీ 341 కింద నియోజకవర్గంలో కేసు నమోదైంది. ఐపీసీ 143, 188, 149 సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి.

తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తున్న తనయ

తండ్రికి తానేమీ తక్కువకాదన్నట్లుగా ఆయన తనయ వ్యవహరిస్తున్నారు. బీజేపీ నుంచి రాజకీయ అరంగేట్రం చేసిన ఈమె నోరు తెరిస్తే చాలు అవతలి వ్యక్తి హడలిపోవాల్సిందేనన్న విమర్శలు ఉన్నాయి. నందికొట్కూరు నియోజకవర్గం కొత్తపల్లెలో ఈమెపై క్రిమినల్ కేసు నమోదైంది. దళిత వ్యక్తిని దూషించడంతో పాటు దాడి చేయడంతో కేసు నమోదైంది. ప్రస్తుతం ఈమె టీడీపీ తరఫున లోక్ సభకు పోటీ చేస్తున్నారు.

రెండోసారి ఎన్నికవడంతో....

• 1999 ఎన్నికల్లోనూ ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఆ నేత ఆగడాలు శృతిమించాయి. నల్లమల అడవిని చెరబట్టి అటవీ సంపదను కొల్లగొట్టారు. విలువైన కలపను ఇతర ప్రాంతాలను రవాణా చేసి రూ.కోట్లు గడించారు. అటవీ అధికారులను బెదిరించి విలువైన కలప చెట్లను హైదరాబాద్, చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాలకు తరలించి రూ.వేల కోట్లు సంపాదించారు. ఆ నేత ఇంటిలో, హైదరాబాద్‌లోని హోటల్లో ఎక్కడ చూసినా విలువైన కలప కళాఖండాలు కనిపిస్తాయని ఉమ్మడి కర్నూలు ప్రజలందరికీ తెలుసు. బీడీల కట్టలు కట్టి అమ్ముకునే నిరుపేదల రక్తం తాగారని ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. కార్మికుల నుంచి కారుచౌకగా బీడీ కట్టలను కొనుగోలు చేసి తాను మాత్రం ఎక్కువ రేటుకు విక్రయించి లాభాలు గడించారు. ఆ నేతకు వ్యతిరేకంగా మాట్లాడినా, ఆయన ఆగడాలను ప్రశ్నించినా వారికి భూమ్మీద నూకలు చెల్లినట్లే. ఈ నేతకు విలేకరులంటే అలుసు. అప్పట్లో విలేకరుల సమావేశాలంటూ పిలిచి కుర్చీలు కూడా వేసేవారు కాదు. పాత్రికేయులు నిలుచునే ఆయన చెప్పేది నోట్ చేసుకోవాల్సిన పరిస్థితి ఉండేది. జిల్లా కేంద్రాలలో ఉండే ముఖ్య ప్రతినిధి వస్తే మాత్రమే కుర్చీ వేసేవారు.

• 2004లో పోటీ చేసి ఓడిపోయిన తర్వాత ఈ నేత వరుసగా పార్టీలు మారారు. కొద్ది రోజులు రాయలసీమ పరిరక్షణ సమితి పేరుతో హడావుడి చేశారు. బీజేపీ, టీడీపీ, కాంగ్రెస్ ఇలా అన్ని పార్టీల్లోకి ఆయన వెళ్లొచ్చారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీతో అంటకాగుతూ ఊసరవెల్లి రాజకీయాలు సాగించిన ఘనత దక్కుతుంది.



జగన్ మళ్లీ సీఎం కావడం రాష్ట్రానికి అవసరం

- గ్రామాల్లో నిజమైన అభివృద్ధి ఇప్పుడే కనిపిస్తోంది
- సర్కారు బడుల రూపు రేఖలే మారిపోయాయి
- బడిపిల్లలకు ఇచ్చే మధ్యాహ్న భోజనంతో పాటు అన్నీ నాణ్యమైనవే...
- అత్యాధునిక ఎక్విప్‌మెంట్స్‌తో ఆస్పత్రుల్లో సరికొత్త సేవలు
- పూర్తి సౌకర్యాలతో రూపుదిద్దుకున్న పేదలకిచ్చిన ఇళ్ల కాలనీలు
- ఇవి నేను స్వయంగా గమనించిన విషయాలు
- సాక్షితో సినీ దర్శక, రచయిత కోన వెంకట్

ఇంటర్వ్యూ

'చెడు త్వరగా ప్రచారంలోకి వస్తుంది. అది వినడానికి కూడా ఎక్కువ మంది ఇష్టపడతారు. మంచి చెబితే ఏదో ఆశించి భజన చేస్తున్నాం అంటారు. అంటే అనుకోనీయండి. కానీ నిజం చెప్పకపోవడం అంటే అబద్ధాన్ని ప్రోత్సహించడమే అని నా అభిప్రాయం. అందుకే నేను నిజాలు చెబుతున్నాను' అంటున్నారు సినీ దర్శక, రచయిత కోన వెంకట్. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మారుమూల గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధిని స్వయంగా పరిశీలించి, వాటి గురించి ససాక్ష్యంగా వరుసగా ట్వీట్స్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సాక్షితో ఆయన తన అనుభవాలను పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే.. –సత్యార్థ్

బాపట్ల జిల్లా కర్లపాలెం మండలంలోని మారుమూల గణపవరం అనే గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను సందర్శించా. అక్కడి పిల్లలతో కలిసి నిమ్మకాయ పులిహోర తిన్నా. రాగి జావ తాగా. ఉచితం అంటే ఎలా ఉంటాయో అని మనం అనుకుంటాం. కానీ మన అంచనాలన్నీ తప్పని అక్కడ ఆహారం తిన్నాక స్పష్టమైంది. అక్కడి విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో వడ్డించే పదార్థాలు ఎంతో రుచికరంగా ఉన్నాయి. అంతేకాదు ట్యాబ్స్, స్కూల్ బ్యాగ్స్, యూనిఫామ్స్, షూ, సాక్స్... అన్నీ నాణ్యమైనవే ఇచ్చారు. పాఠశాల వాతావరణం బాగుంటే సానుకూల ఫలితాలు వస్తాయి కదా... అదే ఇప్పుడు కనిపిస్తోంది. మేం చదువుకున్నప్పుడు ఇలాంటి వసతులు, సౌకర్యాలు ఉంటే మరింత బాగా రాణించేవాళ్లం కదా అనిపించింది. టీచర్లు, సిబ్బంది కూడా కొత్త ఉత్సాహంతో కనిపించారు. నాకు ఎంత ఆనందం కలిగిందంటే అప్పటికప్పుడు ఆ టీచర్లు అందరికీ శాలువాలుతెప్పించి సన్మానించాను.

పల్లెలకు చికిత్స



ప్రభుత్వ ఆస్పత్రులు.. అదీ మారుమూల గ్రామంలో ఎలా ఉంటాయో అనే దానిపై మనం ఒక మైండ్ సెట్‌తో ఉంటాం. అయితే మా బాపట్ల ప్రభుత్వాస్పత్రిని చూస్తే ఆ ఆలోచన కచ్చితంగా మారిపోతుంది. ఆపరేషన్ థియేటర్స్‌లో కూడా అత్యాధునిక ఎక్విప్‌మెంట్, అప్పుడే పుట్టిన చిన్నారుల కోసం ఇన్ఫాంట్ స్పెషల్ ఐసీయూ. అంతేకాదు.. సొంత ఆక్సిజన్ ప్లాంట్ కూడా ఏర్పాటు చేశారు. నాకు తెలిసి ఆ సౌకర్యం చాలా ప్రైవేటు ఆస్పత్రులకు ఇప్పటికీ లేదు. నేను వచ్చింది ప్రభుత్వ ఆస్పత్రికా, లేక కార్పొరేట్ ఆస్పత్రికా అన్న ఆశ్చర్యం కలిగింది. కొన్నేళ్ల క్రితం వరకూ గర్భిణులు సైతం డెలివరీల కోసం చీరాల, తెనాలి అంటూ పొరుగూళ్లకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడిక ఆ సమస్య లేదు. ఇక మరో మారుమూల ఉన్న కొత్త నందాయపాలెం అనే చిన్న గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్ చూశా. అదీ అద్భుతం అనే చెప్పాలి. ఆ హెల్త్ క్లినిక్‌లో ల్యాబ్ కూడా పెట్టారు. అక్కడికక్కడ రక్త పరీక్షలు, బీపీ, షుగర్ టెస్ట్‌లు చేస్తూ మందులు ఇస్తున్నారు. అక్కడ సేవలందించే డాక్టర్స్ విశ్రాంతి తీసుకోవడానికి క్వార్టర్స్ కూడా ఏర్పాటు చేశారంటే ఎంత పక్కా ప్రణాళికతో ఈ విలేజ్ క్లినిక్స్‌ని డిజైన్ చేశారో ఆలోచించండి.

నా కళ్లు నేనే నమ్మలేనంత గొప్పగా ఇళ్లు



పేదలకిచ్చిన ఇళ్లను గమనించడానికి మాకు సమీపంలో ఉన్న జగనన్న కాలనీలను సందర్శించా. చెబుతుంటే అతిశయోక్తిలా ఉంటుందేమో. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఉన్న విల్లా కమ్యూనిటీలాగా అనిపించింది. అది కూడా ఎక్కడో ఊరికి దూరంగా విసిరేసినట్టు కట్టిన కాలనీ కాదు. బాపట్ల ఎంట్రన్స్‌లో హైవే పక్కనే కట్టించి ఇచ్చారు. కేవలం ఇళ్లు ఇవ్వడమే కాదు చక్కగా, పరిశుభ్రంగా అన్ని వసతులతో నిర్వహిస్తున్నారు. అక్కడ తాపీ పనిచేసే ఒక ముస్లిం కుటుంబంతో పాటు అనేక మందితో ముచ్చటించినప్పుడు వాళ్ల కళ్లల్లోని ఆనందాన్ని చూస్తే పేదలకు ఇంతకన్నా మేలు చేసే ప్రభుత్వం ఉంటుందా? అనిపించింది. ఎందుకంటే వాళ్ల జీవితంలో ఇలాంటి ఇళ్లు కట్టుకోవడం అసాధ్యం. నాకు కూడా అలాంటి చోట ఒక ఇల్లు ఉంటే బాగుండు అన్నంత బాగుంది.

రోడ్లపై జరుగుతోంది దుష్ప్రచారమే...



రహదారుల విషయంలో కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై దుష్ప్రచారం జరుగుతోంది. దీనిని నిర్ధారించుకోవడానికి నేను మా ఊరి చుట్టుపక్కల రహదారుల్ని సర్వే చేశాను. అదంతా అబద్ధమేనని తేలింది. మీరు నమ్ముతారా? మా బాపట్లకి అవుటర్ రింగ్ రోడ్ కూడా ఉంది ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న మంచిని కనపడనీయకుండా, వినపడనీయకుండా చేయాలనే ఆలోచనతో విపక్షాలు, జగన్ శత్రువులు కుట్ర చేస్తున్నారు. నేను రాష్ట్రం మంచి కోరుకునే ఆంధ్రప్రదేశ్ పౌరుడ్ని. వృత్తి, వ్యాపకాల రీత్యా నేనెక్కడ స్థిరపడినా నా ఊరు బాగుపడుతుంటే ఆ ఊరంటే ప్రేమ ఉన్న నేనెందుకు గర్వంగా చెప్పుకోకూడదు? ఎవరేమనుకున్నా సరే.. నాకు కనపడిన మంచిని ప్రజలతో పంచుకుంటా.

చిత్తశుద్ధి ఉన్న సీఎం గెలవాలి...

వైఎస్సార్‌సీపీయా... బీజేపీయా... కాదు. పేదల సంక్షేమం పట్ల చిత్తశుద్ధి ఉన్న జగన్ లాంటి ముఖ్యమంత్రి ఈ రాష్ట్రానికి చాలా అవసరం. ఆయనకు ఆ అవసరం లేకపోవచ్చు. నాన్న వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలని తప్ప మరో కోరిక ఉండకపోవచ్చు. కానీ ఆయన సీఎంగా ఉండడం, మళ్లీ గెలవడం ఈ రాష్ట్రానికి... ముఖ్యంగా పేదలకు అవసరం. ఇలాంటి పాలన నిజంగా పేదలకు ఓ వరం.



● ప్రియా ఛత్రి



● ఇంటి యజమాని రాశి సోమన్‌తో...

ప్రియమైన విజయం

రెండేళ్ల కిందట ... ప్రియా ఛత్రి ఒక నిస్సహాయ మహిళ. ఢిల్లీ, గుర్‌గావ్‌లో ఓ క్లినిక్ ముందు నిలబడి అగమ్యగోచరంగా ఉన్న భవిష్యత్తును ఊహించుకుంటూ కన్నీళ్ల పర్యంతమైంది. భర్త తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్నాడు. పరీక్ష చేసిన డాక్టరు రాసిచ్చిన మందుల చీటీ ఆమె చేతిలో ఉంది. చీటీ అనడం అలవాటైన మాట, కానీ ఆమె చేతిలో ఉన్నది మందుల జాబితా. ఆ మందులు వాడాలంటే తను, భర్త సంపాదిస్తున్న డబ్బు చాలదు. మందులకు ఖర్చు చేస్తే ఇల్లు గడవదు. ఇల్లు గడిస్తే వైద్యం అందదు. తనేమో నాలుగు ఇళ్లలో పనులు చేస్తుంది. భర్త సంజీత్ ఒక ప్రైవేట్ కంపెనీలో చిరుద్యోగి. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం సిలిగురి నుంచి బతుకుదెరువు కోసం దేశ రాజధాని బాట పట్టిన అనేక కుటుంబాల్లో ప్రియ కుటుంబం ఒకటి. ఇరవై నాలుగేళ్ల వయసులో జీవితం ఆమెకి పెట్టిన పరీక్ష అది. ఆ పరీక్షలో నెగ్గిన ప్రియ ఇప్పుడు సిలిగురిలో తోటి మహిళలకు రోల్ మోడల్ అయింది. ఇంతకీ ఆమె చేసిన పనేంటి అంటే... మనదేశంలో పండని పండ్లను, గింజలను ఇంటింటికీ చేర్చడమే. తాజాగా, నాణ్యంగా ఉన్న పండ్లను ఇస్తుందన్న విశ్వాసాన్ని చూరగొన్నది. ఇప్పుడు భార్యాభర్తలిద్దరూ వారి వారి పనులు చేసుకుంటూనే పండ్ల వ్యాపారం చేస్తూ నెలకు ముప్ఫైవేల రూపాయలు సంపాదిస్తున్నారు. ఇందుకు ఆమె పెట్టుబడి తన శ్రమ మాత్రమే. ఆమెకు అండగా నిలిచింది ఆమె పని చేస్తున్న ఇంటి యజమాని రాశి సోమన్ గొప్ప మనసు.



● భర్త సంజీత్‌తో కలిసి ప్యాకింగ్ చేస్తూ...

జీవితం పండింది

ప్రియ తన పండ్లు, గింజల వ్యాపారానికి తాను పని చేసే ఇళ్ల నుంచే కస్టమర్లను వెతుక్కుంది. తొలి ప్రయత్నంగా ఢిల్లీ మండి నుంచి పది అవకాడోలు తెచ్చింది. మూడు వందల ఆదాయం వచ్చింది. ‘‘రాశి అక్క నాకు ఢిల్లీలోని ఆజాద్‌పూర్ మండీకి తీసుకెళ్లి చూపించింది. మన దేశంలో అరుదుగా లభించే పరదేశీ పండ్ల గురించి వివరించింది. సాధారణంగా ఒక పండు హోల్‌సేల్ మార్కెట్ నుంచి తినేవారి చేతికి వచ్చే మధ్యలో ఎన్నో చేతులు మారుతుంది. అనేక దఫాలు రవాణా అవుతుంది. పండ్ల దుకాణానికి చేరి పండ్లు కొనేవారికి అందే లోపు వాడిపోయేవి, కుళ్లిపోయేవి ఎన్నో. దుకాణదారులు ఆ నష్టాలను కూడా బాగున్న పండ్ల మీదనే రాబట్టుకోవాలి. నేను మండీ నుంచి కొనే గింజలు, పండ్లు తక్కువ మోతాదులో ఉంటాయి. అవి కూడా నా కస్టమర్లకు అవసరమైన పండ్లనే తెస్తాను. కాబట్టి నా దగ్గర నిల్వ ఉండవు. తెచ్చిన రోజే కస్టమర్లకు చేరుస్తాను. అలాగే నాణ్యమైన పండ్లను మాత్రమే తెస్తాను. ఏరోజుకారోజు తాజా పండ్లను తినే వెసులుబాటును కల్పిస్తున్నాను. కాబట్టి నా దగ్గర క్రమం తప్పకుండా పండ్లు తెప్పించుకునే వాళ్లు 250 మంది ఉన్నారు. అందరినీ ఒక వాట్సాప్ గ్రూప్‌లో చేర్చాను. వారానికి ఒకసారి తెప్పించుకునే వాళ్లు ఆదివారం రోజు గూగుల్ ఫార్మ్‌లో వాళ్లకు అవసరమైనవి తెలియచేస్తారు. గురువారం వాళ్లకు అందచేస్తాను. ఇవి కాకుండా తాజా పండ్లు రోజూ తెప్పించుకునే వాళ్లకు అలాగే అందిస్తున్నాను. పండ్ల దుకాణంలో దర కంటే చాలా తక్కువగా లభిస్తుండడంతో నా ప్రయత్నం విజయవంతమైంది. రెడ్ గ్లోబ్ గ్రేప్స్, బ్లూ బెర్రీ, మాండేరియన్స్, గోల్డెన్ కివీ, గ్రీన్ కివీ వంటి పండ్లతోపాటు వాల్‌నట్స్, ఫిగ్, విదేశీ ఖర్జూరాలు, హాజెల్‌నట్, క్రాన్ బెర్రీ, మంచి జీడిపప్పు, బాదం వంటివి 30 రకాలు అందిస్తున్నాను. నేను, సంజీత్ మా ఉద్యోగాలు చేసుకుంటూ ఈ వ్యాపారం చేస్తున్నాం. దీనిని వ్యాపారం, లాభాలు అనాలా లేక నేను అందిస్తున్న సర్వీస్‌కి లభిస్తున్న చార్జ్ అనాలో తెలియదు. కానీ నా పిల్లలు కూడా ప్యాకింగ్, డెలివరీ వంటి పనుల్లో సాయం చేస్తున్నారు. నాకు పద్దెనిమిదేళ్లకే పెళ్లయింది. దాంతో పదకొండవ తరగతితోనే చదువు ఆగిపోయింది. నాకున్న కొద్దిపాటి చదువుతో, నా శ్రమను పెట్టుబడి పెట్టాను. పెద్ద చదువులు చదివిన వాళ్ల కంటే తక్కువేమీ కాదని ఈ ఏడాది మహిళాదినోత్సవం రోజు నా గురించి పేపర్‌లో రాశారు. అంతా మా యజమాని రాశి అక్క సహాయమే’’ అన్నది ప్రియా ఛత్రి.

జీవితం ప్రతి ఒక్కరికీ పరీక్షలు పెట్టి విజేతలుగా నిలబెట్టాలని చూస్తుంది. ఆ పరీక్షలో విజయవంతమైన వాళ్లు విజేతలుగా నిలుస్తారు. పరీక్ష నుంచి పారిపోయిన వాళ్లు పరీక్షతోపాటు జీవితేచ్ఛను కూడా పోగొట్టుకున్న పరాజితులుగా మిగులుతారు. ప్రియా ఛత్రి తన జీవితానికి తానే రక్షణ గొడుగు పట్టుకుంది.


ఆ ఆటలతో ఆ అద్భుతాలు

మార్పు



● ఆటలతో ఆరోగ్య విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అర్చన సిన్హా

పిల్లలు, ఆటలు, పాటలు ఒకే కుటుంబం. ఆటపాటలంటే పిల్లలకు బోలెడు ఇష్టం. ఆ ఇష్టాన్ని దృష్టిలో పెట్టుకొని పోషకాహారం నుంచి పరిసరాల పరిశుభ్రత వరకు ఎన్నో కాన్సెప్ట్‌లను ఆటల రూపంలో డిజైన్ చేసిన బెంగళూరుకు చెందిన నరిషింగ్ స్కూల్స్ ఫౌండేషన్(ఎన్ఎస్ఎఫ్) వారి కృషి వృథా పోలేదు. స్కూల్ గార్డెన్ నుంచి గ్రూప్ యాక్టివిటీస్‌లో చురుగ్గా పాల్గొనడం వరకు పిల్లల్లో ఎంతో సానుకూల మార్పు కనిపిస్తోంది...



ప్రభుత్వ పాఠశాలలకు వెళుతూ పిల్లల వయసు, ఎత్తు, బరువు... మొదలైన విషయాల ఆధారంగా బేస్ లైన్ సర్వేలు నిర్వహిస్తోంది ఎన్ఎస్ఎఫ్ ఫౌండేషన్. సర్వే ఫలితాల గురించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేయడమే కాదు తగిన సూచనలు కూడా ఇస్తోంది. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల సమస్యలను అర్థం చేసుకోవడానికి ఈ సర్వే ఫలితాలు ఉపయోగపడుతున్నాయి.

‘పారిశుధ్య ప్రాముఖ్యత, సరైన పౌష్టికాహారం గురించి పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా టూల్ కిట్ ఆధారిత విధానానికి రూపకల్పన చేశాము. వారికి తగిన పరిజ్ఞానాన్ని అందించి ఆలోచనాపరులుగా మార్చడమే మా లక్ష్యం’ అంటుంది ఎన్ఎస్ఎఫ్ కో–ఫౌండర్, సీయివో అర్చన సిన్హా.

పోషకాహారం, పారిశుధ్యంతో పాటు నవీన వ్యవసాయ పద్ధతుల గురించి పిల్లలకు అవగాహన పరిచే పదిహేను గేమ్స్‌తో కూడిన టూల్‌కిట్‌లను ఎన్ఎస్ఎఫ్ ఫౌండేషన్ ప్రభుత్వ పాఠశాలలకు అందిస్తోంది. పోషకాహార లోపాల లక్షణాలను గుర్తించడానికి ఈ టూల్‌కిట్‌లలోని ఎనిమీ కార్డ్, అలాగే... ఈ లోపాలను పరిష్కరించడానికి సహాయపడే ఆహార వనరుల గురించి తెలుసుకోవడానికి ఫ్రెండ్ కార్డు పిల్లలకు ఉపయోగపడుతుంది. వైకుంఠపాళిలోని పాములు, నిచ్చెనలతో కూడా పిల్లలు ఎన్నో విషయాలు తెలుసుకుంటారు.

జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండేవారి సత్‌ప్రవర్తనకు బహుమతులు, జంక్ ఫుడ్‌ను అమితంగా ఇష్టపడేవారికి ఈ ఆటలో శిక్షలు (పాముకాటు)లు ఉంటాయి. సబ్బు వాడకం వల్ల కలిగే ప్రయోజనాల గురించి పిల్లలకు అర్థమయ్యేలా చెప్పడానికి ఆకట్టుకునే కాన్సెప్ట్‌కు రూపకల్పన చేశారు.

టూల్‌కిట్స్ యాక్టివిటీల ద్వారా పిల్లలు స్కూల్ గార్డెన్‌లను పెంచుతున్నారు. వారికి ఇచ్చిన గైడ్‌బుక్‌లో వెజిటేబుల్ క్యాలెండర్, మొక్కల పెంపకానికి సంబంధించి స్టెప్-బై-స్టెప్ ఇన్‌ఫర్‌మేషన్ ఉంటుంది.

టూల్‌కిట్‌లు పిల్లలపై ఏ మేరకు ప్రభావం చూపాయి... అనే విషయంలో ఎప్పటికప్పుడు సర్వేలు చేస్తుంటుంది ఫౌండేషన్.

‘పిల్లల ఆహారపుటలవాట్లపై టూల్‌కిట్స్ సానుకూల ప్రభావం చూపించడమే కాదు వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచాయి. గ్రూప్ యాక్టివిటీలలో చురుగ్గా పాల్గొనేలా చేస్తున్నాయి’ అంటుంది ఒకిత ఎం అనే గృహిణి.

‘ప్రభుత్వ పాఠశాలలతో పోల్చితే ప్రైవేట్ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగ్గా ఉండవచ్చు. అయితే ఊబకాయంలాంటి సమస్యలు ఉన్నాయి’ అంటుంది అర్చన సిన్హా.

త్వరలో ప్రైవేట్ స్కూల్స్‌లోకూడా ఆన్‌లైన్ మాడ్యూల్ అందుబాటులోకి తీసుకు రానున్నారు.

‘ఎన్ఎస్ఎఫ్’ దేశవ్యాప్తంగా ఉన్న ఎన్నో ప్రభుత్వ పాఠశాలల్లో యాక్టివిటీ ప్రోగ్రామ్స్ నిర్వహించింది. వేలాదిమంది విద్యార్థులపై ఇవి సానుకూల ప్రభావం చూపుతున్నాయి.

అలా వచ్చిన ఆలోచనే... ఎన్ఎస్ఎఫ్



జర్నలిస్ట్‌గా కెరీర్ మొదలు పెట్టిన అర్చన సిన్హా ఆ తరువాత మేనేజ్‌మెంట్ అండ్ కన్సల్టింగ్‌లోకి వచ్చింది. సామాజికసేవా కార్యక్రమాలు అంటే మొదటి నుంచి ఇష్టం ఉన్న అర్చన ‘అశోక ఇన్నోవేటర్స్ ఫర్ ది పబ్లిక్’ అనే స్వచ్ఛంద సంస్థలో పనిచేసింది. ఒడిషాలోని గ్రామాలకు వెళ్లినప్పుడు అక్కడి మహిళలతో పౌష్టికాహారం గురించి మాట్లాడింది. అరుదుగా మాత్రమే వారు పౌష్టికాహారం గురించి పట్టించుకుంటున్నారు. పౌష్టికాహారం, పారిశుధ్యం గురించి వారికి అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని గుర్తించిన అర్చన ‘నరిషింగ్ స్కూల్స్ ఫౌండేషన్’కు శ్రీకారం చుట్టింది.

అద్భుతం.. సజీవ సేద్యం..!

● గో ఆధారిత ‘సజీవ సేద్య’ పద్ధతిని ఆవిష్కరించిన గుజరాత్ వాసి మహేశ్ మహేశ్వరి ● ట్యూబ్ పద్ధతిలో అధిక కర్బనంతో కూడిన అడ్వాన్స్‌డ్ ద్రవ జీవామృతం, అధిక కర్బనంతో కూడిన ఎరువు, జీవన పురుగుమందుల ఉత్పత్తితో అద్భుత ఫలితాలు...
● మట్టిలోని సేంద్రియ కర్బన స్థాయిని ఒక్క ఏడాదిలోనే 6%కి పెరుగుతుందంటున్న మహేశ్ ● తాగు/సాగు నీటిని శుద్ధి చేయటం.. ఆవు దేహాన్ని శుద్ధి చేసి పొట్టలో సూక్ష్మజీవరాశిని పెంపొందించటం..
● నేలలో నుంచి 606 పురుగుమందులు, రసాయనాలను తొలి ఏడాదే నిర్మూలించవచ్చు ● తొలి ఏడాదిలోనే పంట దిగుబడులు తగ్గకపోగా పెరుగుతాయి.. ఏ కల్మషమూ లేని పోషకాల సాంద్రతతో కూడిన సేంద్రియ ఆహారోత్పత్తుల దిగుబడి సుసాధ్యమే!
● జీవ ఇంధనం ఉత్పత్తి, కార్బన్ క్రెడిట్స్ పొందటానికీ అవకాశం.. ఇవీ ‘సజీవ సేద్య పద్ధతి’లో ముఖ్యాంశాలు...
మహేశ్ మహేశ్వరి ‘మిరకిల్’ కృషిపై ‘సాక్షి సాగుబడి’ ప్రత్యేక కథనం



● అహ్మదాబాద్‌లో చాలా ఎత్తు పెరిగిన సజీవ సేద్యం నేపియర్ గడ్డి



● నేపియర్ గడ్డితో తయారైన పెల్లెట్లు



● ద్రవ జీవామృతం తయారయ్యే ట్యూబ్

● జీవామృతం



● అధిక కర్బనంతో కూడిన ఎరువు



● ట్యూబ్ నుంచి బయటకి వస్తున్న జీవామృతం



● దేశీ ఆవుల డీటాక్స్ తర్వాత పేడ, మూత్రం నుంచి దుర్వాసన రాదు



● సజీవ సేద్యం వివరాలు చెబుతున్న సెజల్ మహేశ్వరి



● నీటిని శుద్ధి చేసే చిప్

మట్టిలో సత్తువను లేదా ఉత్పాదక శక్తిని కొలిచేందుకు ఒక సాధనం సేంద్రియ కర్బనం (సాయిల్ ఆర్గానిక్ కార్బన్– ఎస్.ఓ.సి.). సేంద్రియ కర్బనం మన భూముల్లో 0.2 నుంచి 0.5 మధ్యలో ఉందని అనేక అధ్యయనాల్లో తేలింది. ఈ భూముల్లో పండించిన ఆహారంలో పోషకాల సాంద్రత లోపించి, ఆ ఆహారం తిన్నవారికి పౌష్టికాహార లోపం వస్తోందని కూడా మనకు తెలుసు.

సేంద్రియ కర్బనం 1% కన్నా ఎక్కువ ఉంటే పంటలు బాగా పండటంతో పాటు చీడపీడల బెడద కూడా తగ్గుతుందని చెబుతారు. దీన్ని 2%కి పెంచుకోగలిగితే ఆ భూములు నిజంగా బంగారు భూములే అంటారు. పదేళ్లుగా శ్రద్ధాసక్తులతో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న అతికొద్ది మంది రైతులు తమ భూముల్లో సేంద్రియ కర్బనాన్ని 2% వరకు పెంచుకోగలగటం మనకు తెలిసిందే.

అయితే, ఒక్క ఏడాదిలోనే సేంద్రియ కర్బనాన్ని ఏకంగా 6 శాతానికి పెంచుకునే ‘అద్భుత సజీవ సేద్య పద్ధతుల’ను కనిపెట్టామని అహ్మదాబాద్ (గుజరాత్) కు చెందిన మహేశ్ మహేశ్వరి అనే ఆవిష్కర్త ఘంటాపథంగా చెబుతున్నారు. రసాయనిక వ్యవసాయం నుంచి సేంద్రియ వ్యవసాయానికి మారే రైతులు తొలి ఏడాదిలోనే దిగుబడి పెంచుకునేందుకు ఈ పద్ధతులు తోడ్పడుతున్నాయని ఇప్పటికే 130 మంది రైతుల ద్వారా ఆచరణలో రుజువైందన్నారు.

అనేక ఏళ్ల క్రితం నుంచి తాము జరిపిన పరిశోధనల ఫలితంగా ఈ అద్భుత ఫలితాలు సాధిస్తున్నామని మిరకిల్స్ అగ్రి గ్రీన్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకులు మహేశ్ మహేశ్వరి, ఆయన సోదరి సెజల్ మహేశ్వరి తెలిపారు.

అహ్మదాబాద్‌లోని స్వామి నారాయణ్ విద్యా సంస్థాన్ ఆవరణలోని వీరి పరిశోధనా వ్యవసాయ క్షేత్రాన్ని ఇటీవల సందర్శించిన ‘సాక్షి సాగుబడి’ ప్రతినిధితో వారు తమ ‘సజీవ సేద్యం’ గురించి ఎన్నెన్నో ఆసక్తికరమైన, ఆశ్చర్యకరమైన, ఆచరణాత్మకమైన, పరీక్షల్లో నిర్ధారిత అనుభవాలను పంచుకున్నారు.

వెన్ను కేన్సర్‌ను జయించి...

58 ఏళ్ల మహేశ్ మహేశ్వరి మెకానికల్ ఇంజనీర్, చార్టర్డ్ ఎకౌంటెంట్. ఐఐఎం అహ్మదాబాద్‌లో ఎంబీఏ పూర్తి చేశారు. 2011లో వెన్నుపూస కేన్సర్ బారిన పడిన ఆయన ఐదారేళ్లు మంచానికే పరిమితమయ్యారు. ఆ క్రమంలో జరిపిన అధ్యయనంలో వ్యవసాయ రసాయనాలతో కూడిన ఆహారం వల్ల కడుపులోని సూక్ష్మజీవరాశి (గట్ మైక్రోబ్స్) నశించటమే కేన్సర్ రావటానికి ఒక మూల కారణమని 2013–14లో గుర్తించారు. ఆ క్రమంలో కొన్నేళ్లపాటు జరిపిన పరిశోధనల ఫలితంగా కేన్సర్‌ను జయించి పునరుజ్జీవం పొందారు! అంతేకాకుండా.. మట్టిలో పేరుకుపోయిన వ్యవసాయక రసాయనాల అవశేషాలను వేగవంతంగా ఒకే సంవత్సరంలో నిర్మూలించటంతో పాటు, పోషకాల సాంద్రతతో కూడిన స్వచ్ఛమైన సేంద్రియ ఆహారోత్పత్తులను పండించుకునేందుకు వీలుకల్పించే అద్భుత ద్రవ, ఘన ఎరువులను.. బయో పెస్టిసైడ్స్‌ను ఆవిష్కరించారు.

తాగు/సాగు నీటిలో.. తినే ఆహారంలో పోషకాల సాంద్రత, సమగ్రతతో పాటు రసాయనిక అవశేషాలను పూర్తిగా నిర్మూలించటం ద్వారా ప్రజలకు పౌష్టికాహార, ఆరోగ్య భద్రత చేకూరుతుంది. రైతులకు ఆదాయ భద్రత లభిస్తుందని, గోశాలలకు ఆర్థిక స్వావలంబన చేకూరుతుందని అంటారు మహేశ్.

పురుగుమందుల అవశేషాలు ఏడాదిలోనే విచ్ఛిన్నం!

రసాయనిక వ్యవసాయం నుంచి సేంద్రియ వ్యవసాయం వైపు మారే రైతులకు గో ఆధారిత సజీవ సేద్య పద్ధతి చాలా సౌలభ్యంగా ఉంటుంది. ఈ పద్ధతిలో దేశీ ఆవును డీటాక్స్ చేసిన తర్వాత సూక్ష్మజీవరాశి పెరిగిన శుద్ధమైన పేడ, మూత్రం వాడుతాం. వీటితో తయారు చేసే సేంద్రియ ఎరువులో పంటల వేర్లు ఉపయోగించుకోవడానికి అనువైన రూపంలో ఉండే కర్బనం 30–40% అధికంగా ఉంది. మట్టిలో సేంద్రియ కర్బనాన్ని వెనువెంటనే 2%కి పెంచే సామర్థ్యం దీనికి ఉంది. హెచ్‌డిపిఇ ట్యూబ్ ద్వారా యాక్టివేటెడ్ కార్బన్ అడ్వాన్స్‌డ్ ద్రవ జీవామృతం క్రమం తప్పకుండా వాడుతూ ఉంటే సేంద్రియ కర్బనం ఏడాదిలో 6% వరకు పెరుగుతుంది. ట్యూబ్‌లో ఆవు పేడ, మూత్రంతో పాటు కూరగాయలు, పండ్ల వ్యర్థాలను కూడా వేస్తాం. అవి 30 రోజుల్లో పూర్తిగా కుళ్లిపోతాయి. నలకలు కూడా లేని శుద్ధమైన ద్రవజీవామృతం లభిస్తుంది. ఇందులో మొక్కలకు లభ్య రూపంలోని కర్బనం 15% వరకు ఉంటుంది. సాధారణ జీవామృతంలో 2–3% మాత్రమే ఉంటుంది.

ఎకరానికి రూ. 10 లక్షలు

లైవ్ వాటర్ బయో చిప్ ద్వారా టీడీఎస్ తగ్గించి, పిహెచ్ న్యూట్రల్ చేసి జీవవంతంగా మార్చిన నీటిని పంటలకు, పశువులకు అందిస్తున్నాం. జొన్న+సజ్జ కలిపి తయారు చేసిన నేపియర్ గడ్డి దిగుబడి సాధారణంగా ఎకరానికి ఏడాదికి 100–150 క్వింటాళ్లు వస్తున్నది. రైతుకు రూ. 2–4 లక్షల ఆదాయం వస్తోంది. మా పద్ధతి పాటిస్తే ఎకరానికి ఏడాదిలో 500–1,000 టన్నుల సేంద్రియ గడ్డి ఉత్పత్తి అవుతుంది. 20 అడుగుల ఎత్తు పెరుగుతుంది. ఇందులో 16% ప్రొటీన్, 7% కొవ్వు, 10% సుగర్ ఉంటుంది. ఆదాయం కనీసం ఎకరానికి ఏటా రూ.10 లక్షలు వస్తుంది. ఈ గడ్డిని కనీసం పదెకరాలు ఒకచోట సాగు చేస్తే.. పెలెట్లు తయారు చేయొచ్చు. పశువులకు, కోళ్లకు, చేపలకు దాణాగా వేయొచ్చు. ఈ పెల్లెట్లను బాయిలర్లలో బొగ్గుకు బదులు బయో ఇంధనంగా వాడొచ్చు. ఈ సేంద్రియ గడ్డి వల్ల, 12 రకాల హైడ్రోపోనిక్ మొలక గడ్డి మేపు వల్ల ఆవుల ఆరోగ్యం, పాల నాణ్యత, కొవ్వు శాతం గణనీయంగా పెరుగుతాయి. ఆవు నిర్వహణ ఖర్చు 70–80% తగ్గిపోతుంది. పాలివ్వని ఆవుల ద్వారా కూడా రైతులకు, గోశాలలకు ఆదాయం పెరుగుతుంది. సజీవ సేద్యం వల్ల రైతులకు ఎరువులు, పురుగుమందుల ఖర్చు మూడేళ్లలో దశలవారీగా 50% తగ్గుతుంది. మొదటి ఏడాది కూడా దిగుబడి తగ్గదు. దిగుబడి 3 ఏళ్లలో 50–75% పెరుగుతుంది. మట్టిలోని 606 రకాల రసాయనిక పురుగుమందుల అవశేషాలు మొదటి ఏడాదే విచ్ఛిన్నమైపోతాయి. నేల, పంట దిగుబడులు కూడా మొదటి ఏడాదిలోనే పూర్తి ఆర్గానిక్‌గా మారిపోతాయి. పౌష్టిక విలువలు మాత్రం మూడేళ్లలో దశలవారీగా ఏడాదికి 25% పెరుగుతుంది.



- మహేశ్ మహేశ్వరి, సజీవ సేద్యం ఆవిష్కర్త, అహ్మదాబాద్, గుజరాత్

(సెజల్ మహేశ్వరి –97256 38432 హిందీ/ ఇంగ్లిష్)
miraclemoringa14@gmail.com

సాగుబడి
భరణి కార్తె : మే 10 వరకు

ప్రక్షాళన దేశీ ఆవుతోనే ప్రారంభం!

వ్యవసాయానికి, మన ఆహారానికి, మన నేలల ఆరోగ్యానికి దేశీ ఆవే కేంద్ర బిందువని మహేశ్ భావించారు. ఆవు పేడ, మూత్రం, పాలను జీవశక్తిమంతంగా, పోషకవంతంగా, రసాయన రహితంగా మార్చుకోవాలంటే.. ప్రక్షాళన ప్రక్రియను ఆవుతోనే ప్రారంభించాలి. ఆవు దేహంలో పేరుకుపోయిన పురుగుమందుల అవశేషాలను నిర్మూలించాలి. అందు కోసం ఆవు దేహాన్ని శుద్ధి చేయటం, ముఖ్యవనరైన నీటిని శుద్ధి చేసుకోవటంతో ‘సజీవ సేద్యం’ ప్రారంభమవుతుంది. ఆవు డీటాక్స్ ప్రక్రియకు 90 రోజులు పడుతుంది. ఆ తర్వాత పేడ, మూత్రం నుంచి దుర్వాసన రాదు. శుద్ధమైన దేశీ ఆవు పేడ, మూత్రంతో ప్రత్యేక పద్ధతిలో తయారు చేసుకునే అధిక కర్బనంతో కూడిన ద్రవ– ఘన ఎరువుల్లో జీవశక్తి, పోషకాలు, లభ్యస్థితిలోని కర్బనం అధిక పాళ్లలో ఉంటుంది. 40 రకాల ఔషధ మొక్కల రసాలతో తయారు చేసే బయో పెస్టిసైడ్స్ వాడకంతో అతి తక్కువ కాలంలోనే మట్టిని పూర్తిగా శుద్ధి చేసి జీవశక్తి నింపి పునరుజ్జీవింప చేసుకోవటంతో వ్యవసాయ –ఆహార వ్యవస్థను ఆసాంతం ప్రక్షాళన చేసే ఈ ప్రక్రియ పూర్తవుతుందని మహేశ్ విశదీకరించారు. ఇటువంటి స్వచ్ఛమైన ఆహారమే మనుషులకు, పశువులకు సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇవ్వగలదని ఆయన అంటున్నారు.

ఎకోసెర్ట్ సర్టిఫికేషన్

మహేశ్ మహేశ్వరి తన ఆవిష్కరణలపై పేటెంట్‌కు దరఖాస్తు చేశారు. వీరు ఆవిష్కరించిన ద్రవ రూప, ఘనరూప ఎరువులకు, జీవన పురుగుమందులు ఫర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ (ఎఫ్‌సిఓ) ప్రమాణాలకు తగినట్లుగా ఉన్నాయని భారత ప్రభుత్వం సర్టిఫై చేసింది. ఈ ఉత్పత్తులతో కూడిన సజీవ సేద్య పద్ధతికి అంతర్జాతీయ ‘ఎకోసెర్ట్’ సర్టిఫికేషన్ సైతం లభించటం విశేషం. ఈ సర్టిఫికేషన్‌కు 130 దేశాల్లో గుర్తింపు ఉంది.

నిర్వహణ: **పంతంగి రాంబాబు,** సాగుబడి డెస్క్



'టాప్స్'లోకి దీపిక కుమారి

రెండేళ్ల తర్వాత భారత మహిళా స్టార్ ఆర్చర్, 'ట్రిపుల్ ఒలింపియన్ దీపిక కుమారికి టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ (టాప్స్)లో చోటు కల్పించారు. ఫామ్‌లో లేకపోవడంతో 2022 జనవరిలో కేంద్ర క్రీడా శాఖ దీపికను 'టాప్స్' నుంచి తొలగించింది. 2022 డిసెంబర్‌లో పాపకు జన్మనిచ్చిన దీపిక ఏడాదిపాటు ఆటకు దూరంగా ఉంది. ఈ ఏడాది జనవరిలో ఆసియా కప్ టోర్నీలో స్వర్ణంతో దీపిక పునరాగమనం చేసింది. ఆదివారం ముగిసిన ప్రపంచకప్ టోర్నీలో దీపిక రజత పతకం నెగ్గి సత్తా చాటుకుంది.

కెరీర్ బెస్ట్ రెండో ర్యాంక్‌లో జ్యోతి సురేఖ


ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-1 టోర్నీలో మూడు స్వర్ణ పతకాలతో మెరిసిన ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ తన కెరీర్ బెస్ట్ ర్యాంక్‌ను అందుకుంది. సోమవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో సురేఖ కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో 299 పాయింట్లతో రెండో ర్యాంక్‌లో నిలిచింది. గత ర్యాంకింగ్స్‌లో సురేఖ మూడో ర్యాంక్‌లో ఉంది. మహిళల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో దీపిక కుమారి 103 స్థానాలు ఎగబాకి 39వ ర్యాంక్‌కు చేరుకుంది. పురుషుల రికర్వ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ ధీరజ్ 18వ ర్యాంక్‌లో ఉన్నాడు.



కోల్‌కతా అలవోకగా...

సొంత మైదానంలో మూడు రోజుల క్రితం 261 పరుగులు చేసి కూడా ఓడి షాక్‌కు గురైన కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) తర్వాతి మ్యాచ్‌లోనే తేరుకుంది. అదే ఈడెన్ గార్డెన్స్ మైదానంలో ఈసారి చక్కటి బౌలింగ్ ప్రదర్శనతో ప్రత్యర్థిపై పైచేయి సాధించింది. బౌలర్లు సమష్టిగా రాణించడంతో ఢిల్లీని తక్కువ స్కోరుకే పరిమితం చేసిన కేకేఆర్ ఆ తర్వాత పెద్దగా శ్రమ లేకుండా లక్ష్యాన్ని ఛేదించింది. మరోవైపు ఢిల్లీ గడ్డపై గత రెండు మ్యాచ్‌లు గెలిచి మళ్లీ దారిలో పడినట్లు కనిపించిన క్యాపిటల్స్ పేలవ బ్యాటింగ్‌తో తమ ఓటమికి బాట వేసుకుంది.

- నైట్‌రైడర్స్‌కు కీలక విజయం
- 7 వికెట్లతో ఓడిన ఢిల్లీ
- రాణించిన సాల్ట్, వరుణ్



ఫిల్ సాల్ట్



వరుణ్ చక్రవర్తి

కోల్‌కతా: పరుగుల వరద పారుతున్న ఐపీఎల్‌లో మరో చిన్న విరామం. తొలుత బ్యాటింగ్ చేసిన జట్టు స్వల్ప స్కోరుకే ఆట ముగించగా... ప్రత్యర్థి సులువుగానే లక్ష్యం చేరింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ 7 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 153 పరుగులు చేసింది. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ (26 బంతుల్లో 35 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలవడం విశేషం. కోల్‌కతా లెగ్ స్పిన్నర్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' వరుణ్ చక్రవర్తి 16 పరుగులిచ్చి 3 వికెట్లు తీసి ఢిల్లీని కట్టడి చేశాడు. అనంతరం కోల్‌కతా 16.3 ఓవర్లలో 3 వికెట్లకు 157 పరుగులు చేసి గెలిచింది. ఫిల్ సాల్ట్ (33 బంతుల్లో 68; 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) అర్ధ సెంచరీ చేయగా... శ్రేయస్ అయ్యర్ (23 బంతుల్లో 33 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్), వెంకటేశ్ అయ్యర్ (23 బంతుల్లో 26 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) నాలుగో వికెట్‌కు అభేద్యంగా 57 పరుగులు జోడించి మ్యాచ్‌ను ముగించారు.

సమష్టి వైఫల్యం...

స్టార్క్ వేసిన తొలి ఓవర్లో 3 ఫోర్లతో మొదలు పెట్టినా... పృథ్వీ షా (13) ఎక్కువసేపు నిలవలేదు. స్టార్క్ తర్వాతి ఓవర్లోనే వరుసగా 6, 4 కొట్టిన జేక్ ఫ్రేజర్ (12) తర్వాతి బంతికి వెనుదిరగడంతో ఢిల్లీకి ఆశించిన ఆరంభం లభించలేదు. షై హోప్ (6) విఫలం కాగా... హర్షిత్ ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్ కొట్టిన అభిషేక్ పొరేల్ (18) కూడా జోరు కొనసాగించలేకపోయాడు. పవర్‌ప్లే ముగిసేసరికి ఢిల్లీ స్కోరు 67 పరుగులకు చేరింది. కెప్టెన్ రిషభ్ పంత్ (20 బంతుల్లో 27; 2 ఫోర్లు, 1 సిక్స్) కూడా తనదైన శైలిలో ఆడలేకపోవడంతో క్యాపిటల్స్ ఇన్నింగ్స్‌లో ఎలాంటి మెరుపులు కనిపించలేదు. 18 పరుగుల వద్ద తాను ఇచ్చిన సునాయాస క్యాచ్‌ను హర్షిత్ వదిలేయడంతో బతికిపోయిన పంత్ దానిని వాడుకోలేకపోయాడు. ఎనిమిది పరుగుల వ్యవధిలో పంత్, స్టబ్స్ (4), అక్షర్ (15) వెనుదిరగ్గా... 101/7 వద్ద ఢిల్లీ ఇన్నింగ్స్ ముగిసేలా కనిపించింది. అయితే కుల్దీప్ కొన్ని చక్కటి షాట్లతో చివరి వరకు నిలబడటంతో క్యాపిటల్స్ 150 పరుగులు దాటగలిగింది.

భారీ భాగస్వామ్యం...

ఛేదనలో తొలి బంతి నుంచే సాల్ట్ దూకుడు మొదలైంది. లిజాడ్ వేసిన మొదటి ఓవర్లో సాల్ట్ 2 ఫోర్లు, సిక్స్ బాదగా మొత్తం 23 పరుగులు వచ్చాయి. ఆపై 15 పరుగుల వద్ద సాల్ట్ ఇచ్చిన క్యాచ్‌ను లిజాడ్ వదిలేశాడు. ఖలీల్ ఓవర్లో 3 ఫోర్లు, సిక్స్ బాదిన సాల్ట్ 26 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 6 ఓవర్లలో కేకేఆర్ 79 పరుగులు సాధించింది. అయితే అక్షర్ తన తొలి రెండు ఓవర్లలో ఓపెనర్లు ఇద్దరినీ అవుట్ చేయగా, రింకూ సింగ్ (11) విఫలమయ్యాడు. అయితే 'అయ్యర్' ద్వయం ఇబ్బంది లేకుండా ఆడి మరో 21 బంతులు మిగిలి ఉండగానే గెలిపించింది.

స్కోరు వివరాలు

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: పృథ్వీ షా (సి) సాల్ట్ (బి) అరోరా 13; జేక్ ఫ్రేజర్ (సి) వెంకటేశ్ (బి) స్టార్క్ 12; పొరేల్ (బి) హర్షిత్ 18; హోప్ (బి) అరోరా 6; పంత్ (సి) శ్రేయస్ (బి) వరుణ్ 27; అక్షర్ (బి) నరైన్ 15; స్టబ్స్ (సి) సాల్ట్ (బి) వరుణ్ 4; కుశాగ్ర (సి) సాల్ట్ (బి) వరుణ్ 1; కుల్దీప్ (నాటౌట్) 35; సలామ్ (సి) శ్రేయస్ (బి) హర్షిత్ 8; లిజాడ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 153. వికెట్ల పతనం:** 1-17, 2-30, 3-37, 4-68, 5-93, 6-99, 7-101, 8-111, 9-140. **బౌలింగ్:** స్టార్క్ 3-0-43-1, అరోరా 4-0-29-2, హర్షిత్ 4-0-28-2, నరైన్ 4-0-24-1, వరుణ్ చక్రవర్తి 4-0-16-3, రసెల్ 1-0-10-0.

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: సాల్ట్ (బి) అక్షర్ 68; నరైన్ (సి) ఫ్రేజర్ (బి) అక్షర్ 15; రింకూ (సి) కుల్దీప్ (బి) లిజాడ్ 11; శ్రేయస్ (నాటౌట్) 33; వెంకటేశ్ (నాటౌట్) 26; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (16.3 ఓవర్లలో 3 వికెట్లకు) 157. వికెట్ల పతనం:** 1-79, 2-96, 3-100. **బౌలింగ్:** లిజాడ్ 3-0-38-1, ఖలీల్ అహ్మద్ 3-0-28-0, సలామ్ 2.3-0-30-0, అక్షర్ పటేల్ 4-0-25-2, కుల్దీప్ 4-0-34-0.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	9	8	1	16	0.694
కోల్‌కతా	9	6	3	12	1.096
చెన్నై	9	5	4	10	0.810
హైదరాబాద్	9	5	4	10	0.075
లక్నో	9	5	4	10	0.059
ఢిల్లీ	11	5	6	10	-0.442
గుజరాత్	10	4	6	8	-1.113
పంజాబ్	9	3	6	6	-0.187
ముంబై	9	3	6	6	-0.261
బెంగళూరు	10	3	7	6	-0.415

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

లక్నో X ముంబై
వేదిక: లక్నో
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

పారిస్ ఒలింపిక్స్‌కు ఏడుగురు భారత షట్లర్లు


సింధు

న్యూఢిల్లీ: భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు వరుసగా మూడో ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించనుంది. 2016 రియో ఒలింపిక్స్‌లో రజతం, 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం నెగ్గిన సింధు...ఈ ఏడాది జూలై-ఆగస్టులలో జరిగే పారిస్ ఒలింపిక్స్ కూడా అర్హత సాధించింది. సోమవారంతో ఒలింపిక్ క్వాలిఫయింగ్ గడువు ముగిసింది. భారత్ నుంచి ఏడుగురికి బెర్త్‌లు లభించాయి. నిబంధనల ప్రకారం పురుషుల, మహిళల సింగిల్స్‌లో టాప్-16లో నిలిచిన క్రీడాకారులకు ఒలింపిక్ బెర్త్‌లు అధికారికంగా ఖరారవుతాయి. ప్రస్తుతం సింధు 12వ ర్యాంక్‌లో ఉంది. పురుషుల సింగిల్స్‌లో భారత ఆటగాళ్లు ప్రణయ్ (9వ ర్యాంక్), లక్ష్య సేన్ (13వ ర్యాంక్) తొలిసారి ఒలింపిక్స్‌లో పోటీపడనున్నారు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి రెండోసారి ఒలింపిక్స్‌కు అర్హత పొందారు. మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో జోడీకి ఒలింపిక్ బెర్త్ దక్కింది. అశ్వినికిది మూడో ఒలింపిక్స్‌కాగా, తనీషా తొలిసారి విశ్వ క్రీడల్లో పోటీపడనుంది.

క్వార్టర్ ఫైనల్లో భారత్

- ఇంగ్లండ్‌పై 5-0తో విజయం
- థామస్ కప్ బ్యాడ్మింటన్ టోర్నీ


చిరాగ్, సాత్విక్

చెంగ్డూ (చైనా): డిఫెండింగ్ చాంపియన్ భారత పురుషుల జట్టు థామస్ కప్ బ్యాడ్మింటన్ టీమ్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. గ్రూప్ 'సి'లో సోమవారం జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లో భారత్ 5-0తో ఇంగ్లండ్‌ను చిత్తుగా ఓడించింది. తొలి మ్యాచ్‌లో ప్రణయ్ 21-15, 21-15తో హ్యారీ హంగ్‌పై గెలిచి భారత్‌కు 1-0తో శుభారంభం ఇచ్చాడు. రెండో మ్యాచ్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ 21-17, 19-21, 21-15తో బెన్ లేన్-సీన్ వెండీ జంటపై గెలిచి ఆధిక్యాన్ని 2-0కు పెంచింది. మూడో మ్యాచ్‌లో ప్రపంచ మాజీ నంబర్‌వన్, ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ కిడాంబి శ్రీకాంత్ 21-16, 21-11తో నదీమ్ డాల్వీపై నెగ్గడంతో భారత్ 3-0తో విజయాన్ని ఖరారు చేసుకుంది. నాలుగో మ్యాచ్‌లో అర్జున్-ధ్రువ్ కపిల జంట 21-17, 21-19తో రోరీ ఈస్టన్-అలెక్స్ గ్రీన్ ద్వయంపై గెలిచింది. చివరిదైన ఐదో మ్యాచ్‌లో కిరణ్ జార్జ్ 21-18, 21-12తో చోలన్ కేయాన్‌ను ఓడించడంతో భారత్ 5-0తో క్లీన్‌స్వీప్ చేసింది. గ్రూప్ తొలి మ్యాచ్‌లో భారత్ 4-1తో థాయ్‌లాండ్‌పై గెలుపొందింది. రేపు జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 14 సార్లు చాంపియన్ ఇండోనేసియాతో తలపడుతుంది. ఈ మ్యాచ్‌లో నెగ్గిన జట్టు గ్రూప్ టాపర్‌గా నిలుస్తుంది.

రచిన్, హెన్రీలకు తొలిసారి చోటు

టి20 ప్రపంచకప్‌కు న్యూజిలాండ్ జట్టు ఎంపిక

ఆక్లాండ్: వెస్టిండీస్, అమెరికాలలో జూన్‌లో జరిగే టి20 ప్రపంచకప్‌లో పాల్గొనే న్యూజిలాండ్ జట్టును సోమవారం ప్రకటించారు. ఓపెనర్ రచిన్ రవీంద్ర, బౌలర్ మ్యాట్ హెన్రీలు తొలిసారి టి20 ప్రపంచకప్ కోసం ఎంపికయ్యారు. గత ఏడాది భారత్ ఆతిథ్యమిచ్చిన వన్డే వరల్డ్‌కప్‌లో రచిన్ 10 మ్యాచ్‌లు ఆడి 3 సెంచరీలు, 2 అర్ధ సెంచరీలతో కలిపి మొత్తం 578 పరుగులు చేసి అందర్నీ ఆకట్టుకున్నాడు. 15 మంది సభ్యులతో కూడిన కివీస్ జట్టుకు నాలుగోసారి విలియమ్సన్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. గాయంతో ఐపీఎల్‌కు దూరమైన స్టార్ ఓపెనర్ కాన్వేను, సెంట్రల్ కాంట్రాక్టుకు దూరమైన సీమర్ బౌల్ట్‌ను ఈ మెగా ఈవెంట్‌కు ఎంపిక చేశారు. బౌల్ట్‌కిది ఐదో టి20 ప్రపంచకప్ కానుంది. ఈ టోర్నీలో కివీస్ ఆటగాళ్లు ధరించే కొత్త జెర్సీలను కూడా విడుదల చేశారు.


కొత్త జెర్సీలతో కివీస్ క్రికెటర్లు

న్యూజిలాండ్ జట్టు: విలియమ్సన్ (కెప్టెన్), కాన్వే, రచిన్ రవీంద్ర, మిచెల్, బ్రేస్‌వెల్, చాప్‌మన్, ఫిన్ అలెన్, గ్లెన్ ఫిలిప్స్, నీషమ్, బౌల్ట్, ఫెర్గూసన్, హెన్రీ, సాన్‌ట్నర్, ఇష్ సోధి, సౌతీ.

బ్యాచ్ ఓపెన్ స్క్వాష్ టోర్నీ విజేత వెలవన్



పారిస్: భారత స్క్వాష్ ప్లేయర్ వెలవన్ సెంథిల్ కుమార్ తన కెరీర్‌లో ఎనిమిదో ప్రొఫెషనల్ స్క్వాష్ అసోసియేషన్ (పీఎస్ఏ) టైటిల్‌ను సాధించాడు. పారిస్‌లో జరిగిన బ్యాచ్ ఓపెన్ చాలెంజర్ టోర్నీలో తమిళనాడుకు చెందిన 26 ఏళ్ల వెలవన్ విజేతగా నిలిచాడు. ఫైనల్లో ప్రపంచ 58వ ర్యాంకర్ వెలవన్ 11-6, 11-9, 11-6తో మెల్విల్ సియానిమానికో (ఫ్రాన్స్)పై గెలుపొంది ఈ ఏడాది తన ఖాతాలో తొలి టైటిల్‌ను జమ చేసుకున్నాడు. ఈ సంవత్సరం నాలుగు టోర్నీలలో పాల్గొన్న వెలవన్ రెండింటిలో క్వార్టర్ ఫైనల్ చేరి, మరో రెండింటిలో రెండో రౌండ్‌లో ఓడిపోయాడు.

సినిమా

షూటింగ్... పార్టీయింగ్...


ఎన్టీఆర్

ఎన్టీఆర్ ముంబైలో బిజీ బిజీగా ఉంటున్నారు. ఓ వైపు షూటింగ్‌లో పాల్గొంటూనే.. మరోవైపు బాలీవుడ్ స్టార్స్‌తో పార్టీల్లో సందడి చేస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. 'వార్ 2' సినిమాతో బాలీవుడ్‌లో ఎంట్రీ ఇస్తున్నారు ఎన్టీఆర్. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో హృతిక్ రోషన్, ఎన్టీఆర్ నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ముంబైలో జరుగుతోంది. ఈ మూవీ చిత్రీకరణ కోసం అక్కడే ఉన్నారు ఎన్టీఆర్. 'వార్ 2' షూటింగ్‌లో బిజీ బిజీగా ఉంటున్న ఆయన పార్టీలనూ ఎంజాయ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే ముంబైలోని ఓ హోటల్‌లో జరిగిన పార్టీలో సతీమణి లక్ష్మీ ప్రణతితో కలిసి పాల్గొన్నారు ఎన్టీఆర్. ఈ పార్టీలో బాలీవుడ్ హీరోలు హృతిక్ రోషన్, రణబీర్ కపూర్, హీరోయిన్ ఆలియా భట్, దర్శక-నిర్మాత కరణ్ జోహార్‌తో పాటు పలువురు సెలబ్రిటీలు సందడి చేశారు. పార్టీ జరుగుతున్న హోటల్ వద్దకి పెద్ద సంఖ్యలో ఫ్యాన్స్ తరలి వచ్చారు. ఎన్టీఆర్‌తో ఫొటోల కోసం వారు ఆసక్తిగా ఎదురు చూశారు. ఓ లేడీ ఫ్యాన్ అయితే.. 'ఎన్టీఆర్ సార్.. ఈ రోజు నా బర్త్ డే.. మీతో సెల్ఫీ దిగాలని ఉంది' అంటూ రిక్వెస్ట్ చేయడంతో.. ఆమెతో ఫొటో దిగారు ఎన్టీఆర్. ఇక హిందీలో 'వార్ 2'తో పాటు తెలుగులో కొరటాల శివ దర్శకత్వంలో 'దేవర' సినిమా చేస్తున్నారు ఎన్టీఆర్.


కోవై సరళ, తమన్నా, రాశీ ఖన్నా, ఖుష్బూ, జాన్వీ నారంగ్

బాక్ సరికొత్త అనుభూతి ఇస్తుంది

– తమన్నా

"'బాక్' మూవీ ట్రైలర్ చూస్తే సుందర్‌గారు ఎంత ప్రతిభ ఉన్న డైరెక్టరో తెలుస్తుంది. షూటింగ్‌లో చాలా ఎంజాయ్ చేస్తూ ఈ సినిమా చేశాం. సరికొత్త అనుభూతిని ఇచ్చే చిత్రం ఇది" అని హీరోయిన్ తమన్నా అన్నారు. సుందర్ .సి కీలక పాత్రలో నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'అరణ్మనై 4'. తమన్నా, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటించారు. అవ్ని సినిమాక్స్‌పై ఖుష్బూ సుందర్, ఏసీఎస్ అరుణ్ కుమార్ నిర్మించారు. ఈ మూవీని 'బాక్' పేరుతో ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్‌ఎల్‌పీ తెలుగులో మే 3న రిలీజ్ చేస్తోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో ఖుష్బూ సుందర్ మాట్లాడుతూ– "దక్షిణాదిలో నా సినిమా జర్నీ సురేష్ ప్రొడక్షన్ నుంచే మొదలైంది. 'బాక్'ని తెలుగులో విడుదల చేస్తున్న సురేష్‌గారికి, జాన్వీకి థ్యాంక్స్. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ చిత్రం థియేటర్స్‌లో అదరగొడుతుంది" అన్నారు. "'బాక్'లో హారర్, గ్లామర్, థ్రిల్, కామెడీ.. ఇలా అన్నీ ఉన్నాయి" అన్నారు రాశీ ఖన్నా. "ఈ మూవీని థియేటర్స్‌లో చూడండి.. ఎంజాయ్ చేస్తారు "అన్నారు జాన్వీ నారంగ్. "చాలా కాలం తర్వాత 'బాక్'తో తెలుగు ప్రేక్షకుల ముందుకు రావడం హ్యాపీ" అన్నారు కోవై సరళ.


చెన్నైకి గేమ్


రామ్‌చరణ్

చెన్నైలో ఆట మొదలెట్టనున్నారు హీరో రామ్ చరణ్. ఆయన హీరోగా శంకర్ దర్శకత్వం వహిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'గేమ్ చేంజర్'. 'వినయ విధేయ రామ' మూవీ తర్వాత రామ్‌చరణ్, కియారా అద్వానీ మరోసారి 'గేమ్ చేంజర్'లో జోడీగా నటిస్తున్నారు. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రం తర్వాతి షెడ్యూల్ చెన్నైలో ప్రారంభం కానుందని సమాచారం. మే మొదటి వారంలో చెన్నైలో ప్రారంభం కానున్న ఈ షెడ్యూల్‌లో రామ్‌చరణ్, కియారా అద్వానీ, సునీల్, నవీన్ చంద్రలపై ప్రీ క్లైమాక్స్ సన్నివేశాలు తెరకెక్కించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారట శంకర్. కొన్ని కామెడీ సన్నివేశాలతో పాటు యాక్షన్ సీన్స్ తెరకెక్కిస్తారట. రాజకీయ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రంలో రామ్‌చరణ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారని టాక్.


ఆనంద్ దేవరకొండ

కోమాలోనే అంతరిక్షంలోకి..!



'ప్రాజెక్ట్ హేల్ మేరీ' పోస్టర్

అతనో స్కూల్ టీచర్. ఆ తర్వాత వ్యోమగామిగా మారతాడు. ఓ ఘటనతో కోమాలోకి వెళ్లిపోతాడు. అతను కోమా నుంచి మేల్కొనేసరికి అంతరిక్షంలో ఉంటాడు. అయితే జ్ఞాపక శక్తి కోల్పోతాడు. తన ముందున్న లక్ష్యం ఏంటి? అంతరిక్షంలోకి ఏ కారణం చేత పంపబడ్డాడు? తన మిషన్ ఏంటో అర్థం అయ్యాక అంతకు ముందు తాను పొందిన శాస్త్రీయ శిక్షణ సహాయంతో ఇతర సభ్యులతో కలిసి ఆ మిషన్‌ని ఎలా ఛేదించాడు? అనే కథాంశంతో రూపొందుతున్న హాలీవుడ్ చిత్రం 'ప్రాజెక్ట్ హేల్ మేరీ'. ర్యాన్ గోస్లింగ్ హీరోగా ఫిల్ లార్డ్, క్రిస్టోఫర్ మిల్లర్ దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. ఆండీ వీర్ రాసిన పాపులర్ నవల 'ది మార్షియన్' ఆధారంగా 'ప్రాజెక్ట్ హేల్ మేరీ' రూపొందుతోంది. ఈ చిత్రం వచ్చే ఏడాది మార్చి 20న విడుదల కానుంది. అంతరిక్ష సాహస ప్రయాణం నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రం ఓ విజువల్ వండర్‌లా ఉంటుందని హాలీవుడ్ అంటోంది. ఇక... ఈ చిత్రం విడుదలయ్యే వారాంతంలో ఇప్పటికి వేరే భారీ చిత్రాల విడుదల ఖరారు కాకపోవడం 'ప్రాజెక్ట్ హేల్ మేరీ'కి ఓ ప్లస్ పాయింట్ అని హాలీవుడ్ ట్రేడ్ భావిస్తోంది.

మేలో గణేశా

'బేబి' వంటి బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత ఆనంద్ దేవరకొండ హీరోగా నటిస్తున్న చిత్రం 'గం.. గం... గణేశా'. ఉదయ్ శెట్టి దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ సినిమాలో ప్రగతి శ్రీవాస్తవ, కరిష్మా హీరోయిన్లుగా నటిస్తున్నారు. కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని మే 31న విడుదల చేయనున్నట్లు ప్రకటించి, కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు మేకర్స్. "సరికొత్త కంటెంట్‌తో ఈ వేసవిలో అన్ని వర్గాల ప్రేక్షకులను మా చిత్రం ఎంటర్‌టైన్ చేయనుంది" అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: ఆదిత్య జవ్వాడి, సంగీతం: చేతన్ భరద్వాజ్, సహ నిర్మాత: అనురాగ్ పర్వతనేని.

సర్‌ప్రైజ్ అవుతారు


మణికంఠ

"యూనిక్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'ప్రసన్న వదనం'. ఫేస్ బ్లైండ్‌నెస్ కాన్సెప్ట్‌తో రూపొందింది. అన్ని వర్గాల ప్రేక్షకులు సర్‌ప్రైజ్ అయ్యే కంటెంట్ మా మూవీలో ఉంది" అని నిర్మాత జేఎస్ మణికంఠ అన్నారు. సుహాస్ హీరోగా, పాయల్ రాధాకృష్ణ, రాశీ సింగ్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ప్రసన్న వదనం'. డైరెక్టర్ సుకుమార్ వద్ద అసోసియేట్‌గా చేసిన అర్జున్ వైకే దర్శకత్వం వహించారు. జేఎస్ మణికంఠ, టీఆర్ ప్రసాద్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం మే 3న విడుదలవుతోంది. జేఎస్ మణికంఠ మాట్లాడుతూ– "'కలర్ ఫోటో', 'ఫ్యామిలీ డ్రామా' చిత్రాలకు సహ నిర్మాతగా చేశాను. అర్జున్ చెప్పిన 'ప్రసన్న వదనం' కథ నచ్చడంతో ఈ ప్రాజెక్ట్ మొదలైంది. మా మూవీకి తమిళంలో పెద్ద సంస్థ నుంచి ఆఫర్ వచ్చింది. డబ్బింగా? రీమేక్ చేయాలా? అనేది చర్చిస్తున్నాం" అన్నారు.

అజిత్‌కి జోడీగా...


మీనా


సిమ్రాన్

కోలీవుడ్‌లో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా నిలిచిన వార్తల్లో అజిత్ 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రానికి సంబంధించిన వార్త ఒకటి. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో తెలుగు నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మించనుంది. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటించనున్నారనే వార్త ప్రచారంలో ఉన్న సంగతి తెలిసిందే. తాజాగా సిమ్రాన్, మీనా పేర్లు వినిపిస్తున్నాయి. ఈ ఇద్దరూ అతిథి పాత్రల్లో కాదు.. అజిత్ సరసన హీరోయిన్లుగా నటిస్తారని టాక్. 'గుడ్ బ్యాడ్ అగ్లీ'లో అజిత్ మూడు పాత్రల్లో కనిపిస్తారట. మూడు పాత్రలకు ముగ్గురు హీరోయిన్లు ఉంటారని, శ్రీలీల, సిమ్రాన్, మీనాతో అజిత్ జతకడతారని చెన్నై కోడంబాక్కమ్ అంటోంది. ఈ వార్త నిజమైతే దాదాపు రెండు దశాబ్దాల తర్వాత సిమ్రాన్, మీనా అజిత్‌తో మళ్లీ స్క్రీన్ షేర్ చేసుకున్నట్లు అవుతుంది. 'అవళ్ వరువాళా (1998), వాలి' (1999) వంటి విజయవంతమైన చిత్రాల్లో అజిత్ సరసన నటించారు సిమ్రాన్. అలాగే అజిత్‌కి జోడీగా 'సిటిజెన్ (2001), విలన్' (2002) వంటి చిత్రాల్లో నటించారు మీనా. ఇప్పుడు మళ్లీ ఈ హీరో సరసన సిమ్రాన్, మీనా నటిస్తే దాదాపు రెండు దశాబ్దాలకు ఈ కాంబినేషన్ కుదిరినట్లు అవుతుంది. మేలో ఈ చిత్రం షూటింగ్‌ని ఆరంభించాలనుకుంటున్నారని సమాచారం. సో... అజిత్ సరసన శ్రీలీల, సిమ్రాన్, మీనా నటించనున్నారా? అనేది త్వరలో తెలిసిపోతుంది.

మహేశ్‌బాబు సినిమాలో...

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందనున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో ఓ కీలక పాత్రకు సిమ్రాన్‌ని ఎంపిక చేశారని సమాచారం. గతంలో 'యువరాజు' (2000) చిత్రంలో మహేశ్‌బాబు-సిమ్రాన్ జంటగా నటించిన సంగతి తెలిసిందే. ఇన్నేళ్ల తర్వాత ఈ ఇద్దరూ స్క్రీన్ షేర్ చేసుకోనున్నారనే వార్త ప్రచారంలో ఉంది. అయితే హీరో-హీరోయిన్‌గా కాదని, సిమ్రాన్‌ది అతిథి పాత్ర అని భోగట్టా. త్వరలో ఈ చిత్రానికి సంబంధించిన విశేషాలను రాజమౌళి ప్రకటించనున్నారట. మరి.. సిమ్రాన్ ఈ ప్రాజెక్ట్‌లో ఉన్నారా? లేదా అనే ప్రశ్నకు అప్పుడు సమాధానం దొరుకుతుంది.

పెళ్లంటే ఆ ఒక్కటీ అడక్కు అంటాడు


మల్లి అంకం

"మా సినిమాలో హీరోని పెళ్లెప్పుడు? అని అందరూ అడుగుతుంటారు. అప్పుడు ఆయన చెప్పే సమాధానమే 'ఆ ఒక్కటీ అడక్కు'. ఈ మూవీలోని వినోదం, భావోద్వేగాలు ప్రేక్షకుల మనసులను హత్తుకునేలా ఉంటాయి" అని డైరెక్టర్ మల్లి అంకం అన్నారు. 'అల్లరి' నరేశ్, ఫరియా అబ్దుల్లా జంటగా నటించిన చిత్రం 'ఆ ఒక్కటీ అడక్కు'. రాజీవ్ చిలక నిర్మించిన ఈ సినిమా మే 3న విడుదలవుతోంది. మల్లి అంకం మాట్లాడుతూ– "ఈవీవీ సత్యనారాయణగారి హిట్ మూవీ 'ఆ ఒక్కటీ అడక్కు'. అయితే ఆ సినిమాకి, మా కథకు సంబంధం లేదు. పెళ్లి చుట్టూ ఎలాంటి భావోద్వేగాలుంటాయి? కొందరు ఆ ఎమోషన్స్‌ని ఎలా క్యాష్ చేసుకుంటారు? వంటి అంశాలను వినోదాత్మకంగా, ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యేలా ప్రెజెంట్ చేశాం. పెళ్లి సంబంధాల విషయంలో ఎంత జాగ్రత్తగా ఉండాలో చూపించాం" అన్నారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
30-4-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	941	74,671
నిఫ్టీ ▲	223	22,643

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)

నాస్డాక్	16,004	▲	75
డోజోన్స్	38,401	▲	162
ఎఫ్టీఎస్ఈ 100	8,147	▲	7
డాక్స్	18,118	▼	43
షాంఘై	3,113	▲	24
నికాయ్	37,935	▲	306

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	72,373
బంగారం (99.5 స్వచ్ఛత)	72,083
వెండి (కిలో)	81,128

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		81.84	85.13
£	బ్రిటన్ పౌండ్		102.36	106.93
€	యూరో		87.44	91.55
¥	జపాన్ ఎన్ (100)		43.00	64.00
AUS	ఆస్ట్రేలియా డాలర్		52.71	56.97
S$	సింగపూర్ డాలర్		59.29	63.53
SAR	సౌదీ రియాల్		21.37	22.91
UAE D	యూఏఈ దిర్హామ్		21.85	23.62
¥	చైనా యువాన్		10.39	12.39

అధిక చార్జీల రిఫండ్

ఆర్థిక సంస్థలకు ఆర్బీఐ ఆదేశం



ముంబై: కొన్ని బ్యాంకులు, ఆర్థిక సంస్థలు వడ్డీ విధింపు విషయంలో అసమంజస విధానాలను పాటిస్తుండటంపై ఆందోళన వ్యక్తం చేసిన రిజర్వ్ బ్యాంక్.. దిద్దుబాటు చర్యలు తీసుకోవాల్సిందిగా వాటిని ఆదేశించింది. అలా అధికంగా వసూలు చేసిన వడ్డీలు, చార్జీలను కస్టమర్లకు తిరిగివ్వాలని ఒక సర్క్యులర్లో సూచించింది. పలు నియంత్రిత సంస్థలను (ఆర్ఈ) పరిశీలించిన మీదట వడ్డీ విషయంలో కొన్ని సంస్థలు అసమంజస విధానాలు పాటిస్తున్నాయని గుర్తించినట్లు ఆర్బీఐ తెలిపింది. కొన్ని ఆర్ఈలు వాస్తవంగా రుణాన్ని విడుదల చేసిన తేదీ నుంచి కాకుండా రుణాన్ని మంజూరు చేసిన తేదీ నుంచి లేదా రుణ ఒప్పందం కుదుర్చుకున్న తేదీ నుంచి వడ్డీ విధిస్తున్నాయని పేర్కొంది.

అల్ట్రాటెక్ సిమెంట్ లాభం 35 శాతం అప్ ..

- క్యూ4లో రూ. 2,259 కోట్లు
- ఆదాయం రూ. 20,418 కోట్లు; 9.5 శాతం వృద్ధి



న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో సిమెంట్ దిగ్గజం అల్ట్రాటెక్ సిమెంట్ లాభం (కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన) 35 శాతం ఎగిసి రూ. 2,259 కోట్లుగా నమోదైంది. ఆదాయం 9.5 శాతం పెరిగి రూ. 20,418 కోట్లకు చేరింది. ఇంధన, ముడివనరుల వ్యయాలు తగ్గడం, నిర్వహణ సామర్థ్యాలు మెరుగుపడటం, అమ్మకాలు పెరగడం తదితర అంశాలు సంస్థ సానుకూల పనితీరుకు దోహదపడ్డాయి. అంతక్రితం ఆర్థిక సంవత్సరం క్యూ4లో లాభం రూ. 1,670 కోట్లు కాగా ఆదాయం రూ. 18,662 కోట్లుగా నమోదైంది. తాజాగా మార్చి క్వార్టర్లో వ్యయాలు సుమారు 7 శాతం పెరిగి రూ. 17,381 కోట్లకు చేరాయి. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అమ్మకాల పరిమాణం 11 శాతం వృద్ధి చెంది 35.08 మిలియన్ టన్నులకు (ఎంటీ) చేరింది. దేశీయంగా విక్రయాలు 11 శాతం వృద్ధి చెందగా, సామర్థ్యాలను వినియోగం 98 శాతంగా ఉంది. మరోవైపు, పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ నికర లాభం 38 శాతం వృద్ధి చెంది రూ. 5,073 కోట్ల నుంచి రూ. 7,004 కోట్లకు చేరింది. ఆదాయం 12 శాతం పెరిగి రూ. 71,525 కోట్లుగా నమోదైంది.

సోమవారం అల్ట్రాటెక్ షేరు బీఎస్ఈలో సుమారు 3 శాతం పెరిగి రూ. 9,984 వద్ద ముగిసింది.

పీఎన్బీ హౌసింగ్ ఫైనాన్స్
ఆదాయం రూ. 1,806 కోట్లు




న్యూఢిల్లీ: మార్చితో ముగిసిన గత ఆర్థిక సంవత్సర నాలుగో త్రైమాసికంలో పీఎన్బీ హౌసింగ్ ఫైనాన్స్ లాభం 57 శాతం వృద్ధి చెంది రూ. 444 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ4లో ఇది రూ. 283 కోట్లు. ఇక సమీక్షాకాలంలో ఆదాయం రూ. 1,628 కోట్ల నుంచి రూ. 1,806 కోట్లకు పెరిగింది. మరోవైపు నికర వడ్డీ ఆదాయం 7 శాతం పెరిగి రూ. 632 కోట్లుగా నమోదైంది. నికర వడ్డీ మార్జిన్ మాత్రం 3.74 శాతం నుంచి 3.65 శాతానికి తగ్గింది. స్థూల మొండిబాకీలు (ఎన్పీఏ) 3.83 శాతం నుంచి 1.5 శాతానికి తగ్గగా, నికర ఎన్పీఏలు 0.95 శాతానికి పరిమితమయ్యాయి. నిర్వహణలోని అసెట్స్ పరిమాణం (ఏయూఎం) 7 శాతం వృద్ధితో రూ. 71,243 కోట్లకు చేరింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను సంస్థ లాభం 44 శాతం పెరిగి రూ. 1,046 కోట్ల నుంచి రూ. 1,508 కోట్లకు ఎగిసింది. మొత్తం ఆదాయం రూ. 6,492 కోట్ల నుంచి రూ. 7,024 కోట్లకు చేరింది.

జీవితకాల గరిష్టానికి ఇన్వెస్టర్ల సంపద

రూ. 406 లక్షల కోట్లకు చేరిక

- బుల్ బ్యాక్ ర్యాలీ నేపథ్యం
- బ్యాంకులు, ఫైనాన్స్ షేర్లకు డిమాండ్



ముంబై: స్టాక్ సూచీల నష్టాలు ఒకరోజుకు పరిమితమయ్యాయి. సెన్సెక్స్, నిఫ్టీలు సోమవారం ఒక శాతానికి పైగా లాభపడ్డాయి. అంచనాలకు మించి క్యూ4 ఆర్థిక ఫలితాల ప్రకటనతో బ్యాంకులు, ఫైనాన్స్ రంగాల షేర్లలో భారీ కొనుగోళ్లు నెలకొన్నాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూలతలు కలిసొచ్చాయి. క్రూడాయిల్ ధరలు దిగిరావడం, ఇరాన్–ఇజ్రాయెల్ ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం, డాలర్ ఇండెక్స్ బలహీనత వంటి అంశాలు సెంటిమెంట్ను బలపరిచాయి. ఫలితంగా సెన్సెక్స్ 941 పాయింట్లు పెరిగి 74,671 వద్ద నిలిచింది. నిఫ్టీ 223 పాయింట్లు బలపడి 22,643 వద్ద నిలిచింది.

సెన్సెక్స్ పరుగుతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలోని కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.2.48 లక్షల కోట్లు పెరిగి జీవితకాల గరిష్టం రూ.406 లక్షల కోట్ల వద్ద స్థిరపడింది. ఈ సూచీలోని 30 షేర్లలో హెచ్సీఎల్ టెక్(- 6%), ఐటీసీ (-0.44%), విప్రో(-0.37%), బజాజ్ఫిన్సర్వ్(-0.10%) మాత్రమే నష్టపోయాయి. ఆసియా మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు లాభాలతో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచి ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు ఆసక్తి చూపడంతో స్థిరంగా ముందుకు కదిలాయి. ఒక దశలో సెన్సెక్స్ 941 పాయింట్లు ఎగసి 74,671 వద్ద, నిఫ్టీ బలపడి 236 పాయింట్లు దూసుకెళ్లి 22,656 వద్ద ఇంట్రాడే గరిష్టాలను అందుకున్నాయి. ఐటీ, ఆటో, రియల్టీ మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్ఈ మిడ్, స్మాల్ సూచీలు వరుసగా 0.79%, 0.07% చొప్పున రాణించాయి.

ఆల్టైం హైకి బ్యాంక్ నిఫ్టీ: ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఎస్బీఐ బ్యాంక్, పీఎస్బీ షేర్లు ఇంట్రాడేలో ఏడాది గరిష్టానికి చేరుకోవడంతో ట్రేడింగ్లో బ్యాంక్ నిఫ్టీ సైతం 49,474 వద్ద ఆల్టైం హైని నమోదు చేసింది. చివరికి 1,223 పాయింట్ల లాభంతో 49,424 వద్ద ముగిసింది. మొత్తం ఈ సూచీలో 12 షేర్లలో ఐడీఎఫ్సీ ఫస్ట్ బ్యాంక్(3.30%), బంధన్ బ్యాంక్(0.20%) మాత్రమే నష్టపోయాయి.

ఐసీఐసీఐ బ్యాంక్@రూ.8 లక్షల కోట్లు

క్యూ4లో నికర లాభం 18% వృద్ధితో ఐసీఐసీఐ బ్యాంకు షేరుకు డిమాండ్ నెలకొంది. బీఎస్ఈలో 4.5%పెరిగి రూ.1,159 వద్ద ముగిసింది. ట్రేడింగ్లో 5% ఎగిసి రూ.1,163 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. మార్కెట్ విలువ రూ.36,555 కోట్లు పెరిగి రూ.8 లక్షల కోట్లపైన రూ.8.14 లక్షల కోట్లకు చేరింది క్యాపిటలైజేషన్ పరంగా రూ.8 లక్షల కోట్లు దాటిన అయిదో కంపెనీగా నిలిచింది.

ఇన్వెస్ట్కార్ప్ చేతికి ఎన్ఎస్ఈఐటీ



ముంబై: డిజిటల్ టెక్నాలజీ సేవల్లో ఉన్న ఎన్ఎస్ఈఐటీని బహ్రెయిన్కు చెందిన ఇన్వెస్ట్కార్ప్నకు విక్రయిస్తున్నట్టు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సోమవారం ప్రకటించింది. డీల్ విలువ రూ.1,000 కోట్లు. క్యాపిటల్ మార్కెట్స్, బీమా, బ్యాంకింగ్ రంగ సంస్థలకు ఆధునిక డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్, సైబర్సెక్యూరిటీ సేవలను ఎన్ఎస్ఈఐటీ అందిస్తోంది. కీలక వ్యాపార విభాగాలపై ఫోకస్ చేసేందుకే ఎన్ఎస్ఈ ఐటీని విక్రయిస్తున్నట్టు ఎన్ఎస్ఈ ఎండీ, సీఈవో ఆశిష్ కుమార్ చౌహాన్ ఈ సందర్భంగా తెలిపారు.

కోడిగుడ్లు (హోల్సేల్-నెక్ / 100కు రూ.లలో)

30-4-2024 ఫామ్ ధర...	
విశాఖ	400-00
చిత్తూరు	453-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	355-00
విజయవాడ	355-00
రిటైల్ ధర (డజను)	48.00
హైదరాబాద్	355-00
వరంగల్	357-00
రిటైల్ ధర	4.15

7.49 లక్షల నుంచి మహీంద్రా ఎక్స్యూవీ 3ఎక్స్వో



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా కాంపాక్ట్ ఎస్యూవీ ఎక్స్యూవీ 3ఎక్స్వో భారత మార్కెట్లో విడుదల చేసింది. ధర ఎక్స్షోరూంలో రూ.7.49 లక్షల నుంచి ప్రారంభం. 18 వేరియంట్లలో లభిస్తుంది. ఎక్స్యూవీ300 స్థానంలో మరిన్ని హంగులను జోడించి ఈ మోడల్ను కంపెనీ ప్రవేశపెట్టింది. 1.2 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజన్తో 6 స్పీడ్ మాన్యువల్, 6 స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్మిషన్తో లభిస్తుంది.

మేఘా ఇంజనీరింగ్కు రూ.8,000 కోట్ల ప్రాజెక్ట్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మౌలిక రంగ నిర్మాణ సంస్థ మేఘా ఇంజనీరింగ్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ (ఎంఈఐఎల్) తాజాగా కర్ణాటక ప్రభుత్వం నుంచి 2,000 మెగావాట్ల శరావతి పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు దక్కించుకుంది. ప్రాజెక్టు వ్యయం రూ.8,000 కోట్లు. నిర్మాణం పూర్తి అయితే దేశంలో అతిపెద్ద పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంటుగా ఇది నిలుస్తుందని కంపెనీ సోమవారం తెలిపింది. ఈ ప్రాజెక్టును చేజిక్కించుకోవడం కోసం లార్సెన్ అండ్ టూబ్రో (ఎల్అండ్టీ) వంటి సంస్థలు సైతం బిడ్డింగ్లో పాల్గొన్నాయి. కాగా, శరావతి పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు కోసం కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ కేపీసీఎల్ చేపట్టిన టెండర్ల ప్రక్రియకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టును ఎల్అండ్టీ ఆశ్రయించినప్పటికీ చుక్కెదురైంది.

ఏపీలో కోరమాండల్ ప్లాంటు నిర్మాణం ప్రారంభం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎరువుల తయారీ దిగ్గజం కోరమాండల్ ఇంటర్నేషనల్ ఆంధ్రప్రదేశ్లోని కాకినాడ వద్ద ఏర్పాటు చేస్తున్న ఫాస్ఫరిక్ యాసిడ్-సల్ఫరిక్ యాసిడ్ కాంప్లెక్స్ ఫెసిలిటీ నిర్మాణ పనులను ప్రారంభించింది. రెండేళ్లలో ప్రాజెక్టు పూర్తి చేయనున్నట్టు కంపెనీ సోమవారం ప్రకటించింది. ఈ ఫెసిలిటీ కోసం రూ.1,000 కోట్లకుపైగా పెట్టుబడి చేస్తున్నట్టు కోరమాండల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ అరుణ్ అలగప్పన్ వెల్లడించారు. రోజుకు 650 టన్నుల తయారీ సామర్థ్యంతో ఫాస్ఫరిక్ యాసిడ్ ఉత్పత్తి కేంద్రం రానుంది. అలాగే రోజుకు 1,800 టన్నుల సామర్థ్యంగల సల్ఫరిక్ యాసిడ్ ప్లాంటు సైతం కొలువుదీరనుంది. కాకినాడ ప్లాంటు దిగుమతి చేసుకుంటున్న యాసిడ్ అవసరాల్లో ప్రతిపాదిత కేంద్రం సగానికిపైగా భర్తీ చేస్తుందని.. ఎరువుల తయారీకి కావాల్సిన ఫాస్ఫరిక్ యాసిడ్ స్థిరంగా సరఫరా చేస్తుందని సంస్థ తెలిపింది. ప్రాజెక్టు కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుండి పెట్టుబడి మద్దతును కూడా కంపెనీ అన్వేషిస్తోంది. ఇది ఎరువుల తయారీలో ఉపయోగించే కీలక ముడి పదార్థాలకు సరఫరా భద్రతను నిర్ధారిస్తుందని సంస్థ భావిస్తోంది. కాగా, కాకినాడ వద్ద ఉన్న కోరమాండల్ ప్లాంటు ఫాస్ఫటిక్ ఫెర్టిలైజర్ తయారీలో దేశంలో రెండవ అతిపెద్దది. సామర్థ్యం 20 లక్షల టన్నులు. దేశవ్యాప్తంగా తయారవుతున్న నత్రజని, ఫాస్ఫరస్, పొటాషియం (ఎన్పీకే) ఆధారిత ఎరువుల పరిమాణంలో కోరమాండల్ కాకినాడ ప్లాంటు వాటా 15 శాతం ఉంది.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

తెలంగాణలో 150 సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పోస్టులు

తెలంగాణ హైకోర్టు తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ పరిధిలోని జూనియర్ విభాగంలో సివిల్ జడ్జి పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 150
» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి న్యాయశాస్త్రంలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. మూడేళ్ల పాటు అడ్వకేట్ లేదా ప్లీడర్గా ప్రాక్టీస్ చేసి ఉండాలి. తెలంగాణ జ్యుడిషియల్ నియమ నిబంధనల ప్రకారం నిర్దేశించిన అర్హతలు కలిగి ఉండాలి.
» **వయసు:** అభ్యర్థులు కనిష్టంగా 23 ఏళ్లు, గరిష్టంగా 35 ఏళ్ల వయసు కలిగి ఉండాలి. ఆయా కేటగిరీ వర్గాల వారికి వయోసడలింపు నిబంధనలు వర్తిస్తాయి.
» **వేతనం:** నెలకు రూ. 77,840 నుంచి 1,36,520
» **ఎంపిక విధానం:** స్క్రీనింగ్ టెస్ట్(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్), రాతపరీక్ష, వైవా-వాయిస్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **స్క్రీనింగ్ టెస్ట్ పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం.
» **దరఖాస్తు విధానం:** ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.05.2024
» **స్క్రీనింగ్ టెస్ట్ హాల్టికెట్ డౌన్లోడ్:** 08.06.2024
» **స్క్రీనింగ్ పరీక్ష తేది(కంప్యూటర్ ఆధారిత పరీక్ష):** 16.06.2024.
» **వెబ్సైట్:** https://tshc.gov.in

నైపర్ జేఈఈ-2024

గువాహటిలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (నైపర్).. జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(జేఈఈ)-2024 ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న నైపర్ క్యాంపస్లలో మాస్టర్స్ ప్రోగ్రామ్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **నైపర్ క్యాంపస్లు:** అహ్మదాబాద్, గువాహటి, హాజీపూర్, హైదరాబాద్, కోల్కతా, రాయ్బరేలి, ఎస్ఏఎస్ నగర్.
» **మొత్తం సీట్ల సంఖ్య:** 990
» **కోర్సుల వివరాలు:** మాస్టర్ ఆఫ్ సైన్స్(ఫార్మసీ), మాస్టర్ ఆఫ్ టెక్నాలజీ(ఫార్మసీ), మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఫార్మసీ).
» **అర్హత:** బీఫార్మసీ/ఎంఎస్సీ/బీఈ, బీటెక్/ఎంబీబీఎస్/బీవీఎస్సీ/బీడీఎస్తో పాటు జీప్యాట్/గేట్/నెట్/ఇతర జాతీయ ఫెలోషిప్ ఉత్తీర్ణత సాధించి ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఉమ్మడి ప్రవేశ పరీక్ష, గ్రూప్ డిస్కషన్, కౌన్సిలింగ్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **తెలుగు రాష్ట్రాల్లోని పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ.
» **దరఖాస్తు విధానం:** ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 25.04.2024.
» **ఆన్లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.05.2024
» **పూర్తి వివరాలకు వెబ్సైట్:** https://niperguwahati.ac.in/niperjee

ఐఐఎం ఇండోర్-ఐఐటీ ఇండోర్లో ఎంఎస్సీలో ప్రవేశాలు

ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్(ఐఐఎం), ఇండోర్; ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ), ఇండోర్.. సంయుక్తంగా డేటా సైన్స్ అండ్ మేనేజ్మెంట్లో ఎంఎస్సీ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నాయి.

» **అర్హత:** మొదటి శ్రేణిలో బీటెక్/ బీఈ /బీఎస్/బీఫార్మసీ/బీఆర్కిటెక్చర్ /బీడీఈఎస్/బీఎఫ్టెక్/నాలుగేళ్ల బీఎస్సీ/ఎంఎస్సీ/ఎంసీఏ/ఎంబీఏ ఉత్తీర్ణులవ్వాలి. క్యాట్/గేట్/జీమ్యాట్/జీఆర్ఈ/జామ్ టెస్ట్ క్వాలిఫై అయి ఉండాలి.
» **ఎంపిక విధానం:** డీమ్యాట్ పరీక్ష ద్వారా.
» **దరఖాస్తు విధానం:** ఆన్లైన్ ద్వారా.
» **ఆన్లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.06.2024
» **డీమ్యాట్ (డేటా సైన్స్ అండ్ మేనేజ్మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్):** 23.06.2024.
» **వెబ్సైట్:** https://msdsm.iimi.ac.in. https://msdsm.iiti.a.in.

ఎన్హెచ్పీసీ, మండిలో 57 అప్రెంటిస్లు

మండి (హిమాచల్ప్రదేశ్)లోని నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ (ఎన్హెచ్పీసీ).. వివిధ విభాగాల్లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 57
» **ఖాళీల వివరాలు:** ఐటీఐ అప్రెంటిస్-39, డిప్లొమా అప్రెంటిస్-13, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్-05.
» **శిక్షణ వ్యవధి:** ఏడాది.
» **ట్రేడులు:** ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్స్మ్యాన్, సర్వేయర్, ప్లంబర్, సివిల్, సీవోపీఏ, ఎలక్ట్రికల్, జీఎస్ఎం, నర్సింగ్, హోటల్ మేనేజ్మెంట్, ఫార్మసిస్ట్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఐటీఐ/డిప్లొమా/గ్రాడ్యుయేషన్ మార్కులు, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్లైన్ ద్వారా.
» **ఆన్లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.04.2024
» **వెబ్సైట్:** https://www.nhpcindia.com

» ఎన్సీఈటీ-2024 నోటిఫికేషన్ విడుదల
» నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ ప్రోగ్రామ్లో ప్రవేశాలు
» ఐఐటీలు, నిట్లు వంటి ప్రముఖ ఇన్స్టిట్యూట్స్లో బీఈడీకి మార్గం

ఇంటర్తో.. ఇంటిగ్రేటెడ్ బీఈడీ

టీచర్ కొలువు సొంతం చేసుకోవాలని.. ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడాలని కోరుకునే వారు బీఈడీలో చేరతారు. సాధారణంగా బీఈడీలో చేరాలంటే.. బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. కాని ఇప్పుడు ఇంటర్మీడియెట్తోనే బీఈడీలో ప్రవేశం పొందే అవకాశం అందుబాటులోకి వచ్చింది. ఐఐటీలు, ఎన్ఐటీలు, ఆర్ఐఈలు, సెంట్రల్ యూనివర్సిటీలు వంటి ప్రతిష్టాత్మక ఇన్స్టిట్యూట్స్.. నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ ప్రోగ్రామ్ అందిస్తున్నాయి. దీనికి మార్గం.. నేషనల్ కామన్ ఎంట్రన్ టెస్ట్ (ఎన్సీఈటీ)! ఇటీవల ఎన్సీఈటీ-2024కు నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో.. నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సు ప్రత్యేకతలు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం, ప్రవేశ పరీక్ష తదితర వివరాలు..

నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్(ఎన్సీటీఈ) నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు.. నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీని ప్రారంభించారు. వీటిలో ప్రవేశానికి ఉద్దేశించిన ఎంట్రన్స్ టెస్ట్.. ఎన్సీఈటీ (నేషనల్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్). ప్రస్తుతం దేశంలో నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని ప్రముఖ యూనివర్సిటీలు, ఇన్స్టిట్యూట్స్తోపాటు ఉపాధ్యాయ విద్యకు ప్రతిష్టాత్మకంగా భావించే రీజనల్ ఇన్స్టిట్యూట్స్ ఆఫ్ ఎడ్యుకేషన్ కూడా అందిస్తున్నాయి. వీటితోపాటు దేశంలోని ప్రముఖ ఇంజనీరింగ్ విద్యాసంస్థలైన ఐఐటీలు, ఎన్ఐటీలు కూడా ఈ కోర్సు అందించేందుకు సిద్ధమయ్యాయి. వీటన్నింటిలో ప్రవేశానికి అర్హత పరీక్ష ఎన్సీఈటీని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తోంది.

64 ఇన్స్టిట్యూట్స్.. 6,100 సీట్లు

- ఎన్సీఈటీ స్కోర్ ఆధారంగా ప్రస్తుతం దేశవ్యాప్తంగా 64 ఇన్స్టిట్యూట్లు నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీలో ప్రవేశం కల్పిస్తున్నాయి. వీటిలో మొత్తం 6,100సీట్లు అందుబాటులో ఉన్నాయి.
- తెలుగు రాష్ట్రాలకు సంబంధించి.. తెలంగాణలో మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీలో బీఏ-బీఈడీ (50 సీట్లు), బీఎస్సీ-బీఈడీ (50 సీట్లు), బీకాం -బీఈడీ (50 సీట్లు); గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్-లక్సెట్టిపేట మంచిర్యాలలో బీఏ-బీఈడీలో 50 సీట్లు, నిట్-వరంగల్లో బీఎస్సీ-బీఈడీ (50 సీట్లు) ఉన్నాయి.
- ఆంధ్రప్రదేశ్లో జాతీయ సంస్కృత విద్యాలయం-తిరుపతిలో.. బీఏ బీఈడీలో 50 సీట్లు; డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ -ఎచ్చెర్లలో బీఏ-బీఈడీలో 50 సీట్లు; బీఎస్సీ-బీఈడీలో 50 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

ఎన్ఐటీలు, ఐఐటీల్లోనూ

ఎన్సీఈటీ ద్వారా ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సుల్లో ప్రవేశం కల్పించే ఇన్స్టిట్యూట్స్లో.. సాంకేతిక విద్యకు కేరాఫ్గా భావించే ఎన్ఐటీలు, ఐఐటీలు కూడా ఉండడం విశేషం. ఎన్ఐటీ-కాలికట్, ఎన్ఐటీ-వరంగల్, ఎన్ఐటీ-పుదుచ్చేరి, ఎన్ఐటీ-అగర్తల, ఎన్ఐటీ-తిరుచిరాపల్లితోపాటు ఐఐటీ-భువనేశ్వర్, ఐఐటీ జోధ్పూర్, ఐఐటీ -రోపార్లలో బీఎస్సీ-బీఈడీ ప్రోగ్రామ్లో 50 సీట్లు చొప్పున అందుబాటులో ఉన్నాయి.

అర్హతలు

ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీ-బీఈడీ అభ్యర్థులు ఎంపీసీ గ్రూప్తో, బీకాం-బీఈడీ ఉత్తీర్ణులు సీఈసీ గ్రూప్తో ఉత్తీర్ణత సాధించి ఉండాలి.

నాలుగు విభాగాల్లో.. ఎన్సీఈటీ

- నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ ప్రోగ్రామ్లో ప్రవేశానికి నిర్వహించే ఎన్సీఈటీ పరీక్షను నాలుగు విభాగాల్లో నిర్వహించనున్నారు. .
- **విభాగం-1:** ఈ విభాగంలో రెండు లాంగ్వేజ్ల నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో లాంగ్వేజ్లో 23 ప్రశ్నలు అడుగుతారు. వీటిలో అభ్యర్థులు 20 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. అభ్యర్థులు ఎన్టీఏ పేర్కొన్న లాంగ్వేజ్లలో ఏవైనా రెండు లాంగ్వేజ్లను ఎంచుకోవాల్సి ఉంటుంది.
- **విభాగం-2: డొమైన్ సంబంధిత సబ్జెక్ట్:** ఈ విభాగంలో మొత్తం 26 డొమైన్ సబ్జెక్ట్లు ఉంటాయి. అభ్యర్థులు తమ ఆసక్తికి అనుగుణంగా మూడు డొమైన్ సబ్జెక్ట్లను ఎంచుకోవాల్సి ఉంటుంది. ఒక్కో సబ్జెక్ట్ నుంచి 28 ప్రశ్నలు చొప్పున అడుగుతారు. వీటిలో 25 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది.
- **విభాగం-3: జనరల్ టెస్ట్:** ఈ విభాగంలో 28 ప్రశ్నలు అడుగుతారు. 25 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి.
- **విభాగం-4: టీచింగ్ ఆప్టిట్యూడ్:** ఈ విభాగంలో 23 ప్రశ్నలుంటాయి. 20 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి.
- పరీక్ష పూర్తిగా ఆన్లైన్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్గా జరుగుతుంది. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటాయి. పరీక్ష వ్యవధి మూడు గంటలు
- మొత్తంగా అభ్యర్థులు 160 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది.
- ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయించారు. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది.ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు.



ప్రవేశాలకు ప్రత్యేక దరఖాస్తు

ఎన్సీఈటీ స్కోర్ ద్వారా నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ ప్రోగ్రామ్లో ప్రవేశం పొందాలనుకునే వారు.. సంబంధిత యూనివర్సిటీలు/ఇన్స్టిట్యూట్స్కు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత దశలో సదరు యూనివర్సిటీలు.. వచ్చిన దరఖాస్తులు, అభ్యర్థుల స్కోర్లను బేరీజు వేసి సీట్ల కేటాయింపు చేస్తాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, ఏప్రిల్ 30
- **ఆన్లైన్ దరఖాస్తు సవరణ:** 2024, మే 2-4
- **ఎన్సీఈటీ పరీక్ష తేదీ:** 2024, జూన్ 12
- **అడ్మిట్ కార్డ్ డౌన్లోడ్:** పరీక్ష తేదీకి మూడు రోజుల ముందు నుంచి
- **పూర్తి వివరాలకు వెబ్సైట్:** www.nta.ac.in, https://ncet.samarth.ac.in

బెస్ట్ స్కోర్కు మార్గమిలా

లాంగ్వేజ్ టెస్ట్

అభ్యర్థులు రెండు లాంగ్వేజ్లకు హాజరుకావాల్సి ఉంటుంది. కాబట్టి హాజరు కావాల్సిన లాంగ్వేజ్ టెస్ట్లలో మెరుగైన స్కోర్కు అభ్యర్థులు తాము ఎంచుకున్న లాంగ్వేజ్లకు సంబంధించి గ్రామర్, కాంప్రహెన్షన్, వాక్య నిర్మాణం, సాహిత్యం వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా ప్రెసిస్ రైటింగ్, ప్యాసేజ్ రీడింగ్ ప్రిపరేషన్తోపాటు ప్రశ్నలను సాధన చేయాలి.

డొమైన్ స్పెసిఫిక్ సబ్జెక్ట్

సంబంధిత సబ్జెక్ట్ల కోసం ఎన్సీఈఆర్టీ 12వ తరగతి పుస్తకాలను అధ్యయనం చేయాలి. ఇంటర్మీడియెట్,పదో తరగతి స్థాయి అకడమిక్ పుస్తకాలపై పట్టు సాధించాలి. అభ్యర్థులు తాము ఎంచుకున్న సబ్జెక్ట్లలోని ముఖ్యమైన ఫార్ములాలు, అప్లికేషన్స్, సిద్ధాంతాలు, నిర్వచనాలు, భావనలపై దృష్టి పెట్టాలి. ముఖ్యంగా బీఎస్సీ బీఈడీ అభ్యర్థులు సైన్స్, మ్యాథ్స్లలోని ముఖ్యమైన కాన్సెప్ట్లను నేర్చుకోవాలి.

జనరల్ టెస్ట్

హిస్టరీ, జాగ్రఫీ, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్ పుస్తకాలను చదవాలి. కరెంట్ ఈవెంట్స్పై అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా క్వాంటిటేటివ్ రీజనింగ్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, లాజికల్ అండ్ అనలిటికల్ రీజనింగ్ అంశాల్లో రాణించడానికి అర్థ గణిత అంశాలు, కోడింగ్ -డీకోడింగ్, బ్లడ్ రిలేషన్స్, సీటింగ్ అరేంజ్మెంట్, టైమ్ అండ్ డిస్టెన్స్, టైమ్ అండ్ వర్క్, నంబర్ సిస్టమ్స్పై అవగాహన పొందాలి.

టీచింగ్ ఆప్టిట్యూడ్

విద్యా దృక్పథాలు, పెడగాజీ, చైల్డ్ డెవలప్మెంట్, శిశు వికాసం వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. పెడగాజికి సంబంధించి సహిత విద్య, శిశువు విద్యా ప్రణాళిక, బోధన పద్ధతులు, మూల్యాంకనం-నాయకత్వం- గైడెన్స్- కౌన్సెలింగ్ గురించి అధ్యయనం చేయాలి. ఎడ్యుకేషన్కు సంబంధించిన చట్టాలపై పూర్తి అవగాహన పొందాలి. పెడగాజిలోని భావనలు, సిద్ధాంతాలు, నిబంధనలను విశ్లేషిస్తూ అధ్యయనం చేస్తే.. ఏ కోణంలో ప్రశ్న అడిగినా సమాధానం ఇచ్చే సన్నద్ధత లభిస్తుంది. అదే విధంగా నూతన విద్యా విధానం-ఉద్దేశాలపై అవగాహన పెంచుకోవాలి.

ర్యాంకర్లూ... ఎక్కడున్నారు?

ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల వెతుకులాట..

ముందే మాట్లాడుకుని దందా సాగిస్తున్న కళాశాలలు

ర్యాంకర్లతో ఇంజనీరింగ్ సీట్ల బ్లాక్.. ఇక ఆ సీటుకు కౌన్సెలింగ్ చేపట్టరు

స్లైడింగ్ ప్రక్రియ పూర్తవ్వగానే ఎన్ఐటీలో చేరుతున్నట్టు సదరు ర్యాంకర్ల లేఖ

అప్పుడు స్పాట్ కౌన్సెలింగ్‌తో రూ.12 నుంచి రూ.18 లక్షలకు ఆ సీటు అమ్మకం

ఏటా రూ. కోట్లలో వ్యాపారం.. తాజాగా జేఈఈ ఫలితాల తర్వాత పెరిగిన ఊపు

సాక్షి, హైదరాబాద్: జేఈఈ ర్యాంకులు వెల్లడవ్వడమే ఆలస్యం.. ర్యాంకర్ల కోసం రాష్ట్రంలోని ప్రైవేటు కాలేజీలు జల్లెడ పట్టి వెతుకుతున్నాయి. టీఎస్ఏపీఈ సెట్ ఇంకా జరగకముందే వచ్చే విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్ సీట్లు బ్లాక్ చేసేందుకు రెడీ అవుతున్నాయి. ఈ మేరకు జేఈఈ ర్యాంకర్ల తల్లిదండ్రులతో బేరసారాలు సాగిస్తున్నాయి. సదరు ర్యాంకర్లు చదివిన కాలేజీల ప్రిన్సిపల్స్‌ను సంప్రదిస్తూ, వారి చేత విద్యార్థులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాయి. రాష్ట్ర ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌లో వారి చేత దరఖాస్తులు చేయించడం, స్లైడింగ్ వరకూ వాళ్ళు కాలేజీల్లో చేరకుండా చూడటం, ఆఖరుకు ఆ సీటును స్పాట్‌లో రూ.లక్షల్లో అమ్ముకోవడం ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల వ్యూహం. ఈ తంతు ప్రతీ ఏటా జరుగుతూనే ఉంది. ఉన్నత విద్యా మండలి, ప్రభుత్వం ఈ దందాను అడ్డుకోలేకపోతున్న దరిమిలా ప్రతీ ఏటా దాదాపు 700 సీట్లను ఇలానే అమ్ముకుంటున్నారు. ఒక్కో సీటుకూ కాలేజీని బట్టి రూ.18 లక్షల వరకూ వసూలు చేస్తున్నట్టు తెలుస్తోంది.



కంప్యూటర్ కోర్సులపైనే గురి

రాష్ట్రవ్యాప్తంగా 1.15 లక్షల ఇంజనీరింగ్ సీట్లు ఉన్నాయి. ఇందులో 30 శాతం యాజమాన్య కోటా సీట్లు ఉంటాయి. మిగిలినవన్నీ కన్వీనర్ కోటా సీట్లు. గత కొన్నేళ్ళుగా కంప్యూటర్ సైన్స్ కోర్సుకు బాగా డిమాండ్ పెరిగింది. 58 శాతం సీట్లు ఈ కోర్సుల్లోనే భర్తీ అవుతున్నాయి. రాష్ట్రంలోని ప్రధాన ఇంజనీరింగ్ కాలేజీల్లో గరిష్టంగా 6 వేల ర్యాంకులోపే కంప్యూటర్ కోర్సులో సీట్లు భర్తీ అవుతున్నాయి. జేఈఈలో వెయ్యిలోపు ర్యాంకు పొందిన విద్యార్థులు రాష్ట్ర ఏపీఈసెట్‌లోనూ వెయ్యి, 1,500 లోపు ర్యాంకు పొందుతున్నారు. ఈ కారణంగా వీళ్ళకు రాష్ట్రంలోని కాలేజీల్లో మొదటి కౌన్సెలింగ్‌లోనే సీఎస్ఈ బ్రాంచీలో సీటు లభించే వీలుంది. వాస్తవానికి వీళ్ళు అడ్వాన్స్‌డ్‌లో సీటు వస్తే ఐఐటీలు, లేదంటే జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో చేరుతారు. అంతే తప్ప రాష్ట్ర ఇంజనీరింగ్ కాలేజీల్లో చేరడం అరుదు. ఇలాంటి వాళ్ళనే ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు ఎంపిక చేసుకుంటున్నాయి.



దందా ఎలా చేస్తారంటే..

జేఈఈలో మంచి ర్యాంకు వచ్చిన విద్యార్థుల చేత కళాశాలల యాజమాన్యాలు రాష్ట్ర ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌లో దరఖాస్తు చేయిస్తున్నాయి. సీటు రాగానే అడ్మిషన్ తీసుకునేలా చేస్తున్నాయి. దీంతో ఆ సీటుకు మళ్ళీ కౌన్సెలింగ్ చేపట్టరు. 4,5 దఫాల కౌన్సెలింగ్ వరకూ వీళ్ళు వచ్చిన సీటులో చేరతామనే చెబుతున్నారు. చివరగా స్లైడింగ్ ప్రక్రియ (ఒక కోర్సులో వారు ఇంకో కోర్సులో చేరడం) వరకూ ఇలాగే ఉంటారు. ఇది పూర్తవ్వగానే తాము ఎన్ఐటీలో చేరుతున్నట్టు యాజమాన్యానికి లేఖ ఇస్తున్నారు. ప్రతీ ఏటా ఇలా 500 మంది వరకూ ఉంటున్నారు.అన్ని కౌన్సెలింగ్‌లు పూర్తవ్వడంతో ఎన్ఐటీలో చేరడం వల్ల మిగిలిపోయిన సీట్లకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఈ దశలో ఎవరు ముందొస్తే వారికి ర్యాంకును బట్టి సీటు ఇస్తున్నారు.

అలాంటి విద్యార్థులకు రూ. 4 లక్షల వరకూ ఆఫర్..

తమకు సహకరించే విద్యార్థులకు రూ.4 లక్షల వరకూ కాలేజీలు ఆఫర్ చేస్తున్నాయి. ఇలా ప్రోత్సహించిన ఇంటర్ కాలేజీల ప్రిన్సిపల్స్‌కు గరిష్టంగా రూ. 2 లక్షల వరకూ ముట్టజెబుతున్నాయి. దీనివల్ల ఏ ఇబ్బందీ ఉండదని తాము చదివిన ఇంటర్ కాలేజీల ప్రిన్సిపల్స్ చెప్పడంతో విద్యార్థులూ సహకరిస్తున్నారు. ఏపీఈసెట్‌లో లక్షల్లో ర్యాంకు వచ్చిన వారికి కూడా కాలేజీలు కంప్యూటర్ సైన్స్ కోర్సులో సీట్లు ఇస్తున్నాయి. ఇలాంటి విద్యార్థులు ముందే కాలేజీ యాజమాన్యాలతో మాట్లాడుకుంటున్నాయి. ఒక్కో సీటుకు రూ. 12 నుంచి 18 లక్షల వరకూ అమ్ముకుంటున్నారు. ఈ మొత్తం ముందే చెల్లించేందుకు విద్యార్థులు ముందుకొస్తున్నారు. ఇలా కాలేజీలు రూ.కోట్ల వ్యాపారం అక్రమ మార్గంలో చేస్తున్నాయనే ఆరోపణలున్నాయి.

ఆన్‌లైన్ విధానంతో ఇలాంటి అక్రమాలకు చెక్

వాస్తవానికి మిగిలిపోయిన సీట్లను ముందుగా జేఈఈ ర్యాంకర్లకు ఇవ్వాలి. వాళ్ళు లేకపోతే రాష్ట్ర ఏపీఈసెట్‌లో ర్యాంకుల ప్రాతిపదికగా, వాళ్ళూ లేకుంటే ఇంటర్ మార్కుల్లో ఎక్కువ వచ్చిన వాళ్ళకే ఇవ్వాలి. కానీ ఈ ప్రక్రియకు ఎలాంటి పారదర్శకత ఉండటం లేదు. విద్యార్థి తనకు ర్యాంకు వచ్చింది, దరఖాస్తు చేసినా తిరస్కరించారని చెప్పేందుకు ఆధారాలూ ఉండటం లేదు. ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తుల ప్రక్రియ కొనసాగిస్తే ఇలాంటి వ్యవహారాలకు చెక్ పెట్టవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.



సీఎస్ పేరుతో ఫేక్ కాల్స్

టీఎస్‌సీఎస్‌బీలో కేసు నమోదు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఫొటోను డీపీ (డిస్‌ప్లే పిక్చర్)గా పెట్టి గుర్తు తెలియని వ్యక్తులు ఫేక్ కాల్స్ చేస్తున్నారు. +977-984-4013103 నంబర్ నుంచి ఈ ఫేక్ కాల్స్ వస్తున్నట్టు గుర్తించారు. దీనిపై తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీఎస్‌సీఎస్‌బీ)లోని సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. ఈ ఫేక్ కాల్స్ ఎవరు చేస్తున్నారన్న అంశంపై సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ఆరా తీస్తున్నారు. ప్రాథమిక సమాచారం ఇప్పటికే సేకరించిన పోలీసులు సాంకేతికంగా మరింత విశ్లేషిస్తున్నట్టు తెలిసింది.

చిక్కని చిరుతపులి



సీసీ కెమెరాల్లో రికార్డయిన చిత్రం

శంషాబాద్: శంషాబాద్ ఎయిర్‌పోర్టు వద్ద కనిపించిన చిరుతను పట్టుకునేందుకు అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.శనివారం అర్ధరాత్రి ఎయిర్‌పోర్టు రన్‌వేకు సమీపంలో చిరుత సంచరించినట్లు అధికారులు గుర్తించారు. రన్‌వే వద్ద ప్రహరీకి సమీపంలోనే కొండతో పాటు అటవీ ప్రాంతం ఉంది. దీంతో చిరుత ఎయిర్‌పోర్టు ప్రహరీ లోపల ఉందా, తిరిగి బయటకు వెళ్లిందా? అన్న కోణంలో అటవీ శాఖ అధికారులు ఆ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నారు. శనివారం అర్ధరాత్రి సీసీ కెమెరాల్లో నమోదైనట్లుగా బయటకు వచ్చిన చిత్రంలో అక్కడ సంచరించింది చిరుతపులిగానే నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది.

బీసీల పక్షపాతి కాంగ్రెస్: పొన్నం

గాంధీభవన్‌లో కురుమల ఆత్మీయ సమ్మేళనం



సభలో పొన్నం, మహేశ్‌కుమార్ గౌడ్

సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసే పార్టీ కాంగ్రెస్ అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కురుమలకు చట్టసభలో ప్రాతినిధ్యం కల్పించిన కాంగ్రెస్, భవిష్యత్తులో వారి ఎదుగుదలకు ప్రత్యేక కృషి చేస్తుందని చెప్పారు. గాంధీభవన్‌లో సోమవారం టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్ అధ్యక్షతన కురుమ ఆత్మీయ సమ్మేళన సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పొన్నం మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో రెండు స్థానాలను కురుమలకు కేటాయించామన్నారు. ఈసారి మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు కూడా కనుమరుగవుతాయని హెచ్చరించారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ కురుమలను అక్కున చేర్చుకొని అండగా నిలిచిన పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్, ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, గద్వాల జిల్లా చైర్‌పర్సన్ సరితా తిరుపతయ్య, సీనియర్ కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, గాంధీభవన్‌లో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో కలిసి పొన్నం మీడియాతో మాట్లాడుతూ రిజర్వేషన్లను కాపాడుకోవడానికి ప్రతి ఊరిలో జేఏసీలు ఏర్పాటు చేసుకొని పోరాడుదామని పిలుపునిచ్చారు.

ధ్యాన సాధనతో జీవనశైలిలో మార్పు

మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

కొత్తూరు: హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ అందిస్తున్న ధ్యానాన్ని సాధన చేసే వారిలో జీవనశైలిలో మార్పువస్తుందని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అన్నారు. రంగారెడ్డి జిల్లాలోని కన్హా శాంతివనం ఆశ్రమంలో సోమవారం బాబూజీ 125వ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ వేడుకలో



బాబూజీ జయంతి వేడుకల్లో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్, కమ్లేష్ డీ పటేల్, మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ

కోవింద్‌తోపాటు సుప్రీంకోర్టు మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ కూడా పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ, ధ్యాన సాధనతో ఇతరుల పట్ల ప్రేమ, కరుణ, సాయం చేసే గుణాన్ని అలవర్చుకుంటారని తెలిపారు. రామచంద్ర మిషన్ సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న ధ్యాన కార్యక్రమాలు ప్రపంచమంతా విస్తరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంతో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ గ్లోబల్ గైడ్ కమ్లేష్ డీ పటేల్, అభ్యాసకులు తదితరులు పాల్గొన్నారు.

నేడే టెన్త్ ఫలితాలు..

సాక్షి, హైదరాబాద్: పదవ తరగతి పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలవుతాయి. విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం 11 గంటలకు ఫలితాలను అధికారికంగా విడుదల చేస్తారు. టెన్త్ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు ఈమేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఫలితాలను http:// results. bse.telangana.gov.in, http://results.bsetelangana.orgఅనే వెబ్‌సైట్లలో చూడవచ్చని తెలిపారు.

'సాక్షి'లో వేగంగా ఫలితాలు

ఇంటర్‌మీడియెట్ ఫలితాలను అందించిన విధంగానే టెన్త్ ఫలితాలను శరవేగంగా అందించేందుకు 'సాక్షి' దినపత్రిక ఏర్పాట్లు చేసింది. అత్యాధునిక సాఫ్ట్‌వేర్‌ను అందిపుచ్చుకుంది.www.sakshieducation.com వెబ్‌సైట్‌కు లాగిన్ అయి ఫలితాలను చూడవచ్చు.

మండే ఎండలు

▶ మొదటి పేజీ తరువాయి

గణాంకాల ప్రకారం రాష్ట్రంలోని చాలా చోట్ల గరిష్ట ఉష్ణోగ్రతలు అత్యధికంగానే నమోదయ్యాయి. నల్లగొండ జిల్లా మతూర్‌లో 45.5 డిగ్రీలు, ములుగు జిల్లా మంగపేటలో 45.2 డిగ్రీలు, నల్లగొండ జిల్లా తిమ్మాపూర్‌లో 45.1 డిగ్రీలు, అదే జిల్లాలోని మాడుగులపల్లిలో 45.0 డిగ్రీల మేర గరిష్ట ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి.

పలుచోట్ల వడగాడ్పులు

రానున్న రెండ్రోజులు పలుచోట్ల వడగాడ్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ మేరకు 12 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ, ఖమ్మం, సూర్యాపేట, వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లోని పలుచోట్ల ఈ నెల 30 నుంచి మే 2వ తేదీ వరకు తీవ్ర వడగాల్పులకు అవకాశం ఉందంటూ ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్‌ను వాతావరణ శాఖ జారీ చేసింది. తక్షణ చర్యలు చేపట్టేలా ఆయా జిల్లా యంత్రాంగాలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

సోమవారం ప్రధాన కేంద్రాల్లో ఉష్ణోగ్రతలు (డిగ్రీల సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం
నిజామాబాద్	43.8
ఖమ్మం	43.2
ఆదిలాబాద్	42.8
భద్రాచలం	42.8
మెదక్	42.6
మహబూబ్‌నగర్	42.4
నల్లగొండ	42.0
రామగుండం	42.0
హైదరాబాద్	41.6
విజయవాడ	41.0
హనుమకొండ	40.5
విశాఖపట్నం	37.6

రాష్ట్రంలో వడదెబ్బకు ఐదుగురు మృతి

ఏటూరునాగారం/త్రిపురారం/దోర్నకల్/పెద్ద అడిశర్లపల్లి/రామగిరి (నల్లగొండ): రాష్ట్రవ్యాప్తంగా వడదెబ్బకు గురై సోమవారం ఐదుగురు మృతిచెందారు. వాంతులు, విరేచనాలతో బాధపడుతూ మరణించారు. మృతుల్లో ఓ బాలుడు, ముగ్గురు వృద్ధులు కూడా ఉన్నారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని ఎక్కెల గ్రామంలో రామగిరి ప్రేమలీల (70) అనే అంగన్‌వాడీ టీచర్‌తోపాటు నల్లగొండ జిల్లా త్రిపురారం మండల కేంద్రంలో నీటి శుద్ధి కేంద్రం నడుపుతున్న చెంచల నర్సయ్య ఆస్పత్రికి తరలించే లోపే మృతిచెందారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న నల్లగొండ జిల్లా పెద్ద అడిశర్లపల్లి మండలంలోని అజ్మాపురం గ్రామానికి చెందిన మాచర్ల కౌశిక్ (12) ఎండవేడి వల్ల ఆస్పత్రికి తరలిస్తుండగా కన్నుమూశాడు. మరోవైపు మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలంలోని అమ్మపాలెం గ్రామానికి చెందిన వేముల ఉప్పలయ్య(46)తోపాటు నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం రామలింగాలగూడేనికి చెందిన వనపర్తి భిక్షమయ్య (70) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు.

కింగ్‌ఫిషర్ లైట్ అందుబాటులో ఉంచండి!

తాగుబోతుల సంఘం వినతి

మంచిర్యాల క్రైం: 'మంచిర్యాల జిల్లాలో కింగ్‌ఫిషర్ లైట్ బీర్లు దొరుకుత లేవు. కొరత తీవ్రంగా ఉంది. దీంతో మద్యం ప్రియులు ఇబ్బందులు పడుతున్నారు'అంటూ తాగుబోతుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్రాంగి తరుణ్ సోమవారం జిల్లా ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 18 రోజుల్లో రాష్ట్రానికి రూ.670 కోట్ల ఆదాయాన్ని తాగుబోతుల సంక్షేమ సంఘం సమకూర్చడం ఆనందంగా ఉందన్నారు. కానీ కొన్ని రోజులుగా జిల్లాలో కింగ్‌ఫిషర్ లైట్ బీర్లు ఏ వైన్స్, బార్లలోనూ దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండ తీవ్రతను తట్టుకునేందుకు యువకులు మొదలుకుని పెద్దల వరకు దాహం తీర్చుకునేందుకు లైట్‌బీర్లు తాగేందుకు ఇష్టపడతారని, అయితే ఆ బీర్లు దొరకకపోవడంతో స్ట్రాంగ్ బీర్లు అధిక ధరలకు కొనుగోలు చేసి తాగాల్సి వస్తోందని వాపోయారు. ఇదే అదునుగా మద్యం దుకాణాల వ్యాపారులు సిండికేట్ అయి మందుబాబుల నుంచి అందిన కాడికి దండుకుంటున్నారని ఆరోపించారు. ఎక్సైజ్ శాఖ అధికారులు స్పందించి జిల్లాలో సరిపడా బీర్లు అందుబాటులో ఉంచాలని కోరారు. అనంతరం స్థానిక ఐబీ చౌరస్తా నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించారు.



వినతిపత్రం ఇస్తున్న తరుణ్

మద్యం నియంత్రణకు చర్యలు చేపట్టండి

ఎన్నికల కమిషన్‌కు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో మద్యం నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఎన్నికల కమిషన్‌ను హైకోర్టు ఆదేశించింది. పిటిషనర్ కోరిన విధంగా ఎక్సైజ్ అధికారుల బదిలీలు చేపట్టాలని ఆదేశాలు ఇవ్వలేమని, ఈసీ నిర్ణయం సరైనదేనని స్పష్టం చేసింది. 'ఎన్నికల సమయంలో చేసే బదిలీల నుంచి ఎక్సైజ్ శాఖకు ఈసీ మినహాయింపు ఇచ్చిందని, అసలు ఎన్నికల్లో ప్రధానంగా ప్రవహించే మద్యాన్ని ఆపడానికి ఏళ్ల తరబడి పాతుకుపోయిన ఎక్సైజ్ అధికారులను బదిలీ చేయాల్సిన అవసరం ఉందని సికింద్రాబాద్‌లోని తిరుమలగిరికి చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి బొందిలి నాగాధర్ సింగ్ ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) కింద పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధానన్యాయమూర్తి జస్టిస్ అలోక్‌అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం విచారణ చేపట్టి.. సోమవారం తీర్పు వెలువరించింది. ఎన్నికల సమయంలో విధులు నిర్వర్తించే అధికారులను కోర్, నాన్‌కోర్ వర్క్స్‌గా విభజించామని, ఎన్నికల సమయంలో రెవెన్యూ, పోలీసు తదితర శాఖల అధికారులలాగానే ఎక్సైజ్ శాఖ అధికారులు కూడా కీలక పాత్ర పోషిస్తారని ఎన్నికల కమిషనర్ తరఫున గతవారం స్టాండింగ్ కౌన్సిల్ అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపించారు. రెవెన్యూ, పోలీస్ శాఖలతో పోలిస్తే ఎక్సైజ్‌శాఖ బదిలీలు వేరుగా ఉంటాయని, బదిలీలకు సంబంధించి ఎన్నికల కమిషన్‌కు తాము ఎలాంటి ఆదేశాలివ్వలేమని తేల్చిచెప్పింది.

కొల్లూరులో వీరవనిత శిల్పం



ఆలేరు రూరల్: యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొల్లూరు గ్రామ శివారులో శివాలయం, వైష్ణవ ఆలయాల మధ్య కాకతీయుల కాలం నాటి వీరవనిత శిల్పాన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందం గుర్తించింది. ఇందుకు సంబంధించిన వివరాలను బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ వెల్లడించారు. ఉత్తరాభిముఖురాలై.. రెండు చేతుల్లో బాకులు పట్టుకుని యుద్ధం చేస్తున్నట్లుగా వీర వనిత మూర్తి ఉంది. తల వెనుక కొప్పు ముడిచి, చెవులకు కుండలాలు, మెడలో కంటె, చేతులకు కంకణాలు, కాళ్లకు పాంజీబులతో ఈ శిల్పం ఉంది. అలాగే రవికె ధరించింది. నడుముకు దట్టి కట్టివుంది. ఈ వీరవనిత శిల్పాన్ని చెక్కిన బండపలక ఐదు అడుగులకుపైగా ఎత్తు ఉంది. తలపైన తోరణం చెక్కుడు గీతలున్నాయి. ఈ శిల్పం శైలిని బట్టి కాకతీయ కాలానికి చెందినట్టుగా కనిపిస్తోందని శ్రీరామోజు హరగోపాల్ చెప్పారు. శత్రువులతో పోరాటం చేసి వీరస్వర్గం పొందిన వనితకు స్మారకంగా రూపొందించిందే ఈ వీరశిల అని వివరించారు. ఆయన వెంట కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు కుండె గణేశ్, మణికంటాచారి ఉన్నారు.

రచయితలపై దాడులకు ఖండన

దోషులను శిక్షించాలని రచయితల సంఘాలు, ప్రజా సంఘాలు, హక్కుల వేదికల డిమాండ్

సాక్షి, వరంగల్,/హైదరాబాద్: కాకతీయ యూనివర్సిటీలో 'లౌకిక విలువలు–సాహిత్యం' అంశంపై 'సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరమ్' నిర్వహించిన రాష్ట్ర స్థాయి సదస్సులో రచయితలపై జరిగిన దాడిని తెలంగాణ రచయితల సంఘాలు, ప్రజాసంఘాల హక్కుల వేదికలు ఖండించాయి. హనుమకొండలో ఆదివారం నిర్వహించిన సదస్సులోకి ఏబీవీపీ, ఇతర శక్తులు జొరబడి దాడి చేశాయని ఆరోపించాయి. దోషులను శిక్షించాలని డిమాండ్ చేశాయి. సమావేశం ముగిసి హాల్ బయటకు వచ్చిన తర్వాత కూడా పోలీసుల సాక్షిగా డా.పసునూరి రవీందర్, నరేష్ కుమార్ సూఫీ, మెర్సీ మార్గరెట్, భూపతి వెంకటేశ్వర్లు తదితర సమూహ సభ్యులపై తీవ్రంగా భౌతిక దాడి చేశారని, ఈ చర్యలన్నీ మనువాద భావజాలంతో కూడిన, మతవాద ఫాసిస్టు దాడులుగానే భావిస్తున్నామని పేర్కొన్నాయి.

ఓయూలో విద్యుత్ కోతలు, నీటి కొరతపై వివాదం

- ఈ కారణాలతో హాస్టళ్లు, మెస్సులు మూసేస్తున్నామన్న చీఫ్ వార్డెన్
- కోతలపై ప్రభుత్వ వాదన బూటకమని తేలిందన్న కేసీఆర్
- అలాంటిదేమీ లేదు: డిప్యూటీ సీఎం వివరణ
- చీఫ్ వార్డెన్ తప్పుడు ప్రకటన చేశారని వెల్లడి.. షోకాజ్ జారీ

సాక్షి, హైదరాబాద్/ ఖమ్మం వన్‌టౌన్: ఉస్మానియా యూనివర్సిటీలో విద్యుత్, తాగునీటి కొరతపై వివాదం చెలరేగింది. తాగునీరు, విద్యుత్ కొరత మూలంగా మే 1 నుంచి 31 వరకు వర్సిటీ హాస్టళ్లు, మెస్‌లను మూసేస్తున్నట్లు చీఫ్ వార్డెన్ ప్రకటన విడుదల చేయడం రాజకీయ దుమారం రేపింది. దీనిపై వర్సిటీ విద్యార్థులతోపాటు విపక్ష బీఆర్ఎస్ మండిపడింది. విద్యుత్ కోతల విషయంలో ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు బూటకమని ఓయూ చీఫ్ వార్డెన్ ప్రకటనతో తేటతెల్లమైందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విమర్శించారు. పోటీ పరీక్షలు ఉన్నందున హాస్టళ్లను తెరిచే ఉంచాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. దీనిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించారు. ఓయూలో విద్యుత్, తాగునీటి కొరత లేదంటూ వివరణ ఇచ్చారు.

వర్సిటీకి విద్యుత్ సరఫరా అవుతోంది..: భట్టి

ఓయూ క్యాంపస్‌లోని 33/11 కేవీ సబ్ స్టేషన్ నుంచి రెండు ప్రత్యేక 11 కేవీ ఫీడర్ల ద్వారా నిరంతరం వర్సిటీకి విద్యుత్ సరఫరా అవుతోందని అధికారులు నివేదిక ఇచ్చినట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాస్తవాలు ధ్రువీకరించుకోకుండా తప్పుడు ప్రకటన చేసిన చీఫ్ వార్డెన్‌కు వర్సిటీ రిజిస్ట్రార్ ద్వారా షోకాస్ నోటీసు జారీ చేసినట్లు చెప్పారు. విద్యార్థులు వర్సిటీలో ఉండి స్వేచ్ఛగా చదువుకోవచ్చని సూచించారు. వర్సిటీని ఖాళీ చేయాల్సిన అవసరం లేదన్నారు. కాగా, ఓయూకు మరింత తాగునీటి సరఫరాకు సిద్ధంగా ఉన్నట్లు జలమండలి ప్రకటించింది. వర్సిటీలో తాగునీటి సమస్యపై జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి సోమవారం వర్సిటీ వీసీ రవీందర్‌తో ఫోన్లో మాట్లాడారు. ఈ నేపథ్యంలో జలమండలి ఉన్నతాధికారులు క్యాంపస్‌ను సందర్శించారు.



క్యాంపస్‌లో జలమండలి అధికారులు

ఆల్ సెట్

- టీఎస్ ఈఏపీసెట్-2024కు సర్వం సిద్ధం
- మే 7 నుంచి 11 దాకా ఉమ్మడి ప్రవేశ పరీక్ష
- ఒక్క నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- 90 నిమిషాల ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి
- ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కాలేజీల్లో ప్రవేశానికి మే 7 నుంచి 11వ తేదీ వరకూ జరిగే ఉమ్మడి ప్రవేశ పరీక్ష (టీఎస్ ఈఏపీసెట్-2024)కు అన్ని ఏర్పాట్లూ చేసినట్టు ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి తెలిపారు. మే 7, 8 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ, 9, 10, 11 తేదీల్లో ఇంజనీరింగ్ పరీక్షలు ఉంటాయని చెప్పారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి సంబంధించిన సెట్‌కు హాల్ టికెట్ల డౌన్‌లోడ్ మొదలైందని, ఇంజనీరింగ్ సెట్‌కు మే 1 సాయంత్రం 3 గంటల నుంచి మొదలవుతుందని వివరించారు. సోమవారం జేఎన్‌టీయూహెచ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'గత ఏడాదితో పోలిస్తే ఈసారి సెట్‌కు 34,120 దరఖాస్తులు పెరిగాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని అదనంగా 20 కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఇంజనీరింగ్‌కు 166, అగ్రి, ఫార్మసీకి 135 (ఏపీతో కలిపి) పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశాం. విద్యార్థులు తాజా ఫోటో, గుర్తింపు కార్డుతో పరీక్ష కేంద్రానికి 90 నిమిషాల ముందే చేరుకోవాలి. సెట్ రోజే ఇతర పరీక్షలుంటే మెయిల్ ద్వారా తెలియజేసినట్టైతే వేరే తేదీని కేటాయిస్తాం. పరీక్ష కేంద్రంలో బయో మెట్రిక్ హాజరును అమలు చేస్తాం..' అని ప్రొఫెసర్ లింబాద్రి వివరించారు.

నెలఖారులోగా సెట్ ఫలితాలు

ప్రశ్నలు 40 శాతం అతి సామాన్యంగా, 40 శాతం మధ్యస్థంగా, 20 శాతం మాత్రమే క్లిష్టంగా ఉంటాయని సెట్ కో-కన్వీనర్ విజయకుమార్ రెడ్డి తెలిపారు. పరీక్ష హాలులో వాటర్ బాటిల్స్‌తో సహా అన్నీ తామే అందిస్తామని, ఎన్నికల సమయంలో ర్యాలీల వల్ల విద్యార్థులు ఇబ్బంది పడకుండా పోలీసుశాఖ సహాయం తీసుకుంటున్నట్టు చెప్పారు. పరీక్ష ఫలితాలను మే నెలాఖరులోగా వెల్లడిస్తామన్నారు. ఈఏపీసెట్ ప్రశ్నపత్రం రూపకల్పనకు 15 విభాగాలతో సమన్వయం చేసుకున్నట్టు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కట్టా నర్సింహారెడ్డి తెలిపారు. ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్, ఈఏపీసెట్ కన్వీనర్ డీన్‌కుమార్, జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వర్‌రావు తదితర అధికారులు పాల్గొన్నారు

ముఖ్యమైన సూచనలు...

- పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు, తిరిగి సాయంత్రం 3 నుంచి 6 గంటల వరకు ఉంటాయి.
- బయోమెట్రిక్ హాజరుకు 20 నిమిషాల సమయం పడుతుంది. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించరు.
- వేలికి ఎలాంటి మెహిందీ, టాటూస్, ఇంక్ వంటివి అంటించుకోకూడదు. ఇది బయోమెట్రిక్‌కు ఇబ్బంది కల్గిస్తుంది.
- పరీక్ష హాల్లోకి బ్లూ, బ్లాక్ పాయింట్ పెన్, హాల్ టికెట్, అవసరమైన ధ్రువపత్రాలను మాత్రమే అనుమతిస్తారు. క్యాలిక్యులేటర్, సెల్‌ఫోన్, రిస్ట్‌వాచ్, ఎలక్ట్రానిక్స్ అనుమతించరు.
- లేటెస్ట్ ఫొటోతో కూడిన ఫిల్ చేసిన ఆన్‌లైన్ దరఖాస్తుపై ఎడమ వేలిముద్ర ఉండాలి. ఇన్విజిలేటర్ సమక్షంలో దానిపై సంతకం చేయించుకుంటారు. ఆన్‌లైన్ అప్లికేషన్, రఫ్ నోట్స్‌ను పరీక్ష హాలులో పరీక్ష పూర్తయ్యాక అప్పగించాలి.
- విద్యార్థులు ఫోటో గుర్తింపు కార్డుగా కాలేజీ ఐడీ కార్డు, ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు, పాన్‌కార్డు, ఓటర్ ఐడీ.. ఇందులో ఏదైనా ఒకటి తెచ్చుకోవాలి.
- ప్రశ్నలు తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో ఉంటాయి. ఇంగ్లిష్ నుంచి తెలుగులోకి తర్జుమా చేసేటప్పుడు ఒకవేళ అవి అర్థం కాకపోతే ఇంగ్లిష్ భాషనే ప్రామాణికంగా తీసుకోవాలి. కంప్యూటర్ సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ సమస్యలు తలెత్తితే వెంటనే ఇన్విజిలేటర్ దృష్టికి తేవాలి.

సెట్‌కు దరఖాస్తులు గత ఏడాది... ఈ సంవత్సరం

విభాగం	రాష్ట్రం	2023	2024
ఇంజనీరింగ్	ఏపీ	51,481	49,071
ఇంజనీరింగ్	తెలంగాణ	1,53,890	2,05,472
అగ్రి, ఫార్మసీ	ఏపీ	20,743	12,349
అగ్రి, ఫార్మసీ	తెలంగాణ	94,589	87,911

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.